ఈనాడు

విజయవాడ 20-12-2025 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 130
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 20 www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

THE GREAT YEAR-END SALE SOUTH INDIA shopping mall




R.S. Brothers™
MEGA SHOPPING MALL
CHRISTMAS
R.S. DHAMAKA SALE
పట్టు చీరలపై ప్రత్యేకమైన ఆఫర్లు మీకోసం...
షాపింగ్ చేయండి. అద్భుతమైన ఆఫర్లు పొందండి
RUPEE SALE
PURE LINEN COTTON @₹499 GET 2ND SAREE@ ₹1
AMBANI SAREE @₹798 GET 2ND SAREE@ ₹1
PURE SAIYAARA @₹1195 GET 2ND SAREE@ ₹1
PURE BANARASI @₹850 GET 2ND SAREE@ ₹1
KEERTHY SILK @₹1250 GET 2ND SAREE@ ₹1
BANARASI KATAN SILK @₹2495 GET 2ND SAREE@ ₹1
SAREES
BUY 3 @ ₹500 RANG COTTON SAREE
KANJIVARAM BROCADE SAREE ₹1198 ₹599 50% OFF
₹325 ₹199 KAVERI PRINT SAREE
50% OFF ₹398 ₹199 NAVYA TISSUE SAREE
50% OFF ₹550 ₹275 RICCO PATTU SAREE
50% OFF ₹596 ₹298 VISTHARA PRINT SAREE
50% OFF ₹598 ₹299 DOLA PRINT SAREE
BUY 3 @ ₹550 TURKEY SILK
BUY 3 @ ₹598 LINEN COTTON SAREE
50% OFF ₹650 ₹325 VISCOS PRINT SAREE
50% OFF ₹698 ₹349 GATTU SILK SAREE
50% OFF ₹798 ₹399 TUSSER SILK SAREE
50% OFF ₹950 ₹475 DHARMAVARAM SILK SAREE
₹478 ₹295 SINDOOR SILK SAREE
₹795 ₹350 MOKSHA PATTU SAREE
₹850 ₹395 DEEPIKA WORK SAREE
₹895 ₹450 BANGLORE SILK SAREE
₹950 ₹495 SRI VALLI SAREE
₹1395 ₹650 CHINNON PATTU SAREE
50% OFF ₹1198 ₹599 TISSUE PATTU SAREE
50% OFF ₹1250 ₹625 BANARASI PATTU SAREE
50% OFF ₹1498 ₹749 MAHESHWARI PATTU SAREE
50% OFF ₹1550 ₹775 JOHRIVAAJ CATALOG SAREE
PATTU SAREE
BUY 1 MEENAKARI PATTU SAREE @4995 & GET 2ND SAREE @ ₹49
BUY 1 POCHAMPALLY WORK SAREE @3995 & GET 2ND SAREE @ ₹39
LADIES WESTERN & LEISURE WEAR
BUY 5 @ ₹500 DUPATTAS
BUY 4 @ ₹500 COTTON NIGHTY
BUY 3 @ ₹555 PRINTED PLAZO
UPTO 50% OFF ₹595 KURTHIS
UPTO 50% OFF ₹695 KURTHIS
UPTO 50% OFF ₹695 STRAGHIT PANTS
UPTO 50% OFF ₹795 KURTHIS
BUY 2 @ ₹799 ALPINE NIGHY
UPTO 50% OFF ₹895 KURTHIS
UPTO 50% OFF ₹995 KURTHIS
UPTO 50% LADIES JEANS
UPTO 30% OFF HEAVY WORK LEHENGAS
BUY 3 @ ₹1199 NIGHT DRESS
BUY 2 @ ₹1499 COTTON PATIYALA SUIT
BUY 2 @ ₹2599 FANCY LEHENGAS
SUITING & SHIRTING
ARVIND LINENCLUB GIZA HOUSE OCM Raymond Reid & Taylor SÖKTAS DIGJAM
SPECIAL OFFERS ON LEADING MENS WEAR BRANDS
GIRLS WEAR
UPTO 50% OFF ₹495 GIRLS SKIRTS
BUY 4 @ ₹500 GIRLS SHORTS
BUY 4 @ ₹500 GIRLS PYJAMA
BUY 4 @ ₹550 GIRLS PYJAMA
BUY 4 @ ₹550 GIRLS T-SHIRTS
BUY 4 @ ₹600 GIRLS TRACK PANT 3/4
BUY 3 @ ₹695 GIRLS COTTON FROCKS
BUY 3 @ ₹895 GIRLS COTTON FROCKS
BOYS WEAR
BUY 4 @ ₹550 BOYS T-SHIRTS
BUY 4 @ ₹595 BOYS T-SHIRTS
BUY 4 @ ₹600 BOYS T-SHIRTS
UPTO 50% OFF ₹645 BOYS SHIRTS
UPTO 50% OFF ₹695 BOYS SHIRTS
BUY 3 @ ₹745 BOYS T-SHIRTS -NECKER
UPTO 50% OFF ₹995 PANTS
UPTO 50% OFF ₹1095 PANTS
UPTO 50% OFF ₹1195 PANTS
MENS WEAR
JACK&JONES spykar: BUY 1 @ 30% OFF BUY 2 @ 40% OFF BUY 4 @ 50% OFF
Allen Solly: BUY 2 @ 40% OFF BUY 3, GET 3 FREE
MONTE CARLO: FLAT 20% OFF
MUFTI: BUY 1 @ 25% OFF BUY 2 @ 40% OFF BUY 4 @ 50% OFF
benetton: BUY 1 @ 20% OFF BUY 2 @ 30% OFF BUY 4 @ 40% OFF
rockit CROCODILE: BUY 1 @ 20% OFF BUY 2 @ 30% OFF
parx: BUY 1 @ 20% OFF BUY 2 @ 30% OFF BUY 3 @ 40% OFF
KILLER: BUY 1 @ 20% OFF BUY 2 @ 30% OFF BUY 3 @ 40% OFF BUY 4 @ 50% OFF
BUY 2, GET 1 FREE
BUY 1 @ 20% OFF
HOME FURNISHING
BUY1 GET 1 ₹295 BLANKETS
BUY 4 ₹199 TOWELS
BUY 4 ₹499 SINGLE BEDSHEETS SET
BUY 3 ₹999 DOUBLE BEDSHEETS SET
R.S. Brothers™
MEGA SHOPPING MALL
బీసెంట్ రోడ్ క్రాస్, ఏలూరు రోడ్ విజయవాడ
బందర్ రోడ్ విజయవాడ
TOLL FREE 1800 570 1999
Email : info@rsbrothers.net | Shop us @ www.rsbrothers.net Follow us on : RSBrothersIndia rsbrothersindia
*Conditions Apply
The withdrawal of offers and schemes is solely at the discretion of management.



ఈనాడు



విజయవాడ 20-12-2025 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 130
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 20
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

పూర్వోదయ నిధులు ఇవ్వండి

- వ్యూహాత్మక అభివృద్ధికి సహకరించండి
- రాయలసీమను ఉద్యాన హబ్‌గా మార్చడానికి రూ.41వేల కోట్లు కావాలి
- సాస్కీ కింద రూ.10వేల కోట్లు అవసరం
- కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు వినతి

ఈనాడు - దిల్లీ


దిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం చంద్రబాబు

రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధి కోసం ఆర్థికంగా సహకారం అందించాలని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను సీఎం చంద్రబాబు కోరారు. దిల్లీ పర్యటనకు వచ్చిన ఆయన శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, నౌకాయానశాఖ మంత్రి సర్బానంద సోనోవాల్, పట్టణాభివృద్ధి, విద్యుత్తు శాఖల మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, పెట్రోలియం మంత్రి హర్‌దీప్‌సింగ్ పురీతో సమావేశమయ్యారు. ఆర్థికమంత్రితో పూర్వోదయ, సాస్కీ, పోలవరం-నల్లమలసాగర్ నిధుల గురించి చర్చించారు. "గ్రామీణ ప్రాంతాలకు రహదారి అనుసంధానం, సాగునీటి వ్యవస్థ ఆధునికీకరణ, మౌలిక వసతుల అభివృద్ధి, పారిశ్రామిక కారిడార్ల విస్తరణ, ఆహారశుద్ధి క్లస్టర్ల ఏర్పాటు, విద్య, వైద్య సౌకర్యాల కల్పన కోసం పూర్వోదయ నిధులు అత్యవసరం. ఈ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు పెద్దఎత్తున నిధులు కేటాయించాలి.

■ రాష్ట్రంలో ఆస్తుల సృష్టికి అవసరమైన పనులు చేపట్టేందుకు రాష్ట్రాలకు మూలధన వ్యయం కోసం చేసే ప్రత్యేక సాయం కింద నిధులను వేగంగా విడుదల చేయాలి. రాష్ట్రం తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటోంది. రాష్ట్రంలో రహదారులు, ఎంఎస్ఎంఈ పార్కులు, సాగునీటి ప్రాజెక్టుల పనులు, గృహనిర్మాణం, వైద్యపరమైన మౌలికవసతుల కల్పనకు ఈ నిధులు చాలా అవసరం. అందువల్ల సాస్కీ కింద ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.10,054 కోట్లు ఇవ్వాలి.

■ రాయలసీమను ఉద్యానహబ్‌గా మార్చేందుకు వచ్చే బడ్జెట్‌లో ప్రత్యేక ప్యాకేజి కేటాయించాలి. రాయలసీమ, ప్రకాశం జిల్లాలు కలిపి ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉన్న 18 ప్రధాన ఉద్యానపంటలను పండిస్తున్నాయి. ఇక్కడి 8 జిల్లాల్లో 93 ఉద్యాన క్లస్టర్లు ఉన్నాయి. దీనిపై 33.7 లక్షలమంది రైతులు ఆధారపడ్డారు. రాష్ట్రంలో ఉద్యానసాగును (మిగతా 6లో)

మెగా షిప్‌బిల్డింగ్ క్లస్టర్‌గా దుగరాజపట్నం

లోపలి పేజీల్లో

అలా రూపొందించడానికి సహకరించండి

కేంద్రమంత్రి సర్బానంద సోనోవాల్‌ను కోరిన సీఎం

విభజన చట్టంలోని సాగునీటి ప్రాజెక్టులకు సాయం చేయండి

జలజీవన్ మిషన్‌కు రూ.వెయ్యి కోట్లు ఇవ్వండి

ఆలమట్టి డ్యాం ఎత్తుపై కర్ణాటకను నియంత్రించండి

జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు చంద్రబాబు విజ్ఞప్తి

ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో స్వల్ప సవరణలు

- హోలీ పండుగతో మార్చి 3న జరగాల్సిన పరీక్షలు 4కు మార్పు
- రంజాన్ కారణంగా 20 నాటి పరీక్షలు 21న

ఈనాడు, అమరావతి: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో స్వల్ప మార్పులు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 2026 సంవత్సరపు సెలవుల క్యాలెండర్ విడుదల చేయడంతో.. ఆయా సెలవు రోజుల్లో వస్తున్న ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు చెందిన రెండు పరీక్షల తేదీలను మార్పు చేసినట్లు ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి రంజిత్ బాషా తెలిపారు. మిగతా పరీక్షల్లో ఎలాంటి మార్పులూ లేవు. ద్వితీయ సంవత్సరం గణితం పేపర్-2ఏ, సివిక్స్ పేపర్-2 పరీక్షలు గతంలో ప్రకటించిన (మిగతా 6లో)





రెడ్ బుక్‌లో మూడు పేజీలే అయ్యాయి

పార్టీ కార్యకర్తల సమావేశంలో మంత్రి లోకేశ్

లోపలి పేజీలో

నిజాయతీ, సమగ్రతలకే ప్రాధాన్యం


పీఎస్సీ ఛైర్‌పర్సన్ల సదస్సు వేదికపై రాష్ట్రపతి ద్రౌపదీముర్మును జ్ఞాపిక బహూకరిస్తున్న యూపీఎస్సీ ఛైర్మన్ అజయ్‌కుమార్. చిత్రంలో టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

- పబ్లిక్ సర్వీస్ అధికారుల ఎంపికలో ఇదే కీలకం
- నియామకాల్లో పారదర్శకత పెంచాలి
- యూపీఎస్సీ అత్యంత విశ్వసనీయ సంస్థ
- పీఎస్సీ ఛైర్‌పర్సన్ల సదస్సులో రాష్ట్రపతి ముర్ము

ఈనాడు, హైదరాబాద్: యూపీఎస్సీ, రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్లు.. సమానత్వాన్ని, సామాజిక న్యాయాన్ని పెంపొందించే దిశగా పనిచేస్తున్నాయని, దేశ పురోగతిలో అవి నిరంతరం భాగస్వాములు కావాలని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము ఆకాంక్షించారు. ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక విధానంలో నిజాయతీ, సమగ్రత కలిగిన అభ్యర్థులకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలని సూచించారు. మిగిలిన అంశాలకంటే నిజాయతీ, సమగ్రతలే (మిగతా 6లో)

కానుకల లెక్కింపులో సంస్కరణలు తప్పనిసరి

- ఏఐ, ఆధునిక సాంకేతికతను వాడుకోండి
- తితిదేకు హైకోర్టు కీలక ఆదేశాలు
- తక్షణ, శాశ్వత చర్యలపై నివేదికల సమర్పణకు రెండు వేర్వేరు గడువులు
- పరకామణిలో చోరీ కేసు విచారణ 26కు వాయిదా

వేంకటేశ్వర స్వామివారికి భక్తులు వివిధ రూపాల్లో కానుకలు సమర్పిస్తుంటారు. వాటి ఆర్థిక విలువ ఎంత అన్నదానికంటే.. ఎంత భక్తిభావంతో సమర్పించారన్నదే ముఖ్యం. కానుకలను భౌతికంగా కనిపించని, వెల కట్టలేని మతపరమైన విశ్వాసానికి, మనోభావాలకు ప్రతీకగా భావించాలి. వాటిని అత్యంత జాగ్రత్తగా, భక్తిభావంతో గుర్తించాలి. సరిగ్గా భద్రపరచడంతో పాటు పారదర్శకంగా లెక్కించేలా పర్యవేక్షించాలి. భక్తుల మనోభావాలు, విశ్వాసాలను కాపాడాల్సిన ప్రధాన కర్తవ్యం తితిదే పాలకమండలిపై ఉంది. -ఏపీ హైకోర్టు

వివరాలు 2లో







24 మీటర్ల ఎత్తు దాటితేనే బహుళ అంతస్తులు

భవన నిర్మాణ నిబంధనల్లో సడలింపులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 24 మీటర్ల ఎత్తు దాటిన భవనాలనే ఇకపై బహుళ అంతస్తులుగా (హైరైజ్ బిల్డింగ్) గుర్తిస్తారు. 18 మీటర్ల ఎత్తు దాటిన వాటిని ఇప్పటి వరకు హైరైజ్‌గా పరిగణిస్తున్నారు. స్థిరాస్తి వ్యాపార సంఘాలు, వ్యాపారుల విజ్ఞప్తిపై హైరైజ్ భవనాల ఎత్తు నిబంధనలు మార్చుతూ రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. 24 మీటర్ల ఎత్తు దాటినవి హైరైజ్ బిల్డింగ్‌లుగా గుర్తించేలా అగ్నిమాపక చట్టంలో ఇటీవల చేసిన సవరణల ఆధారంగా మున్సిపల్ బిల్డింగ్ నిబంధనల్లోనూ మార్పులు చేశారు. తాజా నిర్ణయం ప్రకారం 24 మీటర్లు, అంతకంటే తక్కువ ఎత్తు కలిగిన భవనాలు నాన్ హైరైజ్‌గా గుర్తిస్తారు.

బహుళ అంతస్తుల మధ్య 'స్కై వాక్': ఒకే ప్రాంగణంలో బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు రాష్ట్రంలో పెరుగుతున్న నేపథ్యంలో భవనాల మధ్య అనుసంధానం కోసం 'స్కై వాక్, స్కై పార్కు' ఏర్పాటుకు అనుమతిస్తూ బిల్డింగ్ నిబంధనలు సవరించారు.


లోపలి పేజీల్లో

పార్లమెంటు నిరవధిక వాయిదా

ముగిసిన శీతాకాల సమావేశాలు

'వీబీ- జీ రామ్ జీ' సహా మొత్తం 8 బిల్లులకు ఆమోదం

ఈసారి బడ్జెట్‌ను ఆదివారం ప్రవేశపెట్టనున్న సీతారామన్!


ఆనందపు ప్రతి క్షణానికి KISNA
KFNC40436NAM

ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

విజయవాడ 20-12-2025 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 130

రూ. 6-50 పేజీలు 20

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

జనవరిలో జాబ్ క్యాలెండర్

● ప్రతి విద్యార్థికీ ఉచితంగా ఏఐ టూల్ ● అమ్మకు చెప్పలేని ఏ పనీ చేయొద్దు..!

రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులతో మంత్రి లోకేశ్ మాటామంతీ

ఈనాడు, రాజమహేంద్రవరం, కాకినాడ, న్యూస్‌టుడే, దేవీచౌక్, టీ.నగర్: 'జీవితంలో ప్రతి ఒక్కరూ ఏ నిర్ణయం తీసుకున్నా అది అమ్మకు చెప్పే విధంగా ఉండాలి.. అమ్మకు చెప్పలేని ఏ పనీ చేయొద్దు' అంటూ మంత్రి నారా లోకేశ్ విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. శుక్రవారం ఆయన తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాలలో ఇంక్యుబేషన్ సెంటర్, ప్రధాన ముఖద్వారం, వందేమాతరం ఉద్యానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో దాదాపు గంటన్నర పాటు మాట్లాడారు.



రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ హబ్ వద్ద ఎన్‌సీసీ క్యాడెట్‌లతో మంత్రి నారా లోకేశ్

ఒక్కో జిల్లాలో ఒక్కో రంగానికి ప్రాధాన్యం

డిగ్రీ పూర్తయ్యాక ఉద్యోగాలు లేక అనేక మంది బాధపడుతున్నారు. అందుకే క్లస్టర్ బేస్డ్ విధానాన్ని తెస్తున్నాం. ఒక్కో జిల్లాలో ఒక్కో రంగాన్ని ప్రోత్సహించడం ద్వారా ఆయా అంశాలపై నైపుణ్య శిక్షణ ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని హరివర్మ అనే విద్యార్థి అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

■ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా 'నైపుణ్యం' పోర్టల్ అందుబాటులోకి తెచ్చామని, దీని ద్వారా మనం నేర్చుకున్న విద్యకు ఎక్కడ ఉద్యోగ అవకాశాలున్నాయనే సమాచారం తెలుస్తుందని విద్యార్థిని సాత్వికకు వివరించారు.



■ కూటమి ప్రభుత్వం అయిదేళ్లలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తోందని, జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని విద్యార్థి పాలంగి కిశోర్ అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు.

■ డిగ్రీ పూర్తయిన తరువాత రాజకీయాల్లోకి రావాలని అనుకుంటున్నా.. మీరు మెంటార్‌గా ఉంటారా? అని విద్యార్థి కిరణ్ కోరగా.. మంత్రి సానుకూలంగా స్పందించారు.

■ ప్రభుత్వం ప్రతి విద్యార్థికీ ఏఐ టూల్స్ ఇచ్చే అవకాశం ఉందా? అని తనూజ్ అనే విద్యార్థి ప్రశ్నించగా.. అందరికీ అందిస్తామని లోకేశ్ వివరించారు. తాను జెమినీ ఐ వినియోగిస్తున్నానని, ఆ సంస్థతో మాట్లాడి అందరికీ అందించే బాధ్యత తీసుకుంటానని భరోసా ఇచ్చారు.

■ ఉన్నత విద్యలో మన ఖ్యాతి పెంచేందుకు ప్రణాళికలున్నాయా? అని ప్రిన్సిపల్ రామచంద్ర అడగ్గా.. కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో బోధన పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మార్చుతున్నాం.. పరిశోధనలు పెరగాల్సి ఉంది.. దీనిపై ప్రధాని దృష్టి సారించారని లోకేశ్ వివరించారు.

■ ఉత్తమ ఉపాధ్యాయులను విదేశాలకు పంపినట్లు డిగ్రీ అధ్యాపకులకూ అవకాశం ఇవ్వాలని మరొకరు కోరగా.. ప్రయత్నం చేస్తామన్నారు.


విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

'స్టాన్‌ఫర్డ్'లో ఎథిక్స్ నేర్చుకున్నా..

▼ 'స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీలో చదువుకున్నప్పుడు ఎథిక్స్ నేర్చుకున్నా.. అక్కడ ఫైనల్ పరీక్షల్లో ఇన్విజిలేటర్ ఉండరు. ఎవరైనా కాపీ కొడితే పక్క వ్యక్తి రిపోర్ట్ చేయాలి. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే శాశ్వతంగా అక్కడి నుంచి తొలగిస్తారు' అని లోకేశ్ మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

▼ అవినీతి నిర్మూలనకు సంస్కరణలు అవసరం. ప్రజలు సైతం ప్రలోభాలకు గురికాకుండా ఓటేసే పరిస్థితి రావాలని లోకేశ్ పేర్కొన్నారు.

▼ గతంలో మీరు లావుగా ఉన్నారని అనేక ట్రోల్స్ చేశారు.. బాధ పడ్డారా? అని కార్తికేయ ప్రశ్నించగా.. లక్ష్యం దిశగా వెళ్తున్నప్పుడు అడ్డంకులు వచ్చినా కుంగిపోకుండా ముందుకెళ్తే విజయం సాధించగలమని మంత్రి వివరించారు.

▼ స్లిమ్‌గా ఉన్నారు.. ఏం డైట్ చేస్తున్నారని ఓ విద్యార్థి అడగ్గా.. వైద్య నిపుణుల సూచనల మేరకు సింగిల్ మీల్ పర్ డే అమలు చేస్తున్నా. మీరెవ్వరూ అలా చేయొద్దు అని సూచించారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కళాశాల విద్య కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, జేసీ మేఘా స్వరూప్, నన్నయ వర్సిటీ ఉపకులపతి ఎస్.ప్రసన్నశ్రీ తదితరులు ఉన్నారు.

నన్నయ వర్సిటీలో నూతన భవనాలు ప్రారంభించిన లోకేశ్

రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో రూ.34 కోట్లతో నూతనంగా నిర్మించిన మూడు భవనాలను విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. విశ్వవిద్యాలయం ఉప కులపతి ఎస్.ప్రసన్నశ్రీ, ఆచార్యులుతో మాట్లాడి విద్యోన్నతి కార్యక్రమాలకు రూపకల్పన చేయాలన్నారు. సిబ్బంది సమస్యలు విని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

నేటి నుంచి ముస్తాబు

రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు అమలు

● ప్రతి తరగతి, వసతిగృహంలో ప్రత్యేక కార్నర్ ఏర్పాటు
● పరిశుభ్రత పాటించే పిల్లలకు ప్రోత్సాహం

ఈనాడు, అమరావతి: పాఠశాల, జూనియర్ కళాశాలల పిల్లలకు పరిశుభ్రత అలవాట్లు నేర్పించేందుకు ప్రభుత్వం 'ముస్తాబు' కార్యక్రమాన్ని శనివారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తోంది. విద్యార్థుల్లో వ్యక్తిగత శుభ్రత, మంచి అలవాట్లు, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంచే లక్ష్యంతో ఇప్పటికే పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఇక్కడ సత్ఫలితాలు రావడంతో సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్త అమలుకు శ్రీకారం చుట్టారు. అన్ని రకాల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఒక్క విద్యార్థి సైతం శుభ్రత లోపం వల్ల అనారోగ్యం బారిన పడకూడదనే లక్ష్యంతో దీన్ని అమలుచేస్తున్నారు. 90రోజుల తర్వాత మొదటి సమీక్ష నిర్వహిస్తారు. తరగతి గదిలో ముస్తాబు కార్నర్ ఏర్పాటుచేస్తారు. ఇంటిదగ్గర సరిగా తయారై రానివాళ్లను గుర్తించి, ముస్తాబు కార్నర్‌కి పంపించి ముఖం కడుక్కుని, తల దువ్వుకుని వచ్చాకే తరగతి గదిలోకి అనుమతిస్తారు.

ముస్తాబు లక్ష్యాలు

■ పిల్లలకు రోజూ వ్యక్తిగత పరిశుభ్రతను అలవాటుగా మార్చడం
■ నిరంతరం పాఠశాలకు వచ్చేలా చూడడం
■ క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాల పెంపు
■ పాఠశాలలు, వసతిగృహాల్లో శుభ్రంగా, సురక్షితంగా పిల్లలకు అనుకూల వాతావరణం కల్పించడం

పిల్లలు రోజూ ఏం చేయాలి?

▼ శుభ్రమైన యూనిఫాం, పాదరక్షలు వేసుకుని రావాలి
▼ గోళ్లు కత్తిరించి, తల దువ్వుకుని రావాలి
▼ చెవులు, ముఖం శుభ్రంగా ఉంచుకోవాలి



▼ టాయిలెట్‌కు వెళ్లి వచ్చాక, భోజనానికి ముందు తప్పనిసరిగా సబ్బుతో చేతులు కడుక్కోవాలి
▼ పరిశుభ్రమైన, సురక్షితమైన నీళ్లే తాగాలి. కౌమారదశ బాలికలకు రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన కల్పించడంతో పాటు వయసుకు తగిన శుభ్రత పద్ధతులను నేర్పించాలి.

ముస్తాబు కార్నర్ ఏర్పాటు

ప్రతి తరగతి గది, వసతిగృహంలో ఒక ముస్తాబు కార్నర్ ఏర్పాటుచేస్తారు. ఇక్కడ అద్దం, దువ్వెన, తువ్వాలు, సబ్బు, నెయిల్ కట్టర్, హ్యాండ్‌వాష్, బకెట్ ఉంచుతారు. విద్యార్థుల్లో నుంచి పరిశుభ్రత నాయకులను నియమిస్తారు. వీరు చేతులు కడుక్కోవడం, వ్యక్తిగత పరిశుభ్రతలను పరిశీలిస్తారు.

✦ చేతులు కడుక్కునే విధానం, గోళ్లు, జుట్టు, వ్యక్తిగత శుభ్రతపై చార్ట్‌లు
✦ మరుగుదొడ్డి వినియోగంపై పిల్లలకు అర్థమయ్యేలా పోస్టర్లు
✦ సాధ్యమైనచోట అద్దం
✦ సబ్బు, హ్యాండ్‌వాష్ స్థలం
✦ వారపు పరిశుభ్రత చెక్‌లిస్ట్
✦ ముస్తాబు స్టార్ పేర్లను ప్రదర్శిస్తారు

పిల్లలకు ప్రోత్సాహకాలు | ■ వారపు ముస్తాబు స్టార్ | ■ నెలవారీ పరిశుభ్రమైన తరగతి/వసతి గృహం | ■ జిల్లాస్థాయి ఉత్తమ పాఠశాల, వసతిగృహం అవార్డులు

కానుకల లెక్కింపులో సంస్కరణలు తప్పనిసరి

- ఏఐ, ఆధునిక సాంకేతికతను వాడుకోండి
- తితిదేకు హైకోర్టు కీలక ఆదేశాలు

ఈనాడు, అమరావతి: తిరుమల శ్రీవారికి భక్తులు సమర్పించే కానుకల లెక్కింపు ప్రక్రియలో తక్షణమే సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరముందని హైకోర్టు తేల్చిచెప్పింది. హుండీల నుంచి కానుకలను బయటకు తీశాక సీల్ వేయడం నుంచి రవాణా చేయడం, పరకామణిలో సీల్ తీయడం, లెక్కించడం వరకు ప్రతి దశలోనూ సాంకేతికతను పెంచాలని, క్రమేణా మానవ జోక్యాన్ని తగ్గించాలని సూచించింది. తద్వారా కానుకలు లెక్కించేందుకు వచ్చే భక్తులను దుస్తులు తీయించి తనిఖీలు చేయాల్సిన అవసరం రాదని, వారికి అవమానంగా ఉండదని పేర్కొంది. కృత్రిమ మేధ (ఏఐ), సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, పూర్తిస్థాయిలో యాంత్రీకరణ, కంప్యూటరైజేషన్, రికార్డుల డిజిటలైజేషన్ చేయాల్సిన అవసరం ఉందని సూచించింది. పరకామణిలో కానుకల చోరీ కేసును లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవడాన్ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై హైకోర్టు విచారణ జరుపుతున్న సంగతి తెలిసిందే. శుక్రవారం న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ ఈ వ్యాజ్యంపై మూడు కీలక ఉత్తర్వులిచ్చారు. విచారణను ఈ నెల 26కు వాయిదా వేశారు.

1. పరకామణిలో రెండు విధాలుగా సంస్కరణలు చేపట్టాలి. తక్షణ, శాశ్వత ప్రాతిపదికన ఆ ప్రణాళికలు రూపొందించండి. తక్షణ సంస్కరణ (ప్లాన్-ఏ)లో భాగంగా హుండీ సీలింగ్, రవాణా, డీసీలింగ్, లెక్కింపు విధానాల్లో మార్పులు చేయండి. ఈ భద్రత చర్యలపై రెండు వారాల్లో నివేదిక సమర్పించాలి.

2. శాశ్వత సంస్కరణ (ప్లాన్-బీ)ల్లో భాగంగా కానుకలను వర్గీకరించడం, విదేశీ కరెన్సీని గుర్తించడం, వివిధ లోహాలను వేరుచేసేందుకు ఏఐ, సాంకేతికత వ్యవస్థను ఏర్పాటు చేయాలి. తితిదేకు సహకారం అందించేందుకు వివిధ రంగాల్లో అనుభవం ఉన్న భక్తులు ప్రపంచవ్యాప్తంగా ఉన్నారు. వారి నుంచి సాంకేతిక నిపుణులను నియమించుకోవాలి. శాశ్వత సంస్కరణలపై ఎనిమిది వారాల్లో ముసాయిదాను రూపొందించి కోర్టుకు సమర్పించాలి.

3. మరోవైపు, కానుకల చోరీకి పాల్పడిన రవికుమార్, అతని కుటుంబ సభ్యులు తమ ఆస్తులను ఎవరెవరికి రిజిస్ట్రేషన్ చేశారో పూర్తి వివరాలతో వారంలో సీల్డ్ కవర్లో నివేదిక ఇవ్వాలి అని ఏసీబీ డీజీని హైకోర్టు ఆదేశించింది.

ఆ బాధ్యత తితిదే పాలకమండలిదే

స్వామివారి పూజా క్రతువులు, సేవలు ఆగమ శాస్త్రం మేరకు జరుగుతున్నాయని, వాటిపై తాము జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. 'తితిదే ధర్మకర్తల మండలి దైవం తరఫున పనిచేస్తుంది. దర్శనం, పూజాదికాలు, సేవలు, నైవేద్యం, ప్రసాదాల తయారీ, కానుకల లెక్కింపు వ్యవహారాలను తితిదే చూస్తుంది. వీటిలో ఏదైనా లోపం జరిగితే భక్తుల మనోభావాలు దెబ్బతింటాయి. అలాకాకుండా చూడాల్సిన బాధ్యత దేవస్థానం పాలకమండలిపై ఉంది. ఇందులో ఎలాంటి లోపం జరిగినా ధర్మకర్తల మండలి తన బాధ్యతను నిర్వర్తించడంలో విఫలమైనట్లే. 2023 ఏప్రిల్ 29న పరకామణిలో జరిగిన చోరీ, ఆ తర్వాతి పరిణామాలు ప్రపంచవ్యాప్తంగా భక్తుల మనోభావాలపై ప్రభావం చూపాయి' అని న్యాయమూర్తి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



శ్రీవారి ఆలయం ఎదుట జస్టిస్ సందీప్ మెహతా కుటుంబం

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

తిరుమల, న్యూస్‌టుడే: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సందీప్ మెహతా శుక్రవారం తిరుమలలోని శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున అభిషేక సేవలో పాల్గొని, ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం, అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

నౌహీరా షేక్ ఆస్తుల వేలం ఆపొద్దు

ఈడీకి సుప్రీంకోర్టు ఆదేశం

ఈనాడు, దిల్లీ: అధిక రాబడుల ఆశచూపి ప్రజల నుంచి కోట్ల రూపాయల డిపాజిట్లు సేకరించి మోసగించిన నౌహీరా షేక్ ఆస్తుల వేలాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపొద్దని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ కార్యక్రమానికి ఆమె అడ్డు తగులుతుంటే అరెస్ట్ చేసైనా వేలం ప్రక్రియ పూర్తి చేయాలని నిర్దేశించింది. ఈమేరకు జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈడీని ఆదేశించింది. "ఆమె ఆస్తులను వేలం వేయాలని మేం ఇదివరకే స్పష్టం చేశాం. ఎలా ముందుకెళ్లాలన్నది మీ ఇష్టం. వేలం ప్రక్రియకు అడ్డుతగిలితే మీరు ఆమెను అరెస్ట్ కూడా చేయొచ్చు. ఇది పెద్ద స్కాం. ఈడీ ఆమె ఆస్తులను అటాచ్ చేసి వేలం వేయడానికి పూర్తి స్వేచ్ఛనిస్తున్నాం" అని జస్టిస్ పార్దీవాలా ఆదేశించారు. ఈ కేసు తదుపరి విచారణను మార్చికి వాయిదా వేశారు. మేం ఆమె ఆస్తులను సీజ్ చేసి [illegible] అన్ని సమస్యలూ తీరిపోయేవని న్యాయమూర్తి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

శ్రీవారి సేవలో నవశకం

- ఇకపై 'మాస్టర్ ట్రైనర్ల' సారథ్యం
- వారి ద్వారా స్వగ్రామాల్లోనే సేవకులకు శిక్షణ
- 1500 మందితో తితిదే భారీ కార్యాచరణ

ఈనాడు డిజిటల్, తిరుపతి: శ్రీవారిసేవ అంటే కేవలం స్వచ్ఛంద సేవ మాత్రమే కాదు.. అది భక్తితో కూడిన బాధ్యత. అందుకే తిరుమలకు వచ్చే భక్తులకు మరింత మెరుగైన, క్రమశిక్షణతో కూడిన సేవలందించే లక్ష్యంతో తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇటీవల తిరుమల పర్యటనకు వచ్చిన ఏపీ సీఎం చంద్రబాబు సూచనల మేరకు శ్రీవారి సేవకులకు దిశానిర్దేశం చేసేందుకు 1,500 మంది 'మాస్టర్ ట్రైనర్ల' వ్యవస్థను సిద్ధం చేస్తోంది. ఐఐఎం, రాష్ట్ర ప్రణాళిక విభాగం సంయుక్తంగా రూపొందించిన బృహత్తర ప్రణాళికతో శ్రీవారి సేవలో సమూల మార్పులు రానున్నాయి. మాస్టర్ ట్రైనర్ల ఎంపిక కోసం తితిదే మూడు నెలల కిందట ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానించగా 2000 పైగా అభ్యర్థనలు వచ్చాయి. 45-65 ఏళ్ల వయసు ఉండి, డిగ్రీ ఆపై చదువుకున్న విద్యావంతులను ఎంపిక చేశారు. వీరికి డిసెంబరు నుంచి శిక్షణ ప్రారంభమైంది. మొత్తం 15 బ్యాచ్‌లుగా, ఒక్కో బ్యాచ్‌కు 150 మంది చొప్పున వారం రోజుల పాటు శిక్షణ ఇస్తున్నారు. ఎస్వీయూ ఆచార్యులు, హెచ్‌ఆర్ నిపుణులు, తితిదే విభాగాధిపతులు పాఠాలు బోధిస్తున్నారు. తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈఓ వెంకయ్యచౌదరి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

పాఠ్యాంశాలు ఇవే..

క్రౌడ్ మేనేజ్‌మెంట్ (రద్దీ నియంత్రణ), భక్తులతో మర్యాదగా ప్రవర్తించే తీరు, తిరుమల చరిత్ర, హిందూ సనాతన ధర్మం, అత్యవసర సమయాల్లో సీపీఆర్ వంటి ప్రథమ చికిత్స అందించడంపై తర్ఫీదు ఇస్తున్నారు.

◆ పాఠాలే కాకుండా వారంలో చివరి రెండు రోజులు వివిధ విభాగాల్లో క్షేత్రస్థాయి శిక్షణ ఉంటుంది.

◆ తిరుమలలో శిక్షణ పూర్తి చేసుకున్న మాస్టర్ ట్రైనర్లు సొంత జిల్లాలకు వెళ్లాక ఆ ప్రాంతం నుంచి శ్రీవారి సేవకు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న భక్తుల వివరాలను (సుమారు 20 మంది జాబితా) తితిదే వీరికి పంపిస్తుంది. వారికి వారాంతాల్లో సుమారు పదిగంటల పాటు శిక్షణ ఇస్తారు. ◆ సేవకు వెళ్లేవారికి తిరుమలలో ఏం చేయాలి, ఏం చేయకూడదు, భక్తులతో ఎలా ఉండాలి అనే విషయాలపై ముందే అవగాహన కల్పిస్తారు. దీనివల్ల సేవకులు తిరుమలకు వచ్చేసరికే పూర్తి పరిజ్ఞానం, సేవాభావంతో సిద్ధంగా ఉంటారు. భక్తులకు మరింత మెరుగ్గా సేవలు అందించగలుగుతారు.

◆ శిక్షణ పొందిన 1,500 మంది మాస్టర్ ట్రైనర్లతో వాట్సప్ గ్రూపుల ద్వారా తితిదే ఎప్పటికప్పుడు సంప్రదిస్తుంది. వీరి నుంచే తిరుమలలో గ్రూప్ సూపర్‌వైజర్లను ఎంపిక చేస్తారు. ప్రతి 15 రోజులకు ఒకసారి కనీసం 100 మంది విధుల్లో ఉండేలా, రొటేషన్ పద్ధతిలో (ప్రతి 60-90 రోజులకు ఒకసారి) అవకాశం కల్పిస్తారు.



తితిదే అధికారులతో కలిసి మాస్టర్ ట్రైనర్ల శిక్షణ మాడ్యూల్ ఆవిష్కరిస్తున్న ఈవో అనిల్‌కుమార్ సింఘాల్

చలి గుప్పిట్లో రాష్ట్రం

డుంబ్రిగుడలో 4.4 డిగ్రీలు

ఈనాడు, విశాఖపట్నం; న్యూస్‌టుడే, చింతపల్లి: రాష్ట్రంలో చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. ఏజెన్సీతోపాటు మైదాన ప్రాంతాల్లోనూ రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. కర్ణాటక, తెలంగాణ సరిహద్దుల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంది. రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1.6 నుంచి 3 డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి. గురువారం రాత్రి రాష్ట్రంలోనే అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడలో 4.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అదే జిల్లాలోని ముంచంగిపుట్టులో 4.6, జి.మాడుగులలో 4.7, అరకులో 4.9, పెదబయలులో 5.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, శ్రీసత్యసాయి, కర్నూలు, అనంతపురం, అన్నమయ్య, ప్రకాశం, చిత్తూరు జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 12 డిగ్రీల లోపే. రాబోయే ఐదు రోజుల్లో రాష్ట్రంలో ఒకటి, రెండు చోట్ల కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని అమరావతి వాతావరణ కేంద్రం అంచనా వేస్తోంది.

హిందూ ఆలయాలకు తితిదే కానుకలు

రాయితీపై మైక్‌సెట్లు, గొడుగులు, రాతిశిల్పాలు, పంచలోహ విగ్రహాలు

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: హైందవ సంస్కృతి విస్తరణ, ప్రజల్లో భక్తిభావన పెంపు లక్ష్యంగా హిందూ ఆలయాలకు రాతితో పాటు విలువైన పంచలోహ విగ్రహాలను తితిదే అందిస్తోంది. సనాతన ధర్మప్రచారంలో భాగంగా మైక్‌సెట్లు, గొడుగులు, శేషవస్త్రాలు, రాతిశిల్పాలు, పంచలోహ విగ్రహాలను రాయితీపై ఇస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. ◆ మైక్‌సెట్ కొనుగోలుకు అయ్యే ఖర్చు రూ.25 వేలు. ఆంధ్రప్రదేశ్‌లోని ఎస్సీ, ఎస్టీలు 90% రాయితీపోనూ రూ.2,500లకు డీడీ పంపించాల్సి ఉంటుంది. ఇతరులు 50% రాయితీపోనూ రూ.12,500 చెల్లించాలి. ◆ గొడుగులు కేటగిరీలతో సంబంధం లేకుండా రూ.14,500 విలువ చేసేవి 50% రాయితీపోనూ రూ.7,250లకు అందిస్తుంది. ◆ హిందూ దేవాలయాల అవసరాలకు అనుగుణంగా శేషవస్త్రాలను ఉచితంగా అందజేయనుంది. ◆ శ్రీవేంకటేశ్వర స్వామి, శ్రీపద్మావతి అమ్మవారి రాతి విగ్రహాలు 5 అడుగులు, అంతకంటే తక్కువ ఎత్తులో ఉన్నవి ఉచితంగా ఇస్తుంది. మిగిలిన దేవతా విగ్రహాలను 75 శాతం రాయితీపై అందజేస్తారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఉచితం.

◆ పంచలోహ విగ్రహాలపై ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని ఎస్సీ, ఎస్టీలకు 90%, ఇతర వర్గాలకు 75% రాయితీ వర్తిస్తుంది. దేవతామూర్తుల రాతి, పంచలోహ విగ్రహాల పేర్లు, కొలతలతో ఆలయ అభ్యర్థన లేఖ పంపించాలి.



తితిదే అందించే పంచలోహ విగ్రహాలు

◆ విద్యాసంస్థలకు సరస్వతీదేవీ రాతి విగ్రహాలను 50% రాయితీతో అందిస్తోంది. ఎంఈవో లేదా డీఈవో ఆమోదంతో దరఖాస్తు సమర్పించాలి. మఠాలు, ట్రస్టులు, ఆశ్రమాలకు 50% రాయితీతో అందిస్తారు.

◆ ఈ కానుకలు కావాల్సిన వారు వ్యక్తిగత దరఖాస్తుతో పాటు ఆలయ కమిటీ దరఖాస్తు పత్రం, స్థానిక తహసీల్దార్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ నుంచి సిఫార్సు లేఖ, ఆలయ ఫొటో, కరెంట్ బిల్లు, దరఖాస్తుదారు ఆధార్ కార్డు తదితరాలు జత చేయాలి. డీడీ పంపాల్సిన చిరునామా: 'కార్యనిర్వహణాధికారి, తితిదే పరిపాలనా భవనం, కె.టి.రోడ్డు, తిరుపతి'. వివరాలకు 0877-2264276 ఫోన్ నంబర్‌పై సంప్రదించవచ్చు.

సుబ్రహ్మణ్యం బెయిల్ పిటిషన్ తిరస్కరణ

కల్తీ నెయ్యి సరఫరాలో ఆయనే కీలకమన్న ఏపీపీ

ఈనాడు, తిరుపతి: తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరాలో తితిదే కొనుగోళ్ల విభాగం మాజీ జీఎం ఆర్ఎస్ఎస్‌వీఆర్ సుబ్రహ్మణ్యం (ఏ29) బెయిల్ పిటిషన్‌ను నెల్లూరు ఏసీబీ కోర్టు శుక్రవారం తిరస్కరించింది. మొత్తం వ్యవహారంలో సుబ్రహ్మణ్యం కీలకపాత్ర పోషించారని ఏపీపీ జయశేఖర్ సిట్ తరఫున వాదించారు. భోలేబాబా డెయిరీ కల్తీ నెయ్యి సరఫరా చేస్తోందని తెలిసినా, ఆయన సిఫార్సుతోనే అదనపు ఆర్డర్లు ఇచ్చారని న్యాయాధికారి సరస్వతి దృష్టికి తెచ్చారు. అప్పటి తితిదే ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మాజీ పీఏ చిన్నఅప్పన్నకు సుబ్రహ్మణ్యం సహకరించారని పేర్కొన్నారు. ఆయన ఇచ్చిన వివరాలతోనే ప్రీమియర్ అగ్రిఫుడ్స్ సంస్థ నుంచి రూ.50 లక్షల లంచం తీసుకున్నారని తెలిపారు. 2021 మార్చి, డిసెంబరు, 2022 జూన్, సెప్టెంబరులో భోలేబాబా, వైష్ణవి, మాల్‌గంగా డెయిరీలను సుబ్రహ్మణ్యం తనిఖీ చేసినప్పుడు లోపాలు బహిర్గతమైనా ఉద్దేశపూర్వకంగానే దాచిపెట్టారని ఏపీపీ వాదించారు. ఆయన చర్యలతోనే తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా అయిందని స్పష్టం చేశారు. సిట్ విచారణకు కూడా సుబ్రహ్మణ్యం సహకరించడం లేదని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో ఆయనకు బెయిల్ ఇవ్వడం సరికాదని వాదించగా..న్యాయాధికారి ఏకీభవించి బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించారు.

గ్రహం అనుగ్రహం

20-12-2025 శనివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, పుష్య మాసం, శుక్లపక్షం

పాడ్యమి: పూర్తి

మూల: రా.1-09 తదుపరి పూర్వాషాఢ

వర్జ్యం: ఉ. 7-37 నుంచి 9-22 వరకు
తిరిగి రా. 11-24 నుంచి 1-09 వరకు

అమృత ఘడియలు: సా. 6-08 నుంచి 7-53 వరకు

దుర్ముహూర్తం: ఉ. 6-28 నుంచి 7-55 వరకు

రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు

సూర్యోదయం: ఉ.6.28; **సూర్యాస్తమయం:** సా.5.26

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	7.2	28.8
మెదక్	8.0	29.4
హనుమకొండ	9.5	28.5
హైదరాబాద్	10.8	29.4
అనంతపురం	13.5	29.2
విజయనగరం	15.0	27.0
కర్నూలు	15.4	31.1
కడప	17.0	29.0
రాజమహేంద్రవరం	17.0	33.0
విశాఖపట్నం	17.4	28.2
గుంటూరు	17.5	28.5
శ్రీకాకుళం	18.0	29.0
తిరుపతి	18.1	29.2
విజయవాడ	18.8	28.5
నరసాపురం	19.2	30.6
ఒంగోలు	20.4	29.5
నెల్లూరు	21.1	29.3
తాడేపల్లిగూడెం	25.0	29.0



వ్యాయామం.. మెదడుకు రక్షణ కవచం

వ్యాయామం శరీరానికే కాదు మెదడుకూ రక్షణ కవచం. క్రమం తప్పక చేసే కసరత్తుతో.. ఒత్తిడి, వార్ధక్యాలను తట్టుకునే శక్తిని మెదడు సాధిస్తుంది. వాపు, ఆక్సిడేటివ్ ఒత్తిడి నెమ్మదిస్తుంది. దీంతో మెదడులోని నాడీకణాలకు రక్షణ లభించడంతోపాటు మెదడు ఆరోగ్యాన్ని సంరక్షించే రసాయనాలు ప్రేరేపితం అవుతాయి. జీవితాంతం మెదడు చురుగ్గా ఉంటుంది. మెదడు ఆరోగ్యాన్ని ఒక్కసారిగా సాధించలేం..వ్యాయామాన్ని చేయడం ద్వారా దశలవారీగా పొందగలం.

– లూయిసా నికోలా, న్యూరోఫిజియాలజిస్టు

రౌడీషీటర్లపై పీడీ చట్టం

- ఎన్నిసార్లు అరెస్టయినా తీరు మార్చుకోని వారిపై ప్రయోగం
- ఈ ఏడాది 153 మంది రౌడీల ముందస్తు నిర్బంధం
- వీరికి ఏడాదిపాటు జైలే



మరింత మంది రౌడీషీటర్లపై పీడీ యాక్ట్

- హరీశ్‌కుమార్ గుప్తా, డీజీపీ

రాష్ట్రంలోని ప్రతి రౌడీషీటర్ కదలికలపై నిఘా పెట్టాం. వారు తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవు. మరింత మంది కరడుగట్టిన రౌడీషీటర్లపై పీడీచట్టం ప్రయోగించబోతున్నాం. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రౌడీల రాష్ట్ర బహిష్కరణకూ చర్యలు చేపడుతున్నాం.

ఈనాడు, అమరావతి: ఎన్ని కేసులు నమోదు చేసినా, ఎన్నిసార్లు అరెస్టు చేసినా తీరు మార్చుకోకుండా పదే పదే నేరాలకు పాల్పడుతున్న కరడుగట్టిన రౌడీషీటర్లపై రాష్ట్ర ప్రభుత్వం పీడీ చట్టం (ఆంధ్రప్రదేశ్ ప్రివెన్షన్ ఆఫ్ డేంజరస్ యాక్టివిటీస్ చట్టం-1986 (ప్రమాదకర కార్యకలాపాల నియంత్రణ చట్టం) ప్రయోగిస్తోంది. ఏదైనా కేసులో అరెస్టు చేసినా కొన్ని రోజులకే బెయిల్‌పై బయటకు వచ్చేసి పేట్రేగిపోతున్న రౌడీలను ఏడాదిపాటు ముందుగానే నిర్బంధించేందుకు ఈ చట్టాన్ని వాడుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ సుమారు 220 మంది రౌడీషీటర్లపై పీడీ చట్టాన్ని ప్రయోగించారు. వైకాపా హయాంలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణను గాలికి వదిలేయటం, రాజకీయ అండదండలతో రాష్ట్రంలో రౌడీషీటర్లు పేట్రేగిపోయారు. వారి నేరసామ్రాజ్యాలను విస్తరించుకుని ఇప్పటికీ తీవ్ర నేరాలకు పాల్పడుతూనే ఉన్నారు. నెల్లూరు జిల్లాకు చెందిన లేడీడాన్ నిడిగుంట అరుణ ఇందుకు ప్రబల నిదర్శనం. అలాంటి వారిపై ప్రభుత్వం పీడీ చట్టం ప్రయోగిస్తోంది.

బాపట్ల, ఎన్టీఆర్ జిల్లాల్లో అత్యధికం

రాష్ట్రవ్యాప్తంగా 26,518 మంది రౌడీలు ఉండగా.. ఈ ఏడాది 153 మందిపై పీడీ చట్టం ప్రయోగించారు. అత్యధికంగా బాపట్ల జిల్లాలో 36 మందిపై, ఎన్టీఆర్ జిల్లాలో 23, గుంటూరులో 20, విశాఖపట్నంలో 14, ప్రకాశంలో 12, పల్నాడు, నెల్లూరుల్లో చెరో 10 మంది రౌడీషీటర్లపై పీడీ చట్టం ప్రయోగించారు. 11,728 మందిని బౌండోవర్ చేశారు.

◆ నంద్యాల, కర్నూలు, కృష్ణా, అన్నమయ్య, చిత్తూరు, కాకినాడ, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఒక్కరిపైనా ఈ చట్టం ప్రయోగించలేదు.

◆ గత ఆరు నెలల్లో కనీసం మూడు తీవ్ర నేరాల కేసులు నమోదైన రౌడీషీటర్లను గుర్తించి, వారిలో కరడుగట్టిన వారిపై పీడీ చట్టం ప్రయోగిస్తున్నారు.


◆ ఈ చట్టం ప్రకారం నాటుసారా, అక్రమ మద్యం, మాదకద్రవ్యాల తయారీ, సరఫరా, రవాణా, ఎగుమతి, దిగుమతిదారులు, విక్రయదారులు, బందిపోటు దొంగతనాలకు పాల్పడే ముఠాలు, మానవ అక్రమరవాణాదారులు, భూకబ్జాదారులు, ఇతర వ్యవస్థీకృత, తీవ్ర నేరాలకు పాల్పడేవారిని ముందస్తుగా నిర్బంధించేందుకు అవకాశముంది. ఎస్పీల సిఫార్సుల మేరకు కలెక్టర్లు, పెద్ద నగరాల్లో నేరుగా పోలీస్ కమిషనర్లే పీడీ యాక్ట్ కింద ఉత్తర్వులిస్తున్నారు. వాటికి ఆమోదం తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిస్తోంది.

◆ ఎవరిపైనైనా ఈ చట్టాన్ని ప్రయోగిస్తే వారు గరిష్ఠంగా ఏడాదిపాటు జైల్లో ఉండాల్సిందే. బెయిల్‌కూ అవకాశం ఉండదు.

17కు చేరిన స్క్రబ్ టైఫస్ మరణాలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ పాజిటివ్ కేసులు, మరణాల సంఖ్య పెరుగుతోంది. అన్ని జిల్లాల్లో కేసుల ప్రభావం కనిపిస్తోంది. ఈ ఏడాది జనవరి 1 నుంచి డిసెంబరు 19వరకు రాష్ట్రవ్యాప్తంగా 9,665 మందికి పరీక్షలు చేస్తే.. 1,884 మందికి పాజిటివ్‌గా తేలింది. వీరిలో స్క్రబ్ టైఫస్ లక్షణాలతోపాటు ఇతరత్రా దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో ఇప్పటివరకు 17 మంది మరణించారు. ఈనెల 17న అన్నమయ్య జిల్లాలో కె.కల్యాణి (75), అనంతపురం జిల్లాలో పి.కదిరమ్మ (72) మృతిచెందినట్లు అధికారులు గుర్తించారు.

ఇదీ సంగతి!



మాటిమాటికీ జైలు.. జైలు అనకండి సార్.. పైన తథాస్తు దేవతలుంటారు!!

'నానోలాట్ సిరీస్'.. అరకు కాఫీ డిమాండ్‌ను ప్రతిబింబిస్తోంది

- మద్దతిస్తున్న 'నాంది', ఆనంద్ మహీంద్రాలకు ధన్యవాదాలు
- సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: అరకు కాఫీకి నాంది ఫౌండేషన్ తీసుకొచ్చిన 'నానోలాట్ సిరీస్'కు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరుగుతోందని, ఇది ఆ రకానికి ఉన్న డిమాండ్‌ను ప్రతిబింబిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. అరకు కాఫీని ప్రపంచ స్థాయి బ్రాండ్‌గా తీర్చిదిద్దిన నాంది ఫౌండేషన్‌కు, అరకు రైతులకు మద్దతుగా నిలుస్తున్న మహీంద్ర గ్రూపు సంస్థల అధినేత, నాంది ఛైర్మన్ ఆనంద్ మహీంద్రాకు ఎక్స్ వేదికగా శుక్రవారం ధన్యవాదాలు తెలిపారు. 'నానోలాట్ సిరీస్' తొలి బ్యాచ్ కాఫీ ప్యాకెట్లు మొదటి రోజులోనే పూర్తిగా, రెండో బ్యాచ్ రెండు గంటల్లో అమ్ముడవడం దానికి వచ్చిన అపూర్వ స్పందనకు నిదర్శనం. ఈ విషయాన్ని పంచుకొన్న ఆనంద్ మహీంద్రాకు ధన్యవాదాలు' అని చంద్రబాబు పేర్కొన్నారు. నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో అరకు కాఫీకి పెరుగుతున్న డిమాండ్ గురించి ఆనంద్ మహీంద్రా ఎక్స్‌లో చేసిన పోస్టుకు చంద్రబాబు ఈ విధంగా స్పందించారు.

Reliance
Growth is Life

SMART BAZAAR

ఉంది కదా, మరెక్కడికో ఎందుకు వెళ్ళడం?

బాడీ లోషన్ / క్రీమ్ 200 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
ఫ్లాట్ 50% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹290 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹145 మొదలుకుని

ఏరియల్ / సర్ఫ్ ఎక్సెల్ మ్యాటిక్ లిక్విడ్ 2 L (టాప్ / ఫ్రంట్ లోడ్) (సెలెక్ట్ వేరియంట్స్)
ఆదా చేసుకోండి ₹65
ఎమ్ఆర్‌పి ₹319 మొదలుకుని | స్మార్ట్ ప్రైస్ ₹254 మొదలుకుని

హెరిటేజ్ అగ్‌మార్క్ గ్రేడ్ స్పెషల్ ఘీ 1 L
₹629
ఎమ్ఆర్‌పి ₹740 | ఆదా చేసుకోండి ₹111

లూజ్ చక్కెర స్మాల్ 1 kg
₹44
మార్కెట్ ధర ₹50

లూజ్ ఉరద్ వాష్డ్‌గోటా 1 kg
₹101
మార్కెట్ ధర ₹106

లూజ్ హైదరాబాదీ బిర్యానీ బాస్మతి రైస్ 1 kg
₹81
మార్కెట్ ధర ₹90

గుడ్ లైఫ్ డైలీ రైస్ 26 kg
₹42.11 /kg
₹1095
ఎమ్ఆర్‌పి ₹1800 | ఆదా చేసుకోండి ₹705

₹40.34 /kg
కర్నూలు సోనా మసూరి రైస్ 26 kg ఎమ్ఆర్‌పి ₹1650
₹1049
ఆదా చేసుకోండి ₹601

ఆధార్ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ 800 g
₹132
ఎమ్ఆర్‌పి ₹180 | ఆదా చేసుకోండి ₹48

ఆశీర్వాద్ సుపీరియర్ ఎంపీ చీట్ ఆటా 5 kg
₹295
+ఏదైనా వంట నూనెపై ₹15 తగ్గింపు పొందండి
ఎమ్ఆర్‌పి ₹358 | ఆదా చేసుకోండి ₹63

ఆశీర్వాద్ / ఈస్టర్న్ / ఆచి స్పైసెస్ 50 g మొదలుకుని / బేసన్ / మైదా / సుజీ / గుడ్ లైఫ్ సోయా చంక్స్ 200 g మొదలుకుని (ఎంపిక శ్రేణి)
BUY ANY 1 GET ANY 1 FREE*
*ఎం ఎమ్ఆర్‌పి

గుడ్ లైఫ్ బాదం 500 g
₹425
ఎమ్ఆర్‌పి ₹620 | ఆదా చేసుకోండి ₹195

మామాఎర్త్ షాంపు 400 ml + కోల్గేట్ టోటల్ టూత్‌పేస్ట్ 280 g + పియర్స్ ప్యూర్ అండ్ జెంటిల్ సోప్ 125 g x 4 + 1 (సెలెక్ట్ వేరియంట్స్)
Combo @ ₹599
కంబైన్డ్ ఎమ్ఆర్‌పి ₹1274 మొదలుకుని
ఆదా చేసుకోండి ₹675 మొదలుకుని

డవ్ / ఫియామా సోప్ 125 g మొదలుకుని (మల్టీ ప్యాక్) (సెలెక్ట్ వేరియంట్స్)
ఫ్లాట్ 33% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹398 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹267 మొదలుకుని

సానిటరీ నేప్కిన్స్ (ఎంపిక శ్రేణి)
ఫ్లాట్ 50% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹335 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹168 మొదలుకుని

మ్యామీ పోకో / మదర్ కేర్ బేబీ కేర్ (సెలెక్ట్ వేరియంట్స్)
కనీసం 33% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹562 మొదలుకుని

బిస్కెట్స్ ప్యాక్ 230 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
BUY ANY 2 GET ANY 1 FREE
ఎమ్ఆర్‌పి ₹125 మొదలుకుని /యూనిట్

తాజ్ మహల్ టీ 500 g
ఆదా చేసుకోండి ₹65
ఎమ్ఆర్‌పి ₹380 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹315 మొదలుకుని

సఫోలా యాక్టివ్ హనీ 1 kg
ఫ్లాట్ 50% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹550 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹275 మొదలుకుని

సన్‌ఫీస్ట్ యిప్పీ! మ్యాజిక్ మసాలా నూడుల్స్ 700 g
ఆదా చేసుకోండి ₹75
ఎమ్ఆర్‌పి ₹180 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹105 మొదలుకుని

యూనిబిక్ / ఇలైట్ ప్లమ్ కేక్ 330 g (సెలెక్ట్ వేరియంట్స్)
ఫ్లాట్ 50% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹240 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹120 మొదలుకుని

బూస్ట్ / హార్లిక్స్ 1 kg
ఆదా చేసుకోండి ₹120
ఎమ్ఆర్‌పి ₹534 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹414 మొదలుకుని

HAPPY LIVING డబల్ బెడ్‌షీట్
BUY 1 GET 3 FREE
ఎమ్ఆర్‌పి ₹1999 మొదలుకుని

cello LA OPALA Servewell LARAH లూజ్ స్టీల్ / ఓపల్ వేర్ / మెలమైన్ డిన్నర్ సెట్ (ఎంపిక శ్రేణి)
BUY 1 GET 1 FREE
ఎమ్ఆర్‌పి ₹75 మొదలుకుని

కనీసం 5% తక్కువ ఎమ్ఆర్‌పి పై ప్రతిరోజు

చక్కెర 1kg ₹9* ప్రతిరోజు
*₹2499 మరియు అంతకంటే మించిన షాపింగ్‌పై

SMART SUPERSTORE వద్ద కూడా లభ్యం

ఇప్పుడు తెరవబడింది పాయకరావుపేట: శ్రీ లక్ష్మి థియేటర్ ప్రక్కన, ఆర్ సి ఎమ్ చర్చ్, మెయిన్ రోడ్డు ఎదురుగా. పాలకొల్లు: శ్రీనివాస థియేటర్ ప్రక్కన, ఆర్ టి సి బస్ స్టాండ ఎదురుగా. జంగారెడ్డిగూడెం: జె పి సెంటర్, క్రొత్త మ్యునిసిపల్ ఆఫీసు దగ్గర.

ఇంకొల్లు: మణికంట కాంప్లెక్స్, వరమూరు రోడ్డు, పోస్ట్ ఆఫీసు దగ్గర, ఇంకొల్లు భీమవరం: పద్మశ్రీ కాంప్లెక్స్, మెయిన్ రోడ్. గూడూరు: PSR మాల్, బస్టాండ దగ్గర. గుంటూరు: • ఐటీసీ ఎదురుగా, చుట్టుగుంట దగ్గర, శ్రీనివాసరావు పేట • KKR ఫంక్షన్ ప్లాజా, నగరంపాలెం • యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదురుగా, మెయిన్ రోడ్ లక్ష్మీపురం • ఫీవర్ హాస్పిటల్ ఎదురుగా, అమరావతి రోడ్ • సిమ్స్ కళాశాల పక్కన, మంగళదాస్ నగర్. జగ్గయ్యపేట: సీతారామపురం ఎస్‌బీఐ బ్యాంక్ దగ్గర. కందుకూరు: రాజ్ థియేటర్ ప్రాపర్టీ. మచిలీపట్నం: పాత వినాయక థియేటర్, రేవతి సెంటర్. నందిగామ: భారత్ టాకీస్ రోడ్. నర్సరావుపేట: రిలయన్స్ ట్రెండ్స్ పక్కన, పల్నాడు రోడ్డు. నెల్లూరు: MGB ఫెలిసిటీ మాల్, GNT రోడ్ • KVR పెట్రోల్ బంక్ దగ్గర, దర్గామిట్ట • ఐకాన్ నర్తకి ప్లాజా, RR వీధి, ఎన్టీఆర్ విగ్రహం దగ్గర. నూజివీడు: బస్ స్టాండ ఎదురుగా, మెయిన్ రోడ్. ఒంగోలు: పాత బై-పాస్ రోడ్డు, ఆంజనేయ స్వామి విగ్రహం దగ్గర. పొన్నూరు: GBC రోడ్ విజయ్ డిజిటల్స్ పక్కన. తాడేపల్లిగూడెం: ఆర్టీసీ బస్ డిపో దగ్గర. తణుకు: టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఎదురుగా, నరేంద్ర సెంటర్ విజయవాడ: • గోపాలరెడ్డి రోడ్డు, వి.వి.కాంప్లెక్స్ • శుభం కల్యాణ వేదిక, ఇండియన్ పెట్రోల్ బంక్ పక్కన, రామవరప్పాడు రింగ్ • మొగల్రాజపురం, విశాలాంధ్ర రోడ్డు వినుకొండ: పాత లక్ష్మి థియేటర్, అద్దంకి రోడ్డు ఉయ్యూరు: దీపక్ మహల్ థియేటర్ ఎదురుగా, కాటూరు రోడ్. నెల్లూరు: అయ్యప్పస్వామి గుడి సర్కిల్, వెంకటరెడ్డి నగర్, వేదయపాలెం. పిడుగురాళ్ల: గంగమ్మ గుడి ఎదురుగా, మెయిన్ రోడ్. కంభం: ఆర్టీసి బస్టాండ సమీపంలో గిద్దలూరు ప్రధాన రహదారి. మేదరమెట్ల: విజయలక్ష్మీ టాకీస్, బస్టాండ ఎదురుగా. చెరుకుపల్లి: ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ దగ్గర, బూర్లమ్మ స్ట్రీట్, గుళ్ళపల్లి. గిద్దలూరు: కా/శినాయన కుంట రోడ్, రిలయన్స్ ట్రెండ్స్ ఎదురుగా. నల్లజర్ల: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పక్కన, కోరాకాంప్లెక్స్, మెయిన్ రోడ్. పెడన: బంటుమిల్లి రోడ్ గణేష్‌నగర్, కోతమిషన్స్ సెంటర్. తిరువూరు: వెంకట్రామా థియేటర్, బోసు బొమ్మ సెంటర్. చల్లపల్లి: బందర్ రోడ్. ఏలూరు: పాత శివాదుర్గ థియేటర్, రేల్వే స్టేషన్ దగ్గర, పిఠాపురం. ఆకివీడు: ఎం వి ఆర్ కాంప్లెక్, ఎస్ బి ఐ ఎదురుగా, కైకలూరు రోడ్. కొవ్వూరు: ఎల్ ఐ సి ఆఫీస్ దగ్గర, ఎల్ ఐ సి ఆఫీస్ రోడ్. పాలకొల్లు: శ్రీనివాస థియేటర్ పక్కన, RTC బస్ స్టాండ్‌కు ఎదురుగా.

మీకు సమీపంలో ఉన్న స్టోర్ లొకేట్ చేయడానికి స్కాన్ చేయండి

SMART BAZAAR

నియమ నిబంధనలు వర్తిస్తాయి. #ఎంపికైన ఉత్పాదనల ఎమ్ఆర్ పిలపై మాత్రమే, వంట నూనె, లూస్ స్టేపల్స్, తాజా పాలు, చంటి బిడ్డలకు ఆహారం, పతంజలి ఉత్పాదనలు, సాధారణ వస్తువులు, ఎలక్ట్రానిక్స్, దుస్తులు మరియు పాదరక్షలు మినహా. స్టాక్స్ ఉన్నంతవరకు ఆఫర్లు చెల్లుతాయి. ఆఫర్లన్నీ నోటీస్ చేయకుండానే మార్పు చేయబడగలవు. చూపించబడిన ఉత్పాదనల బొమ్మలు/ఫోటోగ్రాఫ్‌లు కేవలం ప్రదర్శన కోసం మాత్రమే. హోమ్‌పేజ్ ఆఫర్లు ఎంపిక చేయబడిన స్మార్ట్ బజార్ మరియు స్మార్ట్ సూపర్ స్టోరులలో మాత్రమే వర్తిస్తాయి. ఉత్పాదనలన్నిటి యొక్క ఎమ్ఆర్‌పి అన్ని పన్నులతో కూడి ఉంటుంది. డిస్కౌంట్ పర్సెంటేజ్‌ను ఆఫర్ ధర యొక్క సమీప పర్సెంటేజ్‌కు రౌండ్ ఆఫ్ చేయబడింది. ఇతర ఆఫర్లన్నీ 21 డిసెంబరు 2025 వరకు చెల్లుతాయి. ఆక్షేపణలన్నీ ముంబయిలోని కోర్టుల్లో ప్రత్యేక అధికారానికి మాత్రమే లోబడి ఉంటాయి.

ఈనాడు

'విశ్వబంధు'గా భారతావని

స్థానిక ప్రజావసరాలను తీర్చడంలో ప్రభుత్వం పాత్రేమిటో నిర్వచించడానికి, ప్రజాస్వామ్య వ్యవస్థల మధ్య అధికారాల విభజనకు మాత్రమే మన రాజ్యాంగం పరిమితం కాలేదు. ప్రపంచంతో అనుసంధానం కావడంలో తప్పటడుగులు పడితే- దీర్ఘకాలంలో జాతి ప్రగతికి అవి నష్టదాయకాలవుతాయనే వాస్తవాన్ని భారత సంవిధానం గుర్తించింది. అందువల్లే అంతర్జాతీయంగా శాంతిభద్రతలను పెంపొందించడం, విదేశాలతో న్యాయబద్ధమైన, గౌరవప్రదమైన సంబంధాలను నెలకొల్పడం రాజ్యం బాధ్యత అని 51వ రాజ్యాంగ అధికరణ స్పష్టంచేస్తోంది. 'విశ్వబంధు'గా భారతావనిని తేజరిల్లజేయాలని ఆశిస్తున్న ఈ సంవిధాన సూత్రమే దశాబ్దాలుగా మన విదేశాంగ విధానానికి దారిదీపమవుతోంది. దానికి అనుగుణంగానే ఇండియా నేడు అనేక దేశాలకు విశ్వసనీయ నేస్తంగా, సహజ భాగస్వామిగా కొనసాగుతోంది. అగ్రరాజ్యాలతో సంబంధ బాంధవ్యాలను నెరపుతూనే- వర్ధమాన దేశాలతో చెలిమికి ఎప్పటికప్పుడు కొత్త చివుళ్లు తొడుగుతూ తన వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని నిలబెట్టుకుంటోంది. బెదిరింపులు, బలప్రయోగాలు, రుణవలలతో పరాయి దేశాలపై పెత్తనం చలాయించే అమెరికా, చైనా దుర్నీతులకు దూరంగా పరస్పర గౌరవం, నమ్మకం, సహకారాలతో ద్వైపాక్షిక బంధాలను బలోపేతం చేసుకుంటోంది. ఈ క్రమంలోనే ప్రధాని మోదీ తాజాగా జోర్డాన్, ఇథియోపియా, ఒమన్‌లలో పర్యటించారు. ఆ మూడింటితో భారత ఆర్థిక, హార్దిక బంధాలను సుస్థిరం చేస్తూనే- వర్ధమాన రాజ్యాల ఆకాంక్షలను అర్థంచేసుకుంటూ, భుజంభుజం కలిపి వాటితో కలిసి నడిచేందుకు ఇండియా ఎప్పుడూ ముందుంటుందనే సానుకూల సందేశాన్ని అందించారు!

ఆఫ్రికా కొమ్ము భాగంలో ఎర్ర సముద్ర వాణిజ్య మార్గాలకు సమీపంలో భౌగోళికంగా కీలకమైన ప్రాంతంలో ఉన్న ఇథియోపియా- దాదాపు 14కోట్ల జనాభాతో వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. 55 దేశాల ఆఫ్రికన్ యూనియన్ ప్రధాన కార్యాలయం కొలువైన ఇథియోపియాతో స్నేహాన్ని సుదృఢం చేసుకోవడం- ఆ ఖండంలోని మిగిలిన రాజ్యాలతో సుహృద్భావ సంబంధాలను పటిష్ఠపరచుకోవడానికి దోహదపడుతుంది. అక్కడ చైనా ప్రాబల్య విస్తరణకు కొంతమేరకు పగ్గాలు వేయడంతో పాటు ఐరాస వేదికలపై మన ప్రయోజనాల పరిరక్షణకు ఆఫ్రికా మద్దతును కూడగడుతుంది. సంక్షుభిత పశ్చిమాసియాలో రాజకీయంగా సుస్థిరమైన జోర్డాన్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం- వ్యవసాయ, వాణిజ్య, భద్రతాపరమైన అవసరాలను తీర్చడంలో భారత్‌కు లాభదాయకమవుతుంది. శాంతియుతంగా కలిసి జీవించడమనే సమున్నత భావనకు కట్టుబడిన రెండు దేశాల నడుమ మైత్రి ఉభయతారకంగా వర్ధిల్లడానికి ప్రధాని మోదీ పర్యటన ఉపకరిస్తుంది!

భారతావనికి ప్రాచీన మిత్రరాజ్యమైన ఒమన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) ముడిపడటం సహర్షంగా స్వాగతనీయం. ప్రస్తుతం వెయ్యి కోట్ల డాలర్లకు పైబడిన ద్వైపాక్షిక వాణిజ్య విలువ మరింత వృద్ధి చెందడానికి ఇది సాయపడుతుంది. ట్రంప్ సుంకాలతో అంతటా అనిశ్చితి అలుముకున్న వాతావరణంలో మస్కట్‌తో మిత్రత్వం ఎంత బలిష్ఠమైతే భారత్‌కు అంతగా లాభిస్తుంది. ఆఫ్రికా, పశ్చిమాసియా దేశాలతో చెలిమి అంతర్జాతీయ సంబంధాల్లో సమతూకానికి, బహుళపక్ష ప్రపంచంలో భారతావని పరపతి పెంపునకు ఊతమిస్తుంది. అమెరికా పెత్తందారీతనానికి, చైనా విస్తరణవాదానికి భిన్నంగా స్నేహ సహకారాలతో సమష్టి శ్రేయస్సుకు పాదులుతీసే విదేశాంగ విధానమే ఇండియా ప్రతిష్ఠను ఇనుమడింపజేస్తోంది. ఆ దౌత్యరీతిని అలా ముందుకు తీసుకెళ్లడమే వర్ధమాన దేశాల వాణిగా అంతర్జాతీయ యవనికపై భారతావని స్వరాన్ని మరింత దృఢతరం చేస్తుంది!



కఠిన నిర్ణయాలు తీసుకునే ధైర్యం ఉండటం వ్యాపారవేత్తకు బలం. అలాగని అన్నివేళలా కఠిన వైఖరి అవలంబించకూడదు. నమ్మిన విధానం ఫలితం ఇవ్వనప్పుడు వెనక్కి తీసుకోవడానికి సంకోచించకూడదు. ఎవరి నిర్ణయం అన్నది కాదు, ఎవరికి మేలు చేస్తుందన్నది ముఖ్యం.

– అజయ్ పీరామల్

ధ్యాన పయనం

విజ్ఞులైన ఋషులు, మహర్షులు, బ్రహ్మర్షులు, పతంజలి వంటి సాధు పుంగవులు మనకు అందించిన వరం- యోగం. యోగాసనాల ప్రక్రియకు ధ్యానం ఆసరా. కానీ శ్వాసనే గురువుగా తలచి ఉచ్ఛ్వాస, నిశ్వాసలపై దృష్టి పెడితే అదే ధ్యానం. బుద్ధుడు చెప్పిన 'ఆనాపానసతి' ఇదే. 'ఆన' అంటే పీల్చేగాలి. 'అపాన' అంటే విడిచే గాలి. 'సతి' అంటే ఎరుక. ఇది శ్వాస మీద ధ్యాసగా ప్రాచుర్యం పొందింది. ఎరుకతో కూడిన నిద్రయే ధ్యానం. ఆ నిద్రకన్నా మూడు రెట్లు అధిక ప్రాణశక్తిని శరీరానికి ఇస్తుంది. భారతీయ సంస్కృతిలో భాగంగా ఇమిడిపోయిన ఈ ధ్యాన ప్రక్రియ ప్రపంచాన్ని ప్రభావితం చేసింది. సాధన ద్వారా ధ్యానం సాధ్యమేనని వివరించింది భగవద్గీత. మనసును శాంతింప చేయడం, ఉన్నత స్థితిగా దర్శించడమే ధ్యానం.

ధ్యాని.. ఆలోచనలు లేని స్థితికి చేరి, ఓ దివ్యమైన ఆనందాన్ని పొందుతాడు. కళ్ళు, నోరు మూసుకుని శ్వాసతో అనుసంధానమవడం చాలా సులభం. ఖర్చు లేదు. శక్తినిచ్చేది. నమ్మకం ఉంచి సాధన చేస్తే ప్రాణశక్తి దేహాన్ని, మనసును ఉత్తేజపరుస్తుంది. ప్రతి అవయవం శక్తిని పుంజుకుని జడత్వాన్ని వదిలేస్తుంది. తద్వారా సంపూర్ణ మానసిక, శారీరక ఆరోగ్యం లభిస్తుంది. శరీరానికి కదలిక, మనసుకు నిశ్చలత్వం అవసరం. మనసుకు సరైన వ్యాయామం ధ్యానమే. దీని ద్వారా నిశ్చలతత్వం ఏర్పడి ఏకాగ్రత వస్తుంది. అర్జునుడికి పక్షి కన్ను మాత్రమే కనిపించినట్లు మనం కూడా ఈ భౌతిక ఆసక్తులేవీ కనిపించని స్థితిలోకి వెళ్తాం. ఫలితంగా జ్ఞాపకశక్తి పెరుగుతుంది. సమయపాలనా అలవడుతుంది. అనవసరమైన ఆలోచనలకు తెర పడుతుంది. విద్యార్థుల దగ్గర్నుంచి వృద్ధుల వరకు అందరికీ ఉపయోగపడే విధిగా మారితే భవిత బంగారుమయమవుతుంది.



ధ్యానం మనలోకి మనం చేసే ఓ చక్కటి ప్రయాణం. ఆత్మసాక్షాత్కారం మనల్ని మనం తెలుసుకోవడం ద్వారానే వస్తుంది. నిశ్చలమైన మనసు సరైన నిర్ణయాలను తీసుకుంటూ బుద్ధి వికసిస్తుంది. ఆత్మ చైతన్యం పొంది చక్కటి మార్గదర్శిగా మారుతుంది. 'ఉద్ధరేదాత్మనాత్మానం నాత్మానం అవసాదయేత్...' అన్న గీతాశ్లోకం చెబుతున్నట్లు ఎవరో వస్తారని ఎదురుచూపులు మాని ఎవరికి వారే తమ మనసును ఉద్ధరించుకునే ప్రక్రియ ధ్యానమే. మారాల్సింది ఎవరికి వారే. అది తెలుసుకోవాలి. ధ్యాన ప్రక్రియ ప్రస్తుతంలో ఉండమంటుంది. ఇప్పటి విధి నిర్వహణను ఎరుకతో చెయ్యమంటుంది. అప్పుడు భవిష్యత్తు దానంతటదే చక్కబడుతుందన్న భరోసాను ఇస్తుంది.

ధ్యానం ద్వారా శాంతి, సహనం, ప్రేమ, ఓర్పు, నేర్పు, హేతుబద్ధంగా ఆలోచించే తత్వం, క్షమించే గుణం, క్షమించమని అడిగే ధైర్యం వస్తాయి. ప్రతి విషయాన్ని ప్రజాశ్రేయోదాయకంగా అమలు చేసే విధానం మనకు అలవడుతుంది. ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది. ఎదుటి వారిలోని దివ్యత్వాన్ని అంతర్యామిని దర్శించగలిగే గుణం అబ్బుతుంది. ఇటువంటి ధ్యానపయనం వ్యక్తికే కాక, సమాజానికీ మేలుచేస్తుంది.

అంతర్యామి

– కె.వి.వి.సత్యప్రసాద్

ఒక్క యాపిల్‌తో సరిపెట్టుకుందామా?

కేంద్రం 2014లో 'భారత్‌లో తయారీ' పథకం ప్రారంభించినప్పుడు దేశంలో రెండంటే రెండే మొబైల్ ఫోన్ ఉత్పత్తి సంస్థలు ఉండేవి. ఇప్పుడు వాటి సంఖ్య మూడొందలు దాటింది. అప్పట్లో భారత్‌లో తయారైన మొబైల్ ఫోన్ల విలువ రూ.18వేల కోట్లు కాగా, నిరుడు వాటి విలువ రూ.5.45 లక్షల కోట్లకు చేరింది. యాపిల్ వంటి బహుళజాతి కంపెనీలకు స్వాగతం పలికితే, మరిన్ని రంగాల్లో భారత్ దేదీప్యమానంగా వెలుగొందగలదు.

నేడు ప్రపంచంలోనే అత్యధికంగా మొబైల్ ఫోన్లను ఉత్పత్తి చేస్తున్న రెండో దేశం ఇండియా. 2014-15లో దేశంలోని మొబైల్ ఫోన్ల గిరాకీలో మూడొంతులను దిగుమతుల ద్వారానే తీర్చుకోవాల్సి వచ్చింది. నిరుడు ఆ అవసరం 0.02శాతానికి తగ్గిపోయింది. అదేకాలంలో భారత్ నుంచి స్మార్ట్‌ఫోన్ల ఎగుమతులు రూ.1,500 కోట్ల నుంచి రెండు లక్షల కోట్ల రూపాయలకు ఎగబాకాయి. ఇవాళ మన దగ్గర నుంచి ఏటా 33కోట్ల మొబైల్ ఫోన్లు విదేశాలకు సరఫరా అవుతున్నాయి. 2020-21 నుంచి భారతీయ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి రంగంలోకి 400కోట్ల డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ప్రవహించాయి. భారత్‌లో తయారీ పథకంలో ఈ రంగానిదే సింహభాగం. దేశంలో స్మార్ట్‌ఫోన్ల ఉత్పత్తికి అవసరమైన వసతులను సమకూర్చడం, ప్రభుత్వం తగిన ప్రోత్సాహక విధానాలను అనుసరించడం వల్లే ఇది సాధ్యపడింది.



ఎగుమతుల వెల్లువ

ప్రపంచబ్యాంకు వ్యాపార సౌలభ్య సూచీలో 2014లో 142 ర్యాంకుతో సరిపెట్టుకున్న భారత్ 2019లో 63వ ర్యాంకుకు చేరింది. భారత్‌లో తయారీ, డిజిటల్ ఇండియా, నైపుణ్య భారత్, దశలవారీ పారిశ్రామికోత్పత్తి పథకం, జాతీయ ఎలక్ట్రానిక్స్ విధానం, ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకం వంటివి దేశాన్ని ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి కేంద్రంగా తీర్చిదిద్దాయి. అసంఖ్యాక వినియోగదారులు, ప్రీమియం ఫోన్లకు గిరాకీ, వ్యాపార సౌలభ్యానికి ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు సైతం ఇండియాను స్మార్ట్‌ఫోన్ల దిగుమతిదారు స్థితి నుంచి అతిపెద్ద ఎగుమతిదారు హోదాకు తీసుకెళ్లాయి. ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో కార్మిక వ్యయం తక్కువ. నిపుణులైన ఇంజినీర్లకూ కొదవుండదు. ఇవే యాపిల్, సామ్‌సంగ్‌లతో పాటు అనేక చైనా కంపెనీలు ఇండియాలో ఎలక్ట్రానిక్స్, స్మార్ట్‌ఫోన్లను తయారుచేసేలా పురిగొల్పాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి అయిదు నెలల్లోనే భారతీయ స్మార్ట్‌ఫోన్ల ఎగుమతి లక్ష కోట్ల రూపాయలను మించిపోయింది. మూడో త్రైమాసికంలో మన స్మార్ట్‌ఫోన్ మార్కెట్ అయిదు శాతం వృద్ధిని కళ్లజూసింది. ప్రీమియం స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో యాపిల్ హవా కొనసాగుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశంలో ఉత్పత్తయిన స్మార్ట్‌ఫోన్ల విలువ 6400 కోట్ల డాలర్లు. అందులో 2410 కోట్ల డాలర్ల విలువైన ఫోన్లు విదేశాలకు ఎగుమతి అయ్యాయి. 2015లో భారతదేశ ఎగుమతుల జాబితాలో 167వ ర్యాంకులో ఉన్న స్మార్ట్‌ఫోన్లు నిరుడు మూడో స్థానంలోకి రావడం విశేషం.

కూర్పు సరే... తయారీ ఏదీ?

అమెరికా-చైనా వాణిజ్యపోరు వల్ల తన ఉత్పత్తి కార్యకలాపాలను చైనా వెలుపలకు తరలించాల్సిన అగత్యం యాపిల్‌కు వచ్చింది. టాటా గ్రూప్ యాపిల్ ఫోన్ల విడిభాగాల కూర్పులో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించసాగింది. టాటా, ఫాక్స్‌కాన్‌లతోపాటు దాదాపు 50 యాపిల్ విడిభాగాల సరఫరాదారులు భారత్‌లో యూనిట్లు తెరిచారు. మరో 45 భారతీయ సంస్థలతో యాపిల్ ఒప్పందాలు కుదుర్చుకోగా, వాటిలో సగం ఎంఎస్ఎంఈలే కావడం విశేషం. ఇదంతా ఒక ఎత్తు అయితే- భారత్ ఇప్పటికీ యాపిల్ విడిభాగాల కూర్పుదారుగానే ఉండిపోయింది తప్పితే, పూర్తిస్థాయి తయారీదారుగా మారలేదు. సెమీకండక్టర్లు వంటి సాధనాల ఉత్పత్తిలో భారత్ తన సత్తా చాటుకోవడానికి పరిశోధన-అభివృద్ధిపై దృష్టి సారించడం అత్యావశ్యకం.

ఈ ఏడాది రెండో త్రైమాసికంలో అమెరికాలో దిగుమతి అయిన స్మార్ట్‌ఫోన్లలో 44శాతం ఇండియావే. ప్రథమార్ధంలో యాపిల్ సంస్థ భారత్ నుంచి వెయ్యి కోట్ల డాలర్ల విలువైన ఐఫోన్లను ఎగుమతి చేసింది. ఇదే ఊపు కొనసాగితే- ఈ సంవత్సరాంతానికి ప్రపంచ ఐఫోన్ ఉత్పత్తిలో నాలుగో వంతు వాటా ఇండియాదే అవుతుంది. 2028 కల్లా యాపిల్ తన విడిభాగాల్లో 30శాతాన్ని భారత్ నుంచే సేకరించాలన్న షరతును అంతకన్నా ముందే చేరుకోవచ్చు. నేడు ఐఫోన్-17 సహా అధునాతన యాపిల్ మోడళ్లన్నీ ఇండియాలోనే తయారవుతున్నాయి. యాపిల్ భారత్‌లో ఐఫోన్ల తయారీ చేపట్టేనాటికి ప్రపంచ విక్రయాల్లో 0.5శాతం మాత్రమే ఇక్కడ అమ్ముడుపోయేవి. నేడు ప్రపంచ ఐఫోన్ మార్కెట్‌లో 10.4శాతం వాటా మనదే. ఐఫోన్లకు మన దేశం మూడో అతిపెద్ద మార్కెట్‌గా ఆవిర్భవించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో యాపిల్ ఇండియా లాభాలు 16శాతం పెరిగి రూ.3,196 కోట్లకు చేరాయి. భారత్‌లో విస్తరిస్తున్న మధ్యతరగతి నుంచి గిరాకీ పెరుగుతుండటంతో యాపిల్ మరిన్ని స్టోర్లను తెరుస్తోంది.

విశ్వవిపణిలో గట్టి పోటీదారు కావాలంటే...

ఇండియాలో యాపిల్ కార్యకలాపాల వల్ల మూడున్నర లక్షల మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించింది. ఈ సంవత్సరాంతానికి మరెన్నో లక్షల మందికి పరోక్షంగా ఉపాధి దొరకనుంది. యాపిల్‌కు విడిభాగాలు సరఫరా చేసే టాటా ఎలక్ట్రానిక్స్, ఫాక్స్‌కాన్ వంటి సంస్థలు అత్యధిక ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు కల్పించాయి. యాపిల్ తీసుకొచ్చిన ఉద్యోగాల్లో 72శాతం మహిళలకే దక్కాయి. భారత్ ప్రపంచస్థాయి ఉత్పత్తి నెట్‌వర్క్‌లతో అనుసంధానమైతే అధిక వేతన ఉద్యోగాలను సృష్టించవచ్చనేందుకు యాపిల్ ఉదంతమే నిదర్శనం. దేశంలోని కార్మిక ఆధారిత సంప్రదాయ పరిశ్రమలతో పోలిస్తే ఎలక్ట్రానిక్స్, యంత్రాలతో నడిచే పరిశ్రమలే వేగవంతమైన వృద్ధిని అందుకుని, పెద్దసంఖ్యలో ఉపాధి అవకాశాలను సృష్టించాయి. ఎగుమతులనూ సాధించాయి. యాపిల్ వంటి మరిన్ని బహుళజాతి సంస్థలను రప్పిస్తే కొరియా, తైవాన్‌ల మాదిరిగా ఇండియా కూడా విశ్వవిపణిలో గట్టి పోటీదారుగా అవతరిస్తుంది. ఆ దిశగా దేశానికి నవకల్పనల భారతంగా పేరు తేవడానికి వచ్చే దశాబ్దకాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. టెక్స్‌టైల్స్, అపెరల్ రంగంలో మంచి పేరున్న ఇండియా- నైకి, గూచి, ఎల్‌వీఎంహెచ్, జారా వంటి అంతర్జాతీయ బ్రాండ్లను సులభంగా ఆకర్షించగలదు. గట్టిగా ప్రయత్నిస్తే- వస్త్రతయారీ రంగానికి ప్రపంచ కేంద్రంగానూ అవతరించగలదు.



కొట్నాన రమేష్
సీనియర్ మేనేజర్, సెంటర్ ఫర్ బిజినెస్ ఇన్నోవేషన్, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, హైదరాబాద్



అడగనివ్వండి!

పిల్లల మనసు అందమైన తోట. అందులో పూసే పూలు వారి ప్రశ్నలు. 'ఎందుకు?', 'ఎలా?', 'ఏమిటి?' అన్న సందేహాలే వారి భవిష్యత్తుకు పునాది వేస్తాయి. ఆ పునాదిని బలంగా నిర్మించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, టీచర్లది. ఈ మధ్య కాలంలో ఆ బాధ్యత నిర్లక్ష్యానికి గురవుతోంది. దానికి ఒకటీ రెండూ కాదు, ఎన్నో కారణాలు. పాఠశాలల్లో సిలబస్ భారం, ఇంట్లో అమ్మానాన్నలకు పనుల ఒత్తిడి, మిగిలే కాస్త సమయం ఫోన్లకు అంకితం కావడం... ఇవన్నీ పిల్లల నోరు మూయిస్తున్నాయి. వారిలో సహజంగా ఉండే కుతూహలాన్ని చంపేస్తున్నాయి.

వీటన్నిటికీ తోడు తల్లిదండ్రులుగా, ఉపాధ్యాయులుగా... పెద్దల వైఖరి కూడా చిన్నారుల ఉత్సాహం మీద నీళ్లు చల్లుతోంది. ప్రశ్నలడిగే పిల్లల్ని 'తలనొప్పి'గా భావించేవారు ఎక్కువయ్యారు. క్వొశ్చన్ బ్యాంక్ అనీ, ఎన్‌సైక్లోపీడియా అనీ పేర్లు పెడుతున్నారు. వారి ఎదురుగానే సమాధానం ఇవ్వడానికి నిరాసక్తత ప్రదర్శిస్తున్నారు. 'బుర్ర తినకు, అవతలికి పో' అంటూ గెంటేస్తున్నారు. కొందరు ప్రశ్నను బట్టి పిల్లల స్థాయిని నిర్ణయిస్తారు. ఎవరైనా తేలికపాటి ప్రశ్న వేస్తే 'అది కూడా తెలియదా నీకు' అంటూ అందరి ముందూ హేళన చేస్తున్నారు. ఇవన్నీ పిల్లల్ని చిన్నబుచ్చుతాయి. క్రమంగా వారిలో అడగాలన్న ఆసక్తి తగ్గిపోతుంది. పాఠం అర్థం కాకపోయినా పూర్తిగా మౌనం పాటించేస్తారు. ఇది పెద్దవాళ్లకు చాలా చిన్న విషయంగా కనిపిస్తుంది కానీ పిల్లల భవిష్యత్తు మీద పిడుగుపాటుతో సమానమైన పెద్ద సమస్య. అది పూర్తిగా వారి వ్యక్తిత్వాన్నే మార్చేస్తుంది.

ప్రశ్న అడగడం అనేది పిల్లల్లో సహజంగా ఉండే జిజ్ఞాసను సూచిస్తుంది. ఎంత ఎక్కువగా ప్రశ్నలడిగితే పిల్లలు అంత చురుగ్గా ఆలోచిస్తున్నట్లు. ఆలోచనే కదా మానసిక వికాసానికి పునాది. అందుకే పిల్లల్ని ప్రశ్నించనివ్వాలి. వాళ్లు అడిగిన ప్రతి ప్రశ్నకు వారికి అర్థమయ్యే స్థాయిలోనే జవాబివ్వాలి. వాళ్లు సంతృప్తి చెందకపోతే, 'నువ్వు పెద్ద క్లాసుకు వెళ్లాక దాని గురించి పాఠం ఉంటుంది. అప్పుడు నీకు చాలా విషయాలు తెలుస్తాయి. మీ టీచర్ ఇంకా బాగా చెబుతారు' అని చెప్పొచ్చు. అప్పుడు వారిలో కుతూహలం ఇంకా పెరుగుతుంది. తమ సందేహాలకు సమాధానాలు పాఠాల్లో ఉంటాయన్న విషయం తెలిసి చదువు మీద ఆసక్తి పెరుగుతుంది. ఒక్కోసారి వాళ్లు అడిగే ప్రశ్నలకు పెద్దల దగ్గరా సమాధానం ఉండదు. అప్పుడు నిజాయతీగా 'ఇది నాకు తెలియదు నాన్నా, మర్చిపోయినట్లున్నా. పుస్తకంలో చదివి చెబుతా' అని చెప్పారనుకోండి... తెలియదని ఒప్పుకోవడంలో తప్పులేదని, పెద్దలు కూడా నేర్చుకుంటూ ఉంటారని, నేర్చుకుంటేనే ఎవరేది అడిగినా చెప్పగలుగుతామని- ఇలా చాలా విషయాలు వారికి తెలుస్తాయి. స్కూల్లో టీచర్లు కూడా రోజూ పాఠం చెప్పాక ఒక పదినిమిషాలు ప్రశ్నాసమయం కేటాయించి పిల్లల్లో ప్రశ్నించే అలవాటును ప్రోత్సహించాలి. ఎందుకంటే- ప్రశ్నించడమే అభివృద్ధికి మొదటి మెట్టు.

– వై.లక్ష్మీ ప్రసాద్

బతుకుజీవుడా అనుకుంటూ...

జాతి, మతం, రాజకీయ భావజాలం, ఒక సామాజిక బృందంలో సభ్యులుగా ఉండటం తదితరాల మూలంగా స్వదేశంలో తమకు ముప్పు ఉందని భయపడినప్పుడు రక్షణ కోసం ప్రజలు ఇతర దేశాలకు పారిపోతారు. అల్లర్లు, యుద్ధాలు, మానవ హక్కుల ఉల్లంఘనల నుంచి కాపాడుకోవడానికీ విదేశాలకు తరలివెళ్తారు. 2024లో ప్రపంచవ్యాప్తంగా 25.5 లక్షల మంది అలా అసైలం కోసం అభ్యర్థించారు. వీరిలో భారతీయులూ ఉండటం ఆశ్చర్యకరం! నిరుడు పరదేశాల్లో ఆశ్రయం కోసం అభ్యర్థించిన ఆయా దేశాల వారి సంఖ్య ఎంతంటే (లక్షల్లో)...

సూడాన్	4.40
వెనెజువెలా	1.99
సిరియా	1.63
కొలంబియా	1.02
అఫ్గానిస్థాన్	1.01
సోమాలియా	0.97
బంగ్లాదేశ్	0.69
ఇండియా	0.63
ఎరిత్రియా	0.61
తుర్కియే	0.60

(ఆధారం: వరల్డ్ డేటా.ఇన్ఫో)

రద్దీని బట్టి రేట్లు... ప్రయాణికులకు పాట్లు!

భారతీయులకు విమాన ప్రయాణం ఒకప్పుడు విలాసమైతే కావచ్చు కానీ, ఇప్పుడైతే లక్షలమందికి అది ఒక అవసరంగా మారిపోయింది. ఏడాది పొడవునా పరీక్షలు, పెళ్లిళ్లు, వైద్య చికిత్సలు, పర్యాటకం, ఇతర అవసరాల కోసం విమాన ప్రయాణాలు చేయడం ఎక్కువైంది. అయితే, రద్దీని బట్టి ఒక ప్రయాణికుడు రూ.5,000 చెల్లిస్తే, మరొకరు అదే సీటు కోసం రూ.50,000 చెల్లించాల్సి వస్తోంది. ఈ సమస్యకు మూలం డైనమిక్ ప్రైసింగ్‌లో ఉంది. ఈ విధానంలో గిరాకీ-సరఫరాల మధ్య వ్యత్యాసం, ప్రయాణ సమయంలో ఉన్న పోటీని బట్టి ధరను తగ్గించడమో లేదో పెంచడమో జరుగుతోంది. విమాన సంస్థలు, ప్రయాణాలు ఎక్కువగా ఉన్న దేశాల్లో సహజంగానే పోటీ ఎక్కువగా ఉంటుంది. అలాంటిచోట్ల గతిశీల (మారే) ధరల వ్యూహాన్ని అనుసరించడం సమర్థనీయం కావచ్చు. కానీ, విమానయాన సంస్థలు బాగా తక్కువగా ఉన్న భారత్ వంటి దేశాలకు అది ఎంతమాత్రం సరిపోదు.

దోపిడికి రాచబాట

ఇండియాలో పౌరవిమానాలు ఇప్పుడు 85 నుంచి 90 శాతం ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయి. అవి ఏదో ఒక్క సీజనుకే పరిమితం కావడంలేదు. అలాంటప్పుడు డైనమిక్ ధరల విధానం అమలు చేయడమంటే అధిక లాభాల కోసం ప్రయాణికుల జేబులు కొల్లగొట్టడమే అవుతుంది. ముఖ్యంగా పండుగలు, పెళ్లిళ్లు, సెలవులు, అత్యవసర సమయాల్లో ధరలు పెంచేయడం నిజంగా అన్యాయం. భారత్ వంటి సువిశాల దేశంలో అత్యవసర సమయాల్లో దూరాభారాలకు వెళ్లడానికి సకాలంలో రైళ్లు దొరక్కపోవచ్చు. పరీక్షలు రాసే విద్యార్థులు, ఇంటర్వ్యూలకు వెళ్లే ఉద్యోగార్థులు, నిర్ణీత సమయానికి పనిలో చేరాల్సిన ఉద్యోగులు, వైద్య చికిత్సల కోసం వెళ్లాల్సిన రోగులు, వారి బంధువులు రైలు దొరకలేదని తమ ప్రయాణాలను వాయిదా వేసుకోలేరు. తప్పనిసరిగా విమానం ఎక్కాల్సిందే. వారి అవసరాన్ని సొమ్ము చేసుకోవడానికి విమాన సంస్థలు టికెట్ ధరలను అమాంతం పెంచేయడం సరికాదు. మార్కెట్లో పోటీ ప్రయాణికులకు లాభదాయకమవుతుందనే సూత్రం భారతీయ విమానయాన విపణిలో తలకిందులవుతోంది.


ఇండిగో సంస్థ విమానాలను రద్దు చేయడంతో ఇటీవల ప్రయాణికులు నరకయాతన అనుభవించారు. దేశీయ పౌర విమానయాన విపణిలో ఆ సంస్థ తన ఆధిపత్యాన్ని దుర్వినియోగం చేసిందా అన్నదానిపై కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) దర్యాప్తు జరపనుంది. అయితే, ప్రయాణికుల డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని ఇండిగోతో పాటు ఇతర సంస్థలు అప్పట్లో టికెట్ రేట్లను విపరీతంగా పెంచేశాయి. ఈ అడ్డగోలు దోపిడికి అడ్డుకట్ట వేయడమెలా?



చాలాదేశాల్లో విమానయాన సంస్థలు ప్రయాణికులను దోచుకున్న అనుభవాలు గతంలోనే ఎదురయ్యాయి. దాన్ని నియంత్రించడానికి ఆయా దేశాలు పకడ్బందీ నిబంధనలు తెచ్చాయి. చైనాలో ప్రైస్ బ్యాండ్ పద్ధతి అమలులో ఉంది. దాని ప్రకారం విమాన టికెట్లకు కనిష్ఠ, గరిష్ఠ ధరలను నిర్ణయిస్తారు. గిరాకీని బట్టి టికెట్లు ఆ నిర్ణీత ధరల మధ్యనే ఉండాలి. అనేక ఆగ్నేయాసియా దేశాలు గిరాకీ ఎక్కువగా ఉండే రోజుల్లో, రద్దీ రూట్లలో విమాన టికెట్ రేట్లపై పరిమితి విధిస్తాయి. ఐరోపాలో ధరల నిర్ణయంలో విమాన సంస్థలకు స్వేచ్ఛనిచ్చినా వినియోగదారుల హక్కుల రక్షణ చట్టాలనూ అంతే పక్కాగా అమలు చేస్తారు. అమెరికాలోనూ టికెట్ ధరల విషయంలో విమానయాన సంస్థలకు స్వేచ్ఛనిచ్చినా- అక్కడ విమానాలు, విమానాశ్రయాలు, ప్రయాణికుల సంఖ్య చాలా ఎక్కువ. ఇలా మార్కెట్లో విపరీతమైన పోటీ ఉండటంతో విమాన సంస్థలు తక్కువ ధరలతో ప్రయాణికులను ఆకర్షించడానికి ప్రయత్నిస్తాయి. సంక్షోభ సమయాల్లో ప్రభుత్వం ఎటూ జోక్యం చేసుకుంటుంది. అయితే, పోటీ తక్కువగా ఉండి, కొత్త సంస్థల ప్రవేశానికి అడ్డంకులు ఎక్కువగా ఉండే భారత్ వంటి దేశాల్లో విమాన టికెట్ ధరల నిర్ణయంలో ఎయిర్‌లైన్స్‌లకు స్వేచ్ఛనిచ్చే విధానం ఎంతమాత్రం సమర్థనీయం కాదు.

విద్యుత్ రంగంలో ఉన్నట్లుగా...

భారతదేశానికి ప్రైస్ బ్యాండ్ విధానం అన్నివిధాలా ఉత్తమంగా ఉంటుంది. దీనికింద కనీస ధర (ఫ్లోర్ ప్రైస్), గరిష్ఠ(సీలింగ్)ధరను నిర్ణయించాలి. విమానయాన సంస్థలు ఎదుటివారిని దెబ్బకొట్టడానికి ధరలను మరీ తగ్గించకుండా ఫ్లోర్‌ప్రైస్ నివారిస్తుంది. గిరాకీ ఎక్కువగా ఉండే సీజనులో ధరలను పెంచేయకుండా సీలింగ్ ఆపుతుంది. ఈ కనిష్ఠ, గరిష్ఠ ధరల మధ్య తమకు అనువైన టికెట్ రేటును నిర్ధారించే స్వేచ్ఛను విమానయాన సంస్థలకివ్వాలి. ఈ పద్ధతి భారతదేశానికి కొత్తేమీ కాదు. విద్యుత్ రంగంలో ఇప్పటికే ఉంది. మన విద్యుత్ విపణిలో యూనిట్ ధర గరిష్ఠంగా రూ.10కి మించకూడదు. కనీస, గరిష్ఠ ధరలు మార్కెట్‌ను దెబ్బతీయవు, దాన్ని స్థిరీకరిస్తాయి. ప్రభుత్వం విమాన టికెట్లకు అనధికారికంగా కనిష్ఠ, గరిష్ఠ ధరలను సూచించినా, విమాన సంస్థలు గరిష్ఠ ధరలకే టికెట్లు విక్రయిస్తున్నాయి. అందువల్ల ప్రభుత్వం క్షేత్రస్థాయిలో టికెట్ ధరలను నియంత్రించాలి. విమాన సంస్థల వ్యాపార సామర్థ్యాన్ని, లాభదాయకతను, ప్రయాణికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమతూకమైన టికెట్ ధరల పద్ధతిని ప్రభుత్వం అమలు చేయాలి.



డి.రాధాకృష్ణ
మాజీ ఛైర్మన్, త్రిపుర విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్, రెరా ట్రైబ్యునల్

మంత్రి సందేహాలు..!

హాయ్! బుజ్జీ!!

కౌశాంబీసీ యువరాజు ఒకసారి రాజ్య పర్యటనకు మంత్రితో కలిసి వెళ్లాడు. దారిలో అతనికి చాలా దాహం వేసింది. దాంతో మంత్రి, అక్కడికి దగ్గర్లో ఉన్న సదానందుని ఆశ్రమానికి తీసుకెళ్లాడు. లోపలికి వెళ్లాక ఇద్దరు శిష్యులను పిలిచి మంచినీళ్లు తీసుకురమ్మని చెప్పాడు. వెంటనే ఒక శిష్యుడు వెళ్లి తీసుకొచ్చాడు. కానీ అక్కడికి వస్తున్న గురువు.. శిష్యుడి చేతిలోని నీళ్ల పాత్ర తీసుకుని మొత్తం పారబోసి, అతణ్ని మందలించాడు. రెండో శిష్యుడు తీసుకొచ్చిన నీళ్లను మంత్రి వెంటనే యువరాజుకు అందించాడు. కానీ యువరాజుకు గురువు మీద చాలా కోపం వచ్చింది. అది గమనించిన మంత్రి యువరాజు చెవిలో.. 'కాస్త ఓపిక పట్టండి' అన్నాడు. ఇంతలోనే ఆశ్రమం బయట ఒక ముసలాయన నడుస్తుంటే ఓ విద్యార్థి అతణ్ని పక్కకు తోసేశాడు.



కిందపడిపోవడంతో చుట్టుపక్కల ఉన్నవాళ్లు వచ్చి పైకి లేపారు. అప్పుడు గురువు, ఆ తోసేసిన శిష్యుణ్ని మెచ్చుకున్నాడు. దాంతో యువరాజు కోపం ఎక్కువైంది. అప్పుడు మళ్లీ మంత్రి.. 'కాస్త ఓర్పుతో ఉండండి' అని చెప్పాడు. ఆ తరవాత మంత్రి.. 'గురువర్యా! నాకు రెండు సందేహాలున్నాయి. యువరాజు దాహంతో బాధపడుతుంటే నీళ్లు పారబోసి, తెచ్చిన అతణ్ని మందలించారు. అందులో మీ ఉద్దేశమేంటి? వృద్ధుణ్ని నెట్టేసిన శిష్యుడినేమో మెచ్చుకున్నారు. మాకేం అర్థంకావట్లేదు' అన్నాడు. గురువు చిన్నగా నవ్వి.. 'మహామంత్రీ! మొదటి శిష్యుడు మూతలేని పాత్రలో నీళ్లు తీసుకొచ్చాడు. పొరపాటున అందులో ఏదైనా ఉంటే మంచిదికాదు కదా! అందుకే తనని మందలించాను. రెండోది ఆ ముసలాయనకు కళ్లు కనిపించవు. గోతిలో పడబోతుంటే శిష్యుడు పక్కన గడ్డి మీదకు నెట్టి కాపాడాడు. అందుకే అతణ్ని ప్రశంసించాను' అని వివరించారు. అది విన్న యువరాజుకు మంత్రి ఓర్పుగా ఉండమని ఎందుకు అన్నాడో అర్థమైంది. అందుకే పెద్దవాళ్లు ఏదైనా విషయం చెబితే.. దానికి కారణమేంటని ఒకటికి పదిసార్లు ఆలోచించాలి.

– సంగనభట్ల చిన్న రామకిష్టయ్య

అవునా? కాదా?

ఇక్కడ కొన్ని వాక్యాలున్నాయి. వాటిని చదివి అవునో, కాదో చెప్పండి చూద్దాం.

1. సూర్యుడు ఒక నక్షత్రం.
2. జనవరిలో 31 రోజులు ఉంటాయి.
3. చెట్లు ఆక్సిజన్‌ని పీల్చుకుంటాయి.
4. తేనెటీగలకు అయిదు కళ్లు ఉంటాయి.

జవాబు: 1.అవును 2.అవును 3.కాదు 4.అవును

ప్రతిపక్షాలూ గౌరవించిన నేత వాజ్‌పేయీ

మన భాష ప్రత్యర్థులను గౌరవించేలా ఉండాలి: మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఈనాడు, విజయనగరం: దేశ రాజకీయాల్లో అజాతశత్రువుగా మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ పేరు తెచ్చుకున్నారని, ప్రతిపక్ష పార్టీల అగ్ర నాయకులు సైతం ఆయన్ను ఎంతో గౌరవించేవారని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ఆయన ఏనాడూ పరుష పదజాలం వాడలేదని.. సిద్ధాంతాలపైనే పోరాటం చేశారని కొనియాడారు. భాజపా రాష్ట్ర నాయకత్వం చేపట్టిన అటల్-మోదీ సుపరిపాలన బస్సు యాత్ర సందర్భంగా శుక్రవారం విజయనగరంలో నిర్వహించిన సభలో వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా ప్రసంగించారు. 'మన భాష ప్రత్యర్థులను సైతం గౌరవించేలా ఉండాలి. ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలను దూషించడం తగదు. బూతులు తిట్టిన ఎమ్మెల్యేలు ప్రతి ఒక్కరినీ మొన్నటి ఎన్నికల్లో ఏపీ ప్రజలు ఓడించారు. ఇప్పుడు కూటమి పార్టీల నాయకులు చక్కగా మాట్లాడుతున్నారు.



మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడికి వాజ్‌పేయీ ప్రతిమను అందిస్తున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మంత్రి సత్యకుమార్

ఇసుక, గనులతో ఎమ్మెల్యేలకు ఏం సంబంధం?

నాయకులు తాము ధరించే తెల్ల దుస్తులంతా స్వచ్ఛంగా ఉండాలి. ఇసుక, గనుల తవ్వకం వంటి వాటితో ఎమ్మెల్యేలకు ఏం సంబంధం? మనం ఇల్లు కట్టుకుంటే స్థానిక కార్పొరేటర్ అనుమతి ఎందుకు? నేతలు క్రమశిక్షణ, సమయపాలన పాటించాలి. నేను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్నప్పుడు గ్రామాలకు రోడ్లు వేస్తే బాగుంటుందని ప్రధాని వాజ్‌పేయీని కోరా. ఆర్థిక మంత్రితో మాట్లాడాలన్నారు. ఆయన్నడిగితే జాతీయ రహదారులకు టోల్ ఉంటుంది.. గ్రామాల్లో టోల్ వసూలు చేస్తే తోలు తీస్తారని చెప్పారు. క్యాబినెట్‌లో ప్రస్తావిస్తే గ్రామీణ సడక్ యోజనకు ఆమోదం లభించింది. నా రాజకీయ జీవితంలో ఈ పథకం ఎంతో సంతృప్తినిచ్చింది.

అందుకే ఆనాడు కన్నీరు పెట్టుకున్నా

నాకు 13 నెలల వయసులో తల్లి దూరమైంది. 16 ఏళ్ల వయసులో రాజకీయాల్లోకి వచ్చా. పార్టీయే నన్ను తల్లిలా పెంచి పెద్దవాణ్ని చేసింది. ఉప రాష్ట్రపతి అయితే ఆ తర్వాత పార్టీని వీడాలనే బాధతో ఆ ప్రకటన రాగానే కన్నీరు ఆపుకోలేకపోయా' అని వెంకయ్యనాయుడు చెప్పారు. మంత్రులు సత్యకుమార్ యాదవ్, కొండపల్లి శ్రీనివాస్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, భాజపా జిల్లా అధ్యక్షుడు రాజేష్‌వర్మ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు శ్రీకాకుళం నగరంలో వాజ్‌పేయీ విగ్రహాన్ని మంత్రులు అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కలిసి ఆవిష్కరించారు.

యోగా మీదా జగన్ విషం

- 'యోగాంధ్ర' ఖర్చు రూ.60 కోట్లే
- మాజీమంత్రి దేవినేని ఉమా

ఈనాడు, అమరావతి: భారతీయ సంస్కృతికి ప్రతీకైన యోగా మీద కూడా వైకాపా అధినేత జగన్ విషం చిమ్ముతున్నారని మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ధ్వజమెత్తారు. యోగాంధ్రను ప్రధాని మోదీనే స్వయంగా ప్రకటించారని... అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఏపీలో నిర్వహించాలని ఆయనే సంకల్పించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమ నిర్వహణకు రూ.60 కోట్లే ఖర్చవ్వగా ఆ నిధులూ కేంద్రం ఇచ్చిందని తెలిపారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'పీపీపీ విధానంలో వైద్యకళాశాలల నిర్మాణం, నిర్వహణకు అనుకూలంగా కేంద్రానికి నివేదిక ఇచ్చిన పార్లమెంటరీ స్థాయీ సంఘంలో వైకాపా ఎంపీ గురుమూర్తి ఉన్నారు. రాష్ట్రంలో మాత్రం పీపీపీ విధానం మీద దుష్ప్రచారం చేస్తూ వైకాపా నేతలు ప్రజల్ని తప్పుదారి పట్టిస్తున్నారు' అని మాజీమంత్రి పేర్కొన్నారు.



మీ జీవితం మీకు ముఖ్యం

మీ జీవితం మీకు అత్యంత ముఖ్యమని ఎల్లప్పుడూ భావిస్తుండండి. ఆ భావన మిమ్మల్ని ఉన్నతంగా తీర్చిదిద్దుతుంది. ఈ క్రమంలో మీ శరీరం పట్ల శ్రద్ధ వహించండి. స్వతంత్రంగా ఆలోచించండి. మాట్లాడేముందు ఎదుటివారు చెప్పేది పూర్తిగా వినండి. మిమ్మల్ని మీరే సవాలు చేసుకోండి.

– సాహిల్ బ్లూమ్, రచయిత

వైకాపా వాళ్లూ సంతకాలు చేయలేదు

ఈనాడు, అమరావతి: పీపీపీ విధానానికి వ్యతిరేకంగా 'కోటి సంతకాల సేకరణ' పేరుతో వైకాపా చేసిన కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులూ సంతకాలు పెట్టలేదని శాప్ ఛైర్మన్ రవినాయుడు ఎద్దేవా చేశారు. ఏ నియోజకవర్గంలో ఎన్ని సంతకాలు సేకరించారో చెప్పే ధైర్యం ఉందా? అని వైకాపా అధినేత జగన్‌ను ప్రశ్నించారు.





41 మంది పీఎల్‌జీఏ కేడర్ లొంగుబాటు

- 24 ఆయుధాలు అప్పగించి.. జనజీవన స్రవంతిలోకి
- తెలంగాణ చరిత్రలో అతిపెద్ద మావోయిస్టు లొంగుబాటు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర చరిత్రలో భారీ మావోయిస్టు లొంగుబాటు శుక్రవారం జరిగింది. పార్టీకి చెందిన 41 మంది కీలక కేడర్ ఆయుధాలతో సహా ఆ రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్‌కుమార్, ఎస్ఐబీ చీఫ్ సుమతి, శాంతి భద్రతల అదనపు డీజీపీ మహేశ్ భగవత్, ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్ సమక్షంలో లొంగిపోయారు. ఒక ఇన్సాస్ ఎల్ఎంజీ, 3 ఏకే-47లు, 5 ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు, 7 ఇన్సాస్ రైఫిళ్లు సహా మొత్తం 24 ఆయుధాలతోపాటు 733 తూటాలు, 8 బీజీఎల్ షెల్స్‌ను పోలీసులకు అప్పగించారు. లొంగిపోయిన వారిలో పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ) బెటాలియన్‌కు చెందిన 11 మంది ప్లటూన్ కమిటీ, డివిజనల్ కమిటీ సభ్యులు, తెలంగాణ మావోయిస్టు పార్టీ కమిటీకి చెందిన సెకండ్ సెంట్రల్ రీజినల్ కమాండ్(సీఆర్సీ) కంపెనీకి చెందిన ఐదుగురు, చర్ల-శబరి ఏరియా కమిటీకి చెందిన నలుగురు, దండకారణ్య స్పెషల్‌జోనల్ కమిటీ(డీకేఎస్‌జడ్‌సీ)



విలేకరుల సమావేశంలో తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు.. లొంగిపోయిన మావోయిస్టులు

సౌత్ సబ్‌జోనల్ బ్యూరోకు చెందిన ప్లటూన్-33 సభ్యులు ఐదుగురు, సౌత్‌బస్తర్ డివిజనల్ కమిటీకి చెందిన 9 మంది, దర్భ డివిజన్ కమిటీకి చెందిన నలుగురు, గంగలూరు ఏరియా కమిటీ ఏసీఎం లొంగిపోయారు. అలాగే కుమురంభీం ఆసిఫాబాద్- మంచిర్యాల డివిజనల్ కమిటీ కార్యదర్శి ఎర్రగొల్ల రవి అలియాస్ సంతోష్(40), అర్బన్ ఏరియా పార్టీ సభ్యుడు కనికారపు ప్రభంజన్(33) ఉన్నారు. లొంగిపోయిన వారిలో తెలంగాణకు చెందిన వారు వీరిద్దరే కాగా.. మిగిలిన వారంతా ఛత్తీస్‌గఢ్ వాసులు. రవి కామారెడ్డి జిల్లా ఆరెపల్లి, ప్రభంజన్ మంచిర్యాల జిల్లా జన్నారం గ్రామాల వాసులు.

తెలంగాణ కమిటీలో మిగిలింది 36 మందే: డీజీపీ

తెలంగాణలో ఈ ఏడాది 509 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ప్రస్తుతం తెలంగాణకు చెందిన 54 మంది అజ్ఞాతంలో ఉన్నారు. వీరిలో 48 మంది ఛత్తీస్‌గఢ్‌తోపాటు ఇతర రాష్ట్ర కమిటీల్లో పనిచేస్తున్నారు. మిగిలిన ఆరుగురు తెలంగాణ రాష్ట్ర కమిటీలో ఉన్నారు. వీరు కాకుండా కమిటీలో ఇతర రాష్ట్రాల వారు మరో 30 మంది మాత్రమే మిగిలారు. ప్రస్తుతం మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీలో ఉన్న ఏడుగురు నేతల్లో ఐదుగురు తెలుగువారే ఉన్నారు. మావోయిస్టు పార్టీ నాయకత్వం క్షేత్రస్థాయి కేడర్‌ను తప్పుదోవ పట్టిస్తోంది. 2026 మార్చి నాటికి మావోయిస్టు సమస్యను నిర్మూలిస్తామని కేంద్రం గడువు విధించగా.. అప్పటి వరకు ఛత్తీస్‌గఢ్‌ను విడిచి ఇతర ప్రాంతాలకు వెళ్లాలని చెబుతోంది. ఆ తరువాత ఆపరేషన్లు తగ్గుముఖం పడతాయని, తిరిగి రావొచ్చని నమ్మిస్తోంది. ఈ క్రమంలోనే కేడర్‌కు ఇష్టం లేకున్నా ఆసిఫాబాద్ అడవుల్లోకి పంపించింది. స్థానిక పరిస్థితులు తెలియకపోవడంతోపాటు రేషన్ దొరక్కపోవడంతో లొంగిపోతామని కేడర్ మాకు సమాచారమిచ్చింది. మార్చి తర్వాత కూడా ఛత్తీస్‌గఢ్‌లో ఆపరేషన్లు ఆగవు. ఇంకా అజ్ఞాతంలో ఉన్న కేడర్ త్వరగా లొంగిపోవాలి.





పక్షి జాడ చెబితే పది వేలు



విశాఖపట్నం (వేపగుంట), న్యూస్‌టుడే: ఎంతో ప్రేమగా పెంచుకుంటున్న పక్షి ఎగిరిపోవడంతో యజమాని తీవ్ర వేదనకు గురయ్యారు. దాని సమాచారం ఇస్తే రూ.10 వేలు బహుమతిగా ఇస్తానంటున్నారు. విశాఖలోని వేపగుంట సమీప రవినగర్‌లో ఉంటున్న ఆనంద్ 2 నెలల క్రితం హైదరాబాద్‌లో విదేశీ పక్షి మకావ్‌ను కొనుగోలు చేసి తెచ్చుకున్నారు. శుక్రవారం ఉదయం ఆహారం పెట్టడానికి పంజరం తెరవగా ఒక్కసారిగా ఎగిరిపోయింది. ఆ పక్షి కాలికి ఓ రింగ్ ఉంటుందని, ఎవరైనా దాని సమాచారం ఇస్తే బహుమతిగా ఇస్తానని ప్రకటించారు.

బ్లూబర్డ్-6 ప్రయోగానికి ముహూర్తం ఖరారు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: సతీష్ ధావన్ స్పేస్ సెంటర్-షార్ నుంచి అమెరికాకు చెందిన భారీ కమ్యూనికేషన్ ఉపగ్రహం బ్లూబర్డ్-6ను ఈ నెల 24న ఉదయం 8.54 గంటలకు ప్రయోగించనున్నట్లు ఇస్రో ఓ ప్రకటనలో తెలిపింది. సుమారు 6,500 కిలోల బరువున్న ఈ ఉపగ్రహాన్ని ఎల్‌వీఎం-3 రాకెట్ అంతరిక్షంలోకి తీసుకెళ్లనుంది. అమెరికాకు చెందిన ఏఎస్టీ స్పేస్ మొబైల్ సంస్థతో కలిసి ఇస్రో వాణిజ్య విభాగం న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ ఈ ప్రయోగాన్ని నిర్వహిస్తోంది.



కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయిన సీఎం చంద్రబాబు, మంత్రి పయ్యావుల కేశవ్

పూర్వోదయ నిధులు ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పుడున్న 8.48 లక్షల హెక్టార్ల నుంచి 2029 నాటికి 12.28 లక్షల హెక్టార్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. నీటివనరులతో పాటు రహదారి, రైలు, పోర్టు, ఎయిర్‌కార్గో సౌకర్యాలు కల్పించాలి. రాయలసీమను ఉద్యానహబ్‌గా తీర్చిదిద్దడానికి వచ్చే మూడేళ్లలో రూ.41 వేల కోట్లు అవసరం. దానివల్ల రైతుల ఆదాయం రూ.3.5 లక్షలకు పెరగడానికి వీలవుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని 2026-27 బడ్జెట్‌లో రాయలసీమ ఉద్యానరంగ అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించండి.

పోలవరం-నల్లమలసాగర్ లింక్‌కు ఆర్థికసాయం: 200 టీఎంసీల గోదావరి వరద నీటిని కరవుపీడిత రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు తరలించడానికి ఉద్దేశించిన పోలవరం-నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టుకు కేంద్రం ఆర్థికసాయం చేయాలి. ప్రాథమిక ప్రాజెక్టు నివేదికను ఇప్పటికే జలశక్తి శాఖకు సమర్పించాం. అనుమతులు రాగానే డీపీఆర్ అందిస్తాం. 2026-27 బడ్జెట్‌లో నిధులు కేటాయించండి'' అని కేంద్ర ఆర్థికమంత్రిని చంద్రబాబు కోరారు.

2 కీలక పథకాలు.. రూ.37,407 కోట్లు!

- ఉద్యాన హబ్, పూర్వోదయ కింద ప్రణాళికలు
- కేంద్రం నుంచి నిధులు రాబట్టేందుకు సన్నాహాలు
- దిల్లీ సానుకూలంగా ఉందని సీఎం సంకేతాలు
- ప్రణాళికలకు తుదిరూపు ఇచ్చిన అధికారులు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక అనిశ్చితి నుంచి అభివృద్ధి వైపు అడుగులు వేసేందుకు కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో ఉన్న అనుకూలతలు, జాతీయ అవసరాలను మేళవించి కేంద్రం రూపొందించిన పథకాల నుంచి రాబోయే నాలుగైదేళ్లలో ఎన్ని నిధులు రాబట్టాలా అని ప్రణాళికలు రచిస్తోంది. రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో ఉద్యానహబ్ రూపకల్పనకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో పూర్వోదయ కింద కార్యక్రమాలు చేపట్టాలని, ఆయకట్టుకు నీరందించి వ్యవసాయ ఫలాలు తెచ్చేలా అడుగులు వేస్తున్నారు. ఈ పథకాలకు నిధులిచ్చేందుకు కేంద్రం సానుకూలంగా ఉందని కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి వెల్లడించారు. దిల్లీ పర్యటన సందర్భంగా శుక్రవారం కేంద్ర ఆర్థికమంత్రికి ఈ నివేదికలనూ సమర్పించారు. ప్రస్తుత బడ్జెట్‌లోనే కేంద్రం పూర్వోదయ పథకాన్ని ప్రవేశపెట్టింది. దేశంలో వెనకబడిన ప్రాంతాలను వివిధ రంగాల్లో ముందుకు తీసుకొచ్చేందుకు వీలుగా ఈ పథకం ద్వారా నిధులిస్తోంది. రాబోయే కేంద్ర బడ్జెట్‌లోనూ ఈ పథకానికి ప్రాధాన్యం దక్కే ఆస్కారమూ ఉంది. అదే సమయంలో దేశ జనాభాకు తగ్గట్టుగా దేశీయ అవసరాలకు, ఎగుమతులకు కూరగాయలు, పండ్ల డిమాండ్ చాలా ఉంది. రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే ఉద్యానహబ్ ప్రణాళికలు రచించింది. ఈ క్రమంలో రాయలసీమ ఆరు జిల్లాలతో పాటు ప్రకాశం జిల్లాలోను ఉద్యానహబ్ ప్రణాళికలో భాగంగా సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇచ్చి కొత్తగా 8,87,447 ఎకరాల ఆయకట్టును సాగులోకి తీసుకురావాలని, 4,30,338 ఎకరాలు స్థిరీకరించాలని ప్రణాళిక రచించింది. దీంతోపాటు ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర జిల్లాల్లో పూర్వోదయ పథకం నుంచి నిధులిచ్చి అనేక ప్రాజెక్టులు పూర్తిచేయడంతో పాటు ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టుల సమస్యలు పరిష్కరించాలని యోచిస్తోంది. ఈ పనులు చేపట్టడంతో మొత్తం 3,97,339 ఎకరాల కొత్త ఆయకట్టు, 25,96,690 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు ఉపకరిస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ రెండు పథకాల ద్వారా దాదాపు 43 లక్షల ఎకరాలకు లబ్ధి చేకూర్చాలనేది యోచన. జలవనరుల శాఖ, ఆర్థిక శాఖలు కలిసి ఈ ప్రణాళికలకు తుదిరూపు ఇస్తున్నాయి. హార్టికల్చర్ హబ్‌కు రూ.24,107.55 కోట్లు, పూర్వోదయకు రూ.13,300 కోట్లు కలిపి మొత్తం రూ. 37,407 కోట్లు అవసరమని తేల్చారు.

ఉద్యానహబ్‌కు ప్రైవేటు రంగం నుంచి రూ.60 వేల కోట్లు: రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో ప్రణాళిక రూపొందించిన ఉద్యానహబ్‌కు ప్రైవేటు పెట్టుబడులు రూ.60వేల కోట్ల వరకు తీసుకొస్తామని సీఎం పేర్కొన్నారు. కూరగాయలు, పండ్ల ఉత్పత్తి పెంచి వాటి ఎగుమతులకు, నిల్వలకు మౌలిక సౌకర్యాల కల్పనకు, రవాణా ఏర్పాట్లకు ప్రైవేటు నుంచి పెట్టుబడులు రాబట్టనున్నారు. ఉద్యాన హబ్ ప్రణాళికను ప్రస్తుతించిన కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వివిధ బ్యాంకుల రాష్ట్రస్థాయి ప్రధాన భవనాల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని ఆ కార్యక్రమానికి అవసరమైన రుణాలు అందించే సామాజిక బాధ్యతను బ్యాంకులు తీసుకోవాలని పిలుపునిచ్చారు.

హార్టికల్చర్ హబ్: రాయలసీమ ఆరు జిల్లాలతో పాటు ప్రకాశం జిల్లాలోని 23 మేజర్, మీడియం ప్రాజెక్టులను పూర్తిచేసి.. 1,012 చిన్న నీటివనరుల పనులు పూర్తి చేయాలనేది యోచన.

- ఈ పనులన్నీ పూర్తిచేయాలంటే రూ.20,963 కోట్లు అవసరం.
- వీటన్నింటినీ క్లస్టర్లతో అనుసంధానించేలా చేయాల్సిన పనులకు రూ.3,144 కోట్లు అవసరం.

పూర్వోదయ కింద చేపట్టే పథకాలకు అవసరమైన నిధులు

జిల్లా	మొత్తం పథకాల సంఖ్య	అవసరమైన నిధులు (రూ.కోట్లలో)	కొత్త ఆయకట్టు (ఎకరాల్లో)	స్థిరీకరణ ఆయకట్టు (ఎకరాల్లో)
ఉత్తరాంధ్ర జిల్లాలు	11	4,200.00	2,69,639	2,49,690
దక్షిణ కోస్తా జిల్లాలు	6	9,100.00	1,27,700	23,47,000
మొత్తం	17	13,300.00	3,97,339	25,96,690

నిజాయతీ, సమగ్రతలకే ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

అత్యంత ముఖ్యమైనవని తెలిపారు. శుక్రవారమిక్కడ రామోజీ ఫిల్మ్‌సిటీలో రెండురోజుల పాటు జరగనున్న పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్‌పర్సన్ల 26వ జాతీయ సదస్సులో రాష్ట్రపతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశానికి తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, యూపీఎస్సీ ఛైర్మన్ డాక్టర్ అజయ్‌కుమార్, తెలంగాణ మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క, టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశంతో పాటు పలు రాష్ట్రాల పీఎస్సీల ఛైర్‌పర్సన్లు, ప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్రపతి మాట్లాడుతూ.. ''సివిల్ సర్వెంట్లుగా నియమితులయ్యే యువత.. సమాజంలో వెనుకబడిన, అణగారిన, అసహాయుల కోసం పనిచేయాలి. మహిళల అవసరాలు, ఆకాంక్షల పట్ల సున్నితత్వం కలిగి ఉండాలి. సర్వీసులు, పబ్లిక్ సర్వీస్ కమిషన్ల కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్.. రాజ్యాంగంలో ప్రత్యేక భాగాన్ని కేటాయించి, ప్రత్యేక విధులు, బాధ్యతలకు ప్రాముఖ్యమిచ్చారు.

అత్యంత విశ్వసనీయత కలిగిన ప్రభుత్వ సంస్థల్లో యూపీఎస్సీ ఒకటి. నిష్పక్షపాతంగా అధికారులను ఎంపిక చేస్తోంది. సివిల్, పబ్లిక్ సర్వీసుల్లో అత్యంత నైపుణ్యం కలిగిన బృందాలను సిద్ధం చేస్తున్న యూపీఎస్సీకి గొప్ప పరపతి ఉంది. వివిధ రాష్ట్రాల పీఎస్సీలు ఆయా రాష్ట్రాల అభివృద్ధిలో భాగస్వాములై.. రాజ్యాంగం నిర్దేశించిన విధులు నిర్వర్తిస్తున్నాయి. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించేలా అడుగులు వేస్తున్నాం. సర్వీస్ కమిషన్లు భవిష్యత్తు అవసరాలకు సిద్ధంగా ఉండే సివిల్ సర్వెంట్ల బృందాన్ని నిర్మించడంలో తమ బాధ్యతలు నిరంతరంగా నిర్వర్తిస్తూనే ఉండాలి'' అని సూచించారు.

సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ అవసరం: యూపీఎస్సీ ఛైర్మన్

యూపీఎస్సీ ఛైర్మన్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ''పబ్లిక్ సర్వీస్ కమిషన్ల బలోపేతం కోసం సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీవోఈ) ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. ఉమ్మడి నిబంధనలు, ఉత్తమ విధానాలను ఒకరితో ఒకరు పంచుకోవడానికి, పారదర్శకతను పెంచేందుకు ఇది ఉపయోగపడుతుంది. రాష్ట్రాల పీఎస్సీల కోసం 100 ముఖ్యమైన న్యాయ తీర్పులతో కూడిన నియమావళి సిద్ధం చేస్తున్నాం. వీటి ఆధారంగా న్యాయవివాదాలను అధిగమించేలా ముందుకు వెళ్లవచ్చు'' అని తెలిపారు. కమిషన్లకు సోషల్ మీడియా పెద్దసవాలుగా మారిందని, అభ్యర్థుల్లో అపోహలు సృష్టిస్తూ పీఎస్సీల విశ్వసనీయతను కొన్ని మీడియా వేదికలు దెబ్బతీస్తున్నాయని టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం పేర్కొన్నారు. పారదర్శక నియామకాలతో ప్రతిభ ఆధారంగా అత్యుత్తమ అభ్యర్థులను ఎంపిక చేస్తున్నామన్నారు. ఈ సదస్సుకు 24 మంది పీఎస్సీల ఛైర్మన్లు వచ్చారని తెలిపారు.

రాష్ట్రపతికి రామోజీ గ్రూపు సంస్థల సీఎండీ కిరణ్ స్వాగతం



పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్‌పర్సన్ల 26వ జాతీయ సదస్సులో పాల్గొనేందుకు శుక్రవారం రామోజీ ఫిల్మ్‌సిటీకి విచ్చేసిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతం పలుకుతున్న రామోజీ గ్రూపు సంస్థల ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ కిరణ్, చిత్రంలో టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం

ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో స్వల్ప సవరణలు

(మొదటి పేజీ తరువాయి)

షెడ్యూల్ ప్రకారం మార్చి 3న జరగాల్సి ఉండగా.. వీటిని మార్చి 4కు మార్చారు. ప్రభుత్వ క్యాలెండర్‌లో హోలీ పండుగ మార్చి 3న ఉండడంతో ఈ మార్పు చేశారు. మార్చి 20న జరగాల్సిన మొదటి ఏడాది పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్ పరీక్షలను 21వ తేదీకి సవరించారు. మార్చి 20న రంజాన్ పండుగ కావడంతో ఈ మార్పు జరిగింది. ఈ ఏడాది ఇంటర్మీడియట్ మొదటి ఏడాది సిలబస్ మారడంతో పాటు పరీక్షల విధానంలోనూ మార్పులు చేయడంతో ప్రథమ సంవత్సరం బ్యాక్‌లాగ్ సబ్జెక్టులకు ప్రత్యేకంగా షెడ్యూల్ ఇచ్చారు.

- నైతికత, మానవ విలువల పరీక్షలు జనవరి 21న, పర్యావరణ పరీక్ష జనవరి 23న నిర్వహిస్తారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ పరీక్షలు జరుగుతాయి.

ఇంటర్ పరీక్షలకు సవరించిన షెడ్యూలు..

ప్రథమ సంవత్సరం విద్యార్థులకు..

తేదీ	సబ్జెక్టు
ఫిబ్రవరి 23	తెలుగు, సంస్కృతం, ఉర్దూ, హిందీ, తమిళ్, ఒడియా, కన్నడ, అరబిక్, ఫ్రెంచ్, పార్శీ
25	ఆంగ్లం
27	చరిత్ర
మార్చి 2	గణితం
5	జీవశాస్త్రం
7	ఆర్థిక శాస్త్రం
10	భౌతికశాస్త్రం
12	కామర్స్
14	సివిక్స్
17	రసాయనశాస్త్రం
21	పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్
24	మోడ్రన్ లాంగ్వేజ్, జాగ్రఫీ

ద్వితీయ సంవత్సరం..

తేదీ	పరీక్షలు
ఫిబ్రవరి 24	రెండో భాష
26	ఆంగ్లం
28	వృక్షశాస్త్రం, చరిత్ర
మార్చి 4	గణితం పేపర్-2ఏ, సివిక్స్
6	జంతుశాస్త్రం, ఆర్థిక శాస్త్రం
9	గణితం పేపర్-2బీ
11	కామర్స్, సామాజికశాస్త్రం, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్
13	భౌతికశాస్త్రం
16	మోడ్రన్ లాంగ్వేజ్, జాగ్రఫీ, బ్రిడ్జ్ కోర్సు (గణితం)
18	రసాయనశాస్త్రం
23	పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్

- ఇంటర్ ప్రాక్టికల్స్ ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు, వృత్తివిద్యా కోర్సులకు జనవరి 27 నుంచి ఫిబ్రవరి 10 వరకు ఉంటాయి. ఉదయం 9 నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండు విడతలుగా ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు.
- సమగ్ర శిక్షా అభియాన్ అమలు చేస్తున్న వృత్తివిద్యా కోర్సులకు ఫిబ్రవరి 13న ఉదయం 10 నుంచి 12గంటల వరకు పరీక్షలు జరుగుతాయి.

విశాఖ, విజయవాడల్లో పీపీపీ రోడ్లు

- ప్రైవేట్ భాగస్వామ్యంతో రూ.478 కోట్లతో రహదారుల అభివృద్ధి
- 56 పనులకు ప్రభుత్వం ఆమోదం
- 'యాన్యుటీ మోడల్'లో పదేళ్లలో బిల్లులు తిరిగి చెల్లింపు
- దశల వారీగా మిగతా నగరాల్లోనూ అమలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ)తో నగరాల్లో రహదారులు అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. విజయవాడ, విశాఖపట్నంలలో ప్రయోగాత్మకంగా 112 కిలోమీటర్ల మేర రోడ్లను రూ.478 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. ఇందుకోసం పురపాలకశాఖ త్వరలో బిడ్లు (ఆర్ఎఫ్‌పీ) ఆహ్వానించనుంది. నాణ్యత, పనుల్లో పారదర్శకత, దీర్ఘకాలిక నిర్వహణకు ప్రాధాన్యమివ్వాలన్నది లక్ష్యం. పనులు చేసిన గుత్తేదారు సంస్థలకు 'యాన్యుటీ మోడల్'లో తిరిగి చెల్లింపులు చేయనున్నారు. దశల వారీగా మిగిలిన నగరాల్లోనూ ఇదే విధానం అమలు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.

నగరపాలక సంస్థల్లో చుట్టూ ఉన్న మున్సిపాల్టీలు, పంచాయతీలను విలీనం చేయడంతో కొత్త కాలనీలు వెలిశాయి. అయితే నిధుల కొరతతో ఈ ప్రాంతాలకు రోడ్లు, కాలువలు, తాగునీరు వంటి మౌలిక వసతులు కల్పించడం సమస్యగా మారింది. దీనికి పరిష్కారంగా ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో తొలుత రోడ్ల అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పెద్ద నగరాలైన విశాఖపట్నం, విజయవాడల్లో ప్రయోగాత్మక అమలుకు అధికారులు తయారు చేసిన ప్రతిపాదనలను రెండు రోజుల క్రితం ఆమోదించింది.

తొలి ఏడాది 40 శాతమే తిరిగి చెల్లింపు

నగరపాలక సంస్థలు రోడ్ల నిర్మాణ వ్యయంలో తొలి ఏడాది 40% నిధులే గుత్తేదారు సంస్థలకు చెల్లించనున్నాయి. మిగిలిన 60% నిధులు తొమ్మిదేళ్లలో జమ చేస్తాయి. ఇందుకోసం ప్రత్యేకంగా ఎస్క్రో ఖాతాలు నిర్వహించనున్నాయి. యాన్యుటీ మోడల్‌లో పనుల నిర్వహణకు ఆసక్తి గల సంస్థలనే బిడ్లు వేయాలని పురపాలకశాఖ ఆహ్వానించనుంది. కొన్ని పెద్ద సంస్థలు ఇందుకు సుముఖత వ్యక్తం చేశాయని తెలిసింది. వాటిని దృష్టిలో పెట్టుకునే ప్రాజెక్టును డిజైన్ చేశారు. చిన్న సంస్థలు పాల్గొనే అవకాశం లేదని ఇంజినీర్లు అభిప్రాయపడుతున్నారు.

నగరం	రోడ్లు	విస్తీర్ణం (కి.మీ.ల్లో)	నిర్మాణ వ్యయం (రూ.కోట్లలో)
విశాఖపట్నం	45	88.54	306.95
విజయవాడ	11	23.54	171.14

రోడ్లతోపాటు కల్పించే సౌకర్యాలు

- ఫుట్‌పాత్‌లు, మీడియన్లు, వర్షపునీటి కాలువల అభివృద్ధి
- వీధి దీపాల ఆధునికీకరణ
- యుటిలిటీ డక్టుల ఏర్పాటు
- సూచిక బోర్డులు, మార్కింగ్ వంటి భద్రత ఏర్పాట్లు
- బెంచీలు, చెత్త బుట్టలు, బయో టాయిలెట్లు
- వాహనాల ప్రత్యేక పార్కింగ్ బేస్, హాకర్ జోన్లు

పదేళ్లలో రోడ్ల నిర్వహణ ఇలా

- రోడ్లపై గుంతలకు ఎప్పటికప్పుడు మరమ్మతులు
- పచ్చదనం, వీధి దీపాల నిర్వహణ.. కాలువల శుభ్రత
- రోడ్డు మార్కింగ్, లేన్ల నిర్వహణ, పునరుద్ధరణ.



విశాఖలో పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేయనున్న పీఎంపాలెం - బాబా కళాశాల రోడ్డు

మళ్లీ భగ్గుమన్న బంగ్లాదేశ్



నిరసనకారులు నిప్పుపెట్టడంతో ఢాకాలోని డైలీ స్టార్ వార్తాపత్రిక కార్యాలయంలో ఎగసిపడుతున్న మంటలు

- హాదీ మరణంతో దేశవ్యాప్తంగా అల్లర్లు
- పత్రికా కార్యాలయాలకు నిప్పంటించిన ఆందోళనకారులు
- అసిస్టెంట్ ఇండియన్ హైకమిషనర్ నివాసంపై రాళ్ల వర్షం
- మూక దాడిలో దీపూ చంద్ర దాస్ మృతి

ఢాకా, దిల్లీ: బంగ్లాదేశ్ మళ్లీ భగ్గుమంది. గతేడాది ఆగస్టులో షేక్ హసీనా నేతృత్వంలోని అవామీలీగ్ ప్రభుత్వాన్ని గద్దె దించిన 'విద్యార్థుల ఉద్యమం'లో కీలక పాత్ర పోషించిన ఇంకిలాబ్ మోంచో యువ నేత షరీఫ్ ఉస్మాన్ హాదీ సింగపూర్‌లోని ఓ ఆసుపత్రిలో గురువారం రాత్రి మరణించడంతో అల్లర్లు చెలరేగాయి. రాజధాని ఢాకా సహా పలు జిల్లాలు హింసాత్మక ఘటనలతో అట్టుడికిపోయాయి. భారత రాయబార కార్యాలయాల ముందు ఆందోళనకారులు భారీ నిరసనలకు దిగారు. చిట్టగాంగ్‌లోని అసిస్టెంట్ ఇండియన్ హైకమిషనర్ నివాసంపై రాళ్ల వర్షం కురిపించారు. ఢాకాలోని భారత రాయబార కార్యాలయం ముందు బారికేడ్లను తొలగించి లోపలకు చొచ్చుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. పత్రికా కార్యాలయాలనూ ఆందోళనకారులు ముట్టడించారు. దేశంలోని ప్రధాన పత్రికలైన ప్రొథోమ్ ఆలో, ది డైలీ స్టార్ భవనాలకు నిప్పంటించారు. ఈ ఘటనల్లో కొందరు పాత్రికేయులు అగ్నికీలల్లో చిక్కుకోగా, వారిని సైన్యం రక్షించింది. ఆందోళనకారులతో మాట్లాడేందుకు ప్రయత్నించిన న్యూ ఏజ్ ఎడిటర్ నూరుల్ కబీర్‌పైనా దాడి జరిగింది. ఈ పరిణామాలతో దేశంలోని ప్రధాన పత్రికలు శుక్రవారం తమ కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేశాయి. ఇప్పటికే ధ్వంసమైన బంగ్లాదేశ్ జాతిపిత షేక్ ముజీబుర్ రెహమాన్ నివాసంపై ఆందోళనకారులు మళ్లీ దాడి చేశారు. రాజ్‌షాహీలోని అవామీలీగ్ పార్టీ కార్యాలయాన్ని బుల్డోజర్‌తో నేలమట్టం చేశారు. ఢాకాలోని ప్రముఖ సాంస్కృతిక సంస్థ ఛాయానట్ ప్రాంగణాన్ని ధ్వంసం చేసి నిప్పంటించారు. గతేడాది జులై, ఆగస్టులో విద్యార్థులు ఉద్యమించడంతో షేక్ హసీనా తన ప్రధాని పదవికి రాజీనామా చేసి భారత్‌కు పారిపోయి వచ్చిన సంగతి తెలిసిందే. అనంతరం మహమ్మద్ యూనస్ ముఖ్య సలహాదారుడిగా తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడినా హింసాత్మక ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహిస్తామని యూనస్ ఇటీవల ప్రకటించినా.. పరిస్థితిలో ఏమాత్రం మార్పు రాలేదు.

భారత్ వ్యతిరేకి.. హాదీ

సింగపూర్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన షరీఫ్ ఉస్మాన్ హాదీ.. ఇంకిలాబ్ మోంచో ముఖ్య నేత. బంగ్లా ప్రధాని షేక్ హసీనాకు వ్యతిరేకంగా గతేడాది జరిగిన ఆందోళనల్లో కీలక పాత్ర పోషించారు. ఆ సందర్భంగా భారత్‌పై ఆయన తీవ్ర విద్వేషం వెళ్లగక్కారు. బంగ్లాదేశ్‌లో ఫిబ్రవరిలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ నెల 12న ఆయన ఢాకాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆ సమయంలో ముసుగు వేసుకున్న ఓ వ్యక్తి బైక్‌పై వచ్చి హాదీ తలపై గురి పెట్టి కాల్చారు. వెంటనే ఆయన్ను ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హాదీని బంగ్లా ప్రభుత్వం సింగపూర్‌కు తరలించింది. గురువారం రాత్రి ఆయన మరణించారని యూనస్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం హాదీ మృతదేహం ఢాకాకు చేరుకుంది. అంత్యక్రియలు శనివారం జరుగుతాయని ఇంకిలాబ్ మోంచో పార్టీ ప్రకటించింది.

చెట్టుకు వేలాడదీసి.. ఆపై నిప్పంటించి..

ఇస్లాంకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో మయమన్‌సింగ్ జిల్లాలో 25 ఏళ్ల దీపూ చంద్ర దాస్‌పై గురువారం రాత్రి మూక దాడి జరిగింది. కొందరు దుండగులు అతణ్ని తీవ్రంగా కొట్టారు. చెట్టుకు వేలాడదీసి ఉరి తీశారు. అనంతరం రహదారి పక్కన పడేశారు. మళ్లీ కొందరు ఆ మృతదేహానికి నిప్పు అంటించడంతో ఆ రహదారిలో ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ సంఘటనపై మహమ్మద్ యూనస్ తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. ఈ హీనమైన నేరానికి పాల్పడిన వారిని వదిలిపెట్టబోమని పేర్కొన్నారు. పత్రికా కార్యాలయాలపై దాడిని కూడా ఖండించారు. పాత్రికేయులకు క్షమాపణ చెప్పారు. ప్రజలంతా సంయమనం పాటించాలని, మూక హింసకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.

భారతీయులు అప్రమత్తంగా ఉండాలి

తాజా పరిణామాల నేపథ్యంలో బంగ్లాదేశ్‌లోని భారత హైకమిషన్ అడ్వైజరీ జారీ చేసింది. భారతీయులంతా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ''ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా.. ఈ దేశంలో నివసిస్తున్న భారతీయులు, భారత విద్యార్థులు అనవసర ప్రయాణాలు చేయొద్దు. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు. ఏదైనా ఎమర్జెన్సీ అయితే సాయం కోసం హైకమిషన్, అసిస్టెంట్ హైకమిషన్ కార్యాలయాలను సంప్రదించండి'' అని భారత దౌత్యాధికారులు తమ అడ్వైజరీలో వెల్లడించారు.

రాష్ట్ర సొంత రాబడి ₹67,235 కోట్లు

- కిందటి ఆర్థిక సంవత్సరం కన్నా 4% అదనం
- లక్ష్యం చేరాలంటే వచ్చే మూడు నెలలు కీలకం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర సొంత రాబడి ఈ ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు 10 వరకు రూ.67,235 కోట్లు దక్కింది. ఈ లక్ష్యం రూ.1,34,208 కోట్లలో ఎనిమిది నెలల కాలానికి దాదాపు సగం సాధించినట్లయింది. ప్రస్తుతం డిసెంబరు నెల చివరికి వచ్చింది. ఈ నెల పూర్తయితే మూడు త్రైమాసికాలు ముగిసినట్లే. జనవరి నుంచి మార్చి వరకు చివరి త్రైమాసికంలో సొంత రాబడులు పెరిగేలా చూడాలని ఆర్థిక శాఖ అధికారులు జిల్లాల యంత్రాంగానికి నిర్దేశిస్తున్నారు. ఏ జిల్లాలో ఏ విభాగం నుంచి ఎంత ఆదాయం వచ్చింది.. గతంలో ఎంత ఉంది.. ఎక్కడ నుంచి అధిక ఆదాయం రాబట్టే ఆస్కారం ఉంది.. అనే అంశాలను ఆర్థిక శాఖ అధికారులు కలెక్టర్లకు అందుబాటులో ఉంచారు. ఆర్థిక సంవత్సరంలో ప్రతి మూడు నెలలను ఒక సమీక్షగా తీసుకుంటారు. మొత్తం నాలుగు త్రైమాసికాలుగా విశ్లేషిస్తారు. తొలి రెండు త్రైమాసికాల్లో రాష్ట్ర రాబడి కిందటి ఏడాది కన్నా అధికంగానే ఉందని పేర్కొంటున్నారు. నవంబరులో జీఎస్టీ 2.0 ప్రభావం కొంతమేర పడి ఆ వసూళ్లలో 2% మేర తగ్గుదల కనిపించింది. డిసెంబరు ప్రారంభం వరకు ఉన్న లెక్కల ప్రకారం.. గనులు, భూగర్భ వనరులు మినహా మిగిలిన అన్ని శాఖల నుంచి రాబడి ఆశించినట్లుగా ఉందని విశ్లేషించారు. రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ల ఆదాయం ఆశించిన దానికన్నా ఎక్కువ ఉంది. నవంబరు నెలాఖరు వరకు అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం లక్ష్యంతో పోలిస్తే 110% మేర రాబడులు సాధ్యమయ్యాయి.

రిజిస్ట్రేషన్ల రాబడి భేష్

- రిజిస్ట్రేషన్ల రాబడి లక్ష్యం కన్నా అధికంగా ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి నవంబరు నెలాఖరు వరకు రూ.6,508.16 కోట్లు లక్ష్యం కాగా రూ.7,194.33 కోట్లు సాధించింది. కిందటి ఏడాది ఇదే సమయానికి అది రూ.5,465.79 కోట్లు మాత్రమే. మొత్తంగా 31.62% ఆదాయం కిందటి ఏడాది కన్నా అధికంగా లభించింది.
- రవాణా రంగంలో నవంబరు నెలాఖరు వరకు రూ. 3,197.61 కోట్ల రాబడి దక్కింది. కిందటి ఏడాది ఇదే సమయానికి రూ.3,060.49 కోట్లే. అదనంగా 4.48% మేర సాధించారు.
- అటవీ శాఖ నుంచి అధిక ఆదాయం ఆశించినా వచ్చింది స్వల్పమే.. రూ.400 కోట్లు ఈ ఆర్థిక సంవత్సరంలో లక్ష్యం కాగా, కేవలం రూ.38.628 కోట్లు మాత్రమే దక్కింది. ఎర్రచందనం వేలం ద్వారా పెద్ద మొత్తంలో ఆదాయం ఆశించినా.. అందుకు వీలు చిక్కలేదు.

ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర సొంత రాబడి లక్ష్యం	రూ.1,34,208 కోట్లు
ప్రస్తుతం సాధించింది	రూ.67,235 కోట్లు
ఇంకా సాధించాల్సింది	రూ.66,973 కోట్లు
2024-25 డిసెంబరు 10 వరకు వచ్చింది	రూ.64,688 కోట్లు
కిందటి ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం రాబడి	4% అదనం

తొలి రెండు త్రైమాసికాల రాబడిని శాఖల వారీగా కిందటి ఆర్థిక సంవత్సరంతో పోల్చి పరిశీలిస్తే.. (అంకెలు రూ.కోట్లలో, మార్పు శాతాల్లో)

రెవెన్యూ ఆర్జన శాఖ	తొలి త్రైమాసికం			రెండో త్రైమాసికం		
	2024–25	2025–26	మార్పు	2024–25	2025–26	మార్పు
వాణిజ్య పన్నులు	12,810	12,415	–3%	11,984	13,149	+10%
అబ్కారీ	5,576	6,369	+14%	6,303	6,950	+10%
స్టాంపులు, రిజిస్ట్రేషన్లు	1,819	2,661	+46%	2,159	2,684	+24%
వాహనాలపై పన్ను	1,074	1,089	+1%	1,052	1,114	+6%
గనులు, భూగర్భ వనరులు	537	584	+9%	477	852	+79%
అడవులు	11	8	–27%	9	7	–22%
ఇతర పన్నుల ఆదాయం	196	53	–73%	140	132	–6%
పన్నేతర రాబడి	650	658	+1%	530	463	–13%

☛ డిసెంబరు నెలాఖరుకు మూడో త్రైమాసికం పూర్తవుతుంది.

మూడే నెలలు.. పూర్తయిపోవాలి!

మార్చిలోగా టెర్మినల్ పనులు ముగించే సంస్థకే బాధ్యతలు

ఈనాడు – అమరావతి

విజయవాడ విమానాశ్రయంలో ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ పనులు త్వరగా పూర్తిచేయాలని చాలాసార్లు లక్ష్యాలను నిర్దేశించి, గుత్తేదారు సంస్థ ఎన్‌కేజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌ను హెచ్చరించినా తీరు మారలేదు. ఇక లాభం లేదని సదరు సంస్థను.. భారత విమానయాన సంస్థ(ఏఏఐ) తప్పించేసింది. నెలాఖరులోగా మరో సంస్థకు బాధ్యతలు అప్పగించేలా.. టెండర్ పిలిచింది. మూడు నెలల్లో మిగులు పనులు పూర్తిచేయాలనే నిబంధన పెట్టారు. 2026 మార్చిలోగా భవనం అప్పగించే సంస్థకే.. పనులు కట్టబెట్టనున్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో రూ.470 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ పనులు 80 శాతం పూర్తయ్యాయి. మిగులు పనులు 2025 జూన్‌లోగా పూర్తిచేయాలని గడువు పెట్టారు. తర్వాత ఆగస్టు.. డిసెంబరులకు పొడిగించినా కొలిక్కి రాలేదు. అందుకే.. గుత్తేదారు సంస్థపై వేటేసి.. కొత్త వారికి కేటాయించాలని టెండర్లు పిలిచారు. కానీ.. కొత్తవారొచ్చి.. తుదిదశ పనులను మార్చిలోగా చేయగలరా అనేదే ప్రశ్నార్థకం.

పూర్తయిన నిర్మాణాలు

● భవన నిర్మాణం పూర్తయింది. బేస్‌మెంట్, 1, 2 అంతస్తుల పిల్లర్లు, శ్లాబులన్నీ అయిపోయాయి. ● స్టీల్ అండ్ గ్లాస్‌తో వెలుపల భాగం నిర్మించాలి. స్టీల్ ఫ్రేములు బిగించారు. గ్లాస్ పనులు సగమే జరిగాయి. ● టెర్మినల్ ఎదురుగా భారీ పైవంతెన 90 శాతం పూర్తయింది. నేరుగా వాహనాల్లో వచ్చి.. టెర్మినల్ ఎదుట దిగి.. వాహనాలు తిరిగి పైవంతెన దిగి కింద ఉండే పార్కింగ్ ప్రదేశానికి వెళ్తాయి. ఈ వంతెనకు తుది మెరుగులద్దుతున్నారు. ● కొత్త టెర్మినల్‌కు జాతీయ రహదారిని అనుసంధానించే ప్రధాన రోడ్డు నిర్మాణం పూర్తయింది. పార్కింగ్ ప్రదేశాలు, టెర్మినల్ ఎదుట ఆహ్లాదంగా ఉండేలా ఫౌంటెయిన్లు, పార్కుల నిర్మాణం చివరి దశలో ఉన్నాయి. ● టెర్మినల్‌కు వెనక వైపు మూడు వంతెనలు, ఆరు ఏరో బ్రిడ్జిలు నిర్మిస్తున్నారు. వీటిలో నాలుగు ఏరో బ్రిడ్జిలు కట్టగా.. రెండు తుదిదశలో ఉన్నాయి.



80 శాతంపైగా పూర్తయిన పైవంతెన



టెర్మినల్ భవనానికి వెలుపల వైపు గ్లాసులు బిగించే పనులు

ఇంకా చేపట్టాల్సినవి...

■ సీలింగ్, ఫ్లోరింగ్.. బయట గ్లాస్ పనులు పూర్తిచేయాలి. ఎలక్ట్రికల్, సెంట్రల్ ఏసీ పనులు చేయాలి. వీటి ఎక్విప్‌మెంట్ వచ్చేసింది. ■ కన్వేయర్ బెల్ట్‌ల పనులు జరుగుతున్నాయి. వీటిని వేరే గుత్తేదారుకు అప్పగించారు. మెటీరియల్ కూడా వచ్చేసింది. ప్రస్తుతం బిగిస్తున్నారు. ■ పాసింజర్ బోర్డింగ్ బ్రిడ్జెస్ ఆరింటిలో నాలుగు పూర్తవగా రెండింటి పనులు జరుగుతున్నాయి. వీటి ద్వారా నేరుగా విమానంలోంచే టెర్మినల్‌లోకి రావచ్చు.



ప్రణమిల్లిన మది.. తల్లడిల్లినది

గత కృష్ణా పుష్కరాల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు పండిట్ నెహ్రూ బస్టాండ్ సమీపంలో రూ.కోట్లతో నిర్మించిన పద్మావతి స్నాన ఘాట్ ఇది. నాడు లక్షల మంది భక్తులు పుణ్యస్నానం చేసిన ఈ ప్రదేశంలో నేడు మురుగు ప్రవహిస్తోంది. నగరంలోని వ్యర్థ జలాలను నేరుగా నదిలోకి వదిలేస్తుండడంతో తీరమంతా ఇలా మురుగు కూపంలా మారుతోంది. - ఈనాడు అమరావతి

కమ్మేసే నిర్లక్ష్యం.. కాటేసే కాలుష్యం..

జగ్గయ్యపేట పారిశ్రామికవాడలో నిబంధనలకు నీళ్లు



ఇవీ... జగ్గయ్యపేట ఆటోనగర్‌లో చుట్టుపక్కల బోర్లు వేయగా వస్తున్న నీరు. పసుపు రంగు సీసాలో పారిశ్రామికవాడలో వేసిన బోరు నీరు. ముదురు తెలుపు రంగు నీరు అక్కడ నుంచి 500 మీటర్లలో వేసిన బోరు నీరు. స్వచ్ఛంగా ఉన్నవి కిమీ పైగా దూరంలో వేసిన బోరు నీరు. ఇదే కాలుష్య ప్రభావానికి తార్కాణం.

ఈనాడు – అమరావతి, న్యూస్‌టుడే – జగ్గయ్యపేట, గ్రామీణం

ఫార్మా కంపెనీ నిర్వాహకుల లాభాపేక్ష ప్రజలు, జంతువుల ప్రాణాలతో చెలగాటమాడుతోంది. వ్యర్థాల నిర్వహణ గాలికొదిలేశారు. స్థానికంగా ప్రజలు తల్లడిల్లుతున్నా... కాలుష్య నియంత్రణ మండలి అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు.

అడ్డగోలు వ్యవహారం...

☛ జగ్గయ్యపేట ఆటోనగర్‌లో ఫార్మా, కెమికల్స్, టైర్ల వ్యర్థాలతో ఆయిల్ తయారు చేసే కంపెనీలు 7 వరకు ఉన్నాయి.

☛ వ్యర్థాలను ట్రీట్మెంట్ చేశాకే బయటకు వదలాలి. ఇక్కడ ట్రీట్మెంట్ లేకుండా రివర్స్ బోరింగ్ ద్వారా మళ్లీ భూమిలోకే పంపుతున్నారు.

☛ భూమి పొరల్లో ఖాళీల ద్వారా చుట్టుపక్కల 2 కి.మీ. మేర కలుషితం అవుతోంది. భూగర్భ జలాలు విషతుల్యం అవుతున్నాయి అర్ధరాత్రి నుంచి రసాయన అవశేషాలతో కూడిన గాలినీ వదులుతున్నారు.

☛ షేర్‌మహ్మద్‌పేట, శాంతినగర్, డాంగేనగర్, విష్ణుప్రియ నగర్, డీవీఆర్ నగర్, ఆర్టీసీ కాలనీ, తిరుమలగిరి తదితర ప్రాంతాల్లోని 15 వేల మంది ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

★ ఆటోనగర్ కాలుష్యంతో అనారోగ్యం పాలవుతున్నామని ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళన బాటపట్టారు. కంపెనీల నిర్వహణ దయనీయంగా ఉందనీ.. పరిస్థితి చక్కదిద్దేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సత్వరమే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

☛ ఊపిరితిత్తులు, కిడ్నీ, చర్మ వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. పెద్ద సంఖ్యలో గేదెలు, ఆవులు, గొర్రెలు, కుక్కలు మృత్యువాతపడ్డాయి.

☛ సమీపంలోనే భూమిలో వెళుతున్న గ్యాస్, డీజిల్ పైపులైన్లు సైతం ఈ కాలుష్య తీవ్రతకు దెబ్బతింటే.. ప్రమాదం వాటిల్లే వీలుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఇదేనా నియంత్రణ...?

కాలుష్య నియంత్రణ అధికారులకు పదుల సంఖ్యలో అర్జీలు ఇచ్చారు. నమూనాలు సేకరించి హడావుడి చేయడం తప్ప ఇప్పటి వరకు ఆ నమూనాల ఫలితాలు వెల్లడించిన దాఖలాలు లేవు. కంపెనీ నిర్వాహకుల నుంచి ఆమ్యామ్యాలు తీసుకుని కనీస చర్యలు తీసుకోవడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు.

కమిటీగా ఏర్పాటై చక్కదిద్దుతాం.. విజయవాడ కాలుష్య నియంత్రణ బోర్డు ఈఈ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాలుష్యం జరుగుతున్న విషయం ఇప్పటికే గుర్తించామన్నారు. ఒక్కో కంపెనీకి రూ.16 లక్షల జరిమానా విధించాలని నిర్ణయించామనీ.. మళ్లీ సంబంధిత శాఖలన్నీ కమిటీగా ఏర్పాటై పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

ఇంద్రగిరికి భక్త తోరణం



అమ్మవారి దర్శనానికి బారులు తీరి..

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై శుక్రవారం ఆర్జిత సేవల సందడి నెలకొంది. అమావాస్య రోజున దుర్గమ్మ దర్శనం చేసుకొని ఆర్జిత సేవలో పాల్గొనాలని భక్తులు ఆసక్తి చూపుతారు. ఆర్జిత సేవలైన చండీయాగం, శ్రీచక్రనవావరణార్చన, శాంతి కల్యాణం, కుంకుమార్చన సేవల్లో పెద్ద సంఖ్యలో ఉభయదాతలు పాల్గొన్నారు. వీరితోపాటు దుర్గమ్మ దర్శనానికి భక్తులు తరలి రావడంతో ఘాట్ రోడ్డు, కనకదుర్గానగర్ మెట్ల మార్గాలు భక్తుల వాహనాలతో నిండిపోయాయి. కెనాల్ రోడ్డులో వాహనాలు నిలిపి పలువురు భక్తులు లిఫ్టు మార్గంలో ఇంద్రకీలాద్రికి చేరుకున్నారు. భక్తులు దర్శనం క్యూలైన్లతో పాటు ఆన్‌లైన్ సేవలను వినియోగించుకున్నారు.

రైలు ప్రయాణంలో సమస్యలా...



రైలులో అంటించిన స్టిక్కరు

'శిర్డీ నుంచి విజయవాడ వస్తున్న సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఏసీ బోగీలో విద్యుత్తు సాకెట్ పని చేయడం లేదు. ఫోన్ ఛార్జింగ్ కాకపోవడంతో దక్షిణ మధ్య రైల్వే కంట్రోల్‌రూంకు ప్రయాణికుడు ఫిర్యాదు చేశారు. 5 నిమిషాల వ్యవధిలో టెక్నీషియన్ వచ్చి సమస్యను పరిష్కరించారు.

విద్యుత్తు సమస్య మాత్రమే కాదు... ప్రయాణికులు ఎదుర్కొనేవి ఏవైనా సరే పరిష్కరించేందుకు రైల్వేశాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని బోగీల్లో పలుచోట్ల ఫిర్యాదులు తెలియజేసేందుకు చరవాణి నంబర్లను ప్రదర్శించింది. వాటికి ఫోన్ చేస్తే.. సదరు కాల్ రైల్వే కంట్రోల్‌రూమ్‌కు వెళుతుంది. మీరు ప్రయాణిస్తున్న రైలు, బోగీ, సీటు నంబర్లు చెప్పాలి. సమస్యను తెలియజేయాలి.

– గవర్నర్‌పేట, న్యూస్‌టుడే

ఏయే సమస్యలు అంటే.. ■ ఏసీ, విద్యుత్తు ప్లగ్ సాకెట్‌లు పనిచేయక పోయినా ■ వాష్‌రూమ్‌ల పరిశుభ్రత, నీటి సరఫరా ■ బెడ్ రోల్స్ ■ కోచ్ నిర్వహణ ■ బొద్దింకలు, ఎలుకల సంచారం.

ఫోన్ నంబర్లు

రైల్వే కంట్రోల్‌రూం... 97013 73410

ఓబీహెచ్ఎస్ (ఆన్‌బోర్డ్ హౌస్ కీపింగ్ సర్వీసెస్) 98498 31767

రబీకి ఎరువుల ప్రణాళిక

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో రబీ 2025-26 ఏడాది గాను అన్ని పంటలకు 33,353 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీకి ప్రణాళిక తయారు చేసినట్టు డీఏవో విజయ కుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎరువుల కొరత లేదని, సొసైటీలు, ఆర్.ఎస్.కె.లు, మార్క్‌ఫెడ్ గోదాములు, రిటైల్/హోల్‌సేల్, కంపెనీ గోదాముల్లో రైతులకు అందుబాటులో ఉంచినట్టు వివరించారు. ఎరువులు పక్కదారి పట్టినా, అధిక ధరలకు విక్రయించినా ఆయా డీలర్లపై తగు చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. అన్నదాతలకు ఎప్పటికప్పుడు సమగ్ర సమాచారం తెలియజేస్తామని, ఎరువులు పంపిణీ చేస్తామన్నారు.

సైనిక కుటుంబాలను ఆదుకోవడం బాధ్యత

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : సాయుధ దళాల పతాక నిధికి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు తమ వంతు సహకారం అందించడం అభినందనీయమని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. లోక్‌భవన్ దర్బార్ హాలులో శుక్రవారం నిర్వహించిన సాయుధ దళాల పతాక దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్జీవో నేతలను గవర్నర్ అభినందించారు. ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ.. వీర సైనికులు, వారి కుటుంబాలను ఆదుకోవడం బాధ్యతగా భావించి, ప్రభుత్వ ఉద్యోగులు పతాక నిధికి విరాళాలు ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఎలాంటి విపత్తులు సంభవించినా సామాజిక బాధ్యతగా గుర్తించి ప్రజలను ఆదుకోవడం, వారికి భరోసా కల్పించడంలో సంఘం ముందుంటుందని పేర్కొన్నారు. అనంతరం గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, హోంమంత్రి వంగలపూడి అనిత, సైనిక సంక్షేమశాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ వి.వెంకటరెడ్డి తదితరులు ఎన్జీవో నేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి డి.వి.రమణ, కార్యనిర్వాహక కార్యదర్శి కిలారు జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో జస్టిస్ అబ్దుల్ నజీర్, హోం మంత్రి అనిత, సైనిక సంక్షేమశాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ వెంకటరెడ్డి, ఏపీ ఎన్జీవో నేతలు విద్యాసాగర్, రమణ, జగదీశ్వరరావు తదితరులు

దిల్లీ ఎయిరిండియా సర్వీసు రద్దు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దిల్లీకి రాకపోకలు సాగించే ఏఐ2571, ఏఐ2572 సర్వీసును శుక్రవారం రద్దు చేసినట్లు ఎయిరిండియా అధికారులు తెలిపారు. దిల్లీ నుంచి ఉదయం 8:15 గంటలకు విమానాశ్రయం చేరుకొని.. 9 గంటలకు దిల్లీ బయలుదేరి వెళ్లాల్సిన సదరు సర్వీసు అనివార్య కారణాలతో రద్దయినట్లు పేర్కొన్నారు. దీంతో ఉభయ గోదావరి, ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి దేశ రాజధానికి రాకపోకలు సాగించాల్సిన ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు.



ఔరా అనేలా.. సౌర గృహం

విజయవాడ నగరంలో ఆంధ్రప్రదేశ్ సోలార్ ఎనర్జీ ఆధ్వర్యంలో సోలార్ రెన్యూబుల్ ఎనర్జీ పేరుతో నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్‌లో ఓ సంస్థ ఏర్పాటు చేసిన సౌర సంచార గృహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఒక్క సోలార్ ప్యానల్ మాత్రమే ఎందుకు, దాంతో పాటు చిన్నపాటి గృహాన్ని కూడా ఏర్పాటు చేసుకోండి అంటూ ఈ సంస్థ దీనిని రూపొందించింది. పాలియురేతేన్ ఫోమ్ ప్యానల్‌తో తయారు చేసే పెద్దసైజు క్యాబిన్ల మీద సౌర పలకలు అమర్చి విక్రయిస్తున్నారు. ఇంటిపైన దీన్ని ఏర్పాటు చేసుకుంటే పెంట్‌హౌస్‌లా ఉపయోగపడుతుందని ఆ సంస్థ వారు చెబుతున్నారు. రూ.3.5లక్షలు, రూ.4.8లక్షల ధరల్లో అందుబాటులో ఉన్నాయి. రెండు ఫ్యాన్లు, రెండు లైట్లు, వివిధ ఉపకరణాల ఛార్జింగ్‌కు ఉపయోగపడే విద్యుత్తు అందించే సోలార్ ప్యానల్‌తో వీటిని సిద్ధం చేశారు.

- ఈనాడు, అమరావతి

మిద్దె పంట.. మేలు ఇంట

వైవిధ్య సాగు ప్రయోజనాలపై సామాజిక కార్యకర్త ప్రచారం



కాయగూరల మొక్కలకు నీరుపోస్తున్న కర్లపాటి శ్రీనివాసరావు

కొంతమంది మిద్దెతోటలను స్వప్రయోజనం కోసం పెంచుతారు.. కానీ జగ్గయ్యపేటకు చెందిన సామాజిక కార్యకర్త కర్లపాటి శ్రీనివాసరావు.. ఆర్థిక, ఆరోగ్య, పర్యావరణ ప్రయోజనాలను ప్రజలకు తెలియజేయాలన్న ఉద్దేశంతో తన ఇంటిపై మిద్దెతోటలు పెంచుతున్నారు. అతి తక్కువ ఖర్చుతో ఎలా సాగు చేయవచ్చో చేసి చూపిస్తున్నారు. దీంతో ఇక్కడకు వచ్చిన ఔత్సాహికులకు ఈ మిద్దె తోటలు సందర్శనా క్షేత్రంగా ఉపయోపడుతున్నాయి. ఇక్కడ బీన్స్, టమాటా, దొండ, బెండ, సొర, వంకాయ, చిక్కుడు, క్యాలీఫ్లవర్, బీర, పొట్ల, మెంతికూర, కొత్తిమీర, పాలకూర, చుక్కకూర, గోంగూర, బచ్చలికూర, అలాగే బంతి, గులాబీ, చామంతి, మరువం, మందారం వంటి పూలసాగు చేస్తున్నారు. ధాన్యం కంకులతో కూడిన పక్షులగూళ్లు, ప్రత్యేక పూల ద్వారా సీతాకోక చిలుకల ఆకర్షణకు పర్యావరణహిత ఏర్పాట్లు చేశారు. డ్రిప్ ఇరిగేషన్ ఎలా పెట్టుకోవచ్చో వివరిస్తున్నారు. ఇప్పటికే పట్టణ మహిళా సమాఖ్య ద్వారా ఇక్కడకు వస్తున్న పలువురు ఔత్సాహికులకు శ్రీనివాసరావు.. మిద్దె సాగు ప్రయోజనాలను వివరిస్తున్నారు. - న్యూస్‌టుడే, జగ్గయ్యపేట

ధ్రువపత్రాల పరిశీలన తేదీల ఖరారు

విజయవాడ బస్ స్టేషన్, న్యూస్‌టుడే: ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ చేయడానికి అంతర్జాలంలో దరఖాస్తు చేసుకున్న ఐటీఐ అభ్యర్థుల విద్యార్హత ధ్రువపత్రాల పరిశీలన తేదీలను ఖరారు చేసినట్లు ఏపీఎస్ఆర్టీసీ జోనల్ సిబ్బంది శిక్షణ కళాశాల ప్రిన్సిపల్ వి.నీలిమ శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

ట్రేడ్‌ల వారీగా అభ్యర్థులు హాజరు కావలసిన తేదీల వివరాలు

★ ఈనెల 24న : మోటార్ మెకానిక్, ఫిట్టర్, డ్రాట్స్‌మెన్ సివిల్, వెల్డర్, పెయింటర్ అండ్ మెషినిస్ట్ ట్రేడ్స్

★ 26,27 తేదీల్లో: ఎలక్ట్రీషియన్ ట్రేడ్

★ 29, 30 తేదీల్లో: డీజిల్ మెకానిక్ ట్రేడ్

★ ధ్రువపత్రాల పరిశీలనకు అభ్యర్థుల వివరాలను ట్రేడ్‌ల వారీగా www.apsrtc.ap.gov.in వెబ్‌సైట్‌లో రిక్రూట్‌మెంట్ ట్యాబ్‌లో ప్రకటించామని పేర్కొన్నారు. అభ్యర్థులు జాబితా ప్రకారం ఆయా తేదీల్లో చెరువు సెంటర్, విద్యాధరపురం, విజయవాడలోని జోనల్ సిబ్బంది శిక్షణ కళాశాల వద్దకు ఉదయం 10 గంటలకు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని, తీసుకురావాల్సిన ధ్రువపత్రాల వివరాలను www.apsrtc.ap.gov.inలో చూసుకోవాలన్నారు. 2 సెట్ల జిరాక్స్ కాపీలను తీసుకురావాలని చెప్పారు.







ప్రభుత్వ భూములూ.. వదలరంతే

ఈనాడు – అమరావతి

'కొత్తూరు తాడేపల్లి పరిధిలోని రీసర్వే నంబరు 45/1, 1లో 1.750 హెక్టార్లలో ఒకరు పేరుతో మట్టి తవ్వకాలకు అధికారుల నుంచి అనుమతి తీసుకున్నారు. కొద్దిరోజులుగా అనుమతిచ్చిన పొలంలో తవ్వకాలు చేస్తున్నారు. ఆ తర్వాత హద్దు రాళ్లను తొలగించేసి మరీ.. పక్కనే ఉన్న ఆర్ఎస్ నంబరు.46లోని ప్రభుత్వ భూమిలోనూ రెండు మూడు రోజులుగా తవ్వేస్తున్నారు. ఎకరాకు పైగా ఈ ప్రభుత్వ భూమిని తవ్వేశారు. అయినా అధికారులకు ఏమాత్రం పట్టలేదు.'

హద్దు రాళ్లు తొలగించి మరీ మట్టి తవ్వకం



తవ్వకాలు పరిశీలిస్తున్న వీఆర్వోలు, స్థానికులు

అనుమతి తీసుకున్న దానితో సంబంధం లేకుండా విచ్చలవిడిగా తవ్వేస్తున్నారని.. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఇప్పటికే పలు ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై జేసీ ఇలక్కియా స్పందించి.. మైనింగ్ అధికారులను సైతం పిలిచి.. తవ్వకాలు జరిగే ప్రదేశాల్లో పర్యటించి.. వాస్తవం గుర్తించాలంటూ రెండు వారాల కిందట సూచించారు. అయినా.. ఒక్క అధికారి కూడా కన్నెత్తి చూడలేదు. అంతే.. అక్రమార్కులు మరింత చెలరేగి.. తవ్వేస్తున్నారు.

స్థానికుల ఫిర్యాదుతో..

ప్రభుత్వ భూమిలో తవ్వేస్తున్న విషయాన్ని గుర్తించిన స్థానిక రైతులు, సామాజిక కార్యకర్త మెండెం జమలయ్య కలిసి.. విజయవాడ రూరల్ మండల ఆర్ఐకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఆర్ఐ వెంటనే స్పందించి.. తాడేపల్లి, వేమవరం వీఆర్వోలు సాయి, దుర్గారావులను తవ్వకాలు జరుగుతున్న ప్రదేశానికి పంపారు. అధికారుల రాకను గమనించి.. రెండు టిప్పర్లతో సహా అంతా పారిపోయారు. దీంతో తవ్వకాలకు ఉపయోగించిన జేసీబీని అధికారులు పట్టుకున్నారు.

తవ్వేసిన మట్టికి రికవరీ ఉంటుందా..?

మట్టి అక్రమంగా తవ్వేస్తున్న వారిపై ఎలాంటి చర్యలు లేకపోవడం వల్లే.. ఎన్నిసార్లు అధికారులు అడ్డుకున్నా.. మళ్లీ అదే చేస్తున్నారు. తవ్వేసిన మట్టి విలువను, జరిమానాతో కలిపి వసూలు చేస్తామని నోటీసులు మాత్రమే ఇచ్చి వదిలేస్తున్నారు. ఎలాంటి రికవరీ పెట్టడం లేదు. అందుకే.. ప్రభుత్వ భూములనూ వదలకుండా తవ్వుతున్నారు. అధికారులొచ్చి.. తవ్వుతున్న యంత్రాలకు తాళాలు వేసి వెళ్లిపోవడం.. ఆ తర్వాత వదిలేయడం ఇదే జరుగుతోంది.

ఉచితంగా 1.29 లక్షల లడ్డూలు పంపిణీ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: భవానీ దీక్షల విరమణలో లడ్డూ ప్రసాదాలు 4.61 లక్షలు ఈనెల 17 నాటికి మిగిలాయని ఈవో శీనానాయక్ తెలిపారు. శుక్రవారం ఆలయంలో విలేకరులతో మాట్లాడారు. భవానీ దీక్షల పూర్ణాహుతికి ముందుగా నిర్ణయించిన లక్ష్యానికి అనుగుణంగా ఈనెల 8 నుంచి 14 వరకు కాయిక్ 564 లడ్డూలు, పోట్టులో 4980 కాయిలకు గాను 28,08,720 లడ్డూలను తయారు చేసినట్లు తెలిపారు. భక్తులకు కొరివన్ని లడ్డూలు పంపిణీ చేసినట్లు చెప్పారు. దేవస్థానానికి రూ.60 లక్షలు నష్టం వచ్చిందని కొందరు సామాజిక మాధ్యమాల్లో, పత్రికల్లో ప్రచారం చేయడం తగదని చెప్పారు. 22,70,146 లడ్డూలు కౌంటర్లలో విక్రయించారన్నారు. దీక్షాదారులు తగ్గడంతో పాలకమండలి ఛైర్మన్, అధికారులతో కలిసి చర్చించి నిల్వ ఉన్న వాటిల్లో ఉచిత ప్రసాదానికి 1,29,196 కేటాయించి.. మిగతావి కౌంటర్లలో ఈనెల 21 వరకు విక్రయించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఉచిత ప్రసాదంగా గతంలో దద్దోజనం, కట్టెపొంగలి, చిన్న లడ్డూ ప్రసాదాలను పంపిణీ చేశారని వాటి స్థానంలో పెద్ద లడ్డూ అందజేస్తుండడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఆరు రోజుల వరకు వాటిని కౌంటర్లలో విక్రయించే అవకాశం ఉన్న విషయాన్ని గమనించాలని కోరారు.



భక్తులకు లడ్డూ అందజేస్తున్న ఈవో శీనానాయక్

2027లో వీఆర్ సిద్ధార్థ స్వర్ణోత్సవాలు

కానూరు, న్యూస్‌టుడే: వీఆర్ సిద్ధార్థ కళాశాలలో 2000 సంవత్సరంలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం ఉత్సాహభరితంగా జరిగింది. కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులందరూ కలిసి అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఉపకులపతి పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. అప్పటి కళాశాల ఇప్పుడు సిద్ధార్థ డీమ్డు విశ్వవిద్యాలయంగా మారిందన్నారు. 2027లో కళాశాల స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సామ్‌సంగ్ ఆర్అండ్‌డీ ఇన్‌స్టిట్యూట్ వైస్‌ప్రెసిడెంట్ జి.మోహనరావు మాట్లాడుతూ.. తాను కళాశాలలో 1984లో ఈసీఈ బ్యాచ్‌లో బీటెక్ పూర్తిచేసి ఇప్పుడు ఈ స్థాయిలో ఉన్నట్లు చెప్పారు. సాంకేతిక యుగంలో భవిష్యత్తులో ఏఐ, మెషీన్‌లెర్నింగ్ కీలకపాత్ర పోషిస్తాయన్నారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు తమ వంతుగా సాయం అందిస్తామని కెనడా మాజీ ఎమ్మెల్యే పాండా శివలింగప్రసాద్ అన్నారు. అంతకుముందు వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పర్వతనేని రవికుమార్, కార్యదర్శి జానకిరాం, ప్రోవైస్‌ఛాన్సలర్ ఏవి రత్నప్రసాద్, అట్లూరి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు




అఫ్సర్ ఖాన్‌కు ఆటో అందజేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ తదితరులు

సీఎం చొరవతో సమకూరిన ఆటో

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం సీతానగరానికి చెందిన పఠాన్ అఫ్సర్ ఖాన్‌కు కొత్త ఆటో సమకూరింది. ఈ ఏడాది అక్టోబరులో విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లో 'ఆటో డ్రైవర్ల సేవలో' కార్యక్రమం నిర్వహించారు. సీఎం చంద్రబాబు ప్రకాశం బ్యారేజీ మీదుగా అఫ్సర్ ఖాన్‌కు చెందిన ఆటోలో విజయవాడకు ప్రయాణించి, అతని ఆదాయ, కుటుంబ పరిస్థితిని తెలుసుకున్నారు. రోజుకు రూ.900ల ఆదాయం వస్తోందని, ఆటో పాతది కావడంతో మరమ్మతులు భారంగా మారాయని అఫ్సర్ వివరించారు. దీంతో సీఎం స్పందించి నూతన ఆటో సమకూరేలా హామీ ఇచ్చారు. ఈక్రమంలో పీ-4 కార్యక్రమం కింద బంగారు కుటుంబానికి చెందిన ఆటో వాలా అఫ్సర్‌కు పీ-4 మార్గదర్శకులుగా ఉన్న జగ్గయ్యపేట అల్ట్రాటెక్ సిమెంట్ లిమిటెడ్ వారు చేయూతనిచ్చారు. రూ.3.30 లక్షల విలువ కలిగిన బ్యాటరీ (ఎలక్ట్రిక్) ఆటోను సమకూర్చి, సుస్థిర జీవనోపాధికి బాట వేశారు. సదరు ఆటోను విజయవాడ కలెక్టరేట్‌లో మార్గదర్శకులతో కలిసి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ శుక్రవారం ఆటో తాళాలను అందజేశారు. అల్ట్రాటెక్ సిమెంట్ లిమిటెడ్, బాలాజీ సిమెంట్ వర్క్స్ యూనిట్ హెడ్ శివరాజ్ వరదరాజన్, యూనిట్ హెచ్.ఆర్. హెడ్ జి.మోహనరావు, లైజన్ హెడ్ డి.జయదేవ్ తదితరులు పాల్గొన్నారు. పీ-4 కార్యక్రమం ద్వారా ఆటోను అందుకోవడం సంతోషంగా ఉందని అఫ్సర్ పేర్కొన్నారు.

వైద్య పరికరాల కొనుగోలుకు నిధులు మంజూరు చేయండి

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: విజయవాడ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేసేందుకు ఎంపీ కేశినేని శివనాథ్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. దీనిలో భాగంగా కేంద్ర మంత్రులను స్వయంగా కలిసి వారి శాఖకు సంబంధించిన ప్రభుత్వరంగ సంస్థల నుంచి సీఎస్ఆర్ నిధులు రప్పించడానికి కృషి చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మను ఆయన కార్యాలయంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, కేశినేని శివనాథ్‌లు కలిశారు. ప్రభుత్వ ఆస్పత్రికి అవసరమైన ఆధునిక బయోమెడికల్ పరికరాల కొనుగోలుకు రూ.1.03 కోట్లు మంజూరు చేయాలని కోరారు.



కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మకు వినతిపత్రం అందిస్తున్న ఎంపీ శివనాథ్, మంత్రి సత్యకుమార్

నగర కమిషనరేట్‌కు ఏబీసీడీ పురస్కారం

ఎనికేపాడు గోదాములో చోరీ కేసు ఛేదనకు అవార్డు

ఈనాడు - అమరావతి : నేర పరిశోధనలో అత్యుత్తమ విధానాలతో కేసుల పరిష్కారానికి కృషి చేసినందుకు ఇచ్చే ఏబీసీడీ (అవార్డు ఫర్ బెస్ట్ ఇన్ క్రైమ్ డిటెక్షన్) పురస్కారం విజయవాడ కమిషనరేట్‌కు దక్కింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీసు యూనిట్లలో తొలి త్రైమాసికానికి ప్రథమ బహుమతి వరించింది. పటమట స్టేషన్ పరిధిలోని ఎనికేపాడులోని యాపిల్ డిస్ట్రిబ్యూటర్ గోదాములో జరిగిన చోరీ కేసును సీసీఎస్ పోలీసులు ఛేదించారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పసిగట్టి నిందితులను అరెస్టు చేశారు. శుక్రవారం డీజీపీ కార్యాలయంలో సీపీ రాజశేఖరబాబు, క్రైమ్ ఏడీసీపీ రాజారావు, సీసీఎస్ సిబ్బంది అవార్డు స్వీకరించారు.

ఫాస్టాగ్ ద్వారా ఛేదించారు: ఈ ఏడాది ఫిబ్రవరి, 5న అర్ధరాత్రి 12.58 గంటలకు ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలు గోదాము వెనుక వైపు గోడ దూకి ప్రవేశించారు. లోపల ఉన్న సీసీ కెమెరాల కేబుళ్లు కట్ చేశారు. రూ.2.51 కోట్లు విలువ చేసే 371 వస్తువులను చోరీ చేసి గోడ దూకి బయటపడ్డారు. రోడ్డుపై వీరి కోసం ఆగి ఉన్న మరో వ్యక్తితో కలిసి మధ్యప్రదేశ్ రిజిస్ట్రేషన్‌తో ఉన్న మారుతీ ఎర్టిగా కారు ఆనవాళ్లు సమీపంలోని సీసీ కెమెరాలో నమోదయ్యాయి. తెల్లవారుజామున 4 గంటలకు గన్నవరం వైపు వెళ్తున్నట్లు కనిపించింది. కారు నెంబర్ ఆధారంగా న్యాట్‌గ్రిడ్‌లో వివరాలను సేకరించారు. ఫాస్టాగ్ వివరాలను తీశారు. చెన్నై - కోల్‌కతా జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్నట్లు ఈ మార్గంలోని టోల్‌గేట్లలో రికార్డు అయింది. వీరు ఒడిశా దాటి బీహార్‌లోకి ప్రవేశిస్తున్నట్లు తెలుసుకుని.. అక్కడి పోలీసులను అప్రమత్తం చేశారు. అక్కడి పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. వాహనంతో పాటు నిందితులను అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



డీజీపీ హరీష్ కుమార్ గుప్తా నుంచి అవార్డు అందుకుంటున్న సీపీ రాజశేఖరబాబు తదితరులు

బయో ఆధారిత ఆవిష్కరణలతో ప్రయోజనాలు

విజయవాడ(కరెన్సీనగర్): వాతావరణ మార్పులతో ఎదురవుతున్న సమస్యలకు ప్రకృతి ఆధారిత బయో ఆవిష్కరణలే స్థిరమైన పరిష్కారమని సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ ప్లాట్‌ఫామ్స్(బెంగళూరు) సంచాలకులు తస్లీమారిఫ్ సయ్యద్ అన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో మాలక్ష్మి గ్రూప్ సహకారంతో విజయవాడ నోవోటెల్‌లో 'వాతావరణ మార్పు-పర్యావరణం, ఆరోగ్యం, వ్యవసాయంపై బయో ఆధారిత ఆవిష్కరణల ప్రభావం' అంశంపై శుక్రవారం యార్లగడ్డ శ్రీరాములు 22వ స్మారక ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. తస్లీమారిఫ్ సయ్యద్ మాట్లాడుతూ వాతావరణ మార్పు కారణంగా ఆహార భద్రతేకాక, నీటి వనరులు, మానవ ఆరోగ్యంపై ఇప్పటికే తీవ్ర ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులకు అడ్డుకట్ట వేసేందుకు సమాజం లోతైన సమాలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. పంటల దిగుబడిని పెంచే సముద్రపు శైవలాలతో తయారైన బయో ఎరువుల ఉత్పత్తిపై పరిశోధనలు జరగాలన్నారు. మాలక్ష్మి గ్రూప్ వ్యవస్థాపకులు యార్లగడ్డ హరిశ్చంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. యువతలో నైతికతతో కూడిన స్థిరమైన సామాజిక బాధ్యతతో ఆవిష్కరణలను ప్రోత్సహించడమే మాలక్ష్మి గ్రూప్ లక్ష్యమన్నారు. తొలుత యార్లగడ్డ శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. గ్రూప్ ప్రస్థానాన్ని ప్రాజెక్టు డైరెక్టరు సందీప్ మండవ వివరించారు. శ్రీరాములు జీవితం, ఆయన అందించిన సేవలపై రూపొందించిన లఘుచిత్రాన్ని ప్రదర్శించారు. తొలుత ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్(ఇండియా) రాష్ట్ర ఛైర్మన్ ఎంఎల్ఎస్ దేవకుమార్, సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ బి.పాండురంగారావులు యార్లగడ్డ శ్రీరాములు వారసత్వాన్ని గుర్తు చేశారు. అనంతరం విద్యార్థులచే ప్రశ్నోత్తరాల కార్యక్రమం నిర్వహించారు. వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి షేక్ రహమతున్నీసా, లయోలా కళాశాల విద్యార్థి గుటాల అపురూప్‌లకు ప్రతిభ పురస్కారాలు అందజేశారు. ఇంజినీర్స్ ఇండియా రాష్ట్ర గౌరవ కార్యదర్శి ఏవీ నరేష్‌బాబు, మాజీ మేయర్ జంధ్యాల శంకర్, కాట్రగడ్డ దత్తు, లయోలా కళాశాల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డా.తస్లీమారిఫ్ సయ్యద్, వేదికపై దేవకుమార్, హరిశ్చంద్ర ప్రసాద్, నరేష్‌బాబు

ప్రత్యేక హోదాతోనే రాష్ట్రాభివృద్ధి

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : ప్రత్యేక హోదాతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజల నుంచి వసూలు చేసిన పన్నులు విదేశీ పారిశ్రామిక సంస్థలకు రాయితీలుగా ఇవ్వడం తగదన్నారు. మిట్టల్, అదానీ, గూగుల్ తదితర సంస్థలకు ఇచ్చిన రూ.50వేల కోట్ల రాయితీలను.. రాష్ట్రంలోని యువతకు పారిశ్రామిక ప్రోత్సాహకాలుగా ఇవ్వాల్సిందని పేర్కొన్నారు. ఉద్యోగ అవకాశాల కల్పన పేరుతో భూములను విదేశీ సంస్థలకు రాసి ఇవ్వడం సమంజసం కాదన్నారు. కోనసీమ నుంచి వెళుతున్న గ్యాస్.. ఏపీ, తెలంగాణలో ప్రతి గృహిణి వంట అవసరాలు తీర్చాకే గుజరాత్, ఇతర ప్రాంతాలకు వెళ్లాలని చెప్పారు.



మాట్లాడుతున్న చలసాని శ్రీనివాస్. పక్కన తులసిరెడ్డి, బాబూరావు, శంకర్ తదితరులు

కేంద్ర నిధులు ఇవ్వకపోవడం దారుణం

కాంగ్రెస్ నేత తులసిరెడ్డి మాట్లాడుతూ.. ప్రత్యేక హోదా, విభజన హామీలను కేంద్రం అమలు చేసి ఉంటే ఆంధ్రప్రదేశ్ స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారేదన్నారు. 11 ఏళ్లు గడిచినా.. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయకపోవడం అన్యాయమన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సి. హెచ్. బాబూరావు మాట్లాడుతూ.. ప్రత్యేక హోదా విభజన హామీల సాధన పోరాటంలో తమ మద్దతు ఉంటుందన్నారు. సీపీఐ జిల్లా అధ్యక్షుడు దోనేపూడి శంకర్ మాట్లాడుతూ.. పారిశ్రామికవేత్తలకు భూములను ఉచితంగా ఇచ్చే వ్యాపార సంస్కృతిని విడనాడాలన్నారు. సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి నరసింహారావు మాట్లాడుతూ.. కేంద్రం విధానాలతో రాష్ట్రానికి తీవ్రమైన నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రాయితీలు ఇవ్వాలని, వైద్య కళాశాలలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటు యాజమాన్యాలకు ఇవ్వడం తగదని, విభజన హామీలు అమలుకు జనవరి నుంచి ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని తీర్మానించారు. ఆంధ్రా మేధావుల ఫోరం సభ్యుడు ఎ.వి.రావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో జీ రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -128 రిటైల్ ధర 155 చికెన్ విత్ స్కిన్ - 225, చికెన్ స్కిన్‌లెస్ - 256.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 145, 154, 165 చికెన్ విత్ స్కిన్ - 280 చికెన్ స్కిన్‌లెస్ - 290.

VIJAYAWADA MUNICIPAL CORPORATION (VMC)

Publication of Notice for News Paper

The following Individual sites are submitted for the TDR Committee meeting, which will be headed by the Commissioner of Vijayawada Municipal Corporation. The meeting will cover the areas mentioned below. Any Suggestion or objections regarding the issuance of the TDR bonds for the applications listed below should be submitted to this office (Circle-III, VMC main office) within 7 days. If no objections are received within this period. Further action will be taken for the issuance of TDR bonds as per Approved Master plan **VIDE G.O. MS NO:674 MA Dt. 29-12-2006.**

S. No.	Name of the Property Holder	Road affected area	Name of the Steet	R.S. No/ Village Name	Document No
1	Smt. Bobba Rajitha W/o B. V. Balakrishna	127.4 sq yds	H.T Line Road	148/1 Patamata	2514/2022
2	Chimata Naga Bala Bhavani D/o. Nagababu	15.00 sq.yds (for 120ft)	MG Road	Patamata	1023/2008
3	Katakam Naga Ratnam W/o. Chenchu Narayana	16.33 sq.yds	MG Road	Patamata	880/1996 & 945/1996
4	Anguluri Suresh, S/o. Late Subba Rao	56.39 sq.yds (for 120ft)	MG Road	Patamata	231/2009
5	Chilamkurthi Pavan Kumar S/o Nageswara Rao & Chilamkurthi Sowmya	35.10 sq.yds	MG Road	Patamata	11924/2021 & 9340/2021
6	Chilamkurthi Pavan Kumar S/o Nageswara Rao & Chilamkurthi Sowmya	28.02 sq.yds	MG Road	Patamata	1761/2021
7	Kattragadda RamaRao S/o Kotaiah	109.20 Sq Yds for 30 feet	Jaya Prakash Nagar 3rd Street	Gunadala	273/62
8	Nagabhairava Malathi D/o Tulasi Prasad	91.04 Sq Yds for 30 feet	Jaya Prakash Nagar 3rd Street	Gunadala	1761/2009
9	Vijay Kumar Mahadev Peswani S/o Mahadev Hassaram Peswani	26.05 sq.yds (for 120ft)	MG Road	185/2 Patamata	Doc.No.18 630/2024 link Doc. 993/1970
10	1)Smt. Tellakula Naga Kalyani W/o Deenadayal S/o Suryanarayana	47.21 sq.yds (for 120ft)	MG Road	185/3 Patamata	Doc.No. 1387/2023 link Doc. 312/2023
11	Pooja Vijay Kumar Peswani W/o Vijay Kumar Mahadev Peswani	26.05 sq.yds (for 120ft)	MG Road	185/3 Patamata	Doc.No. 18619/2024 link Doc. 993/1970

For Commissioner, Vijayawada Municipal Corporation

వివాదాల కేంద్రం.. గుణదల స్టేషన్

విజయవాడ, న్యూస్‌టుడే : ఆ పోలీస్‌స్టేషన్‌కు ఆయనే బాస్. ఏ కేసు కట్టాలన్నా, దర్యాప్తు చేయాలన్నా ఆయన కనుసన్నల్లోనే జరుగుతుంది. అలాంటి స్టేషన్‌లో ఆయనపైనే కేసు నమోదడం విశేషం. వినడానికి వింతగా ఉన్నా.. గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఇది చోటుచేసుకుంది. ఇక్కడి పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్ (సీఐ) వాసిరెడ్డి శ్రీనివాస్‌పై కోర్టు ఉత్తర్వుల మేరకు బుధవారం కేసు నమోదైంది. ఓ స్థలం తనఖా విషయంలో ఒక యువతి ఫిర్యాదు చేయగా 1వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు.. సీఐపై కేసు నమోదు చేయాలని ఉత్తర్వులు ఇచ్చింది. తనపై నమోదైన కేసును తానే పర్యవేక్షించుకునే పరిస్థితిని సదరు సీఐ ఎదుర్కొన్నారు. పలు సివిల్ వివాదాల్లో ఆయన వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్నట్లు ఆది నుంచి ఆరోపణలున్నాయి. ఈ స్టేషన్ పరిధిలో విలువైన ఖాళీ స్థలాలు ఉన్నాయి. సదరు స్థలాల కొనుగోలు, విక్రయాల నేపథ్యంలో బిల్డర్ల మధ్య గొడవలున్నాయి. ఇవి పూర్తిగా సివిల్ వివాదాలు కాగా.. వాటిలో సీఐ ప్రత్యక్షంగా జోక్యం చేసుకుని కొంత మందికి వత్తాసు పలకడం వివాదాస్పదంగా మారింది. దీనిపై బాధితులు సీఐపై కోర్టులో ప్రైవేట్ కేసులు దాఖలు చేశారు. ఇప్పటి వరకు మూడు పిటిషన్లు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. తాజాగా గుణదల 1వ డివిజన్‌లో నమోదైన స్థలం వివాదంలో కేసు నమోదైంది.

తవ్వేకొద్దీ ఎల్‌బీఎఫ్ దారుణాలు

గంపలగూడెం, విస్సన్నపేట, న్యూస్‌టుడే : విస్సన్నపేట లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్ సంస్థ నిర్వాహకుల మోసాల చిట్టా రోజు రోజుకూ పెరుగుతూనే ఉంది. సంస్థ సీఈవో ఎన్.శివాని ఆచూకీ ఇంతవరకు లభించక పోవడంతో డిపాజిటర్లలో ఆందోళన రెట్టింపు అవుతోంది. వారం రోజులుగా ఆమె ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. కుటుంబ సభ్యులను, సమీప బంధువులను విచారిస్తున్నారు. డిపాజిటర్లు దాడి చేస్తారనే భయంతో శివాని హైదరాబాద్‌లో తలదాచుకున్నట్లు వినికిడి. మరో వైపు ఎల్‌బీఎఫ్ సంస్థ వ్యాపార లావాదేవీలు నిర్వహించిన కంప్యూటర్లు, సాఫ్ట్‌వేర్ డేటాను పోలీసులు స్వాధీనం చేసుకుని అందులో డిపాజిటర్ల వివరాల సమాచారం రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం కూడా పలువురు బాధితులు విస్సన్నపేట పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఎల్‌బీఎఫ్ మోసాలపై వివరించినట్లు సమాచారం. ఫిర్యాదుదారుల వద్ద ధరావత్తు పత్రాల ఆధారంగా విచారణ జరుగుతోంది. ఎల్‌బీఎఫ్ సంస్థ ఆర్థిక లావాదేవీలు జిల్లాలు దాటాయి. అంత దూరం నుంచి పెట్టుబడిదారులను ఆకర్షించడంలో ఎవరెవరు బాధ్యులుగా ఉన్నారో? పోలీసులు ఆరా తీస్తున్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

ప్రతిభ చాటాలి.. పతకాలు పొందాలి



గెలుపొందిన వారితో ఉపాధ్యాయులు



క్విజ్ పోటీలో పాల్గొన్న విద్యార్థినులు

మైలవరం, న్యూస్‌టుడే: విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొని ప్రతిభ చాటి పతకాలు సాధించాలని స్థానిక ఎంపీపీ బాలికోన్నత పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు ఎం.తులసి పేర్కొన్నారు. 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా శుక్రవారం ఆ పాఠశాలలోని విద్యార్థినులకు క్విజ్ పోటీలు జరిగాయి. ఇందులో అక్షా అలేఖ్య(8వ తరగతి), ఎం.భూమికశ్రీ(9వ తరగతి), ఎస్.లక్ష్మీభవాని(7వ తరగతి) విద్యార్థులు మొదటి మూడు స్థానాలు సాధించారు. ఈ మేరకు వీరికి పాఠశాల ఉపాధ్యాయులు పి.బాలసరోజిని దేవి, ఎస్.సుమ, కె.శ్రీలక్ష్మి, ఆర్.విజేత బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు.

హజ్ యాత్రకు సాయం ప్రకటించడం హర్షణీయం



తిరువూరు జామియా మసీదు వద్ద సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే: హజ్ యాత్రకు వెళ్లేందుకు రూ.లక్ష సాయం ప్రకటించిన సీఎం చంద్రబాబు ముస్లిం పక్షపాతిగా నిరూపించుకున్నారని రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్, తిరువూరు పురపాలిక ఫ్లోర్‌లీడర్ ఎస్కే అబ్దుల్ హసన్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం తిరువూరు జామియా మసీదు వద్ద ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ముస్లిం మైనార్టీ తెదేపా నాయకులు ఎస్కే.రసూల్, అబ్దుల్‌సత్తార్, ఎస్కే.హుస్సేన్, ఉమర్, మస్తాన్ పాల్గొన్నారు.

అభివృద్ధికి దూరం.. పరిస్థితి దయనీయం

మైలవరం, న్యూస్‌టుడే

సుమారు 79 ఎకరాల భూమి.. మూడు వేలకు పైగా నివేశన స్థలాలు. రెండు వేలకు పైగా స్థల లబ్ధిదారులు. సుమారు 800ల వరకు పూర్తి అయిన గృహ నిర్మాణాలు. 300లకు పైగా నివసిస్తున్న కుటుంబాలు. ఇన్ని గణాంకాలుంటే అది తప్పనిసరిగా ప్రత్యేక గ్రామ పంచాయతీ అని భావిస్తారు. నిధులు, అభివృద్ధి పనులకు కొదవ ఉండదనుకుంటారు. కానీ ఇక్కడ అదేమీ కనిపించదు. దీంతో ఆ కాలనీ పరిస్థితి దయనీయంగా మారింది. రికార్డుల పరంగా ఒక గ్రామ పంచాయతీ, నివాసితులు మరో గ్రామం నుంచి వచ్చి పెట్టిన వేరు. ఈ నేపథ్యంలో వారి బాగోగులు ఎవరు చూడాలో అర్థం గాక నాలుగేళ్లుగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారు.



మైలవరం మండలం పూరగుట్ట కాలనీలో నిర్మించిన గృహాలు

ఎన్నికల ముందు చేపట్టి..

దాదాపు అర్ధ దశాబ్దానికి పైగా పూరగుట్ట ప్రాంతంలోని ఆ భూమిని తెదేపా హయాంలో అప్పటి మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, జలవనరుల శాఖ నుంచి రెవెన్యూకు బదలాయించి, 2 సెంట్ల చొప్పున ప్లాట్ల కేటాయింపును 2024 ఎన్నికలకు ముందు చేపట్టారు. లబ్ధిదారులు నిర్మాణాలు ప్రారంభించే లోగా ప్రభుత్వం మారి వైకాపా అధికారంలోకి వచ్చింది. తర్వాత సెంటున్నర చొప్పున మైలవరం, వెల్వడం, గుంటలకు చెందిన రెండున్నర వేల మందికి పట్టాలు ఇచ్చారు. వీటిలో కొందరు అమ్ముకున్నారు. ఆసరా ఉన్న వారు గృహ నిర్మాణాలు చేపట్టి అక్కడే నివసిస్తున్నారు.

పాలనలో అయోమయం

వాస్తవానికి ఆ ప్రాంతం పొందుగల రెవెన్యూ కింద ఉంది. పాలన వ్యవహారాలను చూడాల్సి ఉన్నా, తమపరిధిలో చెన్న పంచాయతీ, నిధులిక్కడివంటూ అధికారులు చేతులెత్తేశారు. పోనీ మైలవరం జనాభా అని నిర్వహణ చూడాలంటే, రికార్డుల పరంగా తమది కాదంటున్నారు. దాంతో కాలనీ ఏర్పాటు సమయంలో అంతర్గత రోడ్లు, విద్యుత్తు సౌకర్యం తప్ప, కనీసం గృహాలకు ఇంటి సంఖ్యను కూడా కేటాయించలేదు. ఇక నీటి సరఫరాకు ఉపయోగించే మోటార్లు చెడిపోతే నెలల తరబడి ఇబ్బందులే. వర్షాకాలంలో అయితే అంతర్గత రహదారులపై బురదలో నడవాల్సిందే. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ ప్రత్యేక నిధులతో ప్రధాన రహదారిని కొంత సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయించారు. మైలవరాన్ని నగర పంచాయతీ చేస్తే, ఆ కాలనీని కలిపే అవకాశం ఉండేది. కానీ మున్సిపాలిటీ ప్రకటన ఇంకా కార్యరూపం దాల్చకపోవడంతో ప్రజలు నిరాశ చెందుతున్నారు..

వైష్ణవాలయాల్లో విశేష పూజలు



గంపలగూడెంలో గోదారంగనాయకులు

గంపలగూడెం, న్యూస్‌టుడే: ధనుర్మాసం సందర్భంగా శుక్రవారం తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లోని వైష్ణవాలయాల్లో అర్చకులు గోదారంగనాయకులకు విశేష పూజలు నిర్వహించారు. భక్తులతో కలిసి ఉదయాన్నే ఆండాళమ్మ తిరుప్పావై పాశురాలు పఠించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

★ తిరువూరు 4వ వార్డులోని డ్రెయిన్లలో మట్టి, బురద పేరుకుపోయి స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ శానిటరీ అధికారి సంతోష్ స్పందించి పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి శుభ్రం చేయించారు. ★ తిరువూరు 6వ వార్డులోని డ్రెయిన్లలో మురుగు పారుదల లేదని స్థానికుడు ప్రసన్నకుమార్ సమస్యను తెలిపారు. దీనిపై శానిటరీ అధికారి సంతోష్ స్పందించి పారిశుద్ధ్య సిబ్బందితో డ్రెయిన్లను శుభ్రం చేయించి, బ్లీచింగ్ చల్లించారు. సమస్య పరిష్కరించారు. **- న్యూస్‌టుడే, తిరువూరు టౌన్**

? జి.కొండూరు మండలం హెచ్.ముత్యాలంపాడు గ్రామం రామాలయం సమీపంలోని పంచాయతీ బోరు మరమ్మతులకు గురై నీటి కోసం అవస్థలు పడుతున్నాం. **- వెంకటేశ్వరరావు, గ్రామస్థుడు** ✔ సమస్య మా దృష్టికి వచ్చింది. సిబ్బందితో దానికి మరమ్మతులు చేయిస్తాం. **- కాజా సంధ్యారాణి, గ్రామ సర్పంచి - న్యూస్‌టుడే, జి.కొండూరు**

నూతన కార్యవర్గ ఎన్నిక

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు మండల విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని సంఘం భవనంలో నిర్వహించిన సమావేశంలో మండల అధ్యక్షుడిగా సీహెచ్.రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా వీవీజీ.బ్రహ్మచారి, కోశాధికారిగా టి.రామకృష్ణాచారి, మరికొందరిని సభ్యులుగా ఎన్నుకున్నారు. సంఘ వ్యవస్థాపకుడు టీవీ.రామాచార్యులు, గౌరవ అధ్యక్షుడు టి.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. నూతన సంవత్సర కాలమానిని ఆవిష్కరించారు.

అష్టోత్తర శత దీపాలంకరణ సేవ

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని నెమలి వేణుగోపాల స్వామి గుడిలో శుక్రవారం రాత్రి అష్టోత్తర శత దీపాలంకరణ సేవ నిర్వహించారు. అర్చకుడు గోపాలాచార్యులు ఆధ్వర్యంలో భక్తులు పాల్గొని దీపాలు వెలిగించారు. ఉత్సవమూర్తులకు అద్దాల మండపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

కూలీలకు బిల్లులు చెల్లించాలని వినతి

విస్సన్నపేట, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం కింద కొండపర్వలో ఫిబ్రవరిలో ఇంకుడు గుంతలు తవ్విన కూలీలకు ఇంతవరకు బిల్లులు చెల్లించలేదని పలువురు నాయకులు ఏపీవో రామారావుకు శుక్రవారం వినతి పత్రం అందించారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: స్థానిక వాహిని ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఆల్ ఇండియా కన్జ్యూమర్ ప్రొటెక్షన్ ఆర్గనైజర్ ఏపీ ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) విజయవాడ శాఖకు చెందిన అధికారులు మాట్లాడారు.

ప్రాణాలు కాపాడిన సీటు బెల్టు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: కారులో సీటు బెల్టు పెట్టుకోవడం వల్ల ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాకు చెందిన పొందూరు ప్రసాద్, భార్య, కుమారుడితో కలిసి శుక్రవారం సాయంత్రం కారులో విజయవాడకు బయలుదేరారు. విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై పెనుగంచిప్రోలు మండలం నవాబుపేట వద్ద కారు అదుపుతప్పి పల్టీ కొట్టింది. దీంతో కారు నుజ్జునుజ్జు కాగా ఎయిర్ బ్యాగ్‌లు తెరుచుకున్నాయి. ఈ ప్రమాదంలో ప్రసాద్, భార్య స్వల్పగాయాలతో సురక్షితంగా ప్రమాదం నుంచి బయట పడ్డారు.

పురపాలిక అభివృద్ధికి సహకారం అవసరం



కౌన్సిలర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

కొండపల్లి, న్యూస్‌టుడే: కౌన్సిలర్లు సమన్వయంతో పని చేస్తూ కొండపల్లి పురపాలిక అభివృద్ధికి కృషి చేయాలని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. శుక్రవారం గొల్లపూడి కార్యాలయంలో కొండపల్లి కౌన్సిలర్ల సమావేశాన్ని ఆయన నిర్వహించి వారితో మాట్లాడారు. త్వరలో ఇంటింటికి కుళాయి పనులు ప్రారంభం కానున్నాయని చెప్పారు. అందులో భాగంగా కౌన్సిలర్లు అందరూ ఆయా డివిజన్లలో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కార దిశగా ప్రయత్నం చేయాలని సూచించారు. నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ చిట్టిబాబు, వైస్ ఛైర్మన్ శ్రీను, పురపాలిక అధికారులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

మైలవరం, న్యూస్‌టుడే: తెలుగు యువత నాయకుడు లంకా లితీష్ ఆధ్వర్యంలో తయారు చేయించిన నూతన సంవత్సర క్యాలెండర్లను గొల్లపూడిలోని తెదేపా కార్యాలయంలో స్థానిక శాసన సభ్యుడు వసంత కృష్ణప్రసాద్ శుక్రవారం ఆవిష్కరించారు. నాయకులు శోభన్‌బాబు, లీలా ప్రసాద్, లితీష్, ప్రసాద్, కరీం, రేణుక, రామారావు, షహనబేగం తదితరులు పాల్గొన్నారు.

ఉరుసు మహోత్సవాలు విజయవంతం చేద్దాం



దర్గా అభివృద్ధి కమిటీ, ముజావర్లు, పురపాలిక అధికారులతో చర్చిస్తున్న ఆర్డీవో చైతన్య

కొండపల్లి, న్యూస్‌టుడే: సమిష్టి కృషితో ఉరుసు మహోత్సవాలను విజయవంతం చేద్దామని ఆర్డీవో చైతన్య సూచించారు. కొండపల్లిలోని షాబుఖారీ దర్గాను ఆయన శుక్రవారం సందర్శించి ఉరుసు మహోత్సవాలకు కావాల్సిన వసతులను గుర్తించారు. పారిశుద్ధ్య నిర్వహణ, తాగు నీటి వసతికి ఎటువంటి ఇబ్బంది లేకుండా అందించాలని ఇన్‌ఛార్జి కమిషనర్ వెంకటరత్నంకు తెలిపారు. భద్రతా ఏర్పాట్లను చూడాలని సీఐ చంద్రశేఖర్‌కు చెప్పారు. పురపాలిక ఛైర్మన్ చిట్టిబాబు, వైస్ ఛైర్మన్ శ్రీను, కౌన్సిలర్లు, కూటమి నాయకులు, దర్గా ముజావర్లు, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన కొండపర్వ గ్రామస్థులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కొండపర్వ గ్రామస్థులు మానవత్వం చాటారు. గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గురుదేవ్ మహాపాత్రో(23) తల్లిదండ్రులకు వెన్నంటి ఉన్నారు. వారికి ధైర్యం చెప్పడంతో పాటు నూజివీడులో పోస్టుమార్టం అనంతరం గురుదేవ్ మృతదేహాన్ని ఒడిశాకు తరలించేందుకు అంబులెన్స్ ఖర్చుల నిమిత్తం గ్రామస్థులంతా కలిసి రూ.45,000లను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. తెలుగు ప్రజల ఔదార్యానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని వారు కృతజ్ఞతలు తెలిపారు.

ధాన్యం తరలింపునకు లారీల కేటాయింపు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మండలంలో కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించేందుకు జిల్లా ఉన్నతాధికారులు శుక్రవారం రాత్రి వరకు 19 లారీలను పంపారు. మండలంలోని గ్రామాల్లో కాటాలు వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించకుండా ఉన్నాయని 'న్యూస్‌టుడే' స్థానిక అధికారులతో పాటు పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ సతీష్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వారు స్పందించి ధ్యానం మిల్లులకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు.



కూనపరాజుపర్వలో ధాన్యం బస్తాలను లారీకి లోడు చేస్తున్న హమాలీలు

ఖాళీ స్థలాలు.. దోమలకు ఆవాసాలు

గుంటుపల్లి, ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

గ్రామాల్లో గృహాల మధ్యనున్న ఖాళీ స్థలాలు రోగాలకు నిలయాలుగా మారుతున్నాయి. నీరు నిలిచిపోవడంతో దోమల ఉత్పత్తి కేంద్రాలవుతున్నాయి. ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలంలోని గ్రామాల్లో, కొండపల్లి పురపాలికలో ఈ సమస్య ప్రజలను వేధిస్తోంది. ఎక్కడ పడితే అక్కడ మురుగు తిష్ఠ వేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నచిన్న పనులు చేసి వెళ్తున్నారే తప్ప శాశ్వత చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు. ఇలాంటి ఖాళీ స్థలాలను యజమానులు విక్రయించాలనుకున్నప్పుడు, ఏదైనా అవసరం వచ్చినప్పుడు మాత్రమే శుభ్రం చేయిస్తున్నారు. మిగిలిన సమయంలో వాటి వైపు చూడడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు.



కేతనకొండ: కాలువలో నిలిచిన మురుగు

వ్యర్థాలన్నీ అక్కడే..

పారిశుద్ధ్య సిబ్బంది రోడ్లపై చెత్త కుండీలను శుభ్రం చేయడం, కాలువల్లో వ్యర్థాలను తొలగించడం వంటి పనులు మాత్రమే చేస్తున్నారు. ఇళ్ల మధ్యలోని ఖాళీ స్థలాల్లోని మురుగును బయటకు పంపడం, అక్కడి చెత్తను శుభ్రం చేయడం వంటి పనులు వదిలేస్తున్నారు. స్థల యజమానులు వీటిని పట్టించుకోరు. ఈ నేపథ్యంలో భారీగా మురుగు వరాహాలు, శునకాలకు ఆవాసాలుగా మారుతున్నాయి. పెద్దఎత్తున పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయి. విష కీటకాలు చేరుతున్నాయి. అవి ఇళ్లలోకి రావడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

నోటీసులు ఇస్తాం

ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. తగు చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. **- మనోజ్, డిప్యూటీ ఎంపీడీవో, ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం**

ప్రజా సమస్యలకు సత్వరమే పరిష్కారం



దివ్యాంగుడి వినతి ఆలకిస్తున్న తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు

గంపలగూడెం, న్యూస్‌టుడే: గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు సీఎం చంద్రబాబు ప్రారంభించిన ప్రజాదర్బార్ సత్ఫలితాలను అందిస్తోందని తిరువూరు శాసన సభ్యుడు కొలికపూడి శ్రీనివాసరావు ప్రశంసించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వివిధ శాఖలకు సంబంధించి 146 అర్జీలు అందాయి. వీటిని ఆయా శాఖల అధికారులకు అందజేసి విచారించి పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. తహసీల్దారు వి.రాజకుమారి, ఎంపీడీవో టి.సరస్వతి, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగులను బెదిరిస్తున్నారని ఫిర్యాదు

గంపలగూడెం, న్యూస్‌టుడే: స్థానిక వెలుగు కార్యాలయంలో పని చేసే ప్రభుత్వ ఉద్యోగిపై దాడికి పాల్పడిన తెదేపా మండల అధ్యక్షుడు మానికొండ రామకృష్ణ 48 గంటలలోపు సదరు ఉద్యోగికి క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు చేస్తే ఎవరిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగిన ప్రజాదర్బార్‌లో దుందిరాలపాడు గ్రామస్థులు తెదేపా నాయకుడు ఉద్యోగులను బెదిరిస్తున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దుందిరాలపాడు గ్రామ ప్రజలకు వ్యతిరేకంగా పంచాయతీ విభజన చేయాలని ఉద్యోగులను భయపెట్టి పత్రాలపై సంతకాలు చేయిస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై మానికొండ రామకృష్ణ 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులపై తాను ఎప్పుడూ దాడికి పాల్పడలేదని, వేధింపులకు గురి చేయలేదని తెలిపారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేట పరిధిలోని బీజేఆర్ నగర్‌లో ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు శుక్రవారం రాత్రి పర్యటించారు. మౌలిక సదుపాయాలు, సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగ అవకాశాలతో పాటు ఆర్థిక చేయూత అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తొలుత కాలనీ వాసులు తీన్‌మార్ డప్పులతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు.

టెట్‌పై ఉపాధ్యాయులకు స్పష్టత ఇవ్వండి



మాట్లాడుతున్న శ్రీను

మైలవరం, న్యూస్‌టుడే: 2010 కంటే ముందు ఉపాధ్యాయులుగా నియమితులైన వారికి టెట్ పరీక్ష గుదిబండగా మారిందని, దానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డెమొక్రాటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను కోరారు. సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని పలు పాఠశాలల్లో ఆయన పర్యటించి సభ్యత్వాలు అందజేశారు. 12వ పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శి కె.కోటేశ్వరరావు, ఆర్వీఎస్ రామకృష్ణారావు, నాయకులు యాకుబ్‌మియా, మస్తాన్ రావు, వెంకట్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం



రైతులకు నట్టల మందు అందిస్తున్న ప్రవీణ్, అధికారులు

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: తిరువూరు పట్టణంలోని రాజుపేట, కోకిలంపాడు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరంలో తిరువూరు కోపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ ప్రవీణ్ పాల్గొని మాట్లాడారు. రైతులకు నట్టల మందు పంపిణీ చేశారు. వైద్యులు అభిలాష్, టి.శ్వేతా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం పేరు మార్పు తగదు



విస్సన్నపేటలో ప్రతులు దహనం చేస్తూ...

ఎ.కొండూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: మహాత్మా గాంధీజీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్పునకు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ ఎ.కొండూరు మండలం చైతన్యనగర్ అడ్డరోడ్డు వద్ద శుక్రవారం వ్య.కా.సం, సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. గతంలో ఉన్న ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పేరును అలాగే కొనసాగించాలని నినాదాలు చేశారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే: వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో విస్సన్నపేటలో జరిగిన నిరసనలో కేంద్రం తెచ్చిన కొత్త బిల్లు ముసాయిదా ప్రతులను దగ్ధం చేశారు. అంతక ముందు స్థానిక సుందరయ్య భవన్‌లో సంఘం మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జిల్లా స్థాయి సమావేశం

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: తిరువూరులోని లక్ష్మీపురం మనుగార్డెన్స్‌లో ఈ నెల 21న యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ 4వ జిల్లా స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు. ఇందులో పలు అంశాలపై చర్చిస్తామని చెప్పారు. దీనికి ఉపాధ్యాయులు హాజరు కావాలని కోరారు.

స్పందించి విభజన చర్యలు చేపట్టాలి



గ్రామస్థులకు మద్దతు తెలిపిన సీపీఐ నాయకులు

ఎ.కొండూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: ఎ.కొండూరు మండలం పాత రేపూడిలో గ్రామ పంచాయతీ విభజన కోసం నిరసన దీక్ష చేస్తున్న గ్రామస్థులకు సీపీఐ జిల్లా నాయకులు టి.కృష్ణయ్య, ఎం.డేవిడ్, సీహెచ్.వెంకటేశ్వరరావు, ఎం.వెంకటేశ్వరరావు శుక్రవారం మద్దతు తెలిపారు. అధికారులు స్పందించి సత్వరమే విభజన చర్యలు చేపట్టాలని కోరారు. కె.కోటేశ్వరరావు, ఎం.ఏలియాబాబు, బి.కృష్ణకుమారి, బి.శ్రీనివాసరావు, ఎం.విజయ్‌రావు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం అభినందనీయం



సూర్యనారాయణ (పాత చిత్రం)

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు పట్టణానికి చెందిన వ్యాపారి కొత్తగుండ్ల సూర్యనారాయణ(75) శుక్రవారం మృతి చెందగా అతని నేత్రాలను కుటుంబ సభ్యులు విజయవాడ ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు కొమ్మినేని రాజేశ్‌ఖన్నా, జి.రంగారావు వారికి నేత్రదానంపై అవగాహన కల్పించడంతో కుటుంబ సభ్యులు అంగీకరించారు. ఆసుపత్రి నిపుణులు ఇక్కడికొచ్చి అతని కళ్లలోని కార్నియాలను సేకరించి తీసుకెళ్లారు.

దస్తావేజులు పోయినవి

Sk. ఆయిషా సుల్తానా W/o. Sk. నదీమ్ పర్వేజ్ I Town, విజయవాడ, NTR జిల్లా వారి ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్‌లోని గొల్లపూడి గ్రామంలోని ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు నెంబరు 5068 / 2008 మరియు 1299 / 1995 గల ఒరిజినల్ దస్తావేజులు భవానీపురం ఏరియాలో పోయినవి. కావున దొరికినవారు తిరిగి ఇవ్వగలరు. ఇచ్చిన వారికి తగిన బహుమతి ఇవ్వగలము.

✆ 99669 99908

శిరస్త్రాణం ధరిద్దాం.. ప్రమాద రహిత సమాజాన్ని స్థాపిద్దాం



పినపాక : విద్యార్థులతో చేపట్టిన మానవహారం

జి.కొండూరు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించి తమ ప్రాణాలను కాపాడుకోవాలని జి.కొండూరు ఎస్సై కె.సతీష్ కుమార్ సూచించారు. జి.కొండూరు పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని గ్రామాల్లో చేపట్టిన అవగాహన ప్రదర్శనలో ఆయన మాట్లాడారు. పినపాకలో పాఠశాల విద్యార్థులతో కలిసి ప్రదర్శన, మానవహారం చేపట్టారు. అదనపు ఎస్సై గిరిజామణి, తెదేపా మండల అధ్యక్షుడు వేములకొండ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



తిరువూరులో అవగాహన కల్పిస్తున్న సీఐ గిరిబాబు, ఎస్సై శాతకర్ణి

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: ప్రమాద రహిత సమాజాన్ని స్థాపించేందుకు ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం ధరించాలని తిరువూరు సీఐ కె.గిరిబాబు, ఎస్సై వై.శాతకర్ణి సూచించారు. శుక్రవారం తిరువూరులోని బైపాస్ రోడ్డులో అయ్యప్ప స్వామి గుడి వద్ద వాహనాలు తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని వారికి జరిమానా విధించారు.

చదువుతోనే ఉన్నత స్థానం

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: విద్యార్థులు ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని ఎంఎన్‌ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం మద్దులపర్వ ఆదర్శ పాఠశాల్లో యూటీఎఫ్ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను పదో తరగతి విద్యార్థులకు ఆయన అందజేశారు. డి.ప్రకాష్, బి.కోటేశ్వరరావు, సోమేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినికి స్టడీ మెటీరియల్ అందిస్తున్న నాగేశ్వరరెడ్డి తదితరులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: యూటీఎఫ్ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను దాత వైభవ్ జ్యువెలర్స్ అధినేత కేవీ నాగేశ్వరరావు సహకారంతో నరసాపురం గురుకుల పాఠశాల విద్యార్థులకు శుక్రవారం అందించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బీసీ హెచ్‌వీ సూర్యనారాయణ, హెచ్‌ఎం ఎం.బి శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు ప్రతిభ

ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

కరెంట్ అఫైర్స్



◆ 'ది బర్నింగ్ ఎర్త్: యాన్ ఎన్విరాన్‌మెంటల్ హిస్టరీ ఆఫ్ ది లాస్ట్ 500 ఇయర్స్' పుస్తకానికి ప్రతిష్ఠాత్మక 2025 బ్రిటిష్ అకాడమీ, బుక్ ప్రైజ్‌ను గెలుచుకున్న భారత సంతతి చరిత్రకారుడు ఎవరు?
జ: సునీల్ అమృత్

మాదిరి ప్రశ్నలు

◆ ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్)లో ఇటీవల ఏ దేశం 90వ సభ్య దేశంగా చేరింది?
జ: తువాలు

◆ ఏటా ఏ రోజున ప్రపంచ పోలియో దినోత్సవాన్ని నిర్వహిస్తారు? (2025లో ఈ దినోత్సవాన్ని 'ఎండ్ పోలియో: ఎవ్రీ ఛైల్డ్, ఎవ్రీ వ్యాక్సిన్, ఎవ్రీవేర్' అనే థీమ్‌తో నిర్వహించారు. పోలియో వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసిన డాక్టర్ జోనస్ శాల్క్ జయంతిని ప్రపంచ పోలియో దినోత్సవంగా నిర్వహిస్తారు.)
జ: అక్టోబరు 24

◆ క్రీడల్లో డోపింగ్‌కు వ్యతిరేకంగా అంతర్జాతీయంగా ఏర్పడిన సీఏపీ10 బ్యూరో వైస్ ఛైర్‌పర్సన్‌గా ఇటీవల ఏ దేశం తిరిగి ఎన్నికైంది? (ప్యారిస్‌లోని యునెస్కో ప్రధాన కార్యాలయంలో జరిగిన కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ 10వ సెషన్‌లో ఈ ఎన్నిక జరిగింది. సీఏపీ10 బ్యూరో ఛైర్‌పర్సన్‌గా అజర్‌బైజాన్ ఎన్నికైంది.)
జ: భారత్

మరింత సమాచారం



దరఖాస్తు చేశారా?

☛ చెన్నై ఎస్ఈఆర్‌సీలో సైంటిస్ట్ పోస్టులు (30)
చివరి తేదీ: 22.12.2025

☛ సీబీఎస్ఈలో జూనియర్ అసిస్టెంట్ ఖాళీలు (124)
చివరి తేదీ: 22.12.2025

జూనియర్ ఇంటర్ వృక్ష శాస్త్రం — జీవశాస్త్ర వర్గీకరణ



ఫైనల్ పరీక్షలు 2026 — ముఖ్యమైన ప్రశ్నలు - జవాబులు

ఒక మార్కు

1. నత్రజని స్థాపన చేసే నీలి ఆకుపచ్చ శైవలం
   1) రైజోబియం 2) నాస్టాక్ 3) క్లోరెల్లా 4) మిథనోజెన్‌లు
   జ: 2) నాస్టాక్
2. రెండు రాజ్యాల వర్గీకరణను ప్రతిపాదించినవారు?
   1) విట్టేకర్ 2) లిన్నేయస్ 3) అరిస్టాటిల్ 4) థియోఫ్రాస్టస్
   జ: 2) లిన్నేయస్
3. కణకవచం లేని మొనిరాకు చెందిన అత్యంత చిన్న జీవించి ఉన్న కణం?
   1) నీలి ఆకుపచ్చ శైవలాలు 2) ప్రోటోజోవాలు 3) మైకోప్లాస్మాలు 4) బ్యాక్టీరియా
   జ: 3) మైకోప్లాస్మాలు
4. కణకవచాలు దేనితో నిర్మితమై ఉండటం వల్ల డయాటమేషియస్ మృత్తిక విచ్ఛిన్నమవదు?
   1) క్యాల్షియం 2) సిలికా 3) జింక్ 4) ఫాస్ఫరస్
   జ: 2) సిలికా
5. ప్లాస్మోడియాన్ని ఏర్పరిచే ప్రొటిస్టా?
   1) యూగ్లినాయిడ్‌లు 2) జిగురు బూజులు 3) డైనోఫ్లాజెల్లేట్‌లు 4) డయాటమ్‌లు
   జ: 2) జిగురు బూజులు
6. శిలీంధ్రాల లైంగిక చక్రంలో సరైన క్రమం?
   1) సమ విభజన - క్షయకరణ విభజన - ఫలదీకరణం
   2) ప్లాస్మోగమీ - కారియోగమీ - క్షయకరణ విభజన
   3) క్షయకరణ విభజన - ప్లాస్మోగమీ - కారియోగమీ
   4) కారియోగమీ - ప్లాస్మోగమీ - క్షయకరణ విభజన
   జ: 2) ప్లాస్మోగమీ - కారియోగమీ - క్షయకరణ విభజన
7. ఐదు రాజ్యాల వర్గీకరణ ప్రకారం బ్యాక్టీరియమ్‌లు...... రాజ్యంలో చేర్చారు.
   జ: మొనిరా
8. బ్యాక్టీరియం ప్రధానంగా...... ద్వారా ప్రత్యుత్పత్తి జరుపుతుంది.
   జ: ద్విధా విచ్ఛిత్తి
9. అగారికస్ ఏ తరగతికి చెందిన శిలీంధ్రం?
   జ: బెసీడియోమైసిటీస్
10. మ్యాడ్ కౌ వ్యాధి దేనివల్ల కలుగుతుంది?
   జ: ప్రియాన్

2 మార్కులు

1. డయాటమ్‌ల్లో కణకవచ స్వభావం ఏమిటి?
   జ: డయాటమ్‌ల్లో కణకవచం రెండు అతివ్యాప్తమైన పలుచని పెంకుల్లాంటి నిర్మాణాలతో ఉంటుంది. అవి ఎపిథీకా, హైపోథీకా. కణకవచం గోడలు సిలికాతో నిర్మితమై ఉండటం వల్ల నాశనం చెందవు.

మరికొన్ని ప్రశ్నలు-జవాబులు



రచయిత: టి. నాగరాజు

క్రమాన్ని కనుక్కుంటే స్థానం దొరికినట్లే!

జనరల్ స్టడీస్ — రీజనింగ్

ఫోన్ కాంటాక్ట్‌ల్లో అవసరమైన పేరు కోసం వేగంగా చూసేటప్పుడు, లైబ్రరీలో కావాల్సిన పుస్తకాన్ని వెతికేటప్పుడు ఆంగ్ల అక్షరమాల పరిజ్ఞానం ఉపయోగపడుతుంది. అభ్యర్థుల పరిశీలనాశక్తిని, వేగంగా విశ్లేషించగలిగే సామర్థ్యాన్ని అంచనా వేయడానికి రీజనింగ్‌లో భాగంగా ఆల్ఫాబెట్‌లపై ప్రశ్నలు అడుగుతున్నారు. ఇందులో ఆంగ్ల అక్షరమాలపై అవగాహనను, అక్షరాల స్థానాలు, వాటి క్రమాన్ని, వాటి మధ్య ఉన్న నమూనాలను పసిగట్టగలిగే నైపుణ్యాన్ని పరీక్షిస్తారు. అక్షరాల స్థాన విలువలు, జతలు, శ్రేణులు, పదాల నిర్మాణం, డిక్షనరీ క్రమం తదితరాలను నేర్చుకుంటే సమాధానాలను సులభంగా కనుక్కోవచ్చు. ఇచ్చిన పదం నుంచి కొత్త పదాలను తయారు చేయడం లేదా తయారు చేయలేని పదాలను గుర్తించడాన్నీ వీలైనంత ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి.



ఆల్ఫాబెట్ టెస్ట్

(ఆంగ్ల అక్షరమాలపై సమస్యలు)

రీజనింగ్‌లో ఆంగ్ల అక్షరమాలను ఆధారం చేసుకుని సాధారణంగా 'లెటర్ సిరీస్', 'కోడింగ్ - డీకోడింగ్' 'లెటర్ అనాలజీ' 'అక్షరభిన్న పరీక్ష' లాంటి అంశాల నుంచి మాత్రమే కాకుండా 'ఆల్ఫాబెట్ టెస్ట్' అనే విభాగం నుంచి విరివిగా కూడా ప్రశ్నలు వస్తుంటాయి. ఇందుకోసం ఆంగ్ల అక్షరమాలలో ఉన్న 26 అక్షరాల అనురూప సంఖ్యలపై పట్టు పెంచుకోవాలి.


A = 1, B = 2, C = 3, ... W = 23, X = 24, Y = 25, Z = 26 అనేది ఎడమ నుంచి కుడివైపు అక్షరమాల క్రమం.

మాదిరి ప్రశ్నలు

1. అక్షరమాలలో ఎడమ నుంచి 16వ అక్షరం?
1) R 2) Q 3) P 4) S
వివరణ: అక్షరమాలలో ఎడమ నుంచి 16వ అక్షరం P
జ: 3

2. అక్షరమాలలో Q అనేది ఎడమ నుంచి ఎన్నో అక్షరం?
1) 15 2) 14 3) 16 4) 17
వివరణ: అక్షరమాలలో Q అనేది ఎడమ నుంచి 17వ అక్షరం
జ: 4

3. అక్షరమాలలో ఎడమవైపు నుంచి పరిగణించగా $I + K - Q \times B \div B$ విలువ ఎంత?
1) 3 2) 5 3) – 3 4) – 4
వివరణ: ఎడమవైపు నుంచి అక్షరాల క్రమం ఆధారంగా



I = 9, K = 11, Q = 17, B = 2

$I + K - Q \times B \div B$

$9 + 11 - 17 \times 2 \div 2$

BODMAS నియమం నుంచి

$9 + 11 - 17 = 20 - 17 = 3$
జ: 1

4. అక్షరమాలలో ఒకే అక్షరం స్థానాల మొత్తం ఎడమ నుంచి, కుడి నుంచి ఎంత?
1) 30 2) 26 3) 27 4) 32
వివరణ: ఉదాహరణకు
D స్థానం ఎడమ నుంచి = 4
D స్థానం కుడి నుంచి = 23
మొత్తం = 4 + 23 = 27
జ: 3



5. అక్షరమాలలో కుడి వైపు నుంచి L అనే అక్షర స్థానం ఎంత?
1) 18 2) 16 3) 14 4) 15
వివరణ: అక్షరమాలలో ఎడమ నుంచి L స్థానం = 12
కుడి నుంచి L స్థానం = 27 – 12 = 15
జ: 4

6. అక్షరమాలలో కుడివైపు నుంచి R స్థానం ఎంత?
1) 9 2) 8 3) 10 4) 11
వివరణ: అక్షరమాలలో ఎడమ నుంచి R స్థానం = 18
కుడి నుంచి R స్థానం = 27 – 18 = 9
జ: 1

7. అక్షరమాలలో కుడి నుంచి పరిగణించగా $M + K \div W \times V$ విలువ ఎంత?
1) 38 2) 42 3) 34 4) 46
వివరణ:

ఎడమనుంచిస్థానాలు	కుడినుంచి స్థానాలు
M = 13	M = 27 – 13 = 14
K = 11	K = 27 – 11 = 16
W = 23	W = 27 – 23 = 4
V = 22	V = 27 – 22 = 5

$M + K \div W \times V \Rightarrow 14 + 16 \div 4 \times 5$

BODMAS నియమం నుంచి

$14 + \frac{16}{4} \times 5$

$14 + 4 \times 5 \Rightarrow 14 + 20 = 34$
జ: 3



8. అక్షరమాలలో ఎడమ నుంచి 36వ అక్షరం ఏది?
1) I 2) J 3) L 4) P
వివరణ: అక్షరమాలలో మొత్తం అక్షరాలు = 26 (1 సెట్) = 36 – 26 = 10
10వ అక్షరం = J
జ: 2

9. అక్షరమాలలో ఎడమ నుంచి 59వ అక్షరం ఏది?
1) I 2) L 3) N 4) G
వివరణ: అక్షరమాలలో మొత్తం అక్షరాలు = 26 (1 సెట్)
= 52 (2 సెట్లు)
= 59 – 52 = 7
7వ అక్షరం = G
జ: 4



10. అక్షరమాలలో కుడివైపు నుంచి 43వ అక్షరం ఏది?
1) K 2) J 3) I 4) E
వివరణ: మొత్తం అక్షరాలు = 26 (1 సెట్)
= 43 – 26 = 17
ఎడమ వైపు నుంచి = 27 – 17 = 10
కుడి నుంచి 43వ అక్షరం = కుడి నుంచి 17వ అక్షరం



ఇది ఎడమ నుంచి 10వ అక్షరానికి సమానం
ఎడమ నుంచి 10వ అక్షరం = J
జ: 2

11. అక్షరమాలలో P అనే అక్షరానికి ఎడమవైపున 5వ అక్షరం ఏది?
1) L 2) F 3) I 4) K



వివరణ:
P స్థానం = 16
Pనకు ఎడమవైపు 5వ అక్షరం = 16 – 5 = 11 = K
జ: 4

12. అక్షరమాలలో M అనే అక్షరానికి కుడివైపున 9వ అక్షరం ఏది?
1) V 2) U 3) T 4) W
వివరణ: M స్థానం = 13
M కి కుడివైపు 9వ అక్షరం = M + 9 = 22 = V
జ: 1



రచయిత: గోలి ప్రశాంత్ రెడ్డి

మద్యం కేసు నిందితులకు జనవరి 2 వరకు రిమాండ్

ఉత్తర్వులిచ్చిన విజయవాడ ఏసీబీ కోర్టు

ఈనాడు – అమరావతి

వైకాపా హయాంలో జరిగిన మద్యం కుంభకోణం కేసు నిందితులకు ఏసీబీ కోర్టు రిమాండ్ పొడిగించింది. శుక్రవారంతో వీరి రిమాండ్ గడువు ముగుస్తుండటంతో విజయవాడ, గుంటూరు కారాగారాల్లో ఉన్న నిందితులను ఎస్కార్ట్ మధ్య కోర్టుకు తీసుకొచ్చి... న్యాయాధికారి భాస్కరరావు ఎదుట హాజరుపరిచారు. నిందితులకు రిమాండ్ పొడిగించాలని ప్రాసిక్యూషన్ తరఫు న్యాయవాది కోరగా.. వచ్చే నెల 2వ తేదీ వరకు పొడిగిస్తూ న్యాయాధికారి ఉత్తర్వులిచ్చారు. అనంతరం వారిని కారాగారాలకు తరలించారు. అనిల్ చోఖ్రా వేసిన బెయిల్ పిటిషన్ వాదనల నిమిత్తం 23వ తేదీకి వాయిదా పడింది. హైదరాబాద్‌లోని ఫామ్‌హౌస్‌లో సిట్ స్వాధీనం చేసుకున్న రూ.11 కోట్లకు సంబంధించి సీసీ కెమెరా ఫుటేజి కావాలని రాజ్ కసిరెడ్డి వేసిన పిటిషన్‌పై విచారణను వచ్చే నెల 2వ తేదీకి వాయిదా వేశారు. తన కుటుంబ సభ్యులను సిట్ అధికారులు తమకు అనుకూలంగా వాంగ్మూలం తీసుకున్నారని దిలీప్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ వచ్చే నెల 2వ తేదీకి వాయిదా పడింది. తన అరెస్టు సమయంలో సిట్ స్వాధీనం చేసుకున్న రూ.3.20 లక్షలు మద్యం కేసుకు సంబంధం లేదని, దానిని విడుదల చేయాలని నిందితుడు బాలాజీ కుమార్ యాదవ్ వేసిన పిటిషన్‌పై విచారణను న్యాయాధికారి వచ్చే నెల 2వ తేదీకి వాయిదా వేశారు.



చెవిరెడ్డిని కోర్టుకు తీసుకువస్తున్న పోలీసులు

● జైలు నుంచి రిమాండ్ పొడిగింపు నిమిత్తం వైకాపా నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని కోర్టుకు తీసుకెళ్తున్న సమయంలో న్యాయస్థానం ప్రాంగణంలో వైకాపా అధినేత జగన్‌కు జన్మదిన శుభాకాంక్షలు చెబుతూ, జగన్‌పై రాసిన కవితను చదువుతూ వెళ్లారు. కోర్టుకు వచ్చిన వైకాపా నేతలను కలిసేందుకు ఆ పార్టీ నాయకురాలు యాంకర్ శ్యామల వచ్చారు. కొద్దిసేపు నేతలతో మాట్లాడి వెళ్లిపోయారు.

మావోల కస్టడీ పిటిషన్ వెనక్కిచ్చిన జిల్లా కోర్టు

ఈనాడు - అమరావతి: మావోయిస్టుల కస్టడీ కోసం పటమట పోలీసులు దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌ను మచిలీపట్నంలోని జిల్లా కోర్టు శుక్రవారం వెనక్కి ఇచ్చింది. సంబంధిత కోర్టులో దాఖలు చేసుకోవాలని సూచించింది. దీంతో మళ్లీ విజయవాడలోని నాలుగో ఏసీజేఎం కోర్టులో కస్టడీ పిటిషన్ దాఖలు చేసే అవకాశం ఉంది. తొలుత ఈ పిటిషన్‌ను పటమట పోలీసులు కింది కోర్టులో దాఖలు చేశారు. మావోయిస్టులను నెల్లూరు కారాగారంలో మూడు రోజులు విచారించేందుకు నాలుగో ఏసీజేఎం కోర్టు ఇటీవల ఉత్తర్వులిచ్చారు. దీనిపై గురువారం ఎంఎస్‌జే కోర్టులో పోలీసులు అప్పీలు చేయగా.. జిల్లా కోర్టులో పిటిషన్ వేసుకోవాలని సూచిస్తూ న్యాయాధికారి తిరస్కరించిన సంగతి తెలిసిందే.

యుపిక్స్ కుంభకోణంలో ఆస్తుల అటాచ్‌మెంట్

ఈనాడు - అమరావతి: యుపిక్స్ కుంభకోణంలో నిందితులు స్వాహా చేసిన డిపాజిటర్ల సొమ్ము రాబట్టేందుకు.. వారి ఆస్తులను ఎటాచ్ చేశారు. ఈమేరకు హోంశాఖ ముగ్గురు నిందితుల ఆస్తులను గుర్తించి, వాటిపై క్రయ, విక్రయాలకు అవకాశం లేకుండా ఎటాచ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని వీటి జాబితాను రిజిస్ట్రేషన్ల శాఖకు పంపించి, లావాదేవీలు నిర్వహించొద్దని ఆదేశించారు. ఈ కేసుకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే రెండు ఎటాచ్‌మెంట్ ఉత్తర్వులు ఇచ్చింది. తాజాగా ఇచ్చిన ఉత్తర్వులతో డిపాజిటర్లకు న్యాయం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి.

● నాలుగు సంస్థల ద్వారా రూ.381 కోట్లు: యుపిక్స్‌లో గుంటూరు, నరసరావుపేట, విజయవాడ ప్రాంతాలకు చెందిన 215 మంది పెట్టుబడులు పెట్టారు. విజయవాడ నగరవాసి కిరణ్ కుమార్ సినిమాలకు యుపిక్స్ క్రియేషన్స్ ద్వారా యానిమేషన్ అందిస్తున్నట్లు నమ్మించాడు. ఏడాదిలోనే 100 నుంచి 125 శాతం రాబడి వస్తుందని అందరికీ సినిమా చూపించాడు. ఈ కంపెనీలో మిట్టపల్లి రాజేంద్ర బాబు (ఏ2), కొత్తూరి వేణుగోపాలరావు (ఏ3), మిట్టపల్లి రాజీవ్ కృష్ణ (ఏ5) కలిసి ఎక్కువ వడ్డీ ఇస్తామని డిపాజిటర్లకు ఆశ చూపించారు. చివరకు సొమ్మును పక్కదారి పట్టించి బోర్డు తిప్పేశారు. నిందితులు, వారి కుటుంబ సభ్యుల పేర్లన 2019 నుంచి కొనుగోలు చేసిన స్థిరాస్తులను పోలీసులు గుర్తించారు.

ఆయా సంస్థల ద్వారా వసూలు చేసిన డిపాజిట్లు

కంపెనీ	బాధితుల సంఖ్య	వసూలు చేసిన సొమ్ము (రూ.కోట్లలో)
యుపిక్స్ క్రియేషన్స్, యుపిక్స్ గ్రూప్స్	183	353
ఎక్స్‌ప్రెస్ టూన్జ్	19	24
శ్రీసాయి లీలా	13	4

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఆస్తులు...

మిట్టపల్లి రాజేంద్రబాబు, కొత్తూరి వేణుగోపాల్, మిట్టపల్లి రాజీవ్‌కృష్ణ పేర్లు, వారి బంధువుల పేర్లన ఉన్న ఆస్తులను ఉత్తర్వుల్లో ఎటాచ్ చేశారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని వీరికి సంబంధించి 51 ఆస్తులు ఉన్నాయి. పల్నాడు జిల్లా చిలకలూరిపేట, ఫిరంగిపురం, నరసరావుపేట.. గుంటూరు నగరంలోని ప్లాట్లు, అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్లు, భవనాలు, వ్యవసాయ భూములను ఈ జాబితాలో చేర్చారు.

బెట్టింగ్ కేసులో కొడాలి నాని సన్నిహితుడి అరెస్టు

జిల్లా వైకాపా రాజకీయ వ్యూహకర్తగా మెలిగిన వినోద్

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం- గుడివాడ, న్యూస్‌టుడే

మాజీ మంత్రి, వైకాపా నేత కొడాలి నాని అత్యంత సన్నిహితుడు.. గుడివాడలో జూదాలు, క్రికెట్ బెట్టింగులు నిర్వహిస్తున్న కూనసాని వినోద్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తుండగా గుడివాడ వన్‌టౌన్ పోలీసులు అతడిని పట్టుకున్నారు. రూ.50 వేల నగదు, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఇతడిపై ఇప్పటికే పలు బెట్టింగ్ కేసులు ఉన్నాయి. జిల్లాలోని పలువురు నేతల అండతో పెద్ద ఎత్తున జూద క్రీడలు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఈ నేపథ్యంలో వినోద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో వినోద్‌తో జూదం ఆడే వ్యక్తులను కూడా త్వరలో అరెస్టు చేయనున్నారు.

నేతల అండతోనే..?: గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి నానికి రాజకీయ వ్యూహకర్తగా వ్యవహరించిన వినోద్ అతని నుంచి మాజీ మంత్రులు పేర్ని నాని, జోగి రమేష్, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ తదితరుల వద్దకు చేరాడు. చివరకు పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డి వద్దకు చేరాడు. కైకలూరుకు చెందిన మాజీ ఎమ్మెల్యే వైకాపాలో చేరడంలో కీలక పాత్ర వహించినట్లు సమాచారం. జిల్లాలోని వైకాపా నేతల అండతో ఇతడు పలు అక్రమాలకు సైతం పాల్పడ్డాడన్న ఆరోపణలు ఉన్నాయి. గతంలో పార్టీ అండతో పట్టణంలో భారీగా క్రికెట్, ఇతర బెట్టింగ్‌లు నిర్వహించాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పలు కేసుల్లో అరెస్టు అయ్యాడు.



వైకాపా నేత జగన్‌తో వినోద్

గ్యాంగుల గొడవతో గుట్టురట్టు..!

వినోద్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొందరు నేతలతో సంబంధాలు ఏర్పరచుకుని గుడివాడ పట్టణంలో భారీగా జూదక్రీడలు నిర్వహిస్తున్నాడని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గన్నవరం, తెలప్రోలుకు చెందిన బడాబాబుల సన్నిహితులు గుడవాడ కేంద్రంగా పెద్దఎత్తున నిర్వహించిన బెట్టింగులపై 'ఈనాడు'లో ప్రత్యేక కథనం వచ్చాక కొద్ది రోజులు వాటిని నిలిపేశారు. కొంతకాలంగా వినోద్ కొందరు నేతల అండతో ఆన్‌లైన్ బెట్టింగులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో గన్నవరం, గుడివాడ జూదరుల మధ్య వివాదం తలెత్తి.. విజయవాడ రోడ్డు సమీపంలో గ్యాంగ్‌లు గొడవ పడటంతో గుట్టురట్టయింది. ఈ క్రమంలో కొందరు పోలీసులతో సెటిల్‌మెంట్లకు ప్రయత్నాలు జరిగినట్లు తెలుస్తోంది.

నాకేం తెలియదు.. సంబంధం లేదు..!

విచారణలో అర్జున్‌రెడ్డి డొంక తిరుగుడు సమాధానాలు

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం - గుడివాడ, న్యూస్‌టుడే

'ఆ పోస్టులు ఏంటో.. అవి ఎవరు పెట్టారో.. నాకేం తెలియదు.. నాకు సంబంధం లేదు'.. ఇది కూటమి నేతలపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టిన వైకాపా నేత జగన్ బంధువు సిరిగిరిరెడ్డి అర్జున్‌రెడ్డి పోలీసుల విచారణలో ఇచ్చిన డొంక తిరుగుడు సమాధానం. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ చిత్రాలను మార్ఫింగ్ చేసి తీవ్ర అసభ్యకర పోస్టులను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేసిన కేసులో నిందితుడు అర్జున్‌రెడ్డిని విచారణకు రావాలని పోలీసులు ఇటీవల నోటీసులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం గుడివాడ రెండో పట్టణ పోలీసులు నిందితుడిని అతడి తరఫు న్యాయవాదుల సమక్షంలో విచారించారు. పోలీసులు అడిగిన ప్రశ్నలకు నిందితుడు తప్పించుకునే సమాధానాలు చెప్పినట్లు సమాచారం. విచారణ ఇంకా పూర్తి కాలేదని, మళ్లీ పిలిపిస్తామని పోలీసులు చెబుతున్నారు.



గుడివాడ టూటౌన్ పోలీసు స్టేషన్‌కు వచ్చిన అర్జున్‌రెడ్డి

తీగ లాగితే డొంక కదిలింది..!

సామాజిక మాధ్యమాలను అడ్డాగా చేసుకొని పలువురు వైకాపా నేతలు, పార్టీ సానుభూతిపరులకు అర్జున్‌రెడ్డి, సజ్జల భార్గవ్‌రెడ్డి తదితరులు కూటమి నేతల చిత్రాలను అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి సర్క్యులేట్ చేశారు. వీటిని చోటా నేతలు స్థానికంగా వైరల్ చేశారు. దీనిపై గుడివాడ పట్టణానికి చెందిన తెదేపా సానుభూతి పరుడు ఆకునూరి శ్రీరామ్ 2024 నవంబర్‌లో వైకాపా ప్రచారకర్త ఖాజా బాబాపై ఫిర్యాదు చేశారు. ఇతడిని పోలీసులు విచారించగా అర్జున్‌రెడ్డి, భార్గవ్‌రెడ్డి, మరికొందరి ఖాతాల నుంచి తనకు కూటమి నేతల అసభ్యకర పోస్టులు వస్తాయని, వాటిని ఆయా గ్రూపుల్లో పోస్టు చేస్తున్నట్లు చెప్పాడు. పలు సామాజిక మాధ్యమాల ఖాతాలను పరిశీలించిన పోలీసులు అసభ్యకర పోస్టులు అర్జున్ రెడ్డి, భార్గవ్ రెడ్డి నుంచి సర్క్యులేట్ అవ్వడం గుర్తించారు. ఇలా తీగ లాగితే ప్రధాన నిందితులు బయట పడ్డారు. దీంతో కేసు నమోదు చేశారు. వెంటనే సజ్జల భార్గవ్ రెడ్డికి పోలీసులు 41 సీఆర్‌పీసీ నోటీసులు ఇచ్చారు. అర్జున్‌రెడ్డి విదేశాలకు పారిపోగా లుక్‌అవుట్ నోటీసులు జారీ చేశారు. ఈ నెల 15న శంషాబాద్ విమానాశ్రయంలో నిందితుడు అర్జున్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని విచారణకు హాజరు కావాలని నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే.

కేసు విచారణలో ఉంది

సామాజిక మాధ్యమాలలో అభ్యంతకర పోస్టులను పెట్టారన్న ఫిర్యాదుపై ఖాజా బాబాను విచారించగా ప్రధాన నిందితులు అర్జున్‌రెడ్డి, భార్గవరెడ్డి అని తేలడంతో వారిపైనా కేసులు నమోదు చేశాం. నోటీసులు ఇచ్చి విచారిస్తున్నాం. అవసరమైతే నిందితులను మళ్లీ విచారణకు పిలుస్తాం. - సీఐ జేఆర్‌కే హనీష్

వాట్సాప్‌లో ఫొటోలు.. ఆపై బేరాలు

వివిధ ప్రాంతాల్లో పిల్లలను దాచి సరోజిని విక్రయాలు

ఈనాడు - అమరావతి: ఉత్తరాది నుంచి పిల్లలను తెప్పించి, సంతానం లేని వారిని గుర్తించి. . వారితో వాట్సాప్‌లోనే బలగం సరోజిని వ్యవహారాలు చక్కబెడుతుంది. కొనే వారిని గుర్తించి వారికి ఫొటోలు పంపుతుంది. పిల్లల ఫొటోలను అవసరమైన వారికి పంపిస్తుంది. ఆతర్వాత వారి నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే బేరసారాలు మొదలుపెడుతుంది. బేరం కుదిరాక వారికి శిశువును అప్పగించి డబ్బులు తీసుకుంటుంది. పిల్లలను అమ్మే వరకు సరోజిని తన వద్ద ఉంచుకోదు. విజయవాడ, సత్తెనపల్లిలో తనకు పరిచయం ఉన్న వారి వద్ద ఉంచుతుంది. ఇందుకు వారికి కమీషన్ ముట్టజెబుతుంది. దిల్లీ, ముంబయి నుంచి వస్తున్న పిల్లలను విక్రయించే వరకు అన్ని స్థాయుల్లో వారికి ఎంతో కొంత కమీషన్ ఇస్తుంది. ఉత్తరాది ముఠాలకు పిల్లలను అప్పగించిన వెంటనే డబ్బు తీసుకోరు. అమ్మిన తర్వాతే వారికి డబ్బులు ఇస్తుంది. ఇదంతా నమ్మకం మీదే సాగుతుంది. ఇదీ.. పిల్లల విక్రయాల కేసులో ప్రధాన నిందితురాలు సరోజిని అనుసరిస్తున్న ఎత్తుగడ.

ఆసుపత్రులతో విస్తృత సంబంధాలు...

దిల్లీ, ముంబయి ముఠాలతో సరోజినికి విస్తృత సంబంధాలు ఉన్నాయి. ఈ పరిచయాలకు తోడు.. స్థానికంగా కూడా పలు ఆసుపత్రులతోనూ సంబంధాలు పెట్టుకుంది. ఆసుపత్రుల్లో పనిచేసే వారితో పరిచయం పెంచుకుని.. గర్భిణులు, బాలింతలు ఉంటే ఆరా తీసి వారితో మాటలు కలుపుతుంది. వారిలో పోషించలేని వారిని గుర్తించి తన ఫోన్ నెంబర్లు ఇస్తుంది. పిల్లలు లేని తమ బంధువులు ఉన్నారని చెబుతుంది. వీరి నుంచి పిల్లలను తీసుకుని అవసరం ఉన్న వారికి అమ్ముతుంది. దీంతోపాటు ఫర్టిలిటీ సెంటర్లతోనూ పరిచయం చేసుకుని వారితో మాట్లాడుకుని కమీషన్లు తీసుకుంటుంది. ఎగ్ డోనార్స్, అద్దె గర్భానికి అంగీకరించే వారిని తీసుకుని సంతాన సాఫల్య కేంద్రాలకు తీసుకెళ్తుంది. ఇలా రెండు రకాలుగా వ్యవహారాలు చక్కబెడుతూ కమీషన్లు పొందుతోంది.

రైలులో పారిపోతుండగా అరెస్టు

సరోజిని, ఆమె గ్యాంగును పోలీసులు అరెస్టు చేశారనే సంగతి తెలియగానే విజయవాడలోని హోటల్‌లో ఉన్న దిల్లీకి చెందిన కిరణ్ శర్మ, భారతిలు ఆగమేఘాలపై రైలెక్కి పారిపోయారు. పోలీసులు హోటల్‌కు వచ్చేసరికి వీరు వెళ్లిపోయారు. దీంతో అక్కడి సీసీ కెమెరాలను పరిశీలించగా.. దిల్లీ వెళ్లే రైలులో జనరల్ బోగీ ఎక్కినట్లు గుర్తించారు. వెంటనే అప్రమత్తమై ఆర్పీఎఫ్‌కు సమాచారం ఇచ్చారు. చివరకు మహారాష్ట్రలోని బలార్షా స్టేషన్‌లో వీరిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి విజయవాడకు తరలించి అరెస్టు చూపించారు.



కిరణ్‌శర్మ



భారతి

బుధవారం తెల్లవారుజామున ఇద్దరు పిల్లలను తీసుకొచ్చే సమయంలో భారతి అనే మహిళ సాయం తీసుకుంది. ఇందుకు ఆమెకు రూ. 5 వేలు ఇస్తానని ఆశ చూపించడంతో వచ్చి కటకటాలపాలైంది. దిల్లీ, పరిసర ప్రాంతాల్లో పిల్లలను పోషించుకోలేని వారిని గుర్తించి డబ్బులు ఎర వేసి శిశువులను కొంటుంది. దిల్లీలోని పలు ఫర్టిలిటీ సెంటర్లకు కిరణ్ శర్మ ఏజెంట్‌గా పని చేస్తోంది. కిరణ్‌శర్మను గత కేసుకు సంబంధించి మహిళా స్టేషన్ పోలీసులు అరెస్టు చూపించారు. భారతిని భవానీపురం పోలీసులు అరెస్టు చేశారు.

వసుంధర

vasundhara@eenadu.in

అందానికి పిల్లో మంత్ర..!

ముఖం అందంగా కనిపించాలని తినే ఆహారం దగ్గర నుంచి రాసుకునే క్రీమ్ వరకూ ప్రతి విషయంలోనూ ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు అమ్మాయిలు. కానీ, ముఖంపై మొటిమలు, ముడతలు, గీతలకి మనం రోజూ నిద్రపోయే తలగడ కూడా కారణం అంటున్నాయి అధ్యయనాలు. ఇవి మనకు తెలియకుండానే వృద్ధాప్యాన్ని తెచ్చిపెడుతున్నాయట. మరి దీన్నుంచి రక్షణ పొందాలంటే... ఈ జాగ్రత్తలు పాటించాలి.



- నిద్రలో ఉన్నప్పుడు కొంతమంది ఒక వైపు తిరిగి నిద్రపోడం, లేదా బోర్లా పడుకోవడం చేస్తారు. దీనివల్ల ముఖంపై ఒత్తిడి పడుతుంది. దాంతో గీతలు ఏర్పడి క్రమంగా అవి ముడతలుగా మారేందుకు ఆస్కారం ఉంది. అంతేకాదు, కొల్లాజెన్ ఉత్పత్తి తగ్గుతుంది.
- అలసటను దూరం చేసుకోవడానికి నిద్రపోతాం. పక్క సరిగ్గా ఉందా, ఫ్యాన్ తిరుగుతుందా అని చూస్తాం. వీటితోపాటూ తలకింద ఉండే దిండు శుభ్రంగా ఉందా అనేదీ గమనించుకోవాలి. ఎందుకంటే... రాత్రి సమయంలో మన చర్మంపై ఉండే మృతకణాలు, నూనెలు, మేకప్ అవశేషాలు పిల్లో మీదకే వచ్చి చేరతాయి. వీటికి బ్యాక్టీరియా తోడై అలర్జీలకూ దారి తీస్తాయి. అందుకే రోజుకోసారైనా దిండులోని దుమ్ము పోయేలా దులపాలి.
- చర్మంలోని సహజ నూనెలను దిండ్లు పీల్చేస్తాయి. దీంతో చర్మం పొడిబారుతుంది. అందుకే వీటి ఎంపికలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి. కాటన్ లేదా శాటిన్ రకాలను ఎంచుకుంటే మంచిది. ఇవి ఒత్తిడి తగ్గించి, నూనెలను పీల్చుకోకుండా కొంతవరకూ అడ్డుకుంటాయి. అంతేకాదు, వారానికోసారి గలేబులను మార్చాలి. గోరువెచ్చని నీటిలో రసాయనాలు లేని డిటర్జెంట్లతో ఉతకాలి.
- కనీసం నెలకోసారైనా పిల్లోలను ఎండలో ఉంచాలి. వాటిలో దుమ్ము చేరకుండా ఉండేందుకు యాంటీ రింకిల్ పిల్లోలు, ప్రొటెక్టర్లు, హైపోఅలర్జెనిక్ పిల్లో కవర్లను వాడాలి. మూడేళ్లకోసారి దిండ్లు మారుస్తూ ఉండాలి.
- వీటితోపాటు వెల్లకిలా పడుకోవడం అలవాటు చేసుకోవాలి. రాత్రి సమయంలో చర్మం తేమను కోల్పోకుండా మాయిశ్చరైజర్ రాయాలి. అలాగే గది ఉష్ణోగ్రతలు తగ్గకుండానూ చూసుకోవాలి.

నేనెందుకు ప్రయత్నించకూడదని..!



మరో కోణం

అమాయకపు అమ్మ, మరిదిని వెనకేసుకొచ్చే వదిన, భర్త మాట జవదాటని భార్య, అత్తమామలకు సేవ చేసే కోడలు... ఇలా చెప్పుకొంటూ పోవాలే కానీ తెలుగు తెరపై **ప్రగతి మహావాది** పోషించిన పాత్రలెన్నో. ఏ పాత్ర చేసినా... ప్రగతి తప్ప ఇంకెవరూ దానికి న్యాయం చేయలేరు అన్నంతగా ఒదిగిపోవడం ఆమె నైజం. అయితే, దీనికి భిన్నంగా పవర్‌లిఫ్టింగ్‌లో రాణించాలని కోరుకున్నారీమె. ఒడుదొడుకులు, ట్రోల్స్, హేళనలు... అన్నింటినీ అధిగమించి అంతర్జాతీయ స్థాయిలో బంగారు, వెండి పతకాలు గెలుచుకున్నారు. ఆమెను 'వసుంధర' పలకరించగా...

అబ్బాయిల్లా అయిపోతారట నిజమేనా..!

గొంతు మారిపోతుంది. ప్రొటీన్ ఎక్కువగా తింటే శరీరాకృతి అబ్బాయిల్లా మారిపోతుంది... ఇవన్నీ అపోహలు. హద్దుల్లో ఉంటూ ఆరోగ్యానికి హాని కలగనంత వరకూ ఎన్ని వ్యాయామాలైనా చేయొచ్చు. నేను ఇది నేర్చుకుంటున్నా అని తెలిశాక... చాలామంది ఇవే సందేహాలతో వెనక్కిలాగే ప్రయత్నం చేశారు. సినిమా అవకాశాలు కోల్పోతావని హెచ్చరించిన వారూ లేకపోలేదు. అవేవీ పట్టించుకోకుండా ముందడుగు వేశా.

దినచర్య ఎలా ఉంటుంది...

షూటింగ్ ఉంటే హడావుడిగా లేచి, పనులు పూర్తిచేసుకుని సమయానికి అక్కడికి చేరుకుంటా. లేదంటే నా రోజు ఆలస్యంగానే మొదలవుతుంది. ఏదేమైనా రోజుకు రెండున్నర గంటలు తప్పకుండా జిమ్ చేస్తా. ఒక్కోసారి పరిధి దాటేస్తుంటా.

ప్రస్తుత విజయం గురించి...

ఇటీవల టర్కీలో జరిగిన ఏషియన్ ఓపెన్ అండ్ మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో నాలుగు పతకాలు సాధించా. ఓవర్ ఆల్ గేమ్‌లో రజతం, డెడ్‌లిఫ్ట్‌లో స్వర్ణం... బెంచ్, స్క్వాట్ లిఫ్టింగ్‌ల్లో రెండు రజత పతకాలు గెలుచుకున్నా. నేను ఊహించని గెలుపు ఇది. మరిన్ని పతకాలు గెలుచుకోవాలన్న ప్రేరణనిచ్చిందీ విజయం.



ప్రేరణ ఎవరు..?

సాధారణ గృహిణులే నా ప్రేరణ. ఇంటాబయటా అన్నీ చక్కబెట్టుకుంటూ సమన్వయంతో అడుగులు వేస్తున్న వారిని నిజజీవితంలో చాలామందిని చూశాను. వాళ్ల గురించి తెలిసినప్పుడు, చదివినప్పుడు చాలా స్ఫూర్తిగా అనిపిస్తుంది. అంతెందుకు నేను పవర్ లిఫ్టింగ్ ప్రారంభించడానికి కారణమైన మహిళ కూడా గృహిణే. ఇంత విలాసవంతమైన జీవితం గడుపుతూ... నేను సాధించిన విజయం వాళ్ల ముందు చాలా చిన్నది.

పవర్ లిఫ్టింగ్‌ని ఎంపిక చేసుకోవడానికి కారణం?

నేను ఫుడీని. తినడం, నిద్రపోవడం అంటే చాలా ఇష్టం. కానీ సినీ రంగంలో ఫిట్‌నెస్‌కి ప్రాధాన్యత ఎక్కువ. బొద్దుగా ఉన్నా... ఆరోగ్యంగా ఉండాలనేదే నా లక్ష్యం. అందుకే పదిహేనేళ్ల క్రితమే నా రొటీన్‌లో ఫిట్‌నెస్ వచ్చి చేరింది. జిమ్‌కు వెళ్లేదాన్ని, వ్యాయామాలు చేసేదాన్ని. దీన్ని ఓ క్రీడగా చూసింది మాత్రం యాదృచ్ఛికంగానే. మా కమ్యూనిటీలో ఒక మహిళ పవర్ లిఫ్టింగ్‌లో రాణిస్తున్నారని తెలిసి... నేనెందుకు ప్రయత్నించకూడదు అనుకున్నా. వెంటనే శిక్షణలో చేరిపోయా. అలా అనుకోకుండానే ఇది నా జీవితంలో భాగమైంది.

దీనివల్ల సినీ రంగంలో వెనకపడ్డారా..?

లేదు! పవర్ లిఫ్టింగ్‌ని లాక్‌డౌన్ సమయంలో ఏం తోచక మొదలుపెట్టా. కొవిడ్ తర్వాత ఇండస్ట్రీలో అవకాశాలు వచ్చినా... మంచి పాత్రల కోసం వేచి చూశా. ఈ ఓపికకు కారణం పవర్ లిఫ్టింగ్ అనే చెబుతా. ఎందుకంటే అంతకుముందు ఏదో అసంతృప్తి ఉండేది. మంచి పాత్రలు రావడం లేదే, చేయలేకపోతున్నానే అని. పైగా, చిన్న చిన్న విషయాలకే కోప్పడేదాన్ని. ఇప్పుడు వాటన్నింటినీ అధిగమించా. ఫలితాలను ఆశించకుండా నా బెస్ట్ ఇవ్వడం నేర్పిందీ క్రీడ.

ప్రారంభంలో ఎదుర్కొన్న సమస్యలు?

కుటుంబపరంగా నా నిర్ణయాలకు విలువనిచ్చే వాళ్లే ఎక్కువ. మా అమ్మాయి అయితే... 'అమ్మా నువ్వు చేయగలవు' అంటూ ప్రోత్సహిస్తుంది. కానీ ట్రోల్స్ వల్ల చాలా ఇబ్బంది పడ్డాను. మొదట్లో చాలా బాధపడేదాన్ని. కానీ నా ఓపికని పరీక్షించడం చూశాక మాత్రం... వాళ్లకు సమాధానం చెప్పాల్సిందే అని నిశ్చయించుకుని కొంచెం గట్టిగానే ప్రతిఘటించా.

భవిష్యత్తు లక్ష్యాలు...

లక్ష్యాలంటూ ప్రత్యేకంగా ఏమీ లేవు. గో విత్ ద ఫ్లో అంతే. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని అనుకుంటున్నా.

నేటి తరానికి సందేశం...

ఎక్కడ ఉన్నా, ఏ పని చేస్తున్నా ఎదుగుదల అనేది చాలా ముఖ్యం. పదేళ్ల క్రితం నేను ఉన్నదానికన్నా ఇప్పుడు భిన్నంగా ఉన్నానా? లేనా? అని మనకు మనమే ప్రశ్నించుకోవాలి. చిన్న చిన్న వాటిలోనే ఆనందాన్ని వెతుక్కోవాలి. జీవితం ఏ ఒక్కదానికో పరిమితం కాకూడదు. భిన్న రంగాల్లో మన ప్రతిభను కనబరచడానికి ప్రయత్నించాలి.

ఇలా అయితేనే సాధించగలరు..!

ఒకప్పటిలా అమ్మాయిలు ఏదో ఒక ఉద్యోగం దొరికితే సరిపోతుంది అనుకోవడం లేదు. అందులో ఎదగాలనుకుంటున్నారు. అయితే అది అంత తేలికేం కాదు. ఎదురయ్యే సవాళ్లను దాటి నాయకురాలిగా నిలదొక్కుకోవాలంటే...



మనసు-మాట అదుపులో: పనిచేసే చోట అందరివీ ఒకేలాంటి మనస్తత్వాలు ఉండవు. పైగా అందరూ ఎంచుకున్న కొలువులో తమదైన ముద్ర ఉండాలని కోరుకుంటారు. ఈ క్రమంలో సహోద్యోగుల మధ్య పోటీ సహజమే. కానీ, అది ఆరోగ్యకరంగా ఉండాలి. మాట పట్టింపులు, అసూయ... వంటివి మిమ్మల్ని డామినేట్ చేయకూడదు. చిన్న చిన్న ఒడుదొడుకులకే మాటల్ని తూటాల్లా పేల్చడం, కోపం తెచ్చుకోవడం, కన్నీళ్లు పెట్టుకోవడం వంటివి చులకన చేస్తాయి. అలాగని ప్రతి విషయంలోనూ మీదే పై చేయి కావాలని వాదనలకూ దిగొద్దు. చెప్పాలనుకున్న విషయాన్ని స్థిరంగా చెప్పండి చాలు. ఇదే మిమ్మల్ని ఉన్నతంగా ఉంచుతుంది.

నేర్చుకోవాలి: జీవితంలో ఏదైనా సాధించాలనుకుంటే ఉత్సాహం, చొరవ తప్పనిసరి. ఇది కెరియర్‌లో మరీ ముఖ్యం. పరిధి గీసుకుని పనిచేయడం, మూసధోరణిలో వెళ్లిపోవడం వల్ల మిమ్మల్ని మీరు కోల్పోతారు. ఎప్పటికప్పుడు కొత్త విషయాలను నేర్చుకోవడానికి ప్రయత్నించండి. మార్కెట్ పోకడల్ని అర్థం చేసుకోండి. అదనపు అర్హతలను సాధించండి. ఇవన్నీ మీ పనితీరులో సృజన, కొత్తదనం కనిపించేలా చేస్తాయి.

సమీక్ష తప్పనిసరి... 'అంతా బాగుంది. నా పనితీరే బెస్ట్...' అనే భ్రమలో ఉండొద్దు. మార్పుల్ని అంగీకరించాలి. సమీక్షించుకోవడానికి సంసిద్ధంగా ఉండాలి. ప్రయోగాలు చేయాలి. అప్పుడే సవాళ్లను దాటి ముందుకు వెళ్లగలరు.

మీకు తెలుసా?

మహిళల హృదయ స్పందన రేటు పురుషుల కన్నా అధికంగా ఉంటుంది. మగవాళ్ల గుండె నిమిషానికి 70-72 సార్లు కొట్టుకుంటే... మహిళల్లో 78-82 బీపీఎం ఉంటుందట. ఈస్ట్రోజన్ స్థాయుల్లో హెచ్చుతగ్గులు, గుండె లయలను నడిపించే నిర్దిష్ట జన్యువులు, గుండె పరిమాణంలో తేడాలే ఇందుకు కారణమని చెబుతున్నాయి అధ్యయనాలు.

చలికి చురకపెట్టే... సూర్య భేదన ప్రాణాయామం...

శరీరానికి వెచ్చదనాన్ని ఇస్తుందీ ప్రాణాయామం. అందుకే చలికాలంలో చేయాలి. మ్యాట్‌పైన పద్మాసనంలోనో, వజ్రాసనంలోనో లేదంటే మామూలుగానో కూర్చోండి. నడుమును నిటారుగా ఉంచి ఫొటోలో చూపినట్లు ఎడమచేతి వేళ్లను చిన్ ముద్రలో ఉంచండి. ఇప్పుడు కుడిచేతి చూపుడు, మధ్య వేళ్లను మడిచి మిగిలిన వేళ్లను చాపి ఉంచండి... దీన్నే విష్ణు ముద్ర అంటారు. కుడి నాసికా రంధ్రాన్ని మూయడానికి బొటనవేలినీ, ఎడమ నాసికా రంధ్రాన్ని మూయడానికి ఉంగరం, చిటికెన వేళ్లనూ ఉపయోగిస్తాం. సూర్య భేదన ప్రాణాయామంలో ముందుగా ఎడమ నాసికా రంధ్రాన్ని మూసి ఉంచి కుడి వైపు నుంచి శ్వాస తీసుకోవాలి. ఇప్పుడు బొటనవేలితో కుడి నాసికా రంధ్రాన్ని కూడా మూసి ఉంచి ఉండగలిగినంతసేపు ఉండి, ఆపై ఎడమవైపు నుంచి ఉంగరం, చిటికెన వేళ్లను తీసి గాలిని పూర్తిగా వదిలేయండి. ఇలా చేస్తే ఒక రౌండ్ పూర్తి అయినట్లు. ఇలా ప్రతిసారీ గాలిని కుడివైపు నుంచి తీసుకొని, ఎడమవైపు నుంచి పూర్తిగా విడిచిపెట్టాలి. ఇలా కొన్నిసార్లు చేయాలి.

జాగ్రత్తలు: బీపీ, గుండె జబ్బులు, మూర్ఛవ్యాధి, అలర్జీ, జ్వరంతో ఉన్నప్పుడు ఈ ప్రాణాయామం చేయరాదు.

ఉపయోగాలు: చలికాలంలో బద్ధకాన్ని వదిలిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. జలుబు, దగ్గు, కఫ దోషాలను అదుపు చేస్తుంది. జీర్ణశక్తినీ, చురుకుదనాన్నీ పెంచుతుంది.

ఆహారం: యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే తులసి, అల్లం, పసుపు... వంటివి ఆహారంలో భాగం చేయాలి. గోరువెచ్చని నీరు తాగాలి. చల్లని పదార్థాలకు దూరంగా ఉండాలి.

– శిరీష, యోగ గురు



ముందు ఆనందం... తరవాతే బాధ!



షాపింగ్... రోజంతా తీరిక లేకుండా గడిపినా, మనసంతా భారంతో నిండిపోయినా అమ్మాయిలకు గుర్తొచ్చేది ఇదే! ఇవి చాలవన్నట్టు సోషల్ మీడియా తెరిస్తే ఆకట్టుకునే ఆకర్షణలూ బోలెడు. ఇంకేం చకచకా కొనేసి... సంతృప్తి పొందుతారు. అక్కడివరకూ సరదాగానే ఉంటుంది. ఆ తరవాతే చిక్కులు మొదలు. కొన్నప్పుడు బాగానే ఉంటాయి. వేసుకునేప్పుడు నచ్చవు. ఎంతో ఆశగా ఎక్కువ ఖరీదైనా కొంటామా... తీరా ఆ ఉత్పత్తి నచ్చదు. పోనీ ఇవన్నీ బాగున్నా... ఖాళీ అయిన ఖాతా వెక్కిరిస్తూ ఉంటుంది. అప్పుడు అనిపిస్తుంది... 'ఛ అనవసరంగా కొన్నానే' అని! దీన్నే 'బై నవ్ పానిక్ లేటర్ సైకిల్' అంటున్నారు నిపుణులు. ఇదిప్పుడు సోషల్‌మీడియాలో తెగ చక్కర్లు కొడుతోంది కూడా. అసలే క్రిస్మస్, న్యూ ఇయర్ ఆపై సంక్రాంతి. వేడుకలే వేడుకలు. తగ్గట్లే మొదలయ్యే ఆఫర్ల జాతరలు. ఖర్చు తక్కువ, లిమిటెడ్ ఆఫర్, వాళ్లకి ఉంది నాకూ కావాలి... ఇలా కారణాలు వెతుక్కుంటూ కొన్నారో... ఈ వలయంలో మీరూ చిక్కుకున్నట్లే. కాబట్టి, కొనేముందే ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోండి. నిజంగా అవసరం అన్నప్పుడే కొనుక్కోండి. ఖాతా ఖాళీ కాదు, వృథా పేరు కోదు... ముఖ్యంగా కొత్త బాధ మీ దరికి చేరదు. ఏమంటారు?

పని చేస్తూ... ప్రపంచ కప్ గెలిచింది!

సంకల్ప బలం ఉంటే లక్ష్య సాధనలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా వాటిని అధిగమించవచ్చు. ఇందుకు **ఎల్.కీర్తన** ప్రయాణమే నిదర్శనం. ఇటీవల మాల్దీవుల్లో జరిగిన క్యారమ్స్ ప్రపంచ కప్ పోటీల్లో గెలిచి, మరోసారి మన దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిందీమె. ఈమె గురించి తెలియాలంటే...

కీర్తనది చెన్నైలోని పుదువన్నరపెట్టైలోని సెరియన్ నగర్. నాన్న లోకనాథన్. అమ్మ ఇంద్రాణి. నిరుపేద కుటుంబం. తండ్రి చనిపోయాక కీర్తన చదువు ఆగిపోయింది. పొట్టకూటి కోసం ఓ వర్క్‌షాప్‌లో పనిచేసేది. 'నాన్నకు క్యారమ్స్ అంటే చాలా ఇష్టం. పని అయ్యాక కాస్త ఖాళీ దొరికినా ఆడేవారు. నాకూ నేర్పించేవారు. అలా ఆరేళ్ల వయసు నుంచే క్యారమ్స్ ఆడుతున్నా. ఎప్పటికైనా ఈ ఆటలో నేను ఛాంపియన్ కావాలన్నది ఆయన ఆశ. కానీ నాకు పన్నెండేళ్లు ఉన్నప్పుడు అనారోగ్య కారణాల వల్ల నాన్న చనిపోయారు. ఎన్ని కష్టాలు వచ్చినా ఆయన కల నెరవేర్చాలి అనుకున్నా. షాప్‌లో పనిచేస్తూనే వీలున్నప్పుడల్లా టోర్నమెంట్స్‌కు వెళుతుండేదాన్ని. అలా వచ్చిన మొత్తాన్ని అమ్మకు ఇచ్చేదాన్ని' అనే కీర్తన ఆడుతూనే మెలకువల్ని నేర్చుకుంది.





ఆ మలుపుతో...

ఇలానే ఒక టోర్నమెంట్ ఆడుతున్నప్పుడు స్థానిక క్యారమ్స్ క్లబ్ వాళ్లు కీర్తనను చూశారు. క్లబ్ తరఫున ఆడే అవకాశం కల్పించారట. 'ఖాళీ దొరికినప్పుడల్లా క్లబ్‌కు వెళ్లేదాన్ని. నేను నేర్చుకుంటూనే జూనియర్స్‌కూ ఆట నేర్పేదాన్ని. అలా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయుల్లో ఆడే అవకాశాన్ని సంపాదించుకున్నా. ఈ నెల 6న మాల్దీవుల్లో జరిగిన క్యారమ్ వరల్డ్ కప్‌లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం వచ్చింది. అక్కడకు వెళ్లడానికి ఆర్థికంగా ఎన్నో సవాళ్లు. కానీ దాతల సహాయంతో అవన్నీ అధిగమించా. ఈ ఛాంపియన్‌షిప్‌లో మూడు బంగారు పతకాలు గెలుచుకున్నా. ప్రపంచ కప్‌నూ కైవసం చేసుకున్నా. నాన్న కల నెరవేర్చినందుకు చాలా సంతోషంగా ఉంది. చెన్నైలో నాలాంటి క్రీడాకారులు చాలామంది ఉన్నారు. కానీ ఆర్థిక కష్టాల వల్ల వెనకడుగు వేస్తున్నారు. ప్రభుత్వం మాకు ఆర్థికంగా సహాయం చేస్తే ఆటలో మరింత రాణిస్తాం' అని చెప్పే కీర్తన... తనకు అవకాశం కల్పించిన క్లబ్‌లోనే 35మందికి పైగా ఔత్సాహికులకు శిక్షణనిస్తోంది.

ఈటీవీ భారత్

పుస్తకంలో... దాచేద్దాం!



నగలంటే ఏ అమ్మాయికైనా ఇష్టమే! చిన్నప్పుడు అమ్మ నగలను ఆశ్చర్యంగా చూడటాన్నైతే అస్సలు మర్చిపోలేం. అక్కడ నగ అందమేనా మనం మెచ్చేది? కాదు... ఓ పెట్టెలో పొందిగ్గా ఆభరణాలు అమర్చడమూ ఆకర్షించే విషయమే. అదీ వారసత్వంగా వస్తుందో ఏమో కానీ... మనదీ అదే బాట. ఓపికగా ఒక్కోటి చక్కగా అమరుస్తాం. ఇక్కడ బంగారం, గిల్టు అన్న తేడా అస్సలు చూపించం. అన్నీ ఒకోచోట ఉంటాయి, పాడవ్వవు, వెతుక్కోకుండా త్వరగా తీసుకోవడానికి వీలుగా ఉంటాయనీ జ్యువెల్లరీ బాక్సులు వాడుతుంటాం. ఇంత శ్రద్ధ చూపే మనకి చిక్కులు ఎప్పుడొస్తాయి? ప్రయాణాల్లోనే కదూ! అన్నింటినీ పెట్టెలు పెట్టెలుగా విడివిడి వాటిల్లో సర్దుకుని తీసుకెళ్లలేం. స్థల వృథాతోపాటు చోరీ భయం. అలాగని తీసుకెళ్లకుండానూ ఉండలేం. మరెలా అంటే... ఈ 'జ్యువెల్లరీ స్టోరేజ్ బుక్'లు తెచ్చుకుంటే సరి. చూడటానికి పుస్తకంలానే ఉంటుంది. తెరిస్తే కానీ... అసలు గుట్టు బయటపడదు. అన్ని రకాల నగలూ పెట్టుకునేలా వీటిని తీర్చిదిద్దారు. వీటిలో మీకు కావాల్సిందేదో ఎంచుకుంటే సరి. చక్కగా చేతిలో పట్టుకుని వెళ్లినా పోతాయన్న భయం ఉండదు. బాగున్నాయి కదూ! కావాలనుకుంటే ఆన్‌లైన్‌లో వెతికేయండి మరి.

బంగారం - వెండి



19న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,36,070	1,23,400	2,05,529
విజయవాడ	1,32,065	1,23,000	2,07,000
ప్రొద్దుటూరు	1,32,200	1,21,620	1,98,000
రాజమహేంద్రవరం	1,34,180	1,23,000	2,21,000
విశాఖపట్నం	1,33,700	1,23,000	2,10,000
తమిళనాడు	-----	1,23,800	2,21,000

రంగవల్లిక

17 చుక్కలు
1 వచ్చే వరకూ
సరిచుక్క






వి. లక్ష్మి
హైదరాబాద్




జి.కె. సత్యవతి ప్రసాద్
చెన్నై



21 చుక్కలు
11 వచ్చేవరకూ
మధ్య చుక్క



ఎ. సత్యవేణి
కవులూరు



17 చుక్కలు
9 వచ్చేవరకూ
మధ్యచుక్క

మీ ముగ్గులు 9154091911 నంబరుకు వాట్సాప్ చేయొచ్చు.

మా చిరునామా: వసుంధర, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిల్మ్‌సిటీ, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ - 501 512.
Email: vasundhara@eenadu.in

గడ్డిపోచలతో మహిళా సాధికారత




ఈటీవీ భారత్: సహజ వనరులకు నిలయమైన ఉత్తరాఖండ్ ప్రత్యేకమైన 'మూంజ్' వంటి హస్తకళలకూ ప్రసిద్ధి. టిహరీ, అల్మోడా, బాగేశ్వర్ వంటి జిల్లాల కళాకారులు ఈ నైపుణ్యాలకు ప్రత్యేక గుర్తింపు పొందారు. ఒకప్పుడు అంతరించిపోయే దశలో ఉన్న 'మూంజ్ హస్తకళ' కొంత మంది మహిళల చొరవతో గత పదేళ్లుగా తిరిగి జీవం పోసుకొంది. నదులు, వాగుల వద్ద దొరికే రెల్లు గడ్డిలాంటి మూంజ్ గరికతో వివిధ ఉత్పత్తులు తయారు చేస్తారు. వీటి ద్వారా ఉత్తరాఖండ్‌లోని దాదాపు 500 మంది మహిళలకు సాధికారత చేకూరిందని చెప్పవచ్చు. ప్రతి మహిళా నెలకు రూ.20 వేలు సంపాదిస్తున్నట్లు పలువురికి శిక్షణ ఇచ్చిన రీటా తెలిపారు. "మా ఉత్పత్తులకు దిల్లీతోపాటు జర్మనీ నుంచి కూడా ఆర్డర్లు వస్తాయి. మార్కెటింగ్ పరంగా ప్రభుత్వం నుంచి సహాయం కోరుతున్నాం. గతేడాది ప్రధాని మోదీని కూడా కలిశాం" అన్నారు.

ఎడారి దేశంలో భారీవర్షాలు



ఇంటర్నెట్ డెస్క్: ఎడారి దేశమైన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని పలు ప్రాంతాల్లో భారీవర్షాలు కురుస్తున్నాయి. అబుదాబి, దుబాయ్ సహా అనేక నగరాల్లో శుక్రవారం కొన్ని గంటలపాటు జనజీవనం స్తంభించిపోయింది. లోతట్టు ప్రాంతాలు జలమయమై ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతోపాటు పలు విమాన సర్వీసులు ఆలస్యంగా నడిచాయి. అందరూ హాలీడే సీజనుకు సిద్ధమవుతున్న వేళ భారీవర్షాలు కురుస్తుండటంతో స్థానిక ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. ప్రభుత్వ ఉద్యోగులు ఇళ్ల నుంచే పనిచేయాలని దుబాయ్ ప్రభుత్వం ఆదేశించింది. బీచ్‌లు, పార్కులు, పర్యాటక ప్రదేశాలను తాత్కాలికంగా మూసివేశారు. ప్రజలు ఇళ్లలోనే ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచనలు జారీ చేశారు. వరద తీవ్రతను తక్కువ అంచనా వేయొద్దని, ప్రమాదకరంగా ఉండొచ్చని షార్జా సివిల్ డిఫెన్స్ అథారిటీ హెచ్చరించింది. దోహా, ఖతార్‌లలోనూ ఇదే పరిస్థితి కనిపించింది. గల్ఫ్ దేశాల్లో ఇటువంటి వాతావరణ పరిస్థితులు సాధారణంగా మారుతున్నాయి. గతేడాది కూడా దుబాయ్‌లో భారీ వరదలు వచ్చాయి.

ఈసారి బడ్జెట్‌ను ఆదివారం ప్రవేశపెట్టనున్న సీతారామన్!



దిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈసారి బడ్జెట్‌ను ఏ రోజు పార్లమెంటులో ప్రవేశపెడతారన్నది ఆసక్తికరంగా మారింది. 2017 నుంచి కేంద్ర ప్రభుత్వం సాధారణ బడ్జెట్‌ను ఏటా ఫిబ్రవరి 1న ప్రవేశపెడుతోంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 1- ఆదివారం. ఆనవాయితీని కొనసాగించాలనుకుంటే సీతారామన్ 2026-27 బడ్జెట్‌ను అదే రోజు పార్లమెంటు ముందుకు తీసుకొస్తారు. అది జరిగే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీనిపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజును ప్రశ్నించగా.. "ఇలాంటి నిర్ణయాలను పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్ కమిటీ తగిన సమయంలో తీసుకుంటుంది" అని బదులిచ్చారు. 2017కు ముందు- ఏటా ఫిబ్రవరి చివరి రోజున జనరల్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టేవారు. ఇప్పటివరకూ కొవిడ్ మహమ్మారి విజృంభణ వంటి కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లోనే పార్లమెంటు ఆదివారం సమావేశమైంది.

పార్లమెంటు నిరవధిక వాయిదా

- ముగిసిన శీతాకాల సమావేశాలు
- 'వీబీ- జీ రామ్ జీ' సహా మొత్తం 8 బిల్లులకు ఆమోదం

దిల్లీ: అధికార-ప్రతిపక్ష నేతల మధ్య మాటల యుద్ధాలు, పలు కీలక బిల్లుల ఆమోదానికి వేదికగా నిలిచిన పార్లమెంటు శీతాకాల సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. (గ్రామీణ ఉపాధి హామీకి సంబంధించి కీలకమైన 'వీబీ- జీ రామ్ జీ' బిల్లుపై చర్చ కోసం ఎంపీలు రాత్రివేళల్లోనూ పార్లమెంటులోనే ఉండటంతో ఈ సమావేశాల్లో రెండు సభలు వంద శాతానికి పైగా (లోక్‌సభ 111%, రాజ్యసభ 121%) ఉత్పాదకత నమోదు చేయడం విశేషం. లోక్‌సభ శుక్రవారం సమావేశం కాగానే.. స్పీకర్ ఓం బిర్లా మాట్లాడారు. ఈసారి సభ 92 గంటల 25 నిమిషాలు పనిచేసినట్లు తెలిపారు. ఆ సమయంలో కొందరు సభ్యులు 'మహాత్మాగాంధీకీ జై' అంటూ నినాదాలు చేశారు. అప్పుడు ప్రధాని మోదీ సభలోనే ఉన్నారు. జాతీయ గేయం వందేమాతరంపై ఈ సమావేశాల్లో వాడివేడిగా చర్చ జరిగింది. 'వీబీ- జీ రామ్ జీ' సహా మొత్తం 8 కీలక బిల్లులు ఆమోదం పొందాయి. వాయు కాలుష్యంపై చర్చ జరగాల్సి ఉన్నా.. అది కార్యరూపం దాల్చలేదు. పార్లమెంటు శీతాకాల సమావేశాలు ఈ నెల 1న మొదలైన సంగతి గమనార్హం.

విపక్ష సభ్యులు ఆత్మావలోకనం చేసుకోవాలి: రాజ్యసభ ఛైర్మన్

వీబీ- జీ రామ్ జీ బిల్లుపై ఓటింగ్ సందర్భంగా రాజ్యసభలో విపక్ష సభ్యులు గురువారం రాత్రి వ్యవహరించిన తీరును ఛైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ శుక్రవారం తీవ్రంగా ఖండించారు. నినాదాలు చేయడం, ప్లకార్డులు ప్రదర్శించడం, మంత్రి ప్రసంగానికి అడ్డుతగలడం, పేపర్లు చించేయడం, వాటిని వెల్‌లోకి విసరడం వంటి చర్యలు ఎంపీల స్థాయికి తగినట్లు లేవన్నారు. విపక్ష నాయకులు ఆత్మావలోకనం చేసుకొని.. భవిష్యత్తులో అలా వ్యవహరించకుండా ఉండాలని సూచించారు. రాజ్యసభను నిరవధికంగా వాయిదా వేస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తాజా సమావేశాలు దాదాపు 92 గంటల పాటు సాగాయని పేర్కొన్నారు.

గ్రీన్‌కార్డ్ లాటరీని నిలిపేసిన ట్రంప్

వాషింగ్టన్: బ్రౌన్ యూనివర్సిటీ, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ)లలో జరిగిన తుపాకీ కాల్పుల ఘటనల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. గ్రీన్‌కార్డ్ లాటరీ ప్రోగ్రామ్‌ను నిలిపివేశారు. ఈ ఘటనలకు పాల్పడిన నిందితుడు గ్రీన్‌కార్డ్ లాటరీ కార్యక్రమం ద్వారానే అమెరికాకు వచ్చినట్లు గుర్తించడంతో గురువారం ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. అమెరికా జాతీయ భద్రతా శాఖ మంత్రి క్రిస్టీ నోయెమ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. ట్రంప్ ఆదేశాల మేరకు గ్రీన్‌కార్డ్ లాటరీ ప్రోగ్రామ్‌ను వెంటనే నిలిపివేయాలని అమెరికా ఇమిగ్రేషన్ సేవల విభాగానికి సూచించినట్లు ఆమె తెలిపారు. ట్రంప్ మొదటి నుంచీ డైవర్సిటీ వీసా లాటరీ పద్ధతిని వ్యతిరేకిస్తున్నారు. కాల్పుల ఘటనలతో దాని అమలును ఆపివేయించారు. అమెరికాకు వలస వచ్చిన జనాభాలో ప్రాతినిధ్యం తక్కువగా ఉన్న దేశాలకు తగిన ప్రాధాన్యం కల్పించేందుకు గాను 'డైవర్సిటీ వీసా లాటరీ' పద్ధతిని ప్రత్యేక చట్టం ద్వారా అమెరికా పార్లమెంటు అమల్లోకి తెచ్చింది.

సైన్సుతో సంప్రదాయ వైద్యం జట్టు కట్టాలి

- ప్రధాని మోదీ


ప్రధాని మోదీతో టెడ్రోస్

దిల్లీ: సంప్రదాయ వైద్యానికి అర్హతకు తగ్గ స్థానం ఇంతవరకూ లభించలేదని ప్రధాని మోదీ శుక్రవారం పేర్కొన్నారు. ఈ వైద్యానికి జనబాహుళ్యంలో ఆదరణ, విశ్వాసం పెంపొందాలంటే అది విజ్ఞానశాస్త్రంతో జట్టుకట్టాలని ఆయన అన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) సంప్రదాయ వైద్యంపై నిర్వహించిన సదస్సులో మోదీ ప్రసంగించారు. పరిశోధనను బలోపేతం చేయడం, డిజిటల్ టెక్నాలజీ వినియోగం, విశ్వసనీయమైన నియంత్రణ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవడం ఈ వైద్యానికి ఊతమిస్తాయని పేర్కొన్నారు. "భారత్ ఈ విషయంపై నిరంతరం పనిచేస్తోంది. ఉదాహరణగా అశ్వగంధ ప్రభావాన్ని గురించి మీరు ఈ సదస్సులోనే చూశారు. కొవిడ్ కాలంలో దాని వైద్య ప్రభావం ప్రపంచానికి తెలిసి వచ్చి డిమాండు విపరీతంగా పెరిగిపోయింది" అని ప్రధాని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని ఆయుష్‌కు సంబంధించి "మై ఆయుష్" పేరుతో రూపొందించిన సమగ్ర సేవల పోర్టల్‌ను ప్రారంభించారు. ఆయుష్ ఉత్పత్తులు, సేవలకు ప్రమాణంగా నిలిచే ఆయుష్ మార్క్‌ను కూడా ఆవిష్కరించారు. అశ్వగంధ ఔషధిపై పోస్టల్ స్టాంపునూ విడుదల చేశారు.

★ సంప్రదాయ వైద్యం ఆధునిక జగతి ఎదుర్కొంటున్న అనేక ఆరోగ్య సమస్యల పరిష్కారానికి సాయపడగలదని డబ్ల్యూహెచ్‌వో డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ అధనోమ్ పేర్కొన్నారు. ఆధునిక విజ్ఞాన శాస్త్రం, సంప్రదాయ విజ్ఞానం ఒకదాన్ని మరొకటి పరిపూర్ణం చేస్తాయని భారత్ ప్రపంచానికి చాటిందని ఆయన అన్నారు.

'ఎక్స్'లో మోదీ హవా.. టాప్ 10 పోస్టుల్లో 8 ప్రధానివే

ప్రధాని నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమాల్లో ఎప్పుడూ చురుకుగా ఉంటారు. విదేశాల సందర్శనలు, ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించిన విషయాలను 'ఎక్స్'లో పంచుకుంటారు. తాజాగా ఎక్స్ నిర్వహించిన "మోస్ట్ లైక్డ్" సర్వేలో మోదీ హవా కొనసాగింది. గత 30 రోజుల్లో భారత్‌లో అత్యధిక లైక్‌లు పొందిన 10 ట్వీట్లలో 8 ట్వీట్లు ప్రధానివే ఉన్నట్లు ఆ సంస్థ వెల్లడించింది. వీటిలో రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత పర్యటనకు వచ్చినప్పుడు ఆయనకు ప్రధాని భగవద్గీత(రష్యా ఎడిషన్)ను బహుమతిగా ఇచ్చిన పోస్టు 6.7 మిలియన్ల వ్యూస్, 2 లక్షలకు పైగా లైకులతో మొదటి స్థానంలో ఉంది. మిగిలిన స్థానాల్లో పుతిన్ పర్యటనకు సంబంధించిన రెండు పోస్టులు, వేదమూర్తి దేవవ్రత్ గురించి చేసిన పోస్టు, అయోధ్యలో ధ్వజారోహణ పోస్టు, ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్‌కు వివాహ శుభాకాంక్షలు చెప్పిన పోస్టు, టీ20 వరల్డ్ కప్‌లో భారత అంధ మహిళల క్రికెట్ జట్టు విజయం సాధించిన పోస్టు, ప్రధాని ఒమన్‌కు వెళ్లినప్పుడు అక్కడి ప్రభుత్వం ఆయనకు అత్యున్నత పురస్కారం అందించిన పోస్టులు ఉన్నాయి.

మానసిక ఆరోగ్యానికి సూత్రాలు



- ✦ చక్కెరను దూరం పెట్టాలి.
- ✦ కృతజ్ఞత కలిగి ఉండాలి.
- ✦ ఎదుటివారిని నవ్వుతూ పలకరించాలి.
- ✦ వద్దు అని చెప్పడం నేర్చుకోవాలి.
- ✦ మిమ్మల్ని మీరు క్షమించుకోవాలి.
- ✦ చన్నీళ్ల స్నానం చేయాలి.
- ✦ రోజూ 14 నుంచి 16 గంటల ఉపవాసం పాటించాలి.
- ✦ కఠినమైన కసరత్తులు చేయాలి.
- ✦ రోజూ 20 నిమిషాలు ఎండలో ఉండాలి.

– కాసెనెనే, న్యూట్రిషియన్


లోక్‌సభ స్పీకర్ ఇచ్చిన తేనీటి విందులో ప్రధాని మోదీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక

మోదీ, ప్రియాంకాగాంధీ స్నేహపూర్వక సంభాషణ

దిల్లీ: పార్లమెంటు శీతాకాల సమావేశాల ముగింపు నేపథ్యంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా వివిధ పార్టీల నేతలకు తేనీటి విందు ఏర్పాటుచేశారు. దానికి హాజరైన ప్రధాని మోదీ, కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకాగాంధీ స్నేహపూర్వకంగా మాట్లాడుకున్నారు. తాను మలయాళం నేర్చుకుంటున్నానని, వయనాడ్ నియోజకవర్గ ప్రజలతో మాట్లాడేందుకు అది ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా ప్రధానికి ప్రియాంక చెప్పారు. జోర్డాన్, ఇథియోపియా, ఒమన్‌లలో తాజాగా చేపట్టిన పర్యటనల గురించి మోదీని వయనాడ్ ఎంపీ ప్రియాంక అడిగారు. ఆయన బదులిస్తూ.. ఇథియోపియా సామాజికంగా, ఆర్థికంగా పురోగతి సాధిస్తోందని తెలిపారు.

తమిళనాడు, గుజరాత్‌లలో 1.71 కోట్ల ఓట్ల తొలగింపు

దిల్లీ: తమిళనాడు, గుజరాత్‌లలో ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ చేపట్టిన ఎన్నికల సంఘం (ఈసీ) శుక్రవారం ముసాయిదా ఓటరు జాబితాలను విడుదల చేసింది. ఈ ఏడాది అక్టోబరు 27 నాటికి రెండు రాష్ట్రాల్లో కలిపి 11.49 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. తాజా ముసాయిదాల్లో 9.78 కోట్ల మంది మాత్రమే చోటు దక్కించుకోగలిగారు. దీంతో ఏకంగా 1.71 కోట్ల ఓట్లను ఈసీ తొలగించినట్లయింది. తమిళనాడులో 6.41 కోట్ల మంది ఓటర్లకుగాను 5.43 కోట్ల మంది (84.81%) మాత్రమే ఎన్యూమరేషన్ ఫారమ్‌లను సమర్పించారని ఈసీ తెలిపింది. గుజరాత్‌లో 5.08 కోట్ల మంది ఓటర్లకుగాను 4.34 కోట్ల మంది (85.50%) ఆ ఫారమ్‌లను సమర్పించారని వెల్లడించింది. తమిళనాడులో 98 లక్షలు, గుజరాత్‌లో 73.73 లక్షల ఓట్లను ఈసీ తొలగించింది.

బెట్టింగ్ యాప్ కేసు.. యూవీ, సోనూసూద్ ఆస్తుల జప్తు



దిల్లీ: అక్రమ బెట్టింగ్ యాప్‌నకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో విచారణ ముమ్మరంగా సాగుతోంది. ఈ కేసులో తాజాగా మాజీ క్రికెటర్లు యువరాజ్ సింగ్(యూవీ), రాబిన్ ఉతప్ప, బాలీవుడ్ నటీనటులు సోనూసూద్, నేహా శర్మల ఆస్తుల్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) జప్తుచేసింది. ఆ జాబితాలో నటి ఊర్వశీ రౌతేలా తల్లితో పాటు తృణమూల్ మాజీ ఎంపీ మిమీ చక్రవర్తి, అంకుశ్ హజ్రా (బెంగాలీ నటుడు) కూడా ఉన్నారు. ఈ కేసులో దర్యాప్తు సంస్థ వీరిని ఇప్పటికే విచారించగా.. తాజాగా జప్తుచేసిన ఆస్తుల మొత్తం విలువ రూ.7.93 కోట్లని ఈడీ ఒక ప్రకటనలో తెలిపింది.

గతంలో మాజీ క్రికెటర్లు సురేశ్ రైనా, శిఖర్ ధావన్‌కు చెందిన రూ.11.14 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ జప్తుచేసిన సంగతి తెలిసిందే.

జర్మన్ మేధావి వర్గాలతో రాహుల్ చర్చలు



దిల్లీ: ప్రస్తుతం జర్మనీ పర్యటనలో ఉన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ శుక్రవారం ఆ దేశంలోని మేధావి వర్గాలతో సంభాషించారు. వేగంగా మారుతున్న భౌగోళిక పరిస్థితుల్లో భారత అనుసరిస్తున్న పథంపై ఆయన మాట్లాడారు. బెర్లిన్‌లోని హెర్టీ పాఠశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన విద్యార్థి, అధ్యాపక, వైజ్ఞానిక వర్గాలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాస్వామ్యం అంటే కేవలం ఒక పరిపాలనా విధానం కాదని, ప్రజాస్వామ్యం అంటే జవాబుదారీతనం అని అన్నారు. తన వ్యక్తిగత, రాజకీయ అనుభవాలను పంచుకున్నారు. ప్రపంచం అధికార పరివర్తన దశలో ఉందని పేర్కొన్నారు. భారత ప్రజాస్వామ్య స్థితిగతుల్ని గురించి మాట్లాడారు. అందరినీ కలుపుకొని పోయే సమగ్ర విద్యా విధానం అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారని కాంగ్రెస్ పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. నిజంతో ప్రయోజనం లేదని, అధికారమే ప్రధానమని ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భాగవత్ ఇటీవల చేసిన ప్రకటనను ఆయన ప్రస్తావించారు. "వారికి అధికారం ముఖ్యమైతే మాకు సత్యమే ప్రధానం, అదీ మాకూ వాళ్లకూ ఉన్న తేడా" అని రాహుల్ అన్నారు. జర్మనీలోని భారతీయ సంతతిని ఆయన కొనియాడారు. జర్మనీ వైస్ ఛాన్సలర్ లార్స్ క్లింగ్‌బెల్, మాజీ ఛాన్సలర్ ఒలాఫ్ షోల్జ్‌లతో ఆయన వేర్వేరుగా సమావేశమయ్యారు.

రేవుల భద్రతకు ప్రత్యేక సంస్థ

- కేంద్రం నిర్ణయం


పోర్టుల భద్రతపై దిల్లీలో జరిగిన సమావేశంలో పాల్గొన్న కేంద్రమంత్రులు సర్బానంద సోనోవాల్, అమిత్ షా, రామ్మోహన్ నాయుడు

దిల్లీ: రేవుల భద్రతను పటిష్ఠం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం "బ్యూరో ఆఫ్ పోర్ట్ సెక్యూరిటీ" (బీఓపీఎస్) అనే ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయనుందని అధికారులు శుక్రవారం వెల్లడించారు. ఈ సంస్థ రేవులు, నౌకలకు సంబంధించిన భద్రతా సంబంధ సమాచార సేకరణ, విశ్లేషణ, వితరణ కార్యకలాపాలు చేపడుతుందని ఆ అధికారులు వివరించారు. రేవుల భద్రతకే అంకితం కానున్న బీఓపీఎస్ సంస్థ ఏర్పాటుకు సంబంధించి కేంద్ర హోంమంత్రి అమిత్ షా గురువారం ఒక సమావేశం నిర్వహించారు, ఈ సమావేశంలో రేవులు, నౌకాయానం, జల రవాణా మంత్రి సర్బానంద సోనోవాల్, పౌర విమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు పాల్గొన్నారు అని అధికారిక ప్రకటన తెలియజేసింది. దేశవ్యాప్తంగా ఒక పటిష్ఠమైన రేవుల భద్రతా చట్రాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని అమిత్ షా ఈ సమావేశంలో నొక్కిచెప్పారు. సముద్రయాన భద్రతా ఏర్పాట్ల నుంచి నేర్చుకున్న విషయాలనే వైమానిక భద్రతా చట్రంలోనూ పొందుపరుస్తామని ఈ సమావేశం తీర్మానించినట్టు అధికార ప్రకటన తెలిపింది. ప్రతిపాదిత బీఓపీఎస్ సంస్థకు ఒక సీనియర్ ఐపీఎస్ అధికారిని డైరెక్టర్ జనరల్‌గా నియమిస్తారు. ఒక ఏడాది పాటు నౌకాయాన విభాగం డైరెక్టర్ జనరల్ బీఓపీఎస్‌కు కూడా డీజీగా వ్యవహరిస్తారని అధికార ప్రకటన వివరించింది. కేంద్రం సీఐఎస్‌ఎఫ్‌ను రేవులకు భద్రత కల్పించే సంస్థగా గుర్తింపునిచ్చింది. రేవుల భద్రతకు బాధ్యత వహిస్తున్న ప్రైవేటు సంస్థల సామర్థ్య మెరుగుదలకు సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్(సీఏపీఎఫ్) ద్వారా ఆయా సంస్థలకు శిక్షణ ఇప్పించాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది.


ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవడంతో హిమాచల్‌ప్రదేశ్‌లోని లాహౌల్ స్పితి లోయలో గడ్డకట్టిన ఓ జలపాతం వద్ద శుక్రవారం పర్యాటకుల సందడి


బిహార్‌లో ఓటు చోరీకి ఇదిగో సాక్ష్యం

- మాంఝీ వీడియోను వైరల్ చేస్తున్న విపక్షం

పట్నా: ఐదేళ్ల క్రితం బిహార్ ఎన్నికల్లో తక్కువ ఓట్లతో వెనుకంజలో ఉన్న ఒక అభ్యర్థి గెలుపునకు తాను సాయం అందించానని కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ చాటుకుంటున్నట్టు తెలియజేసే ఒక వీడియో పెను వివాదం రేపుతోంది. మాంఝీ లోక్‌సభ నియోజకవర్గమైన గయలో ఈ వీడియోను చిత్రీకరించారు. దీన్ని ఆర్జేడీ-కాంగ్రెస్ కూటమి వైరల్ చేస్తోంది. భాజపా నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి "ఓటు చోరీ"కి పాల్పడిందనడానికి ఇదొక సాక్ష్యమని ప్రతిపక్ష కూటమి ఆరోపిస్తోంది. అయితే ఈ వీడియోను ట్యాంపర్ చేసి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని మాంఝీ స్పష్టంచేశారు. ఎన్డీఏ భాగస్వామి అయిన హిందుస్థానీ ఆవామ్ మోర్చా పార్టీకి మాంఝీ నేతృత్వం వహిస్తున్నారు. ఆ పార్టీకి చెందిన అనిల్ కుమార్ అనే అభ్యర్థి టికారీ శాసనసభ నియోజక వర్గం నుంచి 2020 ఎన్నికల్లో విజయం సాధించారు. అయితే ఆయన ఇటీవలి ఎన్నికల్లో ఆర్జేడీ అభ్యర్థి చేతిలో ఓడిపోయారు. ఈ నియోజకవర్గానికి సంబంధించి మాంఝీ మాట్లాడుతూ "2020 శాసనసభ ఎన్నికల్లో అనిల్ కుమార్ 2700 ఓట్లతో వెనుకంజలో ఉన్నట్టు నాకు సమాచారం అందింది. నేను వెంటనే సంబంధిత అధికారికి ఫోన్ చేశాను. చివరికి అనిల్‌కుమార్ గెలుపొందినట్టు అధికారులు ప్రకటించారు" అని మాంఝీ అన్నట్టు వీడియో తెలియజేస్తోంది. అయితే ఈ వీడియో వాస్తవమైనదా కాదా అన్నది వెంటనే తెలియలేదు.

ఆ వీడియో బూటకం

సుధామూర్తి



ఇంటర్నెట్ డెస్క్: అధిక రాబడులు పొందడానికి కొన్ని సంస్థల్లో పెట్టుబడులు పెట్టాలని తాను సూచిస్తున్నట్లుగా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వీడియో బూటకమని రాజ్యసభ సభ్యురాలు సుధామూర్తి స్పష్టం చేశారు. ఫలానాచోట పెట్టుబడులు పెట్టాలని తాను ఎప్పుడూ చెప్పనని.. ఇటువంటి డీప్‌ఫేక్ వీడియోల మాయలో పడొద్దని ప్రజలకు సూచించారు. వైరలైన వీడియోలో.. ఆయా సంస్థల్లో పెట్టుబడులు పెట్టడానికి తెరపై కనిపిస్తున్న లింకును క్లిక్ చేయమని వీక్షకులను సుధామూర్తి కోరుతున్నట్లుగా ఉంది. "ఇప్పటికే ఇందులో చాలామంది పెట్టుబడులు పెట్టి, నెలకు రూ.10 లక్షల వరకు సంపాదిస్తున్నారు. ఎక్కువమంది చేరుతున్నందున రిజిస్ట్రేషన్లను నేటితో ముగిస్తున్నాం. చేరాలనుకునేవారు వెంటనే చేరండి" అని సుధామూర్తి చెబుతున్నట్లు ఉంది. ఇటువంటి వీడియోల వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు.

పౌరుల స్వేచ్ఛ ప్రభుత్వ బాధ్యత.. బహుమతి కాదు

- సుప్రీంకోర్టు

దిల్లీ: మన రాజ్యాంగ వ్యవస్థలో పౌరుని స్వేచ్ఛ ప్రభుత్వం అందించే ఉచిత బహుమతి కాదు, అది ప్రభుత్వ మొదటి బాధ్యత అని సుప్రీంకోర్టు శుక్రవారం వ్యాఖ్యానించింది. పాస్‌పోర్టు రెన్యువల్ సమయంలో అధికారులు వ్యక్తి భావి ప్రయాణ వివరాలను తెలుసుకోవాల్సిన అవసరం లేదని జస్టిస్ విక్రంనాథ్, జస్టిస్ ఏజీ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. వ్యక్తిపై కేసు విచారణ జరుగుతున్నా క్రిమినల్ కోర్టు తన పర్యవేక్షణలో ప్రయాణ అవకాశాల్ని తెరచి ఉంచిందా అన్నది చూడటమే పాస్‌పోర్టు అధికారుల విధి అని ధర్మాసనం స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని 21వ అధికరణం న్యాయబద్ధమైన రీతిలో ప్రయాణం చేయడానికి, తనకు ఇష్టమైన జీవనోపాధిని ఎంచుకోడానికి, అవకాశాలను అందిపుచ్చుకోడానికి ప్రతి పౌరునికీ భరోసా ఇచ్చిందని ధర్మాసనం పేర్కొంది. న్యాయ ప్రక్రియలో పొందుపరచిన భరోసాలు కఠినమైన అవరోధాలుగా, తాత్కాలిక నిషేధాలు శాశ్వత అడ్డంకులుగా మారినప్పుడు ప్రభుత్వ అధికారానికి, వ్యక్తి గౌరవానికి మధ్య సమతుల్యత నశిస్తుంది, రాజ్యాంగం ఇచ్చిన భరోసాకు ముప్పు ఏర్పడుతుంది, అని న్యాయమూర్తులు అన్నారు. బొగ్గు గనుల కేటాయింపు కుంభకోణంలో అక్రమ కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ) కింద నేర నిర్ధారణ జరిగి శిక్ష అనుభవిస్తున్న మహేశ్ కుమార్ అగర్వాల్ తన పాస్‌పోర్టు రెన్యువల్‌కు అనుమతి ఇవ్వాల్సిందిగా కోరుతూ దాఖలుచేసిన అభ్యర్థనపై స్పందిస్తూ కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

ఉత్తరాదిపై మంచు దుప్పటి

దిల్లీకి ఐఎండీ రెడ్ అలర్ట్.. 177 విమానాల రద్దు

దిల్లీ: ఉత్తర భారతాన్ని పొగమంచు కప్పేసింది. పంజాబ్, హరియాణా, దిల్లీ, ఉత్తర్‌ప్రదేశ్, ఈశాన్య మధ్యప్రదేశ్ సహా బిహార్ రాష్ట్రాలపై పొగమంచు దుప్పటిలా అలముకుంది. ఉపగ్రహ చిత్రాల ద్వారా ఈ విషయం వెల్లడైందని భారత వాతావరణ కేంద్రం(ఐఎండీ) తెలిపింది. శుక్రవారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో అతి సమీపంలోని వాహనాలు సైతం కనిపించని పరిస్థితి ఎదురైందని పేర్కొంది. ఈ క్రమంలోనే దిల్లీకి రెడ్ అలర్ట్‌ను జారీ చేసింది. పొగమంచు కారణంగా రోడ్డు, రైలు, వాయు మార్గాల్లో రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని హెచ్చరించింది. ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్‌లలోని పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది. మంచువల్ల దిల్లీ విమానాశ్రయంలో దాదాపు 177 విమానాలు రద్దు అయ్యాయి. మరో 500 విమానాలు కనీసం 49 నిమిషాలు ఆలస్యంగా నడిచాయి.

ఐరాస శరణార్థుల సంస్థ అధిపతిగా బర్హమ్ సలీహ్

న్యూయార్క్: ఇరాక్ మాజీ అధ్యక్షుడు బర్హమ్ సలీహ్‌ను ఐక్యరాజ్యసమితి శరణార్థి సంస్థ తరువాతి అధిపతిగా సమితి జనరల్ అసెంబ్లీ గురువారం ఆమోదించింది. 1970ల తరువాత పశ్చిమాసియాకు చెందిన వ్యక్తి మొదటిసారి ఈ పదవికి ఎంపికయ్యారు. 193 మంది సభ్యులున్న సర్వ ప్రతినిధి సభ 65 ఏళ్ల వయసు గల కుర్దిష్ రాజకీయ నాయకుడైన బర్హమ్ సలీహ్‌ను ఐరాస శరణార్థుల హైకమిషనర్‌గా ఏకాభిప్రాయంతో ఎన్నుకుంది. సలీహ్‌ను ఈ పదవికి సిఫార్సు చేసిన ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ మాట్లాడుతూ.. 'సీనియర్ దౌత్యవేత్తగా.. సలీహ్‌కున్న రాజకీయ, పరిపాలన అనుభవాన్ని కొత్త పదవిలో సమర్థంగా వినియోగించుకుంటారు' అని తెలిపారు. 'శరణార్థిగా తన అనుభవాలు.. సానుభూతి, కార్యాచరణ, అంతర్జాతీయ చట్టాలపై ఆధారపడిన నాయకత్వాన్ని అందించడానికి ఉపయోగపడుతుంది' అని సలీహ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఉక్రెయిన్‌లోకి చొచ్చుకుపోతున్నాం: పుతిన్

మాస్కో: ఉక్రెయిన్ భూభాగంలోకి తమ దళాలు చొచ్చుకుపోతున్నాయని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శుక్రవారం ప్రకటించారు. నాలుగేళ్ల యుద్ధం అనంతరం రష్యా తన సైనిక లక్ష్యాలను సాధించడానికి చేరువలో ఉందని ఆయన అన్నారు. "రష్యన్ సేనలు వ్యూహాత్మకంగా పూర్తి నియంత్రణతో ముందుకు సాగుతున్నాయి. సంవత్సరాంతానికి మరిన్ని విజయాలు సాధిస్తాయి. యుద్ధరంగంలో మా సేనలు అన్ని వైపులా ముందుకు వెళ్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో వేగంగా, కొన్ని చోట్ల మందకొడిగా సాగుతున్నాయి. అయితే అన్ని చోట్లా శత్రువు వెనకడుగు వేస్తున్నాడు" అని పుతిన్ పేర్కొన్నారు. మరోవైపు.. ఉక్రెయిన్‌కు 9 వేల కోట్ల యూరోల వడ్డీలేని రుణం అందించేందుకు యూరోపియన్ యూనియన్ శుక్రవారం అంగీకరించింది.

నేషనల్ హెరాల్డ్ కేసు తీర్పును హైకోర్టులో సవాలుచేసిన ఈడీ

దిల్లీ: నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్‌గాంధీలపై దాఖలుచేసిన ఛార్జిషీట్లను దిగువకోర్టు పరిగణనలోకి తీసుకోకపోవడాన్ని సవాలుచేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. దిగువకోర్టు జడ్జి విశాల్ గోగ్నే ఈ నెల 16వ తేదీన ఇచ్చిన తీర్పును సవాలుచేస్తూ 17వ తేదీనే ఈడీ హైకోర్టుకు వెళ్లింది. ఈ పిటిషన్‌ను కోర్టు వచ్చే వారం విచారణకు స్వీకరించే అవకాశం ఉంది.



ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్ జంతు ప్రదర్శనశాలలో శీతలగాలుల నుంచి రక్షణ కల్పించేందుకు సింహం, పులి బోన్ల సమీపంలో ఏర్పాటు చేసిన హీటర్లు

ఈ జాగ్రఫీ సారు తీరే వేరు

- అరుదైన నాణేల సేకరణ..
- వేలాది తాటిచెట్ల సంరక్షణ



ఈటీవీ భారత్: పశ్చిమబెంగాల్‌లోని హుగ్లీ జిల్లా పాండువాకు చెందిన భూగోళశాస్త్ర ఉపాధ్యాయుడు భాస్కర్ మండల్ 20 దేశాలకు చెందిన 3,000 నాణేలు, నోట్లను సేకరించి భద్రపరిచారు. చిన్ననాటి నుంచీ ఉన్న ఆసక్తితో మొగలులు, దిల్లీ సుల్తానులు, బ్రిటిషు కాలం నాటి వెండి, రాగి నాణేలు సేకరించిన భాస్కర్ 33 ఏళ్లుగా బోధనా వృత్తిలో ఉన్నారు. ఆయన దగ్గర భారతీయ నాణేలతోపాటు అమెరికా, నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, మలేసియా, ఇండోనేసియా, థాయ్‌లాండ్, మయన్మార్ వంటి దేశాల నాణేలు కూడా ఉన్నాయి. ఈ నాణేలను విద్యార్థులకు చూపించి వాటి చరిత్రను ఆయన చెబుతుంటారు. భాస్కర్‌కు ఈ అభిరుచితోపాటు పర్యావరణ పరిరక్షణపైనా ఎంతో ఆసక్తి. పిడుగుపాట్ల నుంచి రైతులను రక్షించడానికి 75,000 తాటిచెట్లను నాటి, సంరక్షించడం ద్వారా గతంలో ఆయన వార్తల్లో నిలిచారు.






దిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి అరకు కాఫీ ఉత్పత్తులు అందిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో లావు శ్రీకృష్ణదేవరాయలు, మాగుంట శ్రీనివాసులురెడ్డి ★ పోర్టులు, షిప్పింగ్, జల రవాణా శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్‌తో సీఎం చంద్రబాబు ఆత్మీయ ఆలింగనం ★ హర్దీప్‌సింగ్ పురీతో భేటీ అయిన సీఎం చంద్రబాబు ★ తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో కూటమి ఎంపీలతో సీఎం చంద్రబాబు



కేంద్ర గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను సన్మానించిన ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీలు బస్తిపాటి నాగరాజు, కలిశెట్టి అప్పలనాయుడు, శ్రీభరత్, మాగుంట శ్రీనివాసులురెడ్డి, హరీష్‌మాథుర్

విభజన చట్టంలోని సాగునీటి ప్రాజెక్టులకు సాయం చేయండి

- జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు చంద్రబాబు విజ్ఞప్తి

ఈనాడు, దిల్లీ: "రాష్ట్రంలో చేపట్టిన ప్రధాన సాగునీటి, తాగునీటి ప్రాజెక్టులకు వేగంగా సాయం అందించండి. విభజన చట్టంలో పేర్కొన్న ప్రాజెక్టుల పూర్తికి అత్యవసరంగా నిధులివ్వాలి. దీర్ఘకాల సమస్యల పరిష్కారానికి ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం ఏర్పాటు చేయండి. రాష్ట్రానికి నీటిభద్రత ముఖ్యం కాబట్టి తాగునీరు, సాగునీటి అవసరాలు తీర్చే విషయంలో కేంద్ర-రాష్ట్రాల సమన్వయంతో పనిచేయాలి" అని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను సీఎం చంద్రబాబు కోరారు. ఆయన శుక్రవారం ఇక్కడ సీఆర్ పాటిల్‌తో గంటపాటు సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. ◆ "జలజీవన్ మిషన్‌కు 2025-26లో రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి. రాష్ట్రప్రభుత్వం తన వాటా కింద ఇప్పటికే రూ.524.21 కోట్లు ఖర్చుచేసింది. కేంద్రం తన వాటాను త్వరగా విడుదల చేయాలి. పీఎంకేఎస్‌వై-ఆర్ఆర్ఆర్ స్కీం కింద చెరువులు, కాలువల పునరుద్ధరణకు కేంద్రం నిధులివ్వాలి. ◆ పోలవరం ప్రాజెక్టుకు ఇవ్వాల్సిన నిధులకు వెంటనే అనుమతులివ్వాలి. ప్రాజెక్టు రెండోదశ పనులకు నిధుల కోసం త్వరలో డీపీఆర్ సమర్పిస్తాం. ◆ శ్రీకాకుళం జిల్లాలోని కరవు నివారణకు నేరడి బ్యారేజ్ నిర్మించాలి. కాబట్టి వంశధార ట్రైబ్యునల్ తీర్పును వెంటనే అమల్లోకి తేవాలి. ఆంధ్రప్రదేశ్ హక్కుల భద్రత కోసం కేంద్రం స్పష్టమైన మార్గదర్శకాలు జారీచేయాలి. ◆ కర్ణాటక ప్రభుత్వం తలపెట్టిన ఆలమట్టి డ్యాం ఎత్తు పెంపు ఆంధ్రప్రదేశ్‌పై తీవ్ర ప్రభావం చూపుతుంది. దాన్ని కేంద్రం అడ్డుకోవాలి. ఇందుకోసం కర్ణాటక ప్రభుత్వం ఇప్పటికే భూసేకరణ ప్రారంభించింది. ఈ అంశం ఇంకా సుప్రీంకోర్టు ముందు పెండింగ్‌లో ఉన్నందున కేంద్రం కర్ణాటక ప్రభుత్వాన్ని నిలువరించాలి" అని చంద్రబాబు కోరారు.



దిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు శ్రీవేంకటేశ్వరస్వామి ప్రతిమ అందజేస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీ కేశినేని శివనాథ్, రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్

కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో చంద్రబాబు భేటీ

ఈనాడు, దిల్లీ: ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం సాయంత్రం ఇక్కడి తాజ్‌ప్యాలెస్ హోటల్లో కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు. క్రెడాయ్ జాతీయ సదస్సుకు హాజరయ్యే ముందు వారిద్దరూ సమావేశమయ్యారు. ఏపీ ప్రభుత్వం ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన పెట్టుబడుల సదస్సుకు వచ్చిన స్పందన గురించి ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అమిత్ షాకు వివరించారు. రాష్ట్రంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, రాజకీయ పరిస్థితులపై చర్చించారు.

అమరావతి నిర్మాణంలో భాగస్వాములు కండి

చంద్రబాబు శుక్రవారం సాయంత్రం ఇక్కడ జరిగిన భారత రియల్ ఎస్టేట్ డెవలపర్ల సంఘాల సమాఖ్య (క్రెడాయ్) జాతీయ సదస్సులో పాల్గొన్నారు. ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్లతో సంప్రదింపులు జరిపారు. అమరావతికున్న ప్రత్యేక సానుకూలతలు, అక్కడున్న దీర్ఘకాల అవసరాలను వివరించారు. రాజధాని నిర్మాణంలో భాగస్వాములు కావాలని వారికి పిలుపునిచ్చారు. 'దేశానికి, భావితరాలకు సరిపోయే ఆధునిక నగరం నిర్మించే అవకాశం అరుదుగా వస్తుంది. అమరావతి నిర్మాణం కూడా మన తరానికి దక్కిన అవకాశం. డెవలపర్లు ఇక్కడ ధైర్యంగా పెట్టుబడులు పెట్టి, ల్యాండ్‌మార్క్ ప్రాజెక్టులు నిర్మించండి' అని పిలుపునిచ్చారు. ఈ మేరకు 'ఎక్స్'లోనూ పోస్టు చేశారు.



కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో ముఖ్యమంత్రి చంద్రబాబు

మెట్రో ప్రాజెక్టులకు ఆమోదముద్ర వేయండి

కేంద్ర మంత్రి ఖట్టర్‌ను కోరిన సీఎం

ఈనాడు, దిల్లీ: విభజన చట్టంలో ఇచ్చిన హామీ ప్రకారం విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టులకు ఆమోదముద్ర వేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను కోరారు. దిల్లీ పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం కేంద్ర మంత్రిని కలిసి, ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించిన సవరించిన డీపీఆర్‌లను సమర్పించి, వాటి ప్రాధాన్యాన్ని వివరించారు. రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ రెండు నగరాల్లో వేగంగా మెట్రోరైలు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని కోరారు. "ఈ రెండు నగరాలు జనాభా పరంగా, ఆర్థికంగా వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో అక్కడి ప్రజలకు ఆధునిక రవాణా వ్యవస్థను అందుబాటులోకి తేవాల్సి ఉంది" అని వివరించారు.

హర్దీప్‌సింగ్ పూరీకి ఆహ్వానం: నెల్లూరు జిల్లాలో ఏర్పాటు చేయబోయే బీపీసీఎల్ గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ ప్రాజెక్టు శంకుస్థాపనకు రావాలని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆహ్వానించారు. "రూ.96,862 కోట్ల భారీ పెట్టుబడితో దేశంలోనే అతిపెద్ద సమీకృత ఇంధన ప్రాజెక్టును బీపీసీఎల్ ఏర్పాటు చేయబోతోంది. ఈ ప్రాజెక్టు కోసం ఏపీ ప్రభుత్వం ఇప్పటికే 6 వేల ఎకరాలు కేటాయించడంతో పాటు ఆకర్షణీయ ప్రోత్సాహకాలూ ప్రకటించింది. ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయడానికి కేంద్రం నుంచి సహకారం అందించండి. ఏపీలో సహజ వాయువు, ఎల్ఎన్‌జీ రంగంలో జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు సహకరించండి. ఎల్ఎన్‌జీ టెర్మినళ్లను మరింత అభివృద్ధి చేయండి. ఐఓసీఎల్, గెయిల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, పెట్రోనెట్ వంటి చమురు కంపెనీలు ఏపీ అభివృద్ధిలో భాగస్వాములయ్యేలా చూడండి" అని విన్నవించారు.

మెగా షిప్‌బిల్డింగ్ క్లస్టర్‌గా దుగరాజపట్నం

- అలా రూపొందించడానికి సహకరించండి
- కేంద్రమంత్రి సోనోవాల్‌ను కోరిన సీఎం

ఈనాడు, దిల్లీ: దుగరాజపట్నాన్ని నేషనల్ మెగా షిప్‌బిల్డింగ్, రిపేర్ క్లస్టర్‌గా అభివృద్ధి చేయడానికి కేంద్రం తరఫున సహకరించాలని కేంద్ర నౌకాయాన, పోర్టులు, జలరవాణా శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్‌కు సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఆయన శుక్రవారం కేంద్రమంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. "దుగరాజపట్నంలో మెగా షిప్‌బిల్డింగ్, రిపేర్ క్లస్టర్ అభివృద్ధికి 3,488 ఎకరాల భూమి సేకరించేందుకు అంగీకరించాం. ఇందుకు టెక్నో-ఎకనమిక్ ఫీజిబులిటీ నివేదిక కూడా సిద్ధమైంది. ఇక్కడే ఎంఎస్ఎంఈ యూనిట్లు, ఉమ్మడి మౌలిక వసతులతో సమగ్ర క్లస్టర్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాం. విభజన చట్టంలో పేర్కొన్న అంశాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టుకు ప్రాధాన్యం ఇవ్వండి.

ఫిషింగ్ హార్బర్లకు ఆర్థికసాయం అందించాలి: మత్స్యకారుల జీవనోపాధి మెరుగుదల కోసం రాష్ట్రంలో మొదటిదశలో రూ.1,361.49 కోట్లతో చేపట్టిన జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్లకు అదనపు నిధులు కేటాయించాలి. రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే రూ.782.29 కోట్లు ఖర్చుచేసింది. ఇప్పటివరకు కేంద్రం నుంచి జువ్వలదిన్నెకు రూ.138.29 కోట్లే మంజూరయ్యాయి. మిగిలిన మూడు హార్బర్లకు ఏమీ ఇవ్వలేదు. తొలిదశ ప్రాజెక్టు పూర్తికి ఇంకా రూ.440.91 కోట్లు కావాలి. ప్రకాశం జిల్లా వాడరేవు ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి సాగరమాల పథకం కింద రూ.150 కోట్లు మంజూరు చేయాలి. మొత్తంగా కేంద్రం రూ.590 కోట్లు ఇవ్వాలి" అని కేంద్రమంత్రిని సీఎం కోరారు.

తొలిసారి తెదేపా పార్లమెంటరీ కార్యాలయానికి..

ఈనాడు, దిల్లీ: నూతన పార్లమెంటు భవనంలో తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీకి కేటాయించిన కార్యాలయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు తొలిసారి సందర్శించారు. అక్కడే 40 నిమిషాల పాటు ఎంపీలతో మాట్లాడారు. 'ఏమీ లేని వైద్య కళాశాలల పీపీపీ అంశాన్ని జగన్ సమస్యగా చిత్రీకరించి ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. ఆ విషయంలోనూ ప్రజలు ఆయన మాటలు నమ్మలేదు. కోటి సంతకాల పేరుతో డ్రామా చేయాలని చేస్తే, అదీ విఫలమైంది' అని సీఎం వ్యాఖ్యానించారు. ఎంపీలు దిల్లీ ప్రభుత్వం చేపడుతున్న పీపీపీ విధానంపై అధ్యయనం చేయాలని సూచించారు.

నితిన్ నబీన్‌తో చంద్రబాబు భేటీ

ఈనాడు, దిల్లీ: భాజపా నూతన కార్యనిర్వాహక అధ్యక్షుడు నితిన్ నబీన్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. చంద్రబాబు తెదేపా ఎంపీలతో వెళ్లి ఇక్కడి బిహార్ భవన్‌లో నితిన్ నబీన్‌ను కలిసి జ్ఞాపికను బహూకరించి శాలువాకప్పి గౌరవించారు. సుమారు అరగంటపాటు ఆయనతో వివిధ అంశాలపై మాట్లాడారు. అనంతరం చంద్రబాబు విలేకర్లతో మాట్లాడుతూ ఒక్క ఎన్నికలో కూడా ఓడిపోకుండా గెలుస్తూ వస్తున్న యువకుడు, ఉత్సాహవంతుడైన నితిన్ నబీన్ నేతృత్వంలో భాజపా మరింత బలోపేతం కావడమేకాకుండా, దేశం కూడా పురోగమిస్తుందని ఆకాంక్షించారు.



నితిన్ నబీన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఎం చంద్రబాబు తదితరులు

జేజేఎం వాటర్ గ్రిడ్ పథకానికి 'అమరజీవి జలధార' పేరు

పోస్టర్ విడుదల చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: జలజీవన్ మిషన్ (జేజేఎం) వాటర్ గ్రిడ్ పథకానికి 'అమరజీవి జలధార' అని పేరు పెట్టారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మంగళగిరిలోని తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం విడుదల చేశారు. ఇందులో భాగంగా ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు సంబంధించిన అమరజీవి జలధార వాటర్ గ్రిడ్ పనులకు శనివారం ఉదయం నిడదవోలు నియోజకవర్గం పెరవలిలో ఉప ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. పథకానికి పేరు మార్చాక భూమి పూజ చేసే మొదటి ప్రాజెక్టు ఇదే కానుంది. ప్రకాశం జిల్లాలో చేపట్టే వాటర్ గ్రిడ్ పనులకు మార్కాపురంలో ఉప ముఖ్యమంత్రి ఇటీవలే శంకుస్థాపన చేశారు. జలజీవన్ మిషన్‌లో ఐదు ఉమ్మడి జిల్లాల్లో రూ.7,910 కోట్లతో ఐదు ప్రాజెక్టుల పనులు చేపట్టి వచ్చే 30 ఏళ్లలో 1.21 కోట్ల గ్రామీణుల దాహార్తి తీర్చాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అమరజీవి జలధార పథకం కింద రూ.3,050 కోట్లతో పనులు చేపట్టనున్నారు.



పోస్టరును ఆవిష్కరిస్తున్న పవన్ కల్యాణ్

మహనీయుడి పేరు పెట్టాం: పవన్‌కల్యాణ్

'తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం ఉండాలని దీక్షబూని ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును ప్రతి ఒక్కరూ నిత్యం తలుచుకునేలా ఆయన పేరు జేజేఎం వాటర్ గ్రిడ్ పథకానికి పెట్టాం. ఆ మహామనిషి త్యాగానికి నివాళిగా 'అమరజీవి జలధార' అని పేరు ఖరారు చేశాం' అని పవన్‌కల్యాణ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అనకాపల్లిలో సీఎం చంద్రబాబు పర్యటన నేడు

ఈనాడు డిజిటల్, అనకాపల్లి: 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం అనకాపల్లి జిల్లాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడతారు. బంగారయ్యపేటలోని సంపద కేంద్రాన్ని పరిశీలిస్తారు. మధ్యాహ్నం తాళ్లపాలెంలోని ప్రజావేదిక సభలో పాల్గొంటారు. అనంతరం ఉగ్గినపాలెం గ్రామంలో నియోజకవర్గ పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశమవుతారు. స్థానిక మత్స్యకారులతోనూ మాట్లాడతారు. సాయంత్రం అనకాపల్లిలో వాజ్‌పేయీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు.

ఎమ్మెల్యేల పనితీరు చిరస్థాయిగా నిలవాలి

- నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి
- పార్టీ కార్యక్రమాల నిర్వహణకు ప్రాధాన్యం
- జనసేన శాసనసభ్యులతో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్
- 9 మంది పార్టీ ఎమ్మెల్యేలతో విడివిడిగా భేటీ

ఈనాడు, అమరావతి: 'నియోజకవర్గంలో అభివృద్ధి, ఉపాధి అవకాశాలను గుర్తించి వాటిని నెరవేర్చేలా ప్రణాళికలు రూపొందించాలి. శాసనసభ్యుడిగా మనం ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి నియోజకవర్గ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోవాలి. ఆ తపనతోనే పనిచేయాలి. ప్రజలు మెచ్చేలా మన పనితీరు ఉండాలి' అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తన పార్టీ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి ఏం కావాలో తెలుసుకునేందుకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మంగళగిరిలో జనసేన పార్టీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆయన తొమ్మిది మంది పార్టీ ఎమ్మెల్యేలతో విడివిడిగా ముఖాముఖి భేటీ అయ్యారు. ఏడాదిన్నరగా తాము ఏం చేశామో వారు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. నామినేటెడ్ పదవులపై చర్చించారు. 'వర్తమాన, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి. పారిశ్రామికాభివృద్ధికి అనుకూలమైన వాతావరణం కల్పించాలి. యువతకు ఉపాధిపై దృష్టి సారించాలి. పార్టీ కార్యక్రమాల నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలి. కూటమి స్ఫూర్తిని బలంగా నిలపాలి. స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలి' అని పవన్‌కల్యాణ్ వారికి తెలియజేశారు. పార్టీ నిర్మాణంలో మచిలీపట్నం లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో పిఠాపురం ఫార్ములా అనుసరించాలని చెప్పారు.



ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో మాట్లాడుతున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్

ఎమ్మెల్యేలు విన్నవించిన అంశాలు

పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ: తోటపల్లి ఆధునికీకరణ పనులు చేపట్టాలి. పాలకొండ ప్రధాన రహదారి విస్తరించాలి. గెడ్డ, వడ్డండి ఎత్తిపోతల పథకాలకు నిధులు కావాలి. పాలకొండ డంపింగ్ యార్డుకు స్థలం అవసరం.

నెల్లిమర్ల ఎమ్మెలే లోకం నాగమాధవి: తారకరామ తీర్థ సాగరం ప్రాజెక్టు పూర్తి. నానో పార్కు అభివృద్ధి చేయాలి. ఏఐ సిటీ, ఫిషింగ్ హార్బర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించారు.

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్: సింహాచలం పంచగ్రామాల సమస్యను పరిష్కరించాలి. కాలుష్యం బారిన పడ్డ తాడి గ్రామాన్ని తరలించాలి. నరేగా నిధులు పెంచాలి.

ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్: నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కిడ్నీ సమస్యలు పెరుగుతున్నాయి. పరిష్కారానికి జలజీవన్ మిషన్ నిధులు కావాలి. ఎలమంచిలి-గాజువాక ప్రధాన రహదారి పనులు పూర్తిచేయాలి.

కాకినాడ గ్రామీణ ఎమ్మెల్యే పంతం నానాజీ: ఆరు గ్రామాలు, 8 వార్డుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగక ఆర్థికసంఘం నిధులు రావట్లేదు. వాటిని కార్పొరేషన్‌లో విలీనం చేయాలి. క్రికెట్ స్టేడియం, బీచ్ సుందరీకరణ, రోడ్లు, డ్రెయిన్ల ప్రతిపాదనలు సమర్పించారు.

పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ: వరద గట్లు బలోపేతం చేయాలి. గ్రోయిన్ల నిర్మాణం చేపట్టాలి. వైనతేయ నదిపై వంతెన నిర్మాణం పూర్తిచేయాలి. అయినవిల్లి, అప్పనపల్లి ఆదుర్రు గ్రామాల్లోని పుణ్యక్షేత్రాలను ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలి.

రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్: శంకరగుప్తం డ్రెయిన్‌ను డ్రెడ్జింగ్ చేయాలి. అంతర్వేది ఆలయ అభివృద్ధికి సహకరించాలి. హార్బర్ నిర్మాణం పూర్తిచేయాలి.

విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్: నియోజకవర్గంలో 22ఏ కింద ఉన్న భూముల్ని ఆ పరిధి నుంచి తొలగించాలి. పూర్ణబజార్, నెహ్రూమార్కెట్ కొత్తగా నిర్మించాలి. బీచ్‌రోడ్డును సుందరీకరించాలి.

అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్: నియోజకవర్గంలో రైతుసమస్యల పరిష్కారం, నీటిపారుదల పనుల విషయంపై చర్చించారు. తెలుగుభాష వాడుక పెంచేలా చూడాలని కోరారు.

సముద్రంలోకి పోయే నీటిలో 200 టీఎంసీలు వాడుకుంటే ఏం నష్టం?

- పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టుపై నీటిపారుదల మంత్రి నిమ్మల వ్యాఖ్య
- గోదావరి ట్రైబ్యునల్ ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రికి వినతి

ఈనాడు, దిల్లీ: "నదీ పరీవాహక ప్రాంతం చివరనున్న ఆంధ్రప్రదేశ్‌కు వరద జలాలను వాడుకొనే స్వేచ్ఛ ఉంటుంది. గోదావరి నుంచి ఏటా సగటున 3వేల టీఎంసీలు, గత ఐదేళ్లలో సగటున 4వేల టీఎంసీలు బంగాళాఖాతంలో కలిసిపోయాయి. అందులో 200 టీఎంసీల వినియోగానికి రాష్ట్రప్రభుత్వం నల్లమలసాగర్ ప్రాజెక్టు నిర్మించాలని నిర్ణయించింది. దీనితర్వాత కూడా 2,800 టీఎంసీల గోదావరి నీళ్లు బంగాళాఖాతంలో కలిసిపోతాయి. దీనికి తెలంగాణ ఎందుకు అభ్యంతరం వ్యక్తం చేస్తోందో తెలియట్లేదు. అక్కడి పార్టీలు దీన్నో ఆయుధంగా చేసుకుంటున్నాయి తప్ప, సాంకేతిక కారణాలేమీ లేవు" అని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ఆయన శుక్రవారం ఉదయం ఇక్కడ ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసిన తర్వాత విలేకర్లతో మాట్లాడారు. ఇందులో ప్రధానంగా పోలవరం స్టాప్ వర్క్ ఆర్డర్‌ను శాశ్వతంగా రద్దుచేయాలని, రెండు తెలుగు రాష్ట్రాల మధ్య గోదావరి జలాలను ప్రాజెక్టుల వారీగా కేటాయించడానికి ట్రైబ్యునల్ ఏర్పాటుచేయాలని, పోలవరం కుడి, ఎడమ కాలువలను 17,500 క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచి నిర్మిస్తున్న పనులకు అయ్యే వ్యయాన్ని పోలవరం ప్రాజెక్టు ఖర్చులో చేర్చి నిధులు విడుదల చేయాలని కోరినట్లు చెప్పారు. వంశధార ట్రైబ్యునల్ 2021లో వెలువరించిన తీర్పుపై గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసి దాన్ని అమల్లోకి తేవాలని కోరినట్లు వెల్లడించారు. పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వడంతోపాటు, ఆర్థిక సాయం కూడా కోరినట్లు చెప్పారు. "సముద్రంలోకి వృథాగా పోయే నీటిని ఈ ప్రాజెక్టుతో ఉపయోగించుకుంటున్నాం. నదీ పరీవాహక ప్రాంత దిగువ రాష్ట్రంగా వరద జలాలను ఉపయోగించుకొనే స్వేచ్ఛ ఆంధ్రప్రదేశ్‌కు ఉంటుంది. గత 50 ఏళ్లలో 1,53,989 టీఎంసీల గోదావరి నీరు సముద్రంలో కలిసిపోయింది. ఐదేళ్లలో సగటున 4,060 టీఎంసీల నీళ్లు సముద్రంలో కలిసిపోయాయి. వీటిలో 200 టీఎంసీల నీరు ఉపయోగించుకోవాలనుకున్నాం. అందువల్ల ఎగువ రాష్ట్రమైన తెలంగాణలో ప్రాజెక్టులకు సీడబ్ల్యూసీ అనుమతులెలా ఇచ్చిందో, దిగువ రాష్ట్రానికీ అలాంటి అనుమతులే ఇవ్వాలని సీఆర్ పాటిల్‌ను కోరాం" అని రామానాయుడు పేర్కొన్నారు. గోదావరి ట్రైబ్యునల్ లెక్కలు తేల్చకుండా ఆంధ్రప్రదేశ్ ఎలా ప్రాజెక్టులు కడుతుంది, ఏపీ ప్రాజెక్టులు కడితే తెలంగాణకు కరవు తలెత్తుతుందని అక్కడి మంత్రులు అంటున్నారు కదా? అని విలేకర్లు అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ "ట్రైబ్యునల్ లెక్కలు తేల్చకముందే తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వరం, సీతమ్మసాగర్, సమక్క ప్రాజెక్టులు ఎలా నిర్మించింది?" అని ప్రశ్నించారు. ఎగువ రాష్ట్రాలు ప్రాజెక్టులు కట్టుకుంటే కింది రాష్ట్రాలకు నీరు రాక అవి కరవు బారిన పడతాయి తప్ప.. కింద రాష్ట్రాలు కట్టుకుంటే ఎగువ రాష్ట్రాలకు కరవు రాదని పేర్కొన్నారు. రాజకీయ కారణాలు తప్ప.. పోలవరం-నల్లమలసాగర్‌కు అభ్యంతరం పెట్టడానికి తెలంగాణకు కారణాలేమీ లేవన్నారు. అందుకే ఇరు రాష్ట్రాలకు నష్టం లేనివిధంగా నిర్ణయం తీసుకోవాలని కేంద్రమంత్రిని కోరినట్లు చెప్పారు. రెండు రాష్ట్రాలు బాగుండాలని చంద్రబాబు కోరుకుంటున్నారని, వృథాగా పోయే నీటిని ఎవరు వాడుకున్నా అది జాతి ప్రయోజనాలను నెరవేర్చినట్లవుతుందన్నారు. ఇరురాష్ట్రాల జల వివాదాల పరిష్కారం కోసం కమిటీ వేయాలని ఇదివరకు ముఖ్యమంత్రుల సమక్షంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం తాము ఐదు పేర్లు ప్రతిపాదించామని, ప్రస్తుతం ఆ ప్రక్రియ నడుస్తోందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. పోలవరం-నల్లమలసాగర్‌ను వ్యతిరేకిస్తూ తెలంగాణ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలుచేసిన నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం తరఫున కేవియట్ వేసినట్లు వెల్లడించారు.



రెడ్ బుక్‌లో మూడు పేజీలే అయ్యాయి

పార్టీ కార్యకర్తల సమావేశంలో మంత్రి లోకేశ్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేశ్

ఈనాడు, కాకినాడ: 'ఎంత మంచి సినిమా అయినా అందులో చిన్న విలన్ ఉంటాడు. మనకూ ఓ విలన్ ఉన్నాడు. ఆయనొస్తే అరెస్టు చేస్తారట. మన నాయకుడిని జైలులో వేసి ఏం చేయగలిగారు.. ఇప్పుడు ఆయన బెదిరింపులకు మనం భయపడాలా..? ఆయన కంటే ముందు ఇలాగే మాట్లాడినవారి పరిస్థితి ఇప్పుడేమైందో గుర్తుతెచ్చుకోండి' అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరంలో పట్టణ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఈ మధ్య వారు ఎగిరెగిరి వస్తున్నారు. రప్పారప్పా అంటున్నారు. మేం రెండు రప్పాలిస్తాం. రెడ్ బుక్‌లో మూడు పేజీలే అయ్యాయి. ఇంకా చాలా ఉన్నాయి. ఎవరికి ఎప్పుడు ముహూర్తం పెట్టాలో నాకు బాగా తెలుసు' అంటూ హెచ్చరించారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారిని కూటమి ప్రభుత్వం వదిలిపెట్టదన్నారు.

సొంతపార్టీలోనే పోరాడాను..

'జగన్‌తో ఎంత పోరాడానో పార్టీలో సంస్కరణలు తీసుకురావడానికి సొంతవారితోనూ అంతే పోరాడా. మారిన కాలానికి అనుగుణంగా మార్పులు తీసుకొస్తున్నాం. ఈ రోజుకు కూడా చంద్రబాబునాయుడితో పోరాడతా. కానీ ఆయన ఒక్కసారి నిర్ణయం తీసుకుంటే తలవంచి దాన్ని అమలుచేసే వ్యక్తిని నేను' అని లోకేశ్ పేర్కొన్నారు.

కార్యకర్తలు కాదు.. కుటుంబ సభ్యులు మీరు..

'తెదేపా కార్యకర్తలంతా కుటుంబ సభ్యులే. అంజిరెడ్డి తాత, మంజుల, తోట చంద్రయ్యలే నాకు స్ఫూర్తి. ఫ్యాక్షన్ దాడిలో మృతి చెందిన చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చాం. రాష్ట్రానికి చంద్రబాబే బ్రాండ్. కుప్పం, హిందూపురం నియోజకవర్గాలు తెదేపాకు కంచుకోట. ఇప్పుడు మంగళగిరి, రాజమహేంద్రవరం కంచుకోటగా చరిత్ర తిరగరాయాలి. మంగళగిరి నియోజకవర్గంతో పోటీ పడతామన్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సవాల్‌ను స్వీకరిస్తున్నా. కష్టకాలంలో ఆదిరెడ్డి కుటుంబం మాకు అండగా నిలిచింది. మేం కూడా వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటాం. . వచ్చే 15 ఏళ్ల వరకు కూటమి కలిసికట్టుగానే పోటీచేస్తుంది' అని స్పష్టం చేశారు. అనంతరం పార్టీలో బాగా పనిచేసిన కార్యకర్తలకు ధ్రువపత్రాలిచ్చారు. అందరితోను ఫోటోలు దిగి ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో జోనల్ కో ఆర్డినేటర్ సుజయ్‌కృష్ణరంగారావు, నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, నియోజకవర్గ పరిశీలకులు వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బాల్ కార్పొరేషన్ పెట్టుబడులు

శ్రీసిటీలో యూనిట్ ఏర్పాటుకు ఒప్పందం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు అల్యూమినియం ప్యాకేజింగ్ సంస్థ బాల్ కార్పొరేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. శ్రీసిటీలో ప్రాజెక్టు ఏర్పాటు ద్వారా సుమారు రూ.520 కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు సంస్థ తెలిపింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా 50 మందికి ఉపాధి కల్పించనున్నట్లు పేర్కొంది.



హార్దిక్

టెస్టుల్లో సఫారీ జట్టుకు తల వంచిన టీమ్ఇండియా.. పరిమిత ఓవర్ల క్రికెట్లో మాత్రం తగ్గేదే లేదన్నట్లు రెచ్చిపోయింది. సీనియర్ల మెరుపులతో వన్డే సిరీస్‌ను చేజిక్కించుకున్న భారత్.. కుర్రాళ్లు అదరగొట్టడంతో టీ20 సిరీస్‌లో పైచేయి సాధించింది. 2-1 ఆధిక్యంతో చివరి టీ20ని మొదలుపెట్టిన భారత్.. బ్యాటుతో రెచ్చిపోయి విజయానికి బలమైన పునాది వేసుకుంది. ఇన్నింగ్స్‌లో సగం వరకు దక్షిణాఫ్రికా కూడా దీటుగా బదులిచ్చినా, ఆ తర్వాత బౌలర్లు పుంజుకోవడంతో విజయం టీమ్ఇండియా సొంతమైంది. సిరీస్‌ను 3-1తో చేజిక్కించుకున్న భారత్.. మొత్తంగా ఈ పర్యటనలో దక్షిణాఫ్రికాపై పైచేయి సాధించింది.

ఇదీ మనదే

- టీ20 సిరీస్ టీమ్ఇండియా వశం
- చివరి టీ20లో ఘనవిజయం
- మెరిసిన తిలక్, హార్దిక్, వరుణ్ చక్రవర్తి

అహ్మదాబాద్

సిరీస్ ఫలితాన్ని తేల్చే చివరి టీ20లో భారత్ అదరగొట్టింది. శుక్రవారం అహ్మదాబాద్‌లో దక్షిణాఫ్రికాను 30 పరుగుల తేడాతో ఓడించింది. మొదట తిలక్ వర్మ (73; 42 బంతుల్లో 10×4, 1×6), హార్దిక్ పాండ్య (63; 25 బంతుల్లో 5×4, 5×6) చెలరేగిపోవడంతో భారత్ 5 వికెట్లకు 231 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్లు సంజు శాంసన్ (37; 22 బంతుల్లో 4×4, 2×6), అభిషేక్ శర్మ (34; 21 బంతుల్లో 6×4, 1×6) ఇన్నింగ్స్‌కు బలమైన పునాది వేశారు. అనంతరం ఛేదనలో దక్షిణాఫ్రికాకు క్వింటన్ డికాక్ (65; 35 బంతుల్లో 9×4, 3×6) మెరుపు ఆరంభాన్నిచ్చినా.. బ్రెవిస్ (31; 17 బంతుల్లో 3×4, 2×6) మినహా బ్యాటర్లు తేలిపోవడంతో ఆ జట్టుకు ఓటమి తప్పలేదు. దక్షిణాఫ్రికా 8 వికెట్లకు 201 పరుగులే చేయగలిగింది. వరుణ్ చక్రవర్తి (4/53) భారీగా పరుగులు ఇచ్చినప్పటికీ కీలక వికెట్లు పడగొట్టాడు. పరుగుల వరద పారిన మ్యాచ్‌లో బుమ్రా 4 ఓవర్లలో 17 పరుగులే ఇచ్చి 2 వికెట్లు తీయడం విశేషం. సిరీస్‌లో రెండో టీ20ని దక్షిణాఫ్రికా చేజిక్కించుకోగా.. పొగ మంచు కారణంగా నాలుగో టీ20 రద్దయింది. మిగతా మ్యాచ్‌ల్లో భారత్ నెగ్గింది. హార్దిక్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా, వరుణ్ 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా ఎంపికయ్యారు. ఈ పర్యటన ఆరంభంలో టెస్టు సిరీస్‌ను 2-0తో క్లీన్ స్వీప్ చేయగా.. వన్డేల్లో భారత్ 2-1తో గెలిచింది.

ఆ ఇద్దరూ భయపెట్టినా..

ఇన్నింగ్స్ సగం వరకు దక్షిణాఫ్రికా బ్యాటింగ్ సాగిన తీరు చూస్తే.. 232 పరుగుల లక్ష్యం కూడా సురక్షితం కాదనే అనిపించింది. మరో ఓపెనర్ రీజా హెండ్రిక్స్ (13) పేలవ ఫామ్‌ను కొనసాగించినప్పటికీ.. డికాక్ చెలరేగిపోవడంతో ఛేదనలో దక్షిణాఫ్రికా దూసుకెళ్లింది. అర్ష్‌దీప్ వేసిన తొలి ఓవర్లోనే హ్యాట్రిక్ ఫోర్లు కొట్టిన అతను.. మళ్లీ అతను బౌలింగ్‌కు తిరిగొచ్చాక ఒక సిక్సర్, మూడు ఫోర్లు బాదేశాడు. హెండ్రిక్స్ ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన బ్రెవిస్.. షాట్లు కొట్టడంలో డికాక్‌తో పోటీ పడ్డాడు. వీరి ధాటికి 9, 10 ఓవర్లలో వరుణ్, హార్దిక్ వరుసగా 23, 19 పరుగులు సమర్పించుకున్నారు. 10 ఓవర్లకు 118/1తో దక్షిణాఫ్రికా విజయానికి బలమైన పునాది వేసుకుంది. అయితే తర్వాతి ఓవర్లో బుమ్రా.. డికాక్‌ను రిటర్న్ క్యాచ్‌తో ఔట్ చేసి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. తర్వాతి ఓవర్లోనే బ్రెవిస్ కూడా ఔటైపోయాడు. వరుణ్.. వరుస బంతుల్లో మార్‌క్రమ్, ఫెరీరాలను ఔట్ చేయడంతో దక్షిణాఫ్రికా ఓటమి ఖరారైపోయింది. లిండే (16), యాన్సెన్ (14), బోష్ (17)ల పోరాటం ఓటమి అంతరాన్ని తగ్గించడానికే ఉపయోగపడింది.



ట్రోఫీతో భారత జట్టు



ఒకటి అంపైర్‌కు.. ఇంకోటి కెమెరామన్‌కు

చివరి టీ20లో భారత ఆటగాళ్ల దూకుడు అంపైర్, కెమెరామన్‌లకు ముప్పు తెచ్చిపెట్టింది. 9వ ఓవర్లో సంజు శాంసన్ బలంగా కొట్టిన స్ట్రెయిట్ డ్రైవ్‌ను బౌలర్ డొనోవన్ ఫెరీరా ఆపే ప్రయత్నం చేశాడు. కానీ బంతి అతడికి చేతిని తాకి, ఆ తర్వాత ఫీల్డ్ అంపైర్ రోహన్ పండిట్ మోకాలికి బలంగా తగిలింది. నొప్పితో విలవిలలాడిన అంపైర్ కాసేపు కింద పడుకుండిపోయాడు. చికిత్స అనంతరం కుదురుకుని విధులు కొనసాగించాడు. ఆ తర్వాత బోష్ వేసిన 13వ ఓవర్లో హార్దిక్ కొట్టిన సిక్సర్‌కు బంతి బౌండరీ అవతల విధుల్లో ఉన్న కెమెరామన్‌కు తాకింది. నొప్పి తగ్గడానికి అతను ఐస్ గడ్డలు వాడాడు.

ఇటు తిలక్.. అటు హార్దిక్

మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన భారత్.. ఆరంభం నుంచి చివరి వరకు చాలా దూకుడుగా ఆడింది. కెప్టెన్ సూర్యకుమార్ (5) మినహా బ్యాటర్లందరూ చెలరేగిపోయారు. వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ గాయపడడంతో సిరీస్‌లో తొలి మ్యాచ్ ఆడే అవకాశం దక్కించుకున్న సంజు శాంసన్.. తనను పక్కన పెట్టడం ఎంత తప్పో రుజువు చేశాడు. ఓవైపు అతను, ఇంకోవైపు అభిషేక్ శర్మ పోటీ పడి భారీ షాట్లు ఆడడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. వీరి ధాటికి యాన్సెన్ 2 ఓవర్లలోనే 33 పరుగులు సమర్పించుకున్నాడు. ఆరో ఓవర్లోనే స్కోరు 60 దాటిపోయింది. అయితే ప్రమాదకర అభిషేక్‌ను బోష్ వికెట్ కీపర్ క్యాచ్‌తో ఔట్ చేశాడు. అయినా స్కోరు వేగం ఏమీ తగ్గలేదు. సూపర్ ఫామ్‌లో ఉన్న తిలక్.. వచ్చీ రాగానే బౌండరీల మోత మోగించాడు. శాంసన్ కూడా దూకుడు కొనసాగించడంతో భారత్ 9 ఓవర్లకు 97/1తో తిరుగులేని స్థితిలో నిలిచింది. అయితే స్పిన్నర్ లిండే బౌలింగ్‌లో సంజు బౌల్డవడం, సూర్య ఎక్కువసేపు క్రీజులో నిలవకపోవడంతో భారత్ 12.1 ఓవర్లకు 115/3తో ఇబ్బందుల్లో పడింది. భారత్‌ను మరింత ఒత్తిడిలో నెడుదామని చూసిన దక్షిణాఫ్రికాకు.. హార్దిక్ షాకిచ్చాడు. సిక్సర్‌తో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన అతను.. పిడుగుల్లాంటి షాట్లతో సఫారీ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. మరోవైపు తిలక్ కూడా తగ్గలేదు. లిండే వేసిన 14వ ఓవర్లో తిలక్ ఓ సిక్స్ కొట్టగా.. హార్దిక్ వరుసగా 4, 6, 6, 4 బాదేశాడు. ఈ ఓవర్లో ఏకంగా 27 పరుగులు వచ్చాయి. చివరి ఓవర్లలో వీరి విధ్వంసం కొనసాగడంతో స్కోరు 19 బంతులుండగానే భారత్ 200కు చేరుకుంది. ఆఖరి 3 ఓవర్లలో పరుగులు తగ్గాయి. లేదంటే స్కోరు 250కి చేరువయ్యేది.



తిలక్

అతను ఆడలేదు.. ఇతను ఆడినా!

ఫామ్‌లో లేని కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నుంచి చివరి టీ20లోనూ మెరుపులు చూడలేకపోయారు అభిమానులు. గత మ్యాచ్ ముంగిట ప్రాక్టీస్‌లో బొటనవేలికి గాయం కావడంతో శుభ్‌మన్ ఈ మ్యాచ్‌లో ఆడలేదు. జట్టుతో పాటు అహ్మదాబాద్‌కు వచ్చినప్పటికీ అతను బరిలోకి దిగలేదు. అతడి స్థానంలో ఆడిన సంజు శాంసన్ (22 బంతుల్లో 37) రాణించాడు. ఇక కెప్టెన్ సూర్యకుమార్ జట్టు పటిష్ఠ స్థితిలో ఉండగా క్రీజులోకి వచ్చినప్పటికీ అవకాశాన్ని ఉపయోగించుకోలేకపోయాడు. 5 పరుగులే చేసిన అతను.. ఒక పేలవ షాట్‌తో లాంగాన్‌లో క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు.



సూర్య

భారత్ ఇన్నింగ్స్: సంజు (బి) లిండే 37; అభిషేక్ (సి) డికాక్ (బి) బోష్ 34; తిలక్ రనౌట్ 73; సూర్యకుమార్ (సి) మిల్లర్ (బి) బోష్ 5; హార్దిక్ (సి) హెండ్రిక్స్ (బి) బార్ట్‌మన్ 63; దూబె నాటౌట్ 10; జితేశ్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 9 **మొత్తం**: (20 ఓవర్లలో 5 వికెట్లకు) **231**; **వికెట్ల పతనం**: 1-63, 2-97, 3-115, 4-220, 5-227; **బౌలింగ్**: ఎంగిడి 4-0-29-0; యాన్సెన్ 4-0-50-0; బార్ట్‌మన్ 3-0-39-1; కార్బిన్ బోష్ 3-0-44-2; డొనోవన్ ఫెరీరా 2-0-20-0; జార్జ్ లిండే 4-0-46-1; **దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్**: డికాక్ (సి) అండ్ (బి) బుమ్రా 65; రీజా హెండ్రిక్స్ (సి) దూబె (బి) వరుణ్ 13; బ్రెవిస్ (సి) సుందర్ (బి) హార్దిక్ 31; మిల్లర్ (సి) శాంసన్ (బి) అర్ష్‌దీప్ 18; మార్‌క్రమ్ ఎల్బీ (బి) వరుణ్ 6; ఫెరీరా (బి) వరుణ్ 0; లిండే (బి) వరుణ్ 16; యాన్సెన్ (సి) శాంసన్ (బి) బుమ్రా 14; బోష్ నాటౌట్ 17; ఎంగిడి నాటౌట్ 7; ఎక్స్‌ట్రాలు 14 **మొత్తం**: (20 ఓవర్లలో 8 వికెట్లకు) **201**; **వికెట్ల పతనం**: 1-69, 2-120, 3-122, 4-135, 5-135, 6-154, 7-163, 8-177; **బౌలింగ్**: అర్ష్‌దీప్ 4-0-47-1; సుందర్ 4-0-30-0; బుమ్రా 4-0-17-2; వరుణ్ చక్రవర్తి 4-0-53-4; హార్దిక్ 3-0-41-1; అభిషేక్ 1-0-13-0

ఫైనల్లో భారత్ × పాక్

- అండర్-19 ఆసియాకప్



విహాన్, ఆరోన్ జార్జి

దుబాయ్: అండర్-19 ఆసియాకప్ వన్డే టోర్నీలో ఆసక్తికర సమరానికి రంగం సిద్ధమైంది. ఆదివారం జరిగే ఫైనల్లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. శుక్రవారం సెమీస్‌లో భారత్ 8 వికెట్ల తేడాతో శ్రీలంకను చిత్తు చేసింది. వర్షం కారణంగా 20 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో మొదట లంక 8 వికెట్లకు 138 పరుగులే చేసింది. చమిక (42; 38 బంతుల్లో 3×4), విమత్ దిన్సారా (32; 29 బంతుల్లో 4×4), సెనెవిరత్నె (30; 22 బంతుల్లో 2×4, 1×6) రాణించారు. హెనిల్ పటేల్ (2/31), కనిష్క్ చౌహాన్ (2/36) ప్రత్యర్థిని కట్టడి చేశారు. ఛేదన ఆరంభంలో భారత్ తడబడింది. కెప్టెన్ ఆయుష్ మాత్రే (7)తో పాటు జోరు మీదున్న వైభవ్ సూర్యవంశీ (9) వికెట్లు చేజార్చుకుంది. ఈ స్థితిలో విహాన్ మల్హోత్రా (61 నాటౌట్; 45 బంతుల్లో 4×4, 2×6), ఆరోన్ జార్జి (58 నాటౌట్; 49 బంతుల్లో 4×4, 1×6) జట్టును ఆదుకున్నారు. దూకుడుగా ఆడి జట్టుకు ఘన విజయాన్ని అందించారు. అభేద్యమైన మూడో వికెట్‌కు ఈ జంట 114 పరుగులు జోడించింది. భారత్ 18 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. మరో సెమీస్‌లో పాకిస్థాన్ 8 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. వర్షం కారణంగా 27 ఓవర్లకు కుదించిన ఈ పోరులో మొదట బంగ్లా 26.3 ఓవర్లలో 121 పరుగులకే ఆలౌటైంది. బషీర్ (33) టాప్ స్కోరర్. అబ్దుల్ సుబాన్ (4/20) ప్రత్యర్థికి కళ్లెం వేశాడు. సమీర్ (69 నాటౌట్) మెరుపులతో పాక్ 16.3 ఓవర్లలో 2 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది.



చిరాగ్, సాత్విక్

సెమీస్‌లో సాత్విక్ జోడీ

హాంగ్‌జౌ: డబ్ల్యూబీఎఫ్ ప్రపంచ టూర్ ఫైనల్స్ టోర్నీలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. శుక్రవారం గ్రూప్-బి చివరి మ్యాచ్‌లో సాత్విక్ జంట 17-21, 21-18, 21-15తో ఆరోన్ చియా-సో వుయ్ (మలేసియా) జోడీని ఓడించింది. తొలి గేమ్ చేజారినా.. తర్వాత భారత జంట పుంజుకుంది. రెండో గేమ్‌లో విరామ సమయానికి 11-9తో నిలిచింది. బ్రేక్ తర్వాతా అదే జోరు ప్రదర్శించి గేమ్‌ను నెగ్గి మ్యాచ్‌లో నిలిచింది. మూడో గేమ్‌లో భారత జంట దూకుడుగా ఆడింది. నియంత్రణతో కూడిన షాట్లు, చక్కని నెట్‌గేమ్‌తో పాయింట్లు సంపాదించింది. 15-11తో ఆధిక్యంలోని నిలిచిన సాత్విక్ ద్వయం.. అదే ఊపులో గేమ్‌తో పాటు మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన సాత్విక్ జోడీ అగ్రస్థానంతో ముందంజ వేసింది. ప్రపంచ టూర్ ఫైనల్స్ పురుషుల డబుల్స్‌లో సెమీఫైనల్ చేరిన భారత తొలి జంటగా సాత్విక్, చిరాగ్ ద్వయం రికార్డు సాధించింది.

హెడ్ అజేయ శతకం

- మూడో టెస్టుపై ఆసీస్ పట్టు
- యాషెస్ సిరీస్



ట్రావిస్ హెడ్

అడిలైడ్: యాషెస్ సిరీస్ తొలి రెండు టెస్టుల్లో నెగ్గిన ఆతిథ్య ఆస్ట్రేలియా.. మూడో టెస్టుపైనా పట్టు సంపాదించింది. ఓపెనర్ ట్రావిస్ హెడ్ (142 బ్యాటింగ్; 196 బంతుల్లో 13×4, 2×6) అజేయ శతకం సాధించడంతో ఆ జట్టు బలమైన స్థితిలో నిలిచింది. మూడో రోజు ఆట చివరికి రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్లకు 271 పరుగులు చేసింది. హెడ్‌తో పాటు అలెక్స్ కేరీ (52 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో 85 పరుగుల ఆధిక్యంతో కలిపి ఆస్ట్రేలియా.. 356 పరుగుల ముందంజలో ఉంది. వెదరాల్డ్ (1), లబుషేన్ (13) త్వరగా వెనుదిరిగినా.. ఉస్మాన్ ఖవాజా (40)తో కలిసి హెడ్ ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లాడు. అయితే ఖవాజా, కామెరూన్ గ్రీన్ (7) వికెట్లను స్వల్ప వ్యవధిలో కోల్పోయిన ఆసీస్ 149/4తో నిలిచింది. ఈ స్థితిలో కేరీతో కలిసి హెడ్ మరో వికెట్ పడకుండా మూడో రోజు ఆటను ముగించాడు. ఈ జంట అభేద్యమైన అయిదో వికెట్‌కు 142 పరుగులు జోడించింది. 99 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద బ్రూక్ క్యాచ్ వదిలేయడం హెడ్‌కు కలిసొచ్చింది. అడిలైడ్‌లో అతడికిది వరుసగా నాలుగో సెంచరీ. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 213/8తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లాండ్ 286 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ బెన్ స్టోక్స్ (83; 198 బంతుల్లో 8×4), జోఫ్రా ఆర్చర్ (51; 105 బంతుల్లో 5×4, 1×6) పోరాడి స్కోరును 300కు సమీపంగా తీసుకెళ్లారు. స్టోక్స్‌ను స్టార్క్ ఓ బుల్లెట్ బంతితో బౌల్డ్ చేసి ఈ భాగస్వామ్యాన్ని విడదీశాడు. స్టోక్స్-ఆర్చర్ తొమ్మిదో వికెట్‌కు 106 పరుగులు జత చేశారు. స్టోక్స్ ఔటైన కొద్దిసేపటికే ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 371 పరుగులు చేసింది.

షాకులుంటాయా?

- టీ20 ప్రపంచకప్‌నకు భారత జట్టు ఎంపిక నేడే

ముంబయి: టీ20 ప్రపంచకప్ ఆరంభానికి ఇంకా 50 రోజుల సమయం ఉండగానే భారత జట్టును ప్రకటించబోతున్నారు సెలక్టర్లు. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ శనివారమే జట్టును ఎంపిక చేయబోతోంది. భారత్ ఆతిథ్యమివ్వనున్న ఈ మెగా టోర్నీ ఫిబ్రవరి 7న ఆరంభం కానున్న సంగతి తెలిసిందే. జట్టును ఇప్పుడే ప్రకటిస్తున్నప్పటికీ.. టోర్నీ మొదలయ్యే రోజు వరకు మార్పులు చేసే అవకాశం ఆతిథ్య హోదాలో భారత్‌కు ఉంది. అందుకే అయిదారుగురిని స్టాండ్‌బైలుగా ప్రకటించనున్నారు సెలక్టర్లు. ఈ ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీ ఆరంభానికి ముందు యశస్వి జైస్వాల్ స్థానంలో వరుణ్ చక్రవర్తిని ఇలాగే జట్టులోకి తీసుకున్నారు. టీ20 ప్రపంచకప్ ముందు జనవరిలో స్వదేశంలో న్యూజిలాండ్‌తో పరిమిత ఓవర్ల సిరీస్‌లకు కూడా సెలక్టర్లు జట్లను ప్రకటించనున్నారు. కివీస్‌తో టీ20 సిరీస్‌లో తలపడే జట్టునే.. ప్రపంచకప్ కోసం ఎంపిక చేసే అవకాశముంది. ఇక సెలక్టర్లు ప్రకటించబోయే జట్టులో ఆశ్చర్యపరిచే పేర్లేమీ ఉండకపోవచ్చని అంచనా. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నప్పటికీ.. వాళ్లిద్దరూ జట్టులో కొనసాగడం ఖాయం. టీ20 ప్రపంచకప్‌ను సూర్యకు కెప్టెన్‌గానే కాక ఆటగాడిగానూ చివరి అవకాశంగా భావిస్తున్నారు. టీ20ల్లోకి పునరాగమనం చేసినప్పటికీ నుంచి నిలకడ అందుకోలేకపోతున్న శుభ్‌మన్‌పై వేటు వేసి యశస్వి జైస్వాల్ లేదా ఇషాన్ కిషన్‌కు జట్టులో చోటివ్వాలన్న డిమాండ్లు వినిపిస్తున్నప్పటికీ సెలక్టర్లు ఆ దిశగా నిర్ణయం తీసుకునే అవకాశాలు తక్కువే. సూర్య, గిల్‌లకు తోడు అభిషేక్, తిలక్ బ్యాటర్లుగా కొనసాగుతారు. జితేశ్‌ను తొలి ప్రాధాన్య వికెట్ కీపర్‌గా ఎంపిక చేయనున్నారు. సంజు శాంసన్ రెండో వికెట్ కీపర్‌గా ఉంటాడు. హార్దిక్, దూబె, అక్షర్, సుందర్ ఆల్‌రౌండర్లుగా జట్టులో ఉండడం ఖాయం. బుమ్రా, అర్ష్‌దీప్, హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి, కుల్‌దీప్ యాదవ్ స్పెషలిస్టు బౌలర్లుగా కొనసాగుతారు. యశస్వి, నితీశ్, పరాగ్, రింకు సింగ్, ప్రసిద్ధ్‌లను స్టాండ్‌బైలుగా ఎంపిక చేసే అవకాశముంది.

కివీస్ 575/8.. విండీస్ 110/0



డెవాన్ కాన్వే

మౌంట్ మాంగనూ: న్యూజిలాండ్, వెస్టిండీస్ జట్ల మధ్య మూడో టెస్టులో పరుగుల వరద పారుతోంది. బౌలర్లు తేలిపోయిన ఈ మ్యాచ్‌లో ఇరుజట్ల బ్యాటర్లు చెలరేగిపోతున్నారు. ఓవర్‌నైట్ స్కోరు 334/1తో శుక్రవారం ఉదయం ఆట కొనసాగించిన కివీస్ 155 ఓవర్లలో 575/8 వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. డెవాన్ కాన్వే (227; 367 బంతుల్లో 31×4) డబుల్ సెంచరీతో చెలరేగాడు. రచిన్ రవీంద్ర (72 నాటౌట్; 106 బంతుల్లో 6×4, 2×6) మెరిశాడు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 23 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 110 పరుగులు సాధించింది. కివీస్ స్కోరుకు విండీస్ మరో 465 పరుగుల దూరంలో ఉండగా.. ఓపెనర్లు జాన్ క్యాంప్‌బెల్ (45 బ్యాటింగ్; 60 బంతుల్లో 7×4), బ్రెండన్ కింగ్ (55 బ్యాటింగ్; 78 బంతుల్లో 9×4) క్రీజులో ఉన్నారు.

ఇంగ్లిస్‌కు ఎందుకంత ధర?



జోష్ ఇంగ్లిస్

దిల్లీ: ఆస్ట్రేలియా బ్యాటర్ జోష్ ఇంగ్లిస్ కోసం ఈసారి ఐపీఎల్ మినీ వేలంలో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ పోటీపడ్డాయి. చివరికి లఖ్‌నవూ 8.6 కోట్ల రూపాయలకు సొంతం చేసుకుంది. సాధారణంగా అయితే ఇంగ్లిస్ కోసం అంత సొమ్ము వెచ్చించడంపై ఎవరూ ఆశ్చర్యం వ్యక్తం చేయరు. కానీ.. నాలుగు లేదా అయిదు మ్యాచ్‌లే ఆడతానన్న ఇంగ్లిస్ కోసం అంత పోటీ ఎందుకు అన్నదే ఇప్పుడు ప్రశ్న. వచ్చే ఏడాది ఏప్రిల్ 18న పెళ్లి చేసుకోనున్న తాను.. లీగ్‌కు ఎక్కువ మ్యాచ్‌లు అందుబాటులో ఉండనని ఇంగ్లిస్ ముందస్తు సమాచారం ఇవ్వడంతోనే పంజాబ్ కింగ్స్ అతడిని జట్టు నుంచి విడుదల చేసింది. కానీ అనూహ్యంగా వేలంలో అతడి కోసం లఖ్‌నవూ, హైదరాబాద్ జట్లు నువ్వా నేనా అన్నట్లుగా పోటీపడటంతో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇంగ్లిస్ మనసు మార్చుకుని లీగ్‌కు పూర్తిగా అందుబాటులో ఉండే అంశంపై ఈ రెండు ఫ్రాంఛైజీలకు సమాచారం ఉందా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇంగ్లిస్ కోసం పోటీపడ్డ లఖ్‌నవూలో జస్టిన్ లాంగర్ (చీఫ్ కోచ్), టామ్ మూడీ (మెంటార్).. సన్‌రైజర్స్ హైదరాబాద్‌లో ప్యాట్ కమిన్స్ (కెప్టెన్) ఉన్నారు. వీరంతా ఆస్ట్రేలియన్లే కావడంతో ఇంగ్లిస్ బిడ్డింగ్ వ్యవహారం పారదర్శకంగానే సాగిందా? లేదా? అన్న విషయాన్ని బీసీసీఐ, ఐపీఎల్ పాలక మండలి పరిశీలిస్తున్నాయి. మరోవైపు ఇంగ్లిస్ కూడా తనకు అంత ధర దక్కడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. అసలు తాను అమ్ముడుపోనని అనుకున్నానని అతడన్నాడు.

మెరిసిన రష్మిక, నగాల్

- ఫైనల్లో ఈగల్స్

బెంగళూరు: శ్రీవల్లి రష్మిక, సుమిత్ నగాల్ సత్తా చాటడంతో ప్రపంచ టెన్నిస్ లీగ్‌లో ఈగల్స్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఆ జట్టు 65-58తో హాక్స్‌ను ఓడించింది. మొదట మిక్స్‌డ్ డబుల్స్‌లో శ్రీవల్లి-మోన్‌ఫిల్స్ (ఈగల్స్) జంట 4-6తో యుకి బాంబ్రి-స్వితోలినా (హాక్స్) జోడీ చేతిలో ఓడింది. తర్వాత మహిళల సింగిల్స్‌లో శ్రీవల్లి 6-2తో మాయాను ఓడించడంతో స్కోరు సమమైంది. మహిళల డబుల్స్‌లో శ్రీవల్లి-బదోసా జంట 6-3తో మాయ-స్వితోలినా ద్వయంపై నెగ్గింది. సుమిత్ నగాల్ 6-1తో షపొవలోవ్‌ను ఓడించడంతో ఈగల్స్ గెలిచింది. ఫైనల్లో కైట్స్‌తో ఈగల్స్ తలపడనుంది. మరో సెమీస్‌లో కైట్స్ 58-55తో ఫాల్కన్స్‌పై నెగ్గింది.



ప్రపంచ టెన్నిస్ లీగ్‌కు హాజరైన పంత్ సరదాగా ఇలా టెన్నిస్ ఆడాడు

ఆంధ్ర కెప్టెన్‌గా నితీశ్

విశాఖపట్నం: విజయ్ హజారే ట్రోఫీలో ఆడే ఆంధ్ర జట్టుకు ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్‌రెడ్డి కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ నెల 24న ఆరంభమయ్యే ఈ టోర్నీలో తలపడే 18 మంది సభ్యుల ఆంధ్ర జట్టును సెలక్టర్లు శుక్రవారం ఎంపిక చేశారు. ఈ టోర్నీలో గ్రూప్-డిలో దిల్లీ, రైల్వేస్, ఒడిశా, సౌరాష్ట్ర, గుజరాత్, హరియాణా, సర్వీసెస్‌తో ఆంధ్ర ఆడనుంది. దిల్లీతో ఆంధ్ర తొలి మ్యాచ్‌లో తలపడనుంది.

ఆంధ్ర జట్టు: నితీశ్ (కెప్టెన్), రికీభుయ్, భరత్, అశ్విన్, రషీద్, హేమంత్, ప్రసాద్, వై.సందీప్, ధనుశ్, సౌరభ్ కుమార్, వినయ్, స్టీఫెన్, సత్యనారాయణ, కేఎస్ఎన్.రాజు, సాకేత్, జ్ఞానేశ్వర్, సీహెచ్ సందీప్.

బరిలో కోహ్లి, పంత్

దిల్లీ: విజయ్ హజారే ట్రోఫీలో బరిలో దిగే దిల్లీ జట్టులో స్టార్ ప్లేయర్లు విరాట్ కోహ్లి, రిషబ్ పంత్ ఆడబోతున్నారు. జట్టులో కోహ్లి, పంత్ అదనపు సభ్యుల జాబితాలో ఉన్నారు. వీళ్లు కనీసం రెండు మ్యాచ్‌లు ఆడతారు. తాను ఆడే మ్యాచ్‌ల్లో పంత్ దిల్లీని నడిపించనున్నాడు. మిగతా మ్యాచ్‌లకు ఆయుష్ బదోని సారథ్యం వహిస్తాడు. అదనపు ఆటగాళ్ల జాబితాలో పేసర్లు హర్షిత్ రాణా, ఇషాంత్ శర్మ, నవ్‌దీప్ సైని కూడా ఉన్నారు. జనవరి 11న న్యూజిలాండ్‌తో ఆరంభమయ్యే వన్డే సిరీస్‌కు సన్నాహకంగా కోహ్లి, పంత్, హర్షిత్ ఈ టోర్నీలో ఆడనున్నారు.

డోపింగ్ సంక్షోభంపై దృష్టి

దిల్లీ: 2036 ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యమివ్వాలని భావిస్తున్న నేపథ్యంలో డోపింగ్ కేసుల పెరుగుదలపై కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ దృష్టిసారించింది. ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) అత్యధిక డోపీల జాబితాలో వరుసగా మూడో ఏడాది భారత్ అగ్రస్థానంలో నిలిచింది. ప్రభుత్వ ఉద్యోగాల కోసం క్రీడాకారులు, కోచ్‌లలో ఉన్న ఆరాటమే డోపింగ్ ఉల్లంఘనలకు ప్రధాన కారణమని క్రీడా మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. 'నో యువర్ మెడిసిన్' యాప్ ద్వారా సమస్యలు పరిష్కరిస్తున్నట్లు చెప్పాయి.


లంక టీ20 కెప్టెన్‌గా శానక



శానక

కొలంబో: టీ20 ప్రపంచకప్‌లో పాల్గొనే శ్రీలంక జట్టును దాసున్ శానక నడిపించనున్నాడు. ఈ టోర్నీ కోసం లంక సెలక్టర్లు శుక్రవారం 25 మంది సభ్యుల ప్రాథమిక జట్టును ఎంపిక చేశారు. ప్రస్తుత సారథి చరిత్ అసలంకను ఆ బాధ్యతలను తప్పించి శానకకు కెప్టెన్సీ అప్పగించారు. సారథిగా విఫలం కావడం, బ్యాట్‌తోనూ ఫామ్‌లో లేకపోవడం అసలంకను తప్పించడానికి ప్రధాన కారణాలు. లంక జట్టులోకి వికెట్‌కీపర్ బ్యాటర్ నిరోషన్ డిక్వెలా పునరాగమనం చేశాడు.

లంక జట్టు: శానక (కెప్టెన్), నిశాంక, కుశాల్ మెండిస్, కమిల్ మిశ్రా, కుశాల్ పెరీరా, ధనంజయ డిసిల్వా, డిక్వెలా, జనిత్ లియనాగె, అసలంక, కమిందు మెండిస్, పవన్ రత్నాయకె, సహాన్, హసరంగ, వెల్లలగె, మిలన్ రత్నాయకె, తుషార, ఇషాన్ మలింగ, చమీర, ప్రమోద్ మదుషాన్, పతిరన, మదుశంక, తీక్షణ, దుషాన్ హేమంత, విజయకాంత్, ట్రావీన్ మాథ్యూ.



రెడీ 1..2..3.. గొంగళి

చెట్టుపై నుంచి ఒడిఒడిగా నేలపైకి దిగుతున్న ఈ గొంగళి పురుగులను చూస్తే వదులుపోలేనా అనిపిస్తోంది. వాటి జీవిత క్రమంలో సీతాకోకచిలుకలుగా మారడమనేది ఎంతో కీలక దశ. ఇందుకోసం స్వేచ్ఛ పోటీ గూడు కట్టుకోవాలి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలోని ఓ ఇంటి పెరట్లో మునగచెట్టుపై నుంచి పురుగులన్నీ ఒకేసారి కిందకు దిగిపోతుండగా తీసిన చిత్రమిది. చెట్టుపైనే ఉంటే పక్షుల నుంచి రక్షణ ఉండదని భావించి ఇలాంటి ఆలోచన చేశాయి ఆ బుల్లి జీవులు. గూడు కోసం సాలెపురుగులు స్రవించే ద్రవంలాంటిదే వీటికీ వస్తుందని, దాని సాయంతోనే ఇలా కిందకు దిగుతుంటాయని మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల జువాలజీ అధ్యాపకుడు అరకంటి ఆనంద్ వివరణ ఇచ్చారు. – న్యూస్‌టుడే, మండపేట

అరె...పేమెంట్ పూర్తయ్యిందే!



ఫోన్‌పే ఉందా? గూగుల్‌పే.. లేదా పేటీఎం చేయొచ్చా? టీ డబ్బులైనా.. టీవీ బిల్లైనా.. విలువ ఎంతైనా చెల్లింపుల సమయంలో అడిగే ప్రశ్నలివి. నగదు బదిలీలే కాక ఈ యూపీఐ యాప్‌ల్లో అనేక ఫీచర్లున్నాయి. వాటిపై ఓ లుక్కేద్దామా..

పిన్‌తో పని లేకుండానే..

- చిన్న మొత్తంలో చేసే చెల్లింపులకు 'యూపీఐ లైట్' అనే ఫీచర్ బాగా ఉపయోగపడుతుంది.
- రోజూ రూ.5, రూ.10లకు పిన్ ఎంటర్ చేయకుండానే డబ్బు చెల్లించే వెసులుబాటు ఉంది.
- దీనికోసం యూపీఐ లైట్ అనే ఫీచర్‌ను యాక్టివేట్ చేసుకోవాలి.
- అనంతరం అందులోకి మీ బ్యాంకు ఖాతా నుంచి డబ్బు బదిలీచేయాలి.
- చెల్లింపుల సమయంలో క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే యూపీఐ ఐడీతో పాటు యూపీఐ లైట్ కూడా చూపిస్తుంది.
- అప్పుడు దీన్ని ఎంపిక చేసుకుంటే పిన్ ఎంటర్ చేయకుండానే పేమెంట్ పూర్తవుతుంది.

షేక్ చేస్తే స్కానర్..

- చెల్లింపులు చేసేటప్పుడు ఫోన్ లాక్ తీసి, యాప్‌ను అన్‌లాక్ చేసి.. స్కానర్ ఓపెన్ చేయాల్సిన అవసరం లేదు.
- ఫోన్‌ను షేక్ చేస్తే చాలు.. వెంటనే స్కానర్ ఓపెన్ అవుతుంది.
- దీనికోసం ఫోన్‌పేలోకి వెళ్లి 'షేక్ టు స్కాన్' ఫీచర్‌ను ఎనేబుల్ చేసుకోవాలి.
- చెల్లింపులు త్వరగా పూర్తయ్యేందుకు ఇది బాగా ఉపయోగపడుతుంది.

బిల్లును పంచుకోవచ్చు..

- ఈ యాప్‌ల్లో ఉండే మరో ఉపయోగకరమైన ఫీచర్.. స్ప్లిట్ ఎక్స్‌పెన్సెస్.
- దీని ద్వారా బృందంలో చేసే ఖర్చులను విభజించుకుని.. మన వాటాగా వచ్చే మొత్తాన్ని బిల్లు చెల్లించిన వ్యక్తికి పంపొచ్చు.
- ఉదా.. మీరు స్నేహితులతో కలిసి ఓ రెస్టారెంట్‌కు వెళ్లినప్పుడు బిల్లు రూ.2,000 వచ్చిందనుకోండి. ఈ మొత్తాన్ని తొలుత ఒక్కరే చెల్లించి తర్వాత.. స్ప్లిట్ ఎక్స్‌పెన్సెస్ అన్న ఆప్షన్‌పై క్లిక్ చేయాలి.
- దీనికోసం ఆ బృందంలో ఉన్న వారందరితో ఫోన్‌పేలోనే గ్రూప్ క్రియేట్ చేసుకోవాలి.
- ఈ బిల్లును ఎంతమంది మధ్య విభజించాలో యాప్‌లోనే అడుగుతుంది.
- ఇది పూర్తయిన తర్వాత చెల్లించాల్సిన డబ్బు ఆ గ్రూప్‌లోని ఒక్కొక్కరికి సందేశం వెళుతుంది.
- వారు తిరిగి బదిలీ చేసిన మొత్తం పేమెంట్ చేసిన వ్యక్తి యూపీఐ ఖాతాకు క్రెడిట్ అవుతుంది.

టైం టు టైం ఆటోపే..

- బిల్లు కట్టేటప్పుడు మన ప్రమేయం లేకుండానే గడువు తీరేలోగా చెల్లింపులు చేసేందుకు ఆటోపేను వాడుకోవచ్చు.
- దీనిద్వారా వివిధ ఓటీటీ చందాలు, బీమా, విద్యుత్తు బిల్లులు వంటివి సకాలంలో చెల్లించవచ్చు.
- దీనికోసం ఆటోపే ఫీచర్‌ను ఎనేబుల్ చేసుకుని సంబంధిత బిల్లర్ లేదా సేవను ఎంచుకోవాలి.
- అనంతరం చెల్లింపులు జరిగే ఖాతాను దీనికి అనుసంధానం చేయాలి. దీనికోసం యూపీఐ పిన్‌ను ఎంటర్ చేస్తే సరిపోతుంది.
- మీరు యాడ్ చేసిన బిల్లు జారీ కాగానే సంబంధిత ఖాతా నుంచి ఆ మొత్తం డెబిట్ అవుతుంది.
- అవసరం లేని సందర్భాల్లో ఈ ఫీచర్‌ను డిజేబుల్ కూడా చేసుకోవచ్చు.

కార్డు మర్చిపోతే..

- షాపింగ్ చేయడానికి వెళ్లి ఇంట్లో పర్సు మర్చిపోయినా, డెబిట్, క్రెడిట్ కార్డులు వెంట తీసుకెళ్లకపోయినా కంగారు పడాల్సిన పనిలేదు.
- యూపీఐ యాప్ నుంచి కార్డును ఎంపిక చేసుకుని చెల్లింపులు చేసుకోవచ్చు.
- దీనికోసం గూగుల్‌పే లోని 'ట్యాప్ అండ్ పే' ఫీచర్‌ను ఎనేబుల్ చేసుకుని కార్డులను దీనికి అనుసంధానం చేసుకోవాలి.
- ఇందుకు 'యాడ్ కార్డ్' అన్న ఆప్షన్‌పై క్లిక్ చేయాలి.
- దీన్ని ఉపయోగించుకోవాలంటే.. ఫోన్‌లో నియర్ ఫీల్డ్ కమ్యూనికేషన్(ఎన్‌ఎఫ్‌సీ)ను ఎనేబుల్ చేసుకోవాలి.
- అవసరమైనప్పుడు యాప్ ఓపెన్ చేసి.. చెల్లింపులు చేయాల్సిన కార్డుపై క్లిక్ చేయాలి.
- అనంతరం ఫోన్‌ను పీఓఎస్ యంత్రం దగ్గర తీసుకెళ్తే చెల్లింపు పూర్తవుతుంది.

- ఈనాడు, అమరావతి





వినసొంపైన విజిల్ బాతులు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం కముజువారి పేట సమీపంలోని ఓ చెరువులో చిలుక బాతులు (శాస్త్రీయ నామం: డెండ్రోసిగ్నా జవానికా) సందడి చేస్తున్నాయి. ఇవి చెరువుల్లో, పొలాల్లో ఆహార అన్వేషణ సాగిస్తున్నాయి. గుంపులుగా ఈత కొడుతూ నీటి మొక్కల మధ్య ఆహార వేటలో పడ్డాయి. సాధారణ బాతులతో పోలిస్తే వీటి గొంతు నుంచి వచ్చే శబ్దం వినసొంపుగా ఉంటుంది. అందుకే కొన్ని ప్రాంతాల్లో వీటిని విజిల్ డక్ అని కూడా పిలుస్తారు. ఆగ్నేయాసియాలో కనిపించే ఇవి.. ఏటా శీతాకాలంలో అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో చిత్తడి నేలలు ఉన్న ప్రాంతాలకు వచ్చి..కొంతకాలం తర్వాత వెళ్లిపోతాయి. –న్యూస్‌టుడే, కోనసీమ

ఎగరలేం.. తింటే తియ్యగుంటాం



పంచదార చిలుకలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. సాధారణంగా ఈ మిఠాయి చిలుకలు ఎవరికైనా నోరూరేలా చేస్తాయి. కానీ, ఆంధ్రా ప్యారిస్ తెనాలిలో చేసినవి చూస్తే ఊరించడమే కాదు.. చూపు తిప్పుకోనివ్వవు. అంతలా కట్టిపడేసేలా వాటిని ముస్తాబు చేస్తారు. చమ్కీలు, రంగుల వస్త్రాలు, మెరుపు తాళ్లతో వినియోగదారుల ఆసక్తి మేరకు తీర్చిదిద్దుతున్నారు. ఇక్కడ ఇప్పటికీ సంప్రదాయ చెక్క డైలలో తయారు చేస్తుండటం విశేషం. వీటిని పుష్పాలంకరణ, సీమంతం, సారెల కోసం కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. నాలుగు దశాబ్దాల ఈ కళకు నేటికీ ఏమాత్రం డిమాండ్ తగ్గలేదని విశ్రాంత అధ్యాపకుడు, కవి రాయప్రోలు జగదీశచంద్ర శర్మ తెలిపారు.

– న్యూస్‌టుడే, తెనాలి టౌన్

జబల్‌పుర్ ర్యాపర్ బాయ్స్.. 'బుందేల్‌ఖండ్' వాయిస్



మధ్యప్రదేశ్‌లోని జబల్‌పుర్ నగర యువత బుందేల్‌ఖండీ ర్యాప్ పాటలతో సామాజిక మాధ్యమాల్లో హోరెత్తిస్తున్నారు. దాదాపు 50 మంది యువకులు పూర్తిగా స్థానిక మాండలికంలో.. రోజువారీ సమస్యలే అంశాలుగా భిన్నమైన శైలితో ఈ పాటలు చేస్తున్నారు. "ర్యాపర్ మౌడా" పేరుతో ఈ బృందం ప్రజల్లో చొచ్చుకుపోతోంది. 'మౌడా' అంటే బుందేల్‌ఖండ్ భాషలో బాయ్స్ అని అర్థం. పేద కుటుంబాల నుంచి వచ్చిన వీరంతా తమ నేపథ్యం, సాగిస్తున్న జీవనపోరాటం గురించి జానపద శైలి పాటల్లో చెబుతూ ఎంతోకొంత ఆదాయం గడిస్తున్నారు. ఆటో డ్రైవరు కుమారుడైన శుభం యాదవ్ ఓ మందుల కంపెనీ ప్రతినిధిగా పనిచేస్తూ ర్యాపర్‌గానూ గుర్తింపు పొందుతున్నారు. 'గావ్ ఖేడా' పేరుతో ఈయన రూపొందించిన తాజా పాట ఉర్రూతలూగిస్తోంది. కంప్యూటర్ ఆపరేటరుగా పనిచేస్తూ ర్యాప్ పాటలతో దూసుకుపోతున్న అభినవ్ చౌధరి మాట్లాడుతూ.. "నా జీవితంలో ఎదుర్కొన్న సమస్యలనే నా పాటల్లో చెబుతున్నా. ఈ రంగంలో మాకెవరికీ గురువుల్లేరు. అంతా మా సొంత శైలే" అన్నారు. –ఈటీవీ భారత్

ముక్కోటి కాంతులు

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం ముక్కోటి వేడుకలకు సిద్ధమైంది. విద్యుద్దీపాలతో అలంకరించడంతో దేదీప్యమానమైంది. ఉత్సవాలలో భాగంగా శనివారం నుంచి ఈ నెల 28 వరకు రోజుకో అలంకారంలో స్వామి దర్శనమిస్తారు. 29న గోదావరిలో హంస వాహనంపై రాములవారికి తెప్పోత్సవం నిర్వహిస్తారు. 30న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఉత్తరద్వార దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. టికెట్లను ఆన్‌లైన్‌లోనూ, ఇక్కడి కౌంటర్లలో నేరుగానూ విక్రయిస్తున్నారు.

– న్యూస్‌టుడే, భద్రాచలం





స్వామివారి దర్శనానికి కుటుంబ సభ్యులతో కలిసి వస్తున్న సీఈసీ జ్ఞానేశ్ కుమార్, పక్కన ఆలయ అధికారులు

మల్లన్న సేవలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల దర్శనార్థం శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి శ్రీశైలానికి వచ్చారు. భ్రమరాంబ అతిథిగృహం వద్ద ఆయనకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్, కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ సునీల్ షొరాణ్, జేసీ కార్తిక్ మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. రాత్రి ఆలయ రాజగోపురం వద్ద సీఈసీ, కుటుంబసభ్యులకు ఈవో ఎం.శ్రీనివాసరావు, అర్చకులు స్వాగతం పలికారు. వారు రత్నగర్భ గణపతిని దర్శించుకొని, రుద్రాభిషేకం చేశారు. అమ్మవారికి కుంకుమార్చన చేసి, హారతి అందుకున్నారు. శనివారం వేకువజామున సీఈసీ దంపతులు మహామంగళహారతి సేవలో పాల్గొని స్వామివారికి రుద్రాభిషేకం, కుంకుమార్చన చేయనున్నారు. శ్రీశైలం ఆలయ దర్శనానికి రావడం తనకు మరపురాని అనుభూతినిచ్చిందని మీడియాతో జ్ఞానేశ్ కుమార్ పేర్కొన్నారు.

మద్యానికి రూ.10 ఇవ్వలేదని హత్య

కొడుకును పోలీసులకు అప్పగించిన తల్లి

విజయవాడ(చిట్టినగర్), న్యూస్‌టుడే: మద్యానికి రూ.10 తగ్గిందని.. అడిగితే ఇవ్వలేదన్న కోపంతో ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన ఘటన విజయవాడ చిట్టినగర్ ప్రాంతంలో చోటుచేసుకుంది. భీమన బాపయ్య వీధి కొండ ప్రాంతానికి చెందిన తెన్నేరు పాండు, జ్యోతి దంపతుల చిన్న కుమారుడు దుర్గాప్రసాద్ (19) ఎలక్ట్రికల్ పనులు చేస్తుంటాడు. గురువారం దుర్గాప్రసాద్ సిగరెట్ తాగుతుండడం చూసిన అతని అన్నయ్య మందలించాడు. దీంతో ఆగ్రహానికి గురైన దుర్గాప్రసాద్ చిట్టినగర్‌లోని ఓ బార్‌లో మద్యం తాగాడు. మరోసారి తాగడానికి రూ.10 తగ్గడంతో.. ఆప్రాంతంలో ఉన్న పలకా తాతాజీ (48)ని అడగ్గా ఇవ్వలేదు. వారిద్దరి మధ్య మాటామాటా పెరగడంతో తాతాజీ.. దుర్గాప్రసాద్ చెంపపై కొట్టాడు. తరువాత మరో వ్యక్తిని రూ.10 అడిగి మద్యం తాగిన దుర్గాప్రసాద్.. ఇంటికి వెళ్లి కత్తి తీసుకొచ్చాడు. నిద్రపోతున్న తాతాజీ ఛాతిలో పొడవడంతో మృతి చెందాడు. కేఎల్‌రావునగర్‌కు చెందిన తాతాజీ మద్యానికి బానిస కావడంతో భార్య వేరుగా మంగళగిరిలో ఉంటున్నారు. వారి కొడుకులిద్దరూ కాకినాడ, విశాఖలో ఉంటున్నారు. దీంతో తాతాజీ తాపీ పనులు చేసుకుంటూ.. చిట్టినగర్ సొరంగం మార్గంలోని ఓ షాపు వరండాలో పడుకుంటున్నాడు. అతను హత్యకు గురైనట్లు సమాచారం అందుకున్న పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించగా.. నిందితుడు టేనర్‌పేట అడ్డరోడ్డు నుంచి లంబాడీపేట వైపు వెళ్లినట్లు గుర్తించారు. అతడి కోసం గాలిస్తున్న క్రమంలో.. నిందితుడి తల్లి జ్యోతి దుర్గాప్రసాద్‌ను పోలీసులకు అప్పగించారు.

డిజిటల్ అరెస్ట్ పేరుతో రూ.42 లక్షల దోపిడీ

- విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలిని బెదిరించి, వసూలు
- ఐదుగురు సభ్యుల సైబర్ నేరగాళ్ల ముఠా అరెస్ట్
- నిందితుల్లో విశాఖ వైద్యుడు.. అతని ఖాతాకు రూ.22 లక్షల బదిలీ



నిందితుల వివరాలు చెబుతున్న ఎస్పీ వకుల్ జిందాల్, చిత్రంలో డీఎస్పీ భానోదయ, సీఐ శ్రీనివాసరావు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: డిజిటల్ అరెస్ట్ పేరుతో ఓ విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలిని బెదిరించి రూ.42 లక్షలు స్వాహా చేసిన కేసులో గుంటూరు పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు. వీరిలో ఓ వైద్యుడు కూడా ఉండడం గమనార్హం. ఎస్పీ వకుల్ జిందాల్ శుక్రవారం ఈ వివరాలు వెల్లడించారు. కాకుమాను మండలం కొమ్మూరుకు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు మోపర్తి మేరీ మంజులవాణికి అక్టోబరు 23న సీబీఐ అధికారినంటూ ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. మానవ అక్రమ రవాణా కేసులో మీ పేరు ఉందని ఆమెను భయపెట్టాడు. డిజిటల్ అరెస్టు చేయకుండా ఉండాలంటే డబ్బు పంపాలని ఐదురోజులపాటు బెదిరించాడు. తీవ్ర ఒత్తిడికి గురైన ఆమె రెండు దఫాలుగా రూ.42 లక్షలను అతను చెప్పిన బ్యాంకు ఖాతాకు జమ చేశారు. ఇంకా డబ్బులు కావాలని బెదిరించడంతో నవంబరు 7న కాకుమాను పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ వకుల్‌జిందాల్, డీఎస్పీ భానోదయ ఆధ్వర్యంలో ప్రత్తిపాడు సీఐ శ్రీనివాసరావు, ఎస్సై ఏక్‌నాథ్, సిబ్బంది విచారణ చేపట్టారు. సైబర్ సీఐ నిస్సార్‌బాషా తదితరులు సాంకేతిక సహకారం అందించారు. బాధితురాలి ఖాతా నుంచి వెళ్లిన రూ.42 లక్షల్లో రూ.22 లక్షలు విశాఖపట్నానికి చెందిన ఇంద్రప్రస్థ ఆసుపత్రి వైద్యుడు మరపు సురేష్‌నాయుడు ఖాతాలో జమైనట్టు గుర్తించారు. ఈయనకు అదే ప్రాంతానికి చెందిన లక్ష్మణ్, నెల్లూరుకు చెందిన పొదల మోహన్ ద్వారా పార్వతీపురం జిల్లా కొమరాడ మండలం చినగంగరేగులవలసకు చెందిన సింహదాడి సాయిశ్రీనివాస్, అనకాపల్లి జిల్లా రాయవరం మండలం బంగారుపాలేనికి చెందిన కారే స్టీవెన్ పరిచయమయ్యారు. వీరికి ఉత్తరప్రదేశ్‌లో ఆగ్రాకు చెందిన మోహిత్ శిఖర్వాల్ తోడయ్యాడు. ఇతనికి సైబర్ ముఠాలో ప్రధాన నిందితుడితో సంబంధం ఉంది. ఇతను కాంబోడియాలో ఉంటూ సైబర్ నేరాలకు పాల్పడుతున్నాడు. బెదిరించి తీసుకున్న నగదును ముఠా సభ్యుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయించి, వారికి కమీషన్ ఇస్తున్నాడు. ఈ కేసులో రూ.3.60 లక్షల కమీషన్ ఇచ్చాడు. ఇందులో వైద్యుడు, అతని సహచరులకు రూ.1.60 లక్షలు అందినట్టు ఎస్పీ తెలిపారు. ఇప్పటికే వైద్యుడు సురేష్‌నాయుడిని అరెస్టు చేశామన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉండడంతో సులువుగా డబ్బు సంపాదించాలన్న ఉద్దేశంతో సైబర్ ముఠాతో చేతులు కలిపినట్టు ఆయన పోలీసు విచారణలో అంగీకరించారు. సాయి శ్రీనివాస్, మోహిత్ శిఖర్వాల్, కారే స్టీవెన్, మోహన్‌లను శుక్రవారం అరెస్టు చేశామని ఎస్పీ చెప్పారు. రూ.50 వేల నగదు, చెక్‌బుక్, పాన్‌కార్డు, సెల్‌ఫోన్లు జప్తు చేశామన్నారు.

ఇన్‌టాక్ ఆధ్వర్యంలో విజయవాడలో 'హెరిటేజ్ వాక్'



మొగల్రాజపురంలోని గుహాలయం వద్ద ఇన్‌టాక్ సభ్యులు, ఉపాధ్యాయులు

ఈనాడు, అమరావతి: ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చర్ హెరిటేజ్ (ఇన్‌టాక్) ఆధ్వర్యంలో విజయవాడలో హెరిటేజ్ వాక్ నిర్వహించారు. భారత వారసత్వ సంస్కృతిని భావితరాలకు అందించే ఉద్దేశంతో ఉపాధ్యాయులతో నిర్వహిస్తున్న కార్యశాలలో భాగంగా శుక్రవారం విజయవాడ (మొగల్రాజపురం)లోని గుహాలయాల్ని సందర్శించారు. తొలినాళ్లలో మనిషి తొలిచిన గుహల్లో ఇవి ఒకటని ఇన్‌టాక్ కన్వీనర్ సాయి పాపినేని వివరించారు. 'ఈ తరహా గుహలు బిహార్, ఎన్టీఆర్ జిల్లా గుంటుపల్లి, గుంటూరు జిల్లా ఉండవల్లి తదితర ప్రాంతాల్లో ఉన్నాయి. వర్షాలు, వరదల నుంచి సరకులను కాపాడుకునేందుకు వ్యాపారులు వీటిని తొలిచారు. వర్తకం తగ్గాక...బౌద్ధ సన్యాసులు వీటిని ఆవాసాలుగా చేసుకున్నారు. తూర్పుచాళుక్యుల కాలానికి కొంత ముందు వీటిలో హిందూ దేవతల విగ్రహాలు ఉంచారు. వాటిలో పెద్దగా పూజలు చేసిన ఆనవాళ్లు లేవు. నిర్మాణ పరంగా దేశంలోనే ఇవి అరుదైన వారసత్వ సంపద. నగరం నడిబొడ్డున ఉన్నా స్థానికులకు వీటి ప్రాముఖ్యత తెలియకపోవడం శోచనీయం' అని సాయి పాపినేని అన్నారు. అనంతరం కలంకారి, కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మల విశిష్టత, కూచిపూడి ప్రాశస్త్యం, కృష్ణా నది ప్రాముఖ్యత-పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ఉపాధ్యాయులు ఇచ్చిన ప్రజంటేషన్లు ఆకట్టుకున్నాయి. కార్యశాలలో పాల్గొన్న వారికి కిట్‌లు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో హెరిటేజ్ ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్ సర్వీస్ ప్రిన్సిపల్ డైరెక్టర్ పూర్ణిమా దత్, ఇన్‌టాక్ కో కన్వీనర్ బాలాంత్రపు ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ బెంగళూరుకు జగన్

ఈనాడు, అమరావతి: మాజీ సీఎం జగన్ శుక్రవారం బెంగళూరుకు బయల్దేరి వెళ్లారు. మంగళవారం బెంగళూరు నుంచి తాడేపల్లికి వచ్చారు. ఆ రోజు గన్నవరం విమానాశ్రయం నుంచి తాడేపల్లిలోని ఇంటికి బయలుదేరి మార్గమధ్యలో జోజినగర్‌కు వెళ్లి అక్కడ ఇటీవల కోర్టు ఆదేశాల మేరకు తొలగింపునకు గురైన ఇళ్లకు సంబంధించిన వారితో మాట్లాడారు. గురువారం గవర్నర్‌ను కలిశారు. శుక్రవారం ఉదయం తిరిగి బెంగళూరుకు వెళ్లారు.

గోదావరి హారతులకు అన్నవరం, వాడపల్లి ఆలయాల ఆదాయం

ఈనాడు, అమరావతి: గోదావరి హారతుల కార్యక్రమానికయ్యే ఖర్చులో అన్నవరం ఆలయ ఆదాయం నుంచి 60%, వాడపల్లి ఆలయం నుంచి 40% వెచ్చించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వు జారీచేసింది. ఈమేరకు దేవాదాయ కమిషనర్ చేసిన ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ఈ ఖర్చు నెలకు రూ.2.5 లక్షలకు మించకూడదని ఉత్తర్వులో పేర్కొంది.

రైలు నుంచి జారిపడి నవ దంపతుల మృతి

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: రైలు నుంచి జారిపడి నవ దంపతులు మృతిచెందిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా వంగపల్లి-ఆలేరు రైలుమార్గంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పార్వతీపురం మన్యం జిల్లా రావుపల్లికి చెందిన కోరాడ సింహాచలం(25)కు, అదే జిల్లాలోని అంకవరం గ్రామానికి చెందిన భవాని(19)తో రెండు నెలల క్రితం వివాహమైంది. సింహాచలం హైదరాబాద్‌లో ఓ రసాయన పరిశ్రమలో పనిచేస్తుండగా జగద్గిరిగుట్టలోని గాంధీనగర్‌లో నివాసం ఉంటున్నారు. విజయవాడలోని బంధువుల ఇంటికి వెళ్లేందుకు దంపతులు మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌లో సికింద్రాబాద్ నుంచి గురువారం రాత్రి బయలుదేరారు. రైలు వంగపల్లి రైల్వేస్టేషన్ దాటిన తర్వాత డోర్ వద్ద నిలబడి ఉన్న ఇద్దరూ జారిపడి మృతిచెందారు. శుక్రవారం ఉదయం విధుల్లో ఉన్న ట్రాక్‌మెన్ గమనించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు.



సింహాచలం, భవాని పెళ్లినాటి చిత్రం

టీవీ పేలి ఇల్లు ధ్వంసం

- ప్రమాదంలో ఇద్దరు మహిళలకు గాయాలు
- అన్నమయ్య జిల్లాలో ఘటన



కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న లక్ష్మమ్మ

రామాపురం, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా రామాపురం మండలంలోని గువ్వలచెరువు గ్రామానికి చెందిన గూడూరు లక్ష్మమ్మ ఇంట్లోని టీవీ శుక్రవారం పేలిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. లక్ష్మమ్మ ఇంట్లో టీవీ చూస్తుండగా కోడలు నాగరత్న ఇంటి ముందు ముగ్గు వేస్తున్నారు. ఒక్కసారిగా టీవీ భారీ శబ్దం చేస్తూ పేలిపోయింది. పేలుడు ధాటికి ఇంటి తలుపులు ఊడిపోయాయి. సామగ్రి ధ్వంసమైంది. లక్ష్మమ్మకు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. నాగరత్నకు స్థానికంగా ప్రాథమిక చికిత్స అందించారు. ఘటనా స్థలాన్ని లక్కిరెడ్డిపల్లె సీఐ కృష్ణంరాజు నాయక్ పరిశీలించారు. పోలీసులు డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. 30 ఏళ్ల నాటి ఈ టీవీని పదేళ్ల క్రితం సెకండ్ హ్యాండ్‌లో కొన్నామని, ఇటీవల మరమ్మతులకు గురవడంతో కడపలో కొన్ని భాగాలు మార్పించినట్లు బాధితులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.





పేలిన టీవీ వద్ద పోలీస్ జాగిలం ★ ప్రమాదం ధాటికి ఊడిపోయిన ఇంటి తలుపులు

తిరుప్పరంకుండ్రం కొండపై దీపం వెలిగించాలని.. ప్రైవేటు ఉద్యోగి ఆత్మాహుతి

అంతకుముందు ఆడియో, వీడియో సందేశాలు



పూర్ణచంద్రన్

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: తమిళనాడులోని తిరుప్పరంకుండ్రం కొండపైనున్న దీపస్తంభంలో దీపం వెలిగించాలని డిమాండ్ చేస్తూ ఓ ప్రైవేటు ఉద్యోగి ఆత్మాహుతికి పాల్పడ్డారు. మదురై జిల్లాకు చెందిన పూర్ణచంద్రన్(40) ఎంబీఏ పట్టభద్రుడు. ఓ మందుల కంపెనీ సేల్స్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తూనే.. పార్ట్‌టైమ్‌గా బండిపై పండ్లు విక్రయించేవారు. గురువారం సాయంత్రం అవుట్ పోస్ట్ పెరియార్ విగ్రహం వద్ద తన బండిని ఆపి, అక్కడే పోలీస్ బూత్‌కు వెళ్లి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. అతని కేకలు విన్న స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. పోలీసులు వచ్చి మంటలు ఆర్పి ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందారు. పూర్ణచంద్రన్ హిందూ సంస్థ కోసం తీవ్రంగా పని చేసేవాడని, తిరుప్పరంకుండ్రం కొండపై దీపం వెలిగించాలంటూ ఇటీవల వీడియో విడుదల చేశాడని, అదే డిమాండ్‌తో ఆత్మాహుతికి పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. బలవన్మరణానికి ముందు పూర్ణచంద్రన్ ఫోన్‌లో మాట్లాడిన ఆడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. 'తిరుప్పరంకుండ్రం మురుగన్ మొదటి పుణ్యక్షేత్రం. అక్కడ దీపం వెలిగించడం మదురై ప్రజలకు గర్వకారణం. దీపం వెలిగించాలని మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం ఆదేశాలిచ్చినా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదు. హిందువుగా దీపం వెలిగించకపోవడం నన్ను క్షోభ పెడుతోంది. అందుకే దేవుడు లేడని చెప్పే పెరియార్ విగ్రహం ముందు ఆత్మహత్య చేసుకుంటున్నా. వచ్చే ఏడాదైనా దీపం వెలిగించండి' అని ఆ ఆడియోలో పేర్కొన్నారు. భార్య, పిల్లలు తనను క్షమించాలని కోరారు.

EENADU Vol: 52, Issue: 130 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

అమరావతి రైల్వేలైన్ కోసం భూసమీకరణకు పట్టుబడుతున్న రైతులు

- భూసేకరణకు సమ్మతించబోమని స్పష్టీకరణ
- దీనిపై నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరిన రైల్వేశాఖ
- ఇది కొలిక్కివస్తే.. పల్నాడు, గుంటూరు జిల్లాల్లో రైల్వేలైన్ పనులు

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి మీదుగా ఎర్రుపాలెం నుంచి నంబూరు వరకు నిర్మిస్తున్న 56.53 కి.మీ. కొత్త రైల్వే లైన్ కోసం.. పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలోని గ్రామాల రైతులు భూసేకరణకు బదులుగా భూములను సమీకరించాలని పట్టుబడుతున్నారు. తొలుత భూసేకరణకు రైల్వే అధికారులు సిద్ధంకాగా రైతులు వ్యతిరేకించారు. క్షేత్రస్థాయిలో పెగ్‌మార్కింగ్ చేసేందుకు కూడా అధికారులను అనుమతించలేదు. భూసమీకరణ ద్వారా మాత్రమే తమ భూములను తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని రైల్వేశాఖ కోరుతోంది.

★ ఈ లైన్ ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలోని 2 గ్రామాలు, ఎన్టీఆర్ జిల్లాలోని వీరులపాడు మండలంలోని 6 గ్రామాలు, కంచికచర్ల, ఇబ్రహీంపట్నం మండలాల్లోని రెండేసి గ్రామాలు, పల్నాడు జిల్లా అమరావతి మండలంలోని మూడు గ్రామాలు, గుంటూరు జిల్లా తుళ్లూరు మండలంలోని రెండు గ్రామాలు, తాడికొండ మండలంలోని మూడు గ్రామాలు, పెదకాకాని మండలంలోని రెండు గ్రామాల మీదుగా వెళ్తుంది.

★ ఇందులో పల్నాడు జిల్లాలోని మూడు గ్రామాలు, గుంటూరు జిల్లాలో ఏడు గ్రామాల్లోని రైతులు భూసేకరణ వద్దని, సమీకరణ చేయాలని పట్టుబడుతున్నారు.

భూసమీకరణపై దృష్టి..

★ రాజధాని అమరావతి కోసం రెండో విడత భూసమీకరణ చేయనున్న గ్రామాల్లో.. రైల్వే లైన్ కోసం కూడా సమీకరణ చేయనున్నారు.

★ ఇందులో పల్నాడు జిల్లాలోని వైకుంఠపురం, ఎండ్రాయి, కర్లపూడి, గుంటూరు జిల్లా వడ్డమాను, పెదపరిమి ఉన్నాయి.

★ మిగిలిన గ్రామాలైన మోతడక, తాడికొండ, కంతేరు, కొప్పురావూరు, పెదకాకాని గ్రామాల్లో భూమిని సమీకరిస్తారా లేక గతంలో మాదిరిగా భూసేకరణ చేపడతారా అన్నది తేలాల్సి ఉంది.

రెండు ప్యాకేజీల్లో తొలివిడత పనులు

అమరావతి రైల్వే లైన్ పనుల్లో భూసేకరణ కొలిక్కి వస్తున్నచోట్ల తొలుత పనులు చేపట్టనున్నారు. ఎర్రుపాలెం నుంచి వైకుంఠపురం సమీపం వరకు 27 కి.మీ.మేర రైల్వే లైన్ నిర్మాణం ఒక ప్యాకేజీగాను, కృష్ణా నదిపై 3.2 కి.మీ. వంతెన నిర్మాణం మరో ప్యాకేజీగా పనులు చేయనున్నారు. ఈ నెలాఖరులోపు ఈ రెండు ప్యాకేజీలకు టెండర్లు పూర్తికానున్నాయి. ఆ తర్వాత వీటిలో పనులు ఆరంభించే అవకాశం ఉంటుంది. గుత్తేదారు సంస్థలకు పనులు అప్పగించినప్పటి నుంచి రెండేళ్లలో రైల్వే లైన్ నిర్మాణం, మూడేళ్లలో వంతెన నిర్మాణం పూర్తయ్యేందుకు వీలుంటుందని రైల్వేశాఖ వర్గాలు చెబుతున్నాయి. మిగిలిన గ్రామాల పరిధిలోని పనులను మరో ప్యాకేజీ కింద చేపడతారు.



కంది పంటలో సాగైన గంజాయి మొక్కలు పరిశీలిస్తున్న అధికారులు



ట్రాక్టర్‌లో గంజాయి మొక్కలను పోలీసుస్టేషన్‌కు తరలిస్తున్న అధికారులు

కర్నూలు జిల్లాలో గంజాయి సాగు

ఆలూరు గ్రామీణ, చిప్పగిరి, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం డేగులపాడులో ఓ రైతు మిరప, కందిలో అంతరపంటగా గంజాయి సాగుచేశారు. సమాచారం అందుకున్న ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి, చిప్పగిరి ఎస్సై సతీష్, ఎక్సైజ్ సీఐ లలిత, తహసీల్దారు ఇజాజ్ అహ్మద్ కలిసి పొలాల్లో తనిఖీలు చేశారు. ఓ ట్రాక్టర్ నిండా గంజాయి మొక్కలు గుర్తించారు. రైతు హనూనేబాది శివయ్య డేగులపాడు గ్రామ పరిధిలోని సర్వే నంబరు 173లో నాలుగు ఎకరాల్లో మిరప, శనగతో పాటు 176 సర్వే నంబరులో ఎనిమిది ఎకరాల దేవాలయ మాన్యంలో కందిపంట సాగుచేశారు. ఇందులోనే అంతరపంటగా గంజాయి వేశారు. అధికారులు గంజాయి మొక్కలను తొలగించి ట్రాక్టర్ ట్రాలీలో వేశారు. ట్రాలీ లోడును పోలీసుస్టేషన్‌కు తరలించారు. సాగు చేసిన రైతు పరారీలో ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

నేతల హస్తంపై ఆరా

గంజాయిని రైతే సాగు చేశారా? రాజకీయ నాయకుల హస్తం ఉందా? అనే కోణంలో పోలీసులు విచారణ ప్రారంభించారు. ఒకప్పుడు ఫ్యాక్షన్ గ్రామంగా ముద్రపడిన డేగులపాడులో ఇలా పెద్దమొత్తంలో గంజాయి దొరకడంతో కొంత అలజడి నెలకొంది.

గోరంట్ల మాధవ్‌కు 41ఎ నోటీసు

తాడేపల్లి, న్యూస్‌టుడే: వైకాపా మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌కు తాడేపల్లి పోలీసులు 41ఎ నోటీసు ఇచ్చారు. శుక్రవారం ఆయన పోలీసు స్టేషన్‌కు వచ్చి నోటీసు అందుకున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో మంత్రి లోకేశ్‌పై మాధవ్ అనుచిత వ్యాఖ్యలు చేశారని తాడేపల్లి తెలుగు యువత అధ్యక్షుడు జి.నాగేశ్వరరావు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. నోటీసు అందుకున్న తర్వాత మాధవ్ మీడియాతో మాట్లాడారు. అధికార పక్షం అకృత్యాలను ప్రశ్నిస్తుంటే కేసులు పెట్టి జైళ్లకు పంపిస్తున్నారన్నారు. వైకాపా అధ్యక్షుడు జగన్ మొదలుకుని తమ పార్టీ వారందరినీ అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని, తాము కూడా కేసులు పెడతామన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని యథాతథంగా కొనసాగించాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

ఈనాడు, అమరావతి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పు, సవరణల బిల్లుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపి, పార్లమెంటు సాక్షిగా జాతిపితను ఘోరంగా అవమానించిందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. పేదల ఉపాధి దెబ్బతీయడానికి, గ్రామీణ వ్యవసాయ కార్మికులకు పని లేకుండా చేయడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఈనెల 22న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. విజయవాడ దాసరిభవన్‌లో శుక్రవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజతో కలిసి రామకృష్ణ విలేకర్లతో మాట్లాడారు. 'ఉపాధి హామీ పథకానికి కేంద్రం అందిస్తున్న 90% నిధులను తాజా సవరణల తర్వాత 60 శాతానికి తగ్గించింది. మిగిలిన 40% నిధులను రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలని చెప్పడం అన్యాయం. తెదేపా ఎంపీ కృష్ణదేవరాయలు 40% రాష్ట్రాలు భరించడం కష్టమని చెబుతుండగా, జనసేన ఎంపీ బాలశౌరి మాత్రం రాష్ట్రాలకు బాధ్యత ఉండాలనే ఈ నిబంధన పెట్టారని చెప్పడాన్ని చూస్తే ఎన్డీయే నేతలే గందరగోళంలో ఉన్నారని అర్థమవుతోంది' అని విమర్శించారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటుపరం చేసే జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడిచినా కొన్ని విశ్వవిద్యాలయాలకు ఉపకులపతులను నియమించలేకపోయారని, 4 వేల అధ్యాపక పోస్టులను భర్తీ చేయలేదంటూ ప్రభుత్వంపై రామకృష్ణ మండిపడ్డారు.

ఈనాడు సినిమా

ఫలించిన అఖండ 2 ప్రయత్నం!


బోయపాటి శ్రీను, బాలకృష్ణ

సనాతన హైందవ ధర్మ పరిరక్షణ ఆవశ్యకతని చాటి చెప్పిన సినిమానే 'అఖండ 2: తాండవం' అన్నారు అగ్ర కథానాయకుడు బాలకృష్ణ. ఈ సినిమాతో తాము చెప్పిన సందేశం ప్రేక్షకులకు బాగా చేరువైందన్నారు. ఆయన కథానాయకుడిగా, బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన సినిమానే 'అఖండ 2: తాండవం'. 14 రీల్స్ ప్లస్ నిర్మించింది. ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా కథానాయకుడు బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను శుక్రవారం వారణాసిని సందర్శించి, కాశీ విశ్వనాథ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కథానాయకుడు బాలకృష్ణ మీడియాతో మాట్లాడారు. "అఖండ 2: తాండవం' కేవలం తెలుగు సినిమా కాదు, భారతీయులందరూ చూడదగిన సినిమా. నేటితరం సనాతనధర్మం గురించి తెలుసుకోవాలన్న మా ప్రయత్నం ఫలించింది. భక్తి, ధర్మం ప్రధానంగా సినిమాని రూపొందించినందుకు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా అభినందనలు తెలిపార"న్నారు బాలకృష్ణ. తన తండ్రి ఎన్టీఆర్‌ని గుర్తు చేసుకున్నారు. ఆయన తన యాభయ్యేళ్ల నట ప్రయాణం గురించి కూడా మాట్లాడారు. సినిమా అంటే కేవలం నటన మాత్రమే కాదనీ, ప్రపంచవ్యాప్తంగా ప్రజలతో కనెక్ట్ అయ్యే మాధ్యమం అని, ఇన్నేళ్లు కథానాయకుడిగా కొనసాగుతుండడం ఆనందంగా ఉందన్నారు బాలకృష్ణ.

రోమియోతో ఈ తారలు?


దిశా పటానీ

మహిళా ప్రాధాన్య చిత్రాలు, ప్రత్యేక పాటలు, అతిథి పాత్రలు... ఇలా వచ్చిన అవకాశాల్ని అందుకుంటూ ప్రేక్షకుల్ని అలరిస్తోంది అందాల తార తమన్నా. ఇప్పుడామె మరో ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. బాలీవుడ్ హీరో షాహిద్ కపూర్, త్రిప్తి డిమ్రీ జంటగా నటిస్తున్న చిత్రం 'ఓ రోమియో'. విశాల్ భరద్వాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమాలో తమన్నా భాగమైనట్లు తెలుస్తోంది. ఈమెతో పాటు దిశా పటానీ, విక్రాంత్ మాస్సే కూడా ఇందులో మెరవనున్నట్లు, చిత్రంలో ఈ తారల సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రొమాటిక్ డ్రామా, యాక్షన్ లాంటి అంశాలతో తీర్చిదిద్దుతున్న ఈ సినిమాను సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది ప్రేమికుల రోజు సందర్భంగా ఫిబ్రవరి 13న థియేటర్లలోకి రానుంది చిత్రం.

తమన్నా


ప్రముఖ గాయని పి.సుశీలని సత్కరిస్తున్న నరసింహారావు, డి.సురేశ్‌బాబు. చిత్రంలో అలనాటి నటీమణులు రాధిక, జయసుధ, జయచిత్ర, ప్రభ, సుమలత, రోజారమణి

శోభన్‌బాబు నుంచి క్రమశిక్షణ నేర్చుకున్నాం

- 'సోగ్గాడు' స్వర్ణోత్సవంలో సీనియర్ కథానాయికలు

"ఎంతోమందికి అభిమానులు ఉంటారు కానీ.. .శోభన్‌బాబు అభిమానులు మాత్రం ప్రత్యేకం. ఆయన వెళ్లిపోయినా, ఇప్పటికీ జీవించే ఉన్నారనిపించేలా అభిమానులు సేవా కార్యక్రమాలు చేస్తుంటారు. అప్పట్లో ప్రతి ఇంట్లో భర్త ఎవరినైనా అభిమానించేవాడేమో కానీ, భార్య మాత్రం శోభన్‌బాబునే ఇష్టపడేది. అభిమానుల్లోనే కాదు, ప్రేక్షకుల హృదయాల్లోనూ సజీవంగా నిలిచిపోయిన గొప్ప నటుడు శోభన్‌బాబు. రీరిలీజ్‌గా ప్రేక్షకుల ముందుకొస్తున్న ఆయన నటించిన 'సోగ్గాడు' చిత్రం మళ్లీ వంద రోజులు ఆడాలని కోరుకుంటున్నా" అన్నారు ప్రముఖ రచయిత పరుచూరి గోపాలకృష్ణ. శోభన్‌బాబు కథానాయకుడిగా నటించిన 'సోగ్గాడు' విడుదలై యాభయ్యేళ్లు పూర్తయిన సందర్భంగా ఆ చిత్రాన్ని నిర్మించిన సురేశ్ ప్రొడక్షన్స్, అఖిల భారత శోభన్‌బాబు సేవా సమితి కలిసి శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో స్వర్ణోత్సవాన్ని నిర్వహించాయి. శోభన్‌బాబుతో కలిసి నటించిన కథానాయికలతోపాటు, ఆయనతో సినిమాలు చేసిన నిర్మాతలు, దర్శకులు, రచయితలు, గాయనీ గాయకులు ఈ వేడుకలో పాల్గొన్నారు. సీనియర్ గాయని పి.సుశీలను ఈ వేదికపై సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ "శోభన్‌బాబు సినిమాల్లో పాడిన ప్రతి పాట నా మదిలో మెదులుతూనే ఉంది. అప్పట్లో 'సోగ్గాడు' సినిమాతో నాకు మంచి పేరు వచ్చింది. ఆ సినిమా స్వర్ణోత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉంది. ఇలాంటి గొప్ప కార్యక్రమాలన్నీ చూసి ఆ జ్ఞాపకాల్ని పోగేసుకోవాలని ఉంది" అన్నారు. నిర్మాత అట్లూరి పూర్ణచంద్రరావు మాట్లాడుతూ "శోభన్‌బాబు మన చిత్ర పరిశ్రమలో ఓ ఆర్థిక మంత్రిలా ఉండేవారు. ప్రతి సినిమానీ లెక్క వేసుకుని చేసేవారు. 'సోగ్గాడు' సినిమా సురేశ్ ప్రొడక్షన్స్ సంస్థకు గొప్ప పేరు, స్థిరత్వాన్ని తీసుకొచ్చింది" అన్నారు. నటి జయసుధ మాట్లాడుతూ "నేనూ, శోభన్‌బాబు కలిసి 38 సినిమాల్లో నటించాం. ఆయన్నుంచి క్రమశిక్షణని నేర్చుకున్నా. మా హీరోయిన్స్ అందరికీ ఆయనంటే చాలా ఇష్టం. శోభన్‌బాబు మన మధ్య లేకపోయినా ఆయన అభిమానులు 'సోగ్గాడు' సినిమాకి స్వర్ణోత్సవం నిర్వహించడం గొప్ప విషయం" అన్నారు. నటి జయచిత్ర మాట్లాడుతూ "ఈ సినిమా జ్ఞాపకాలు ఇంకా మదిలో మెదులుతున్నాయి. నటిగా నాకు మంచి అవకాశాల్ని తెచ్చిపెట్టింది. శోభన్‌బాబు కోప్పడటం నేనెప్పుడూ చూడలేదు. ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ ఉండేవారు" అన్నారు. నటి రాధిక శరత్‌కుమార్ మాట్లాడుతూ "శోభన్‌బాబు అందంగానే కాదు, అందమైన వ్యక్తిత్వంతోనూ ఉండేవారు. ఆయన తన సినిమా సెట్‌లో మరో సినిమా గురించి, మరొకరి గురించి మాట్లాడటం నేను వినలేదు. ఆయన క్రమశిక్షణే మా అందరికీ అలవాటైంది" అన్నారు. శోభన్‌బాబు కోసమే రాశారా అనిపించేలా ఉంటుంది 'సోగ్గాడు' చిత్రమని, అప్పట్లో మా సంస్థని మళ్లీ విజయాల బాట పట్టించింది ఈ చిత్రమే అన్నారు నిర్మాత డి.సురేశ్‌బాబు. ఈ కార్యక్రమంలో సీనియర్ కథానాయికలు సుమలత, ప్రభ, రోజా రమణి, శోభన్‌బాబు మనవలు డా.సురక్షిత్, సౌరభ్‌చంద్ర, మాజీ ఎమ్మెల్యే జేష్ఠ రమేశ్, రాశీ మూవీస్ నరసింహారావు, సుధాకర్‌బాబు, కె.ఎస్.రామారావు, బి.గోపాల్ తదితర సినీ ప్రముఖులు పాల్గొన్నారు.

ఈసారి ఇడియట్స్ నలుగురు?


ఆమిర్ ఖాన్

బాలీవుడ్ ప్రేక్షకుల్లో నవ్వులు పూయించి విశేషంగా ఆకట్టుకున్న చిత్రం '3 ఇడియట్స్'. రాజ్‌కుమార్ హిరాణీ దర్శకత్వంలో ఆమిర్ ఖాన్, ఆర్.మాధవన్, శర్మన్ జోషి, కరీనాకపూర్ ప్రధాన పాత్రధారులుగా రూపొందిన ఈ సినిమాకు సీక్వెల్ రాబోతున్న కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా దీనికి '4 ఇడియట్స్' అనే పేరును ఖరారు చేసినట్లు సమాచారం. "3 ఇడియట్స్' ప్రపంచాన్ని విస్తరించాలనే ఆలోచనలో ఉన్నారు దర్శకనిర్మాతలు. అందుకే '4 ఇడియట్స్' పేరుతో సీక్వెల్‌ను తీసుకురావాలని నిర్ణయించుకున్నారు. మొదటి భాగంలోని నటీనటులు తమ పాత్రలను తిరిగి పోషించే అవకాశం ఉన్నప్పటికీ.. నాల్గో పాత్రను ఇంకా ఖరారు చేయలేదు. దీని కోసమే మరో హిందీ స్టార్‌ను రంగంలోకి దించే ప్రయత్నాలు చేస్తుంది చిత్రబృందం. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయ"ని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరి ఈసారి నలుగురు ఇడియట్స్ తెరపై చేసే సందడి ఎలా ఉంటుందో చూడాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.


శివాజీ, బిందు మాధవి

బతుకుని మార్చేది చదువే

ఈ క్రిస్మస్‌కి 'దండోరా' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు నటుడు శివాజీ. ఆయన.. నవదీప్, నందు, రవికృష్ణ, బిందు మాధవి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాని మురళీకాంత్ తెరకెక్కించారు. రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మించారు. మౌనిక రెడ్డి, మురళీధర్ రెడ్డి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానున్న నేపథ్యంలో హీరో నాగచైతన్య శుక్రవారం ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. "అన్నా మా అవ్వని గింత దూరం ఎందుకు తీసుకుపోతున్నామన్నా" అంటూ ఓ పిల్లాడి ప్రశ్నతో మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. సమాజాన్ని పట్టి పీడిస్తున్న కుల సమస్యని ఈ సినిమాలో ప్రధానంగా చర్చించనున్నట్లు ట్రైలర్‌ను బట్టి అర్థమవుతోంది. "మన చావు పుట్టుకలన్నీ ఆ ఊరి బయట రాసిందురా దేవుడు", "చావు నుంచైనా తప్పించుకోవచ్చేమో గానీ.. కులం నుంచి తప్పించుకోలేం రా", "మన బతుకులు మారాలంటే మనకు కావాల్సిందొక్కటే.. చదువు, చదువు" అంటూ ట్రైలర్‌లో ఆద్యంతం శక్తిమంతమైన సంభాషణలు వినిపించాయి. ఈ చిత్రానికి సంగీతం: మార్క్ కె.రాబిన్, ఛాయాగ్రహణం: వెంకట్ ఆర్ శాఖమూరి.

ఓ భర్తగా తప్పు చేశా!


డింపుల్ హయాతి, రవితేజ, ఆషిక

'భర్త మహాశయులకు విజ్ఞప్తి' చిత్రంతో సంక్రాంతి బరిలో సందడి చేయనున్నారు రవితేజ. ఆయన హీరోగా నటించిన ఈ సినిమాని కిశోర్ తిరుమల తెరకెక్కించారు. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి కథానాయికలు. ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి 13న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ఈ చిత్ర టీజర్‌ని విడుదల చేశారు. ఓ భర్తగా హీరో తనకొచ్చిన సమస్యను చెప్పుకునేందుకు సైకాలజిస్ట్‌ను కలవడం.. దానికి అతనిచ్చిన సలహాల నేపథ్యంలో టీజర్ ఆద్యంతం వినోదాత్మకంగా సాగింది. ఈ ప్రచార చిత్రాన్ని బట్టి.. ఇది ఇటు భార్యకి అటు ప్రేయసికి మధ్య నలిగిపోయే ఓ భర్త కథగా సాగనున్నట్లు అర్థమవుతోంది. "కమల్‌హాసన్ నాయుడు గారు ఓ భర్తగా నేను తప్పు చేశా కదండి" అంటూ టీజర్‌లో రవితేజ చెప్పిన డైలాగ్ ఆసక్తి రేకెత్తించింది. మరి తను చేసిన ఆ తప్పేంటి.. దాని వల్ల వచ్చిన సమస్యలేంటి అన్నది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఛాయాగ్రహణం: ప్రసాద్ మూరెళ్ల.

మోగ్లీ.. ఎవర్నీ నిరుత్సాహపరచదు


సాక్షి, సాయి దుర్గా తేజ్, రోషన్, విశ్వప్రసాద్

"మోగ్లీ'ని తప్పకుండా థియేటర్లలో చూడండి. ఇది కచ్చితంగా ఎక్కడా.. ఎవర్నీ నిరుత్సాహపరచదు'' అన్నారు హీరో రోషన్ కనకాల. ఆయన టైటిల్ పాత్రలో నటించిన ఈ సినిమాని సందీప్ రాజ్ తెరకెక్కించారు. టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. సాక్షి మడోల్కర్ కథానాయిక. ఈ సినిమా ఇటీవల విడుదలైన నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో థాంక్యూ మీట్ ఏర్పాటు చేశారు. హీరో సాయి దుర్గా తేజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "మనం చిన్నప్పటి నుంచి టీవీల్లో చూసిన టైటిల్ మోగ్లీ. ఇప్పుడది సినిమా అయింది. దాన్ని రోషన్ మనకి పరిచయం చేశాడు. సాక్షి, బండి సరోజ్, వైవా హర్ష.. అందరూ అద్భుతంగా నటించారు. దర్శకుడు సందీప్ రాజ్ ఈ మధ్య బ్యాడ్‌లక్ అని ఓ ట్వీట్ వేశారు. ఈ ఇండస్ట్రీలో హార్డ్‌వర్క్ తప్ప బ్యాడ్‌లక్ అనేది ఉండదు. తనింకా బాగా కష్టపడి మరిన్ని మంచి స్క్రిప్ట్‌లు తెరపైకి తీసుకురావాలని కోరుకుంటున్నా. ఇలాంటి మంచి చిత్రాల్ని ప్రోత్సహిస్తున్న ప్రేక్షకులందరికీ కృతజ్ఞతలు" అన్నారు. "మా చిన్న చిత్రాన్ని పెద్ద సినిమాలా ఆదరించినందుకు ప్రేక్షకులకు కృతజ్ఞతలు" అన్నారు నిర్మాత టీజీ విశ్వప్రసాద్. రోషన్ మాట్లాడుతూ.. "ఈ మోగ్లీ గాణ్ని గెలిపించినందుకు.. ఆదరించినందుకు ప్రేక్షకులందరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నా. సాక్షి దీంట్లో అద్భుతంగా నటించింది. నిర్మాత విశ్వప్రసాద్ లేకపోతే ఈ చిత్రం లేదు" అన్నారు. ఈ కార్యక్రమంలో సాక్షి, హేమంత్ మధుకర్ పాల్గొన్నారు.

ఖతర్నాక్ జాసూస్ రెడీ



"హ్యాపీ పటేల్ నిన్ను మామూలుగా చంపను.. హింస అంటే ఏంటో చూపిస్తూ చంపేస్తా" అంటూ వీర్‌దాస్‌కు సవాల్ విసురుతున్నారు ఓ వ్యక్తి. మరి ఈ సవాల్‌ను ఆయనెలా ఎదుర్కొన్నాడో తెలియాలంటే 'హ్యాపీ పటేల్: ఖతర్నాక్ జాసూస్' సినిమా చూడాల్సిందే. వీర్‌దాస్ హీరోగా నటిస్తూ.. దర్శకత్వం వహించిన చిత్రమిది. అగ్రహీరో ఆమిర్ ఖాన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఖతర్నాక్ జాసూస్ రెడీ అంటూ ట్రైలర్‌ను ఇన్‌స్టా వేదికగా విడుదల చేసింది చిత్ర బృందం. "ఆయన ఒక చెఫ్, ఏజెంట్, హీరో.. అతనే హ్యాపీ పటేల్" అనే వ్యాఖ్యల్ని జోడించింది. ఇందులో పలు భిన్నమైన అవతారాల్లో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు వీర్ దాస్. జిమ్మీ పాత్రలో సరికొత్తగా కనిపించి ట్రైలర్‌కు ఆకర్షణగా నిలిచారు ఆమిర్. ఈ స్పై కామెడీ చిత్రంలో ఇమ్రాన్ ఖాన్, మోనా సింగ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రం జనవరి 16న థియేటర్లలోకి రానుంది.

ఆరోజు భయంతో బయటికి రాలేదు!

ఈ ఏడాది 'లోక చాప్టర్ 1: చంద్ర' సినిమాతో మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది మలయాళీ భామ కల్యాణి ప్రియదర్శన్. ఇందులో తన అద్భుతమైన సాహసాలతో సూపర్ హీరోయిన్ అనిపించుకున్న ఈ తార.. ఈ చిత్రం విడుదల సమయంలో తానెంతో భయపడినట్లు చెప్పింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కల్యాణి మాట్లాడుతూ.. "నన్ను సూపర్ హీరోగా ప్రేక్షకులు అంగీకరిస్తారో, లేదోనని భయపడ్డాను. విడుదల రోజున భయంతో బయటికి కూడా రాలేదు. నాతో పాటు మా టీమ్ అంతా ప్రేక్షకులు విమర్శలు చేయకపోతే చాలు అని మా గదుల్లోనే ఉన్నాం. చివరకు మధ్యాహ్నం మాకు ఉపశమనం లభించింది. మేము ఎంత భయపడ్డామో అంత మంచి స్పందన వచ్చింది. మధ్యాహ్నం 3గంటలకు మంచి రివ్యూలు వస్తున్నాయని మాకు తెలియగానే అందరం గదిలో నుంచి బయటికి వచ్చి సంబరాలు చేసుకున్నామ"ని చెప్పుకొచ్చింది.



కల్యాణి ప్రియదర్శన్

ప్రతి తండ్రికీ చూపించాల్సిన చిత్రం


సాయి సింహాద్రి, వినోద్ కుమార్, సతీశ్

సాయి సింహాద్రి హీరోగా నటిస్తూ.. స్వయంగా నిర్మించిన చిత్రం 'సన్ ఆఫ్'. బత్తల సతీశ్ తెరకెక్కించారు. వినోద్ కుమార్ కీలక పాత్ర పోషించారు. ఈ చిత్ర టీజర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా నటుడు వినోద్ కుమార్ మాట్లాడుతూ.. "తండ్రీ కొడుకుల మధ్య జరిగే అందమైన కథతో రూపొందిన చిత్రమిది. స్క్రీన్‌ప్లే ప్రధానంగా సాగుతుంది. ఇది కచ్చితంగా అందరికీ నచ్చుతుంది" అన్నారు. "ఓ కొడుకు తన తండ్రిపై ఎందుకు కేసు వేశాడనే ఆసక్తికర అంశంతో ఈ సినిమా సాగుతుంది" అన్నారు దర్శకుడు సతీశ్. హీరో, నిర్మాత సాయి సింహాద్రి మాట్లాడుతూ.. "ఈ కథ నిజ జీవితంలో నాకు.. మా నాన్నకు కనెక్ట్ అవుతుంది. ప్రతి కొడుకు.. తన తండ్రికి చూపించాల్సిన చిత్రమిది. దీంట్లో బలమైన డ్రామా, భావోద్వేగాలు కనిపిస్తాయి" అన్నారు.

ఆరేళ్ల తర్వాత మళ్లీ?


అక్షయ్‌కుమార్

జయాపజయాలతో సంబంధం లేకుండా ప్రేక్షకుల్ని అలరించడమే లక్ష్యంగా సినిమాల్ని ఎంచుకుంటారు బాలీవుడ్ కథానాయకుడు అక్షయ్‌కుమార్. ఈయనతో ఓ సినిమా కోసం చేతులు కలిపినట్లు ఇటీవలే దర్శకుడు అనీస్ బాజ్మీ అధికారికంగా వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే స్క్రిప్ట్ పనులు పూర్తయ్యాయని, అన్నీ ప్రణాళిక ప్రకారం జరిగితే వచ్చే ఏడాది ఈ కామెడీ డ్రామా చిత్రీకరణను ప్రారంభిస్తామని తెలిపారు దర్శకుడు. ఇప్పుడిందులో కథానాయికగా విద్యాబాలన్‌ను ఎంచుకున్నట్లు సమాచారం. 'హే బేబీ', 'భూల్ భులయ్యా' లాంటి చిత్రాల్లో కలిసి నటించి హిట్ జోడీ అనిపించుకున్నారు అక్షయ్, విద్యాబాలన్. మళ్లీ ఆరేళ్ల తర్వాత వీరిద్దరూ తెరపైకి రావడానికి చాలా ఉత్సాహంగా ఉన్నారని, త్వరలో ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించనున్నార"ని విద్యాబాలన్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం అక్షయ్ 'భూత్ బంగ్లా', 'హైవాన్' లాంటి చిత్రాలతో బిజీగా ఉన్నారు.


విద్యాబాలన్

రెండో ఇన్నింగ్స్ మొదలు


ఉదయ్‌భాస్కర్, నక్షత్ర

ఉదయ్‌భాస్కర్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'సెకండ్ ఇన్నింగ్స్'. నక్షత్ర కథానాయిక. గోవింద్ పొదులపు దర్శకత్వం వహిస్తున్నారు. జ్ఞానేశ్వరి, వేద వ్యాస్ ఆకుల నిర్మాతలు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాల్ని చేసుకుంటోంది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని సినీ వర్గాలు తెలిపాయి. "నిజ జీవితాల్ని ప్రతిబింబించే కథ, కథనాలతో రూపొందుతున్న చిత్రమిది. భావోద్వేగాలే ప్రధానంగా సాగుతుంది. ఒక యువకుడి జీవితంలో రెండో ఇన్నింగ్స్ ఎలా మొదలైందన్నది తెరపైనే చూడాలి. రంగస్థలం, టెలివిజన్, సినిమా... ఇలా ప్రతి వేదికపైనా తనదైన ముద్ర వేసిన నటుడు ఉదయ్‌భాస్కర్ మరోసారి సహజమైన అభినయంతో ఆకట్టుకుంటారు. ఆయనకీ, నక్షత్రకీ మధ్య కెమిస్ట్రీ బాగుంటుంద"ని సినీ వర్గాలు చెప్పాయి. ఈ సినిమాలో చిత్రం శ్రీను, అఖిల్, సోమాలి, లిరీష తదితరులు నటించారు.

డౌటే లేదు.. డేటాదే హవా


- వచ్చే రెండేళ్లలో రూ.60,000 కోట్ల పెట్టుబడులు
- భారీగా డేటా సెంటర్ల విస్తరణ
- 2030 నాటికి 8 జీడబ్ల్యూ సామర్థ్యం
- సవాళ్లూ లేకపోలేదు

డేటా.. డేటా.. తరచూ వినిపిస్తున్న పదం ఇది. సమీప భవిష్యత్తులో డేటా వినియోగం అనూహ్యంగా పెరిగే అవకాశం ఉండటంతో అంతర్జాతీయ సంస్థలు, పెట్టుబడులను మన దేశంలో డేటా కేంద్రాల వ్యాపారం ఆకర్షిస్తోంది. ఏఐ (కృత్రిమ మేధ), డేటా లోకలైజేషన్, లో లేటెన్సీ నీడ్స్ (గేమింగ్, ట్రేడింగ్, వీడియో కాన్ఫరెన్సింగ్ వంటి రియల్ టైమ్ అప్లికేషన్లు...) ఇవే మనదేశంలో డేటాకు గిరాకీ అనూహ్యంగా పెరగటానికి ప్రధాన కారణాలు.

ఇటీవల కాలంలో వివిధ నగరాల్లో కొత్త డేటా కేంద్రాలు పెద్ద ఎత్తున ఏర్పాటవుతున్నాయి. ఈ రంగంలోకి భారీగా పెట్టుబడులు ప్రవహిస్తున్నాయి. వచ్చే రెండేళ్ల కాలంలో మనదేశంలో డేటా సెంటర్లకు రూ.55,000- 60,000 కోట్ల వరకూ పెట్టుబడులు వచ్చే అవకాశం ఉన్నట్లు ఇటీవల క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది. అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్‌తో పాటు మరికొన్ని విదేశీ సంస్థలు, స్థానిక కంపెనీలు కొత్త డేటా కేంద్రాల ఏర్పాటులో తీరిక లేకుండా ఉన్నాయి.

ఎన్నో ప్రోత్సాహకాలు...

డేటా కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వం 'మౌలిక సదుపాయాల పరిశ్రమ' హోదా ఇచ్చింది. దీనివల్ల రాయితీలు, ప్రోత్సాహకాలు లభిస్తాయి. విద్యుత్తు సరఫరా, మానవ వనరుల లభ్యత సులువవుతుంది. ఇదే కాకుండా వ్యయాలను తగ్గించే లక్ష్యంతో మూలధన ఆస్తులకు జీఎస్టీలో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్(ఐటీసీ) సదుపాయాన్ని కల్పించింది.



- ఈనాడు, హైదరాబాద్

ఎందుకీ జోరు...?

- ఇవాళ ఎవరి నోట విన్నా చాట్‌జీపీటీ, గూగుల్ జెమిని... పేర్లు వినిపిస్తాయి. షాపింగ్ చేసే ముందు ఏ వస్తువు కొనాలి, ఏ బ్రాండు బాగుంది, ఇతర బ్రాండ్లతో పోలిక ఏమిటి...? అనే ఎన్నో సందేహాలకు ఏఐని మన దేశంలో వినియోగదార్లు అధికంగా వాడుతున్నారని తాజా సర్వేలు పేర్కొంటున్నాయి.
- ఇది ఒక చిన్న ఉదాహరణ మాత్రమే. ఇలా ఇతర విభాగాలు, అంశాలకు సంబంధించిన సమాచారం కోసం ఏఐ మీద ఆధారపటం రోజురోజుకూ పెరుగుతోందే తప్ప తగ్గే పరిస్థితి లేదు. దీనికి అనుగుణంగా ఎన్నో రకాలైన ఏఐ టూల్స్ సైతం అందుబాటులోకి వస్తున్నాయి.
- ఇంటర్నెట్ వినియోగం 2019లో 33.4% మాత్రమే. ఈ ఏడాది ప్రారంభం నాటికి ఇది 55.3 శాతానికి పెరిగింది. అదే విధంగా ఒక వినియోగదారుడి నెలవారీ సగటు డేటా వినియోగం 2019లో 11.5 జీబీ కాగా, ఇప్పుడు అది 32 జీబీకి చేరుకుంది.



- డేటా లోకలైజేషన్ నిబంధనలతో స్థానికంగా డేటాను నిల్వ చేయాల్సిన అవసరం ఏర్పడుతోంది. ప్రపంచ వ్యాప్తంగా 'జనరేట్' అయ్యే డేటాలో మనదేశం వాటా అయిదో వంతు కాగా, అంతే స్థాయిలో డేటా కేంద్రాల సామర్థ్యం లేదు. అన్ని దేశాల్లో ఉన్న డేటా కేంద్రాల సామర్థ్యంలో మన వాటా కేవలం 3 శాతం మాత్రమే.
- అందువల్ల పెరుగుతున్న గిరాకీని తట్టుకోవాలంటే అధిక సామర్థ్యం కల డేటా కేంద్రాలు అవసరం.
- ప్రస్తుతం మనదేశంలో 280 డేటా కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాలకు ఉన్న సామర్థ్యం 1.2 గిగావాట్లు (జీడబ్ల్యూ) కాగా, కొత్త కేంద్రాల ఏర్పాటుతో 2030 నాటికి ఇది 8 గిగావాట్లకు పెరుగుతుందని జెఫరీస్ అనే సంస్థ ఇటీవల అంచనా వేసింది.
- ముంబయి, చెన్నై, హైదరాబాద్ నగరాల్లో డేటా కేంద్రాల సామర్థ్యం అధికంగా ఉంది. ఈ జాబితాలో త్వరలో విశాఖపట్నం చేరనుంది.
- అధిక వినియోగం డేటా కేంద్రాల నిర్వాహకులకు కాసులు పండించనుంది. 2028 ఆర్థిక సంవత్సరం నాటికి రూ.20,000 కోట్ల ఆదాయాల స్థాయికి డేటా కేంద్రాల పరిశ్రమ చేరుకుంటుందని అంచనా.

నీరు, విద్యుత్తు ఎలా?

డేటా కేంద్రాల విస్తరణలో సవాళ్లు సైతం లేకపోలేదు. డేటా కేంద్రాలకు ఎంతో అధిక విద్యుత్తు అవసరం. 2030 నాటికి డేటా కేంద్రాలు దేశ విద్యుత్తు లభ్యతలో 3 శాతం వినియోగిస్తాయని అంచనా. ప్రస్తుతం ఇది 1 శాతం మాత్రమే. దీన్ని బట్టి విద్యుత్తు సామర్థ్యం ఎంతగానో పెరగాలని తెలుస్తోంది. ఇదే కాకుండా నీటి అవసరాలు కూడా ఎంతగానో పెరుగుతాయి. అధిక నీటి లభ్యత ఎలా అనేది ప్రధాన సమస్య కాగా, డేటా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో కాలుష్యం తలెత్తి పర్యావరణ సమస్యలు ఉత్పన్నం అవుతాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా భూగర్భ జలాలు కలుషితం అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఈ సవాళ్లకు తగిన పరిష్కారాలు కనుగొనటం పైనే డేటా కేంద్రాల పరిశ్రమ విస్తరణ ఆధారపడి ఉంటుందని తెలుస్తోంది.

ఈనాడు బిజినెస్

సర్వేజనా హెల్త్‌కేర్‌లో కిమ్స్‌కు 75.53 శాతం వాటా

ఈనాడు, హైదరాబాద్: సర్వేజనా హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్‌లో మరో 6.94 శాతం వాటా కొనుగోలు చేసినట్లు కిమ్స్ హాస్పిటల్స్ (కృష్ణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) వెల్లడించింది. దీంతో ఈ సంస్థలో కిమ్స్ వాటా 75.53 శాతానికి చేరింది. సన్‌షైన్ హాస్పిటల్స్‌ను సర్వేజనా హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహిస్తోంది. ఈ సంస్థ గత ఆర్థిక సంవత్సరంలో రూ.597 కోట్ల టర్నోవర్ నమోదు చేసింది.

ఎస్‌ఈఐఎల్ ఎనర్జీకి వరుసగా రెండోసారి 'గ్రేట్ ప్లేస్ టు వర్క్' గుర్తింపు

ఈనాడు, హైదరాబాద్: దేశంలోని స్వతంత్ర విద్యుత్తు ఉత్పత్తి సంస్థల్లో ఒకటైన ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ (గతంలో సెంబ్‌కార్ప్ ఎనర్జీ ఇండియా) 2025-26 సంవత్సరానికి 'గ్రేట్ ప్లేస్ టు వర్క్' గుర్తింపు సాధించింది. దాదాపు 86% మంది కంపెనీ ఉద్యోగులు ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ పనిచేయటానికి గొప్ప ప్రదేశమని అభిప్రాయపడ్డారు. 'గ్రేట్ ప్లేస్ టు వర్క్' అనేది ప్రపంచ ప్రసిద్ధి గాంచిన సంస్థ. వ్యాపార సంస్థల్లో పని పరిస్థితులు, సంస్కృతి, ఉద్యోగుల అనుభవం, ఆవిష్కరణకు ప్రోత్సాహం... తదితర అంశాలను పరిశీలించి ధ్రువీకరణలు జారీ చేస్తుంది. వరుసగా రెండో సంవత్సరం ఈ గుర్తింపు పొందటం గొప్ప విషయమని, ఉద్యోగులు, పని పరిస్థితులకు తాము ఇస్తున్న ప్రాధాన్యానికి ఇది నిదర్శనమని కంపెనీ సీఈఓ జనమేజయ మహాపాత్ర అన్నారు. ఈ సంస్థ నెల్లూరు జిల్లా ముత్తుకూరు వద్ద 4×660 మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ యూనిట్లను నిర్వహిస్తోంది.

తాజ్ జీవీకే హోటల్స్‌లో ఐహెచ్‌సీఎల్ వాటా జీవీకే-భూపాల్ కుటుంబం చేతికి



ఈనాడు, హైదరాబాద్: తాజ్ జీవీకే హోటల్స్ అండ్ రిసార్ట్స్ లిమిటెడ్‌లో ఇండియన్ హోటల్స్ కంపెనీ లిమిటెడ్ (ఐహెచ్‌సీఎల్)కు ఉన్న 25.52% వాటా జీవీకే- భూపాల్ కుటుంబం చేతికి రానుంది. ఈ రెండు సంస్థల మధ్య ఇప్పటి వరకూ ఉన్న వాటాదార్ల వెంచర్ ఒప్పందాన్ని, దీర్ఘకాలిక మేనేజ్‌మెంట్ ఒప్పందంగా మార్చుకోవాలని నిర్ణయించారు. ఈ లావాదేవీ పూర్తయ్యాక తాజ్ జీవీకే హోటల్స్ అండ్ రిసార్ట్స్‌లో జీవీకే - భూపాల్ కుటుంబానికి 74.99% వాటా ఉన్నట్లు అవుతుంది. ఇరవై ఏళ్లకు పైగా ఐహెచ్‌సీఎల్, జీవీకే- భూపాల్ కుటుంబం కలిసి 1500కు పైగా గదులు కల ఏడు స్టార్ హోటళ్లను అభివృద్ధి చేసినట్లు తాజ్ జీవీకే హోటల్స్ అండ్ రిసార్ట్స్ సంయుక్త ఎండీ కృష్ణ భూపాల్ తెలిపారు. ముంబయి, హైదరాబాద్, చెన్నై, చండీగఢ్ నగరాల్లో ఉన్న ఈ హోటళ్లు ఆతిథ్య రంగంలో క్రియాశీలకంగా ఉన్నట్లు తెలిపారు. వచ్చే అయిదేళ్లలో 4,000 గదుల స్థాయికి విస్తరించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు వివరించారు. జీవీకే- భూపాల్ కుటుంబంతో ఐహెచ్‌సీఎల్‌కు ఉన్న భాగస్వామ్యం హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణా హోటల్ నుంచి ముంబయిలోని తాజ్ శాంతాక్రూజ్ వరకూ విస్తరించిందని ఐహెచ్‌సీఎల్ ఎండీ, సీఈఓ పునీత్ చత్వాల్ అన్నారు.

20% వాటా.. రూ.39,618 కోట్లు

శ్రీరామ్ ఫైనాన్స్‌లో కొనుగోలు చేయనున్న జపాన్ సంస్థ

దిల్లీ: బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో 20% వాటాను జపాన్ సంస్థ మిత్సుబిషి యూఎఫ్‌జే ఫైనాన్షియల్ గ్రూప్ (ఎంయూఎఫ్‌జీ) రూ.39,618 కోట్ల (దాదాపు 4.4 బిలియన్ డాలర్ల)కు కొనుగోలు చేయనుంది. ఇప్పటివరకు భారత ఆర్థిక రంగంలో అతిపెద్ద విదేశీ పెట్టుబడి ఇదే కావడం విశేషం. ప్రిఫరెన్షియల్ ఈక్విటీ షేర్ల ద్వారా ఎంయూఎఫ్‌జీ ఈ మైనారిటీ వాటాను కొనుగోలు చేయనున్నట్లు శ్రీరామ్ ఫైనాన్స్ తెలిపింది. ఎంయూఎఫ్‌జీతో డెఫినిటివ్ ఒప్పందం కుదుర్చుకోవడం భారత ఆర్థిక సేవల రంగంపై విశ్వాసాన్ని, భవిష్యత్ వృద్ధి సామర్థ్యాన్ని చూపుతోందని వెల్లడించింది. ఎంయూఎఫ్‌జీ బ్యాంక్ ప్రతిపాదిత పెట్టుబడులకు వాటాదార్లు, నియంత్రణ సంస్థల అనుమతులు లభించాల్సి ఉందని స్పష్టం చేసింది.

- ఈ ఏడాది అక్టోబరులో ఆర్‌బీఎల్ బ్యాంక్‌లో 60% వాటాను రూ.26,853 కోట్లకు కొనుగోలు చేసేందుకు యూఏఈకు చెందిన ఎమిరేట్స్ ఎన్‌డీబీ బ్యాంక్ ఆసక్తి చూపించింది.
- ఎంయూఎఫ్‌జీ బ్యాంక్ మాతృసంస్థ అయిన మిత్సుబిషి యూఎఫ్‌జే ఫైనాన్షియల్ గ్రూప్‌నకు భారత్‌లో 130 ఏళ్ల చరిత్ర ఉంది. మన దేశంలో 1.7 బి.డాలర్ల పెట్టుబడులు పెట్టిన ఈ సంస్థ, దాదాపు 5000 ఉద్యోగాలను సృష్టించింది.

2030 నాటికి 50 లక్షల మందికి శిక్షణ

- ఏఐ, సైబర్ సెక్యూరిటీ, క్వాంటమ్ కంప్యూటింగ్‌లో: ఐబీఎం

దిల్లీ: నూతన సాంకేతిక పరిజ్ఞానానికి అవసరమైన నైపుణ్యం కల మానవ వనరులను తయారు చేయటం కోసం అమెరికా టెక్ కంపెనీ ఐబీఎం భారీ స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు అమలు చేయనుంది. 2030 నాటికి ఏఐ, సైబర్ సెక్యూరిటీ, క్వాంటమ్ కంప్యూటింగ్‌లో 50 లక్షల మందికి శిక్షణ ఇవ్వనుంది. 'ఐబీఎం స్కిల్స్‌బిల్డ్' కింద ఈ కార్యక్రమాలు అమలు చేయనున్నట్లు వెల్లడించింది. దీనివల్ల విద్యార్థులకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని, అదే సమయంలో వివిధ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కల మానవ వనరులు లభిస్తాయని పేర్కొంది. దీని కోసం స్కూళ్లు, యూనివర్సిటీలు, ఒకేషనల్ విద్యా సంస్థలతో కలిసి పనిచేయనున్నట్లు వివరించింది. ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ) సహకారంతో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు, హ్యాకథాన్, ఇంటర్న్‌షిప్ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించింది. 'నవతరం సాంకేతికతల్లో నైపుణ్యాలు, పోటీతత్వాన్ని కలిగి ఉండటం ఎంతో అవసరం. ఏ కొద్ది మందికో ఇవి చేరువ అయితే సరిపోదు. యువతను ఇందుకు సన్నద్ధం చేయటం ద్వారా దేశ సత్వర వృద్ధిలో భాగస్వామి కావాలని అనుకుంటున్నాం' అని ఐబీఎం ఇండియా ఛైర్మన్ అండ్ సీఈఓ అర్వింద్ కృష్ణ తెలిపారు.

సూరత్, తిరుపూర్, విశాఖ ఎగుమతులకు జోష్

భారత్-ఒమన్ ఎఫ్‌టీఏ ప్రభావం

దిల్లీ: భారత్-ఒమన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కింద సున్నా సుంకాలతో సూరత్ నుంచి ఆభరణాలు; పుణె నుంచి ఇంజినీరింగ్ వస్తువులు; తిరుపూర్ నుంచి దుస్తులు; విశాఖపట్నం నుంచి మెరైన్ ఉత్పత్తుల ఎగుమతులు జోరందుకోనున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం.. కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ సహా పలు రాష్ట్రాల నుంచి ఐటీ/ఐటీఈఎస్ నిపుణులు, ఇతర వ్యాపార సేవల ప్రొవైడర్లకు మంచి ఎగుమతుల అవకాశాలు లభించనున్నాయి.

మొరాదాబాద్ నుంచి ఇత్తడి వస్తువులు, లోహ హస్తకళలు; కాన్పూర్-ఆగ్రా నుంచి తోళ్ల పాదరక్షలు; భడోహి-మిర్జాపూర్ నుంచి తివాచీలు, గృహ వస్త్రాలు; ఇడుక్కి/వయనాడ్ నుంచి విలువ జోడించిన సుగంధ ద్రవ్యాలు; తిరుపతి నుంచి ఎంపిక చేసిన ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులు; వేలూర్-అంబూర్ నుంచి లెదర్ చెప్పులకు సుంకాల నుంచి మినహాయింపు లభించనుంది.

కోడి గుడ్లు

20న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	650
వరంగల్	652
విజయవాడ	700
తూ/ప గోదావరి	675
విశాఖపట్నం	675
చిత్తూరు	688

పరిస్థితులకు అనుగుణంగా చర్యలు తీసుకోవడానికే తటస్థ వైఖరి

ఆర్‌బీఐ మినిట్స్‌లో వెల్లడి

ముంబయి: మారుతున్న స్థూలఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునేందుకు తటస్థ ద్రవ్య విధాన వైఖరి వెసులుబాటు కల్పిస్తుందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. ఈ నెల 3-5 తేదీల్లో జరిగిన ద్రవ్యపరపతి విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశం మినిట్స్‌ను ఆర్‌బీఐ శుక్రవారం విడుదల చేసింది. ఈ సమావేశాల్లో ఆయనతో పాటు మరో అయిదుగురు సభ్యులు రెపో రేటులో 25 బేసిస్ పాయింట్ల కోతకు అనుకూలంగా ఓటేశారు. దీంతో ఆర్‌బీఐ రెపో రేటు 5.25 శాతానికి చేరింది. తటస్థ వైఖరిని కొనసాగించాలని అయిదు సభ్యులు ఓటేయగా, ఒకరు మాత్రం 'అందుబాటు'గా మార్చాలని సూచించారు. 'గిరాకీని పెంచడంతో పాటు వృద్ధికి తోడ్పాటు అందించేందుకు పావు శాతం రేట్ల కోతకు ఓటేశాం. తటస్థ వైఖరిని కొనసాగించడానికి నేను అనుకూలం. పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునేందుకు ఈ వైఖరి దోహదపడుతుంది' అని సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. 2026-27 ప్రథమార్థంలో ద్రవ్యోల్బణం దాదాపు 4 శాతంగా ఉండొచ్చని అంచనా వేశారు. పసిడి వంటి విలువైన లోహాలను మినహాయిస్తే, ద్రవ్యోల్బణం మరింత తక్కువగా ఉంటుందన్నారు.

హైదరాబాద్‌లో ఆర్‌బీఐ కేంద్ర బోర్డు సమావేశం: అంతర్జాతీయ, దేశీయ ఆర్థిక పరిస్థితులు, సంబంధిత సవాళ్లపై ఆర్‌బీఐ కేంద్ర బోర్డు చర్చించింది. గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ 620వ సమావేశం హైదరాబాద్‌లో శుక్రవారం జరిగింది. బ్యాంకుల కోసం రిస్క్ ఆధారిత డిపాజిట్ బీమా నియమావళికి బోర్డు ఆమోదం తెలిపింది. ఈ సమావేశానికి ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్లు రవిశంకర్, స్వామినాథన్, పూనమ్ గుప్తా, శిరీష్ చంద్ర ముర్ము హాజరయ్యారు.

సంక్షిప్తంగా

- జర్మనీ సంస్థ బీఎండబ్ల్యూకి చెందిన ద్విచక్ర వాహనాల విభాగం **బీఎండబ్ల్యూ మోటరాడ్ ఇండియా** 2026 జనవరి 1 నుంచి తన వాహనాల ధరలను 6 శాతం వరకు పెంచనుంది.
- అమెరికాలోని తన వ్యాపారాన్ని మూడు అమెరికా సంస్థలకు ఒరాకిల్, సిల్వర్ లేక్, ఎంజీఎక్స్‌కు విక్రయించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు **టిక్‌టాక్** తెలిపింది.
- ప్రాథమిక మదింపు ఆధారంగా **ఇండిగో** కార్యకలాపాలను మరింత లోతుగా పరిశీలించాలని నిర్ణయించినట్లు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఛైర్‌పర్సన్ రవ్‌నీత్ కౌర్ తెలిపారు.
- 2024-25 ఆర్థిక సంవత్సరంలో **కోక-కోలా ఇండియా** నికర లాభం ఏకీకృత ప్రాతిపదికన 46.3% పెరిగి రూ.615.03 కోట్లకు చేరింది. కార్యకలాపాల ద్వారా ఆదాయం 7% అధికమై రూ.5,042.56 కోట్లుగా నమోదైంది.
- యునైటెడ్ సోలార్ హోల్డింగ్‌లో 30 మిలియన్ డాలర్ల (సుమారు రూ.25 కోట్లు) పెట్టుబడులు పెట్టేందుకు **వారీ ఎనర్జీస్** ఒప్పందాన్ని కుదుర్చుకుంది.
- **శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్** కంపెనీ నుంచి **పిరమల్ ఫైనాన్స్** వైదొలుగుతోంది. శ్రీరామ్ లైఫ్‌లో తనకున్న 14.72 శాతం వాటాను దక్షిణాఫ్రికా సంస్థ సన్లామ్ గ్రూపునకు రూ.600 కోట్లకు విక్రయించాలని నిర్ణయం తీసుకుంది.
- భారత్‌లో కేన్సర్ డయాగ్నొస్టిక్ పరీక్షలను ప్రారంభించేందుకు మైరియాడ్ జెనెటిక్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు **జైడస్ లైఫ్‌సైన్సెస్** తెలిపింది.
- ప్రైవేట్ ప్లేస్‌మెంట్ పద్ధతిలో మార్పిడి రహిత డిబెంచర్ల (ఎన్‌సీడీలు) జారీ ద్వారా రూ.2,000 కోట్లను **టాటా పవర్** సమీకరించింది.
- కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్ సొల్యూషన్స్ సంస్థ మినివెట్ ఏఐలో మెజార్టీ వాటాను **ఫ్లిప్‌కార్ట్** కొనుగోలు చేసింది.
- మహారాష్ట్ర విదర్భ ప్రాంతంలో 2 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యంతో తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు రూ.2,000 కోట్ల పెట్టుబడిని **శ్రీ సిమెంట్** పెట్టనుంది.

చైనాతో వాణిజ్య లోటు మరింత పైకి

- 2025లో 106 బి. డాలర్లకు చేరొచ్చు
- దిగుమతులు పెరగడమే కారణం: జీటీఆర్‌ఐ

దిల్లీ: చైనాతో భారత వాణిజ్య లోటు ఈ ఏడాది 106 బి. డాలర్ల(దాదాపు రూ.9.54 లక్షల కోట్లు)కు చేరొచ్చని మేధోసంస్థ గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్(జీటీఆర్‌ఐ) చెబుతోంది. ఆ దేశానికి మనం పంపే ఎగుమతులతో పోలిస్తే, అక్కడి నుంచి వచ్చే దిగుమతులు వేగంగా పెరుగుతుండడం ఇందుకు నేపథ్యమని తెలిపింది. ఈ ఏడాది ఎగుమతులు 17.5 బి. డాలర్లు, దిగుమతులు 109.6 బి. డాలర్లుగా నమోదవ్వొచ్చని జీటీఆర్‌ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ పేర్కొన్నారు.

కారణం ఏమిటంటే: ముడి పదార్థాలు, ఇంటర్మీడియట్ వస్తువులు; వాహన విడిభాగాలు, ఎలక్ట్రానిక్ విడి భాగాలు-అసెంబ్లీస్, మొబైల్ ఫోన్ విడిభాగాలు, మెషినరీ, వాటి విడిభాగాలు వంటి యంత్రపరికరాలు; యాక్టివ్ ఫార్మాసూటికల్ ఇంగ్రేడియంట్లు(ఏపీఐలు) అధికంగా దిగుమతి చేసుకోవాల్సి వచ్చిందని వాణిజ్య సహాయ మంత్రి జితిన్ ప్రసాద ఇటీవల తెలిపారు.

చైనాతో వాణిజ్యం(బి. డాలర్లలో)

ఏడాది	దిగుమతులు	ఎగుమతులు
2021	87.7	23.0
2022	102.6	15.2
2023	91.8	14.5
2024	109.6	15.1
2025(అంచనా)	123.5	17.5



ఏం చేయనున్నారు: ఒక అంతర్ మంత్రిత్వ కమిటీ(ఐఎమ్‌సీ)ని ఏర్పాటు చేసి దిగుమతులు-ఎగుమతుల ధోరణిని పరిశీలించనున్నారు. తద్వారా దిద్దుబాటు చర్యలు చేపట్టనున్నట్లు ప్రసాద వివరించారు. ఎలక్ట్రానిక్స్, మెషినరీ, ఆర్గానిక్ కెమికల్స్, ప్లాస్టిక్స్.. ఈ నాలుగు ఉత్పత్తి విభాగాలే చైనా నుంచి వచ్చే దిగుమతుల్లో 80% వరకు ఉన్నాయని జీటీఆర్‌ఐ తెలిపింది.

3 నెలల్లోగా భారత్- ఒమన్ ఒప్పందం అమల్లోకి

వాణిజ్య మంత్రి పీయూశ్ గోయల్



దిల్లీ: భారత్-ఒమన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)ను వచ్చే మూడు నెలల్లోగా అమలు చేయాలని ఇరు దేశాలు భావిస్తున్నట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూశ్ గోయల్ తెలిపారు. ఒమన్ మంత్రితో దీనిపై చర్చించినట్లు వెల్లడించారు. ఉక్కు, ఇంధనం, విద్య, ఆరోగ్య సంరక్షణ వంటి రంగాల్లో భారత వ్యాపారాలకు మంచి అవకాశాలు ఉంటాయని అభిప్రాయపడ్డారు. ఈ ఒప్పందం వల్ల మన దేశం ఎగుమతి చేస్తున్న 98 రకాల ఉత్పత్తులపై ఇకపై సుంకం ఉండదు. ఒమన్‌కు ఎగుమతి చేస్తున్న 99.38% భారత వస్తువులపై ప్రయోజనం కలుగుతుంది. కార్మికులు అధికంగా పని చేసే రంగాలైన రత్నాభరణాలు, జౌళి, తోలు, పాదరక్షలు, స్పోర్ట్స్ వస్తువులు, ప్లాస్టిక్స్, ఫర్నిచరు, వ్యవసాయ ఉత్పత్తులు, ఇంజినీరింగ్ ప్రోడక్ట్స్, ఔషధాలు, సంప్రదాయ ఔషధాలు, వైద్య పరికరాలు, వాహనాలపై టారిఫ్‌ను ఒమన్ పూర్తిగా రద్దు చేస్తుంది. వీటిపై ప్రస్తుతం 5-100% టారిఫ్ విధిస్తోంది. ఖర్జూరాలు, మార్బుల్, పెట్రో రసాయనాల వంటి ఒమన్ ఉత్పత్తులపై టారిఫ్‌ను మనదేశం తగ్గిస్తుంది. మొత్తం టారిఫ్ లైన్ల (12,556)లో 77.79% వరకు పన్ను సరళీకరణ ఉంటుంది.

భారత సంస్థలకు నియామకాల్లో వెసులుబాటు: వాణిజ్య ఒప్పందంలో భాగంగా ఒమన్‌లో పెట్టుబడులు పెట్టే భారత కంపెనీలకు నియామకాల్లో వెసులుబాటు ఉంటుందని గోయల్ తెలిపారు. కేవలం పరిమిత సంఖ్యలోనే ఒమన్ దేశస్థులను నియమించుకోవాల్సి ఉంటుందని, మిగతా వారిని భారత్ నుంచి తీసుకోవచ్చని వెల్లడించారు.

ప్రత్యక్ష పన్నుల వసూళ్లు 8 శాతం పెరిగాయ్

ప్రస్తుత సంవత్సరం ఏప్రిల్ నుంచి డిసెంబరు 17 వరకు నికర ప్రత్యక్ష పన్నుల వసూళ్లు రూ.17.04 లక్షల కోట్లకు చేరాయి. ఇందులో కార్పొరేట్ పన్నుల వసూళ్లు రూ.8.17 లక్షల కోట్లు కాగా.. కార్పొరేట్‌యేతర పన్నులు రూ.8.47 లక్షలు అని ఆదాయపు పన్ను విభాగం గణాంకాలు తెలియజేస్తున్నాయి. సెక్యూరిటీస్ లావాదేవీల పన్ను(ఎస్‌టీటీ)ల ద్వారా నికర వసూళ్లు రూ.40,195 కోట్లుగా ఉన్నాయి. అయితే రిఫండ్‌లు 14 శాతం తగ్గి రూ.2.97 లక్షల కోట్లకు పరిమితమయ్యాయి. రిఫండ్‌ల సర్దుబాటుకు ముందు స్థూల ప్రత్యక్ష పన్నుల వసూళ్లు 4.16 శాతం పెరిగి రూ.20.01 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2025-26) ప్రత్యక్ష పన్నుల వసూళ్లు రూ.25.20 లక్షల కోట్లుగా ఉండొచ్చని ప్రభుత్వం అంచనా వేసింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 12.7 శాతం ఎక్కువ.

4 రోజుల తర్వాత లాభాల్లోకి

సెన్సెక్స్ ▲448 84929 | నిఫ్టీ ▲151 25966

- రూ.5.43 లక్షల కోట్లు పెరిగిన సంపద
- విదేశీ మార్కెట్ల సానుకూల సంకేతాల ప్రభావం

ఎఫ్‌ఐఐల కొనుగోళ్లు.. రూ.1830.89 కోట్లు
డీఐఐల కొనుగోళ్లు.. రూ.5722.89 కోట్లు

నాలుగు రోజుల వరస నష్టాల అనంతరం స్టాక్ మార్కెట్ లాభాల్లో ముగిసింది. అమెరికా ద్రవ్యోల్బణం అంచనాల కంటే తక్కువగా నమోదుకావడంతో, ఫెడ్ కీలక రేట్లను మరింతగా తగ్గించొచ్చనే భావనతో ప్రపంచ మార్కెట్లు రాణించడం ఇందుకు తోడ్పడింది. విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్‌ఐఐలు) తిరిగి కొనుగోళ్ల బాట పట్టడం కూడా ప్రభావం చూపింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 53 పైసలు పెరిగి రూ.89.67 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 0.53 శాతం లాభంతో 60.15 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

- మదుపర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.5.43 లక్షల కోట్లు పెరిగి రూ.471.22 లక్షల కోట్లకు (5.22 లక్షల కోట్ల డాలర్లు) చేరింది.



లాభాల్లోనే మొదలై...: ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ క్రితం ముగింపు 84,481.80తో పోలిస్తే 275 పాయింట్ల లాభంతో 84,756.79 పాయింట్ల వద్ద ఆరంభమైంది. ఆ తర్వాత అదే ఒరవడిని కొనసాగిస్తూ 85,067.50 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. చివరకు 447.55 పాయింట్లు పెరిగి 84,929.36 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 150.85 పాయింట్ల లాభంతో 25,966.40 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 25,880.45 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని; 25,993.35 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని నమోదుచేసింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 338.30, నిఫ్టీ 80.55 పాయింట్లు నష్టపోయాయి.

నాలుగే నష్టాల్లో...: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 4 మినహా మిగతావి లాభాల్లోనే ముగిశాయి. బెల్ 2.37%, పవర్‌గ్రిడ్ 2.19%, టీఎంపీవీ 1.98%, ఏషియన్ పెయింట్స్ 1.41%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.34%, ఎల్అండ్‌టీ 1.05%, బజాజ్ ఫిన్‌సర్వ్ 0.9% మేర పెరిగాయి. మరోవైపు హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 1.14%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 0.27% నష్టపోయాయి.

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ అదుర్స్: ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ షేర్లు స్టాక్ మార్కెట్లో నమోదైన రోజే అదరగొట్టాయి. బీఎస్ఈలో ఇష్యూ ధర రూ.2,165తో పోలిస్తే 20.37 శాతం అధికంగా రూ.2,606.20 వద్ద నమోదైంది. చివరకు 19.47 శాతం లాభంతో రూ.2,586.70 వద్ద ముగిసింది.

- ఐపీఓ ద్వారా రూ.2,180 కోట్లను సమీకరించేందుకు సెబీకి ముసాయిదా పత్రాలను సింబయోటెక్ ఫార్మాల్యాబ్ దాఖలు చేసింది.

2026లో 12 కోట్ల మంది ప్రయాణిస్తారు

తమ విమానాశ్రయాల రద్దీపై అదానీ ఎయిర్‌పోర్ట్స్

ముంబయి: త్వరలో కార్యకలాపాలు ప్రారంభించనున్న నవీ ముంబయి విమానాశ్రయం సహా తమ ఎనిమిది విమానాశ్రయాల్లో వచ్చే ఏడాది 12 కోట్ల మంది ప్రయాణిస్తారని అదానీ ఎయిర్‌పోర్ట్స్ అంచనా వేస్తోంది. నవీ ముంబయి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ డిసెంబరు 25న ప్రారంభం కానున్న నేపథ్యంలో అదానీ ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్(ఏఏహెచ్‌ఎల్) డైరెక్టర్ జీత్ అదానీ పీటీఐతో మాట్లాడారు. విదేశాల్లో ఆస్తుల కొనుగోళ్లను పరిశీలించాల్సిన అవసరం లేదని ఈ సందర్భంగా అన్నారు. దేశీయ మార్కెట్‌పైనే ప్రస్తుతం దృష్టి సారించినట్లు వివరించారు. 'గతేడాది 8-9 కోట్ల మంది ప్రయాణికులు ఏడు విమానాశ్రయాల నుంచి తమ గమ్యస్థానాలకు చేరారు. ఈ ఏడాది 10 కోట్లకు చేరొచ్చు. వచ్చే ఏడాది నవీ ముంబయి విమానాశ్రయం వల్ల ఈ సంఖ్య 12 కోట్లకు చేరుతుంద'ని చెప్పుకొచ్చారు.



- ప్రస్తుతం ఏఏహెచ్‌ఎల్ చేతిలో ముంబయి, అహ్మదాబాద్, తిరువనంతపురం, జైపుర్, లఖ్‌నవూ, గువాహటి, మంగళూరు విమానాశ్రయాలున్నాయి. ఈ ఏడాది అక్టోబరులో ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభమైన నవీ ముంబయి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ఈ నెల 25న వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించనుంది.


అరుదైన భూ అయస్కాంతాల ఎగుమతికి చైనా అనుమతి

బీజింగ్: ప్రజల వినియోగం కోసం అరుదైన భూ అయస్కాంత లోహాల ఎగుమతిని అనుమతించనున్నట్లు చైనా శుక్రవారం ప్రకటించింది. పలు రంగాల ఉత్పత్తుల తయారీకి అవసరమైన ఈ విలువైన లోహాల ఎగుమతులను పునరుద్ధరించాలని భారత్ కోరుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఏ దేశాన్ని లక్ష్యంగా పెట్టుకుని అరుదైన లోహాలకు సంబంధించిన ఎగుమతులపై నియంత్రణ తీసుకురాలేదని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి గువో జియాకున్ తెలిపారు. పౌర వినియోగం కోసం, నిబంధనలకు అనుగుణంగా ఎగుమతులు ఉన్నంత వరకు చైనా ప్రభుత్వం సకాలంలో దరఖాస్తును ఆమోదిస్తుందని స్పష్టం చేశారు. రక్షణ రంగ ఉత్పత్తులను తయారు చేయడానికి లోహాలను ఎగుమతి చేయకూడదనే చైనా విధానాన్ని ఆయన గుర్తుచేశారు. సంబంధిత దేశాలు, ప్రాంతాలతో సహకారానికి చైనా సిద్ధంగా ఉందని, అంతర్జాతీయ పారిశ్రామిక, సరఫరా వ్యవస్థలను స్థిరంగా ఉంచడమే లక్ష్యమని అన్నారు. పౌర వినియోగం కోసం అనుమతులు ఉంటాయని, వాటిని రక్షణ పరికరాల తయారీకి ఉపయోగించవచ్చని తెలిపారు.

ఈతరం

youthpage@eenadu.in

హిట్ అండ్ రన్



హెడ్డింగ్ చూసి ఇదేదో యాక్సిడెంట్ అనుకుని కంగారు పడకండి. ఇదో కొత్తరకం టూరిజం అంతే! అంటే ఏం లేదు.. తక్కువ సమయంలో ఎక్కువ ప్రదేశాలను చూసి, ఫొటోలు - వీడియోలు తీసుకుని పరుగుపెట్టడమే.. వెనక్కి వచ్చేయడం. ఆ ప్రాంతాన్ని చూసి ఎంజాయ్ చేయడం కంటే.. ఇలా ఫొటోలు దిగడమే ఇందులో ప్రధాన ఉద్దేశం. ఇటీవల కాలంలో ఈ పద్ధతి పెరగడానికి ఓ కారణం ఉంది. కొందరు యూత్ ఇలా చేసి ఆ డేటాను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ డబ్బు సంపాదిస్తున్నారు. మరికొందరేమో కుర్రకారు లైక్ కొట్టేయాలని.. ఫాలోవర్స్ పెంచడం కోసం కంటెంట్‌లా దీన్ని వాడుతున్నారు. కారణాలు ఏమైతేనేం.. చాలా తక్కువ టైమ్‌లో కొత్త కొత్త ప్రాంతాలన్నీ తిరిగేస్తున్నారు, అదీ సంగతి!

అధిగమిద్దాం ఇలా..

నేనే లీడర్



వెంటనే ఈ పని చేసేయాలి అనుకుంటాం. కానీ అంతలోనే బోరు కొట్టేస్తుంది. ఎప్పటినుంచో ఒక చాప్టర్ చదవాలి అనుకుంటాం. కానీ 'వాయిదా పద్ధతుంది దేనికైనా' అని పాడుకుంటూ ఉంటాం. ఈ చిన్నవయసులో మనకు ఉండకూడని లక్షణాల్లో సోమరితనం ముందు వరుసలో ఉంటుంది. అందుకే దీన్ని అధిగమించడానికి ఓ జపనీస్ సిద్ధాంతం ట్రెండవుతోంది. అదేంటంటే..

1 ప్రయోజనాన్ని తెలుసుకోవడం (ఇకిగై): ఒక పనిని మనం ఎందుకు చేయాలో, దాని వల్ల కలిగే ప్రయోజనం ఏమిటో గుర్తించాలి. ఆ విషయాన్ని పదేపదే గుర్తుచేసుకోవాలి. ఈ భావన ప్రతిరోజూ మనకి ప్రోత్సాహాన్ని అందిస్తుంది. లోపల నుంచి మోటివేషన్ కలిగి.. బద్ధకం దూరమవుతుంది.

2 ప్రతిరోజూ మెరుగ్గా.. (కైజెన్): ఒకేసారి ఎంత సాధించాం అనుకోకుండా.. ప్రతిరోజూ ఏమాత్రం మెరుగయ్యాం అనే అంశాన్ని పరిశీలించాలి. చదువు, ఉద్యోగ ప్రయత్నాలు.. ఏదైనా ప్రతి రోజూ కొంత ప్రగతి సాధించాలి. చిన్నచిన్న భాగాలుగా పనులు మొదలుపెట్టి పూర్తి చేయాలి. ఇది కొనసాగితే, అభివృద్ధి పెంచగలం.

3 మనసు (షోషిన్): ఏదైనా కొత్తగా చేసేటప్పుడు తెలియని గితలాంటిది మనసులో ఉండాలి. బిగినర్స్ మైండ్ చాలా ముఖ్యం. అనుభవం లేకుండా కేవలం దాని పై ఏర్పరుచుకున్న అభిప్రాయాలు మన కృషిని తగ్గించకూడదు. నేర్చుకోవడానికి ఆసక్తిగా మనసు సిద్ధమైనప్పుడే సోమరితనం వెనక్కిపోయేది.

4 కొంతమే ఆహారం (హరా హచి బు): అతిగా తినడం వల్ల బద్ధకం ఆవహిస్తుంది అనేది అందరికీ తెలిసిన విషయమే. అందుకే ఈ సిద్ధాంతంలో పొట్ట కొంచెం ఖాళీగా ఉంచడం అనేది ప్రధానమైన అంశం. ఎనభై శాతమే ఆహారం తీసుకోవడం ద్వారా శరీరానికి పూర్తిస్థాయిలో శక్తి అందడంతోపాటు అధికమైన ఏకాగ్రత సొంతమవుతుంది.

5 లోపాలను స్వీకరించడం (వాబి - సబి): మనలోని లోపాలను అంగీకరించాలి. వాటిని అధిగమించడానికి.. అభివృద్ధివైపు నడవడానికి ప్రయత్నించాలి. అసంపూర్తిగా ఏ స్థాయిలో ఉన్నా మామూలే. ఆదేమీ పట్టించుకోకుండా పనిని ముందుకు తీసుకెళ్లడానికి చూడాలి.

తెల్లచీర దెయ్యం



90 లోకి వెళ్దామా..

మెట్‌పల్లిలో ఇంటర్ చదువుతున్నప్పుడు మా కోతి గ్యాంగ్ ఆటలు మామూలుగా ఉండేవి కాదు. క్లాసులకు వెళ్లకుండా ఆడుతూ పాడుతూ గడిపేసేవాళ్లం. లెక్చరర్లు ఎంత చెబుతున్నా వినకుండా అల్లరి చేయడమే పని. కానీ పరీక్షల సమయానికి వచ్చేసరికి మాత్రం కంగారు పడి బాగా చదివేవాళ్లం. అయినా అప్పటికప్పుడు చదివితే ఏం వచ్చి చస్తుంది చెప్పండి? అందుకే ఇక పెద్ద పరీక్షలు దగ్గరకొస్తున్నాయి అన్నప్పుడు.. మా ఫ్రెండ్ ఖలీల్ గాడు, మిగతా స్నేహితులు సుధాకర్, రాజశేఖర్ ఇంకో కొందరు క్లాస్‌మేట్స్‌తో కలిసి వాళ్ల డాబా మీద కంబైండ్ స్టడీ ప్లాన్ చేశాడు. కానీ అక్కడ కూడా మాలో కొందరి అల్లరి ఆగలేదు. ఇక ఇలా ఉంటే పరీక్షల్లో ఫెయిలవ్వడం ఖాయమని ఖలీల్ భయపడ్డాడు. అందుకే రోజూ ఒక్కడే అర్ధరాత్రి లేచి చదవడం మొదలుపెట్టాడు. అది గమనించిన సుధాకర్.. 'మమ్మల్ని వదిలేసి నువ్వొక్కడివే చదివేస్తావా' అనుకుని ఖలీల్‌ను భయపెట్టాలని ఓ ప్లాన్ వేశాడు. సరిగ్గా రాత్రి వాడు చదువుతున్న టైమ్‌లో వాళ్లమ్మ తెల్లచీర కట్టుకుని దూరంగా దెయ్యంలా నిలబడ్డాడు. అది చూసిన ఖలీల్‌కి పైప్రాణాలు పైనే పోయినంత పనయ్యింది. అంతేనా.. పక్కనున్న చెట్టు కొమ్మలు కదిలించడం, వింత వింత శబ్దాలు చేయడం.. ఇలా వాడ్ని ఫుల్‌గా భయపెట్టేశాడు. దెబ్బకు ఖలీల్ నైట్ కంబైండ్ స్టడీ అంటే భయపడే పరిస్థితి వచ్చింది. ఇంత తిక్క వేషాలేసినా అందరం బాగా పరీక్షలు రాసి చక్కగా స్థిరపడ్డాం. ఎప్పుడైనా కలిసినప్పుడు ఇవన్నీ గుర్తు చేసుకుని నవ్వుకుంటూ ఉంటాం.

– పురుషోత్తమ్, అమ్మక్కపేట్, జగిత్యాల

సరదాగా..



నచ్చిన అమ్మాయికి ఇష్టంగా నాలుగు మాటలు చెబితే ఫ్లర్టింగ్ అంటుంది కదూ ఈ పాడులోకం. ఏం కాదు.. హర్ట్ చేయకుండా సరదాగా చెప్పే మాటలను అమ్మాయిలూ ఇష్టపడతారు. మనసుకు గిలిగింతలు పెట్టి.. చంద్రబింబం లాంటి ఆమె మొహంలో చిరునవ్వు తెప్పించే ఈ రొమాంటిక్ ఫ్రేజెస్/ పికప్ లైన్స్‌ను వెంటనే తనతో చెప్పేయండి!

- కొంచెం టైమ్ ఎంతయ్యిందో చెప్తావా.. నిన్ను చూసి కాలం స్తంభించిపోయిందని డౌటుగా ఉంది!
- ఇక్కడ టెంపరేచర్ చాలా తక్కువగా ఉందేంటి.. కొంపదీసి నువ్వు చందమామవా?
- నిన్ను చూసి నా గుండెల్లో ట్రాఫిక్ జామ్ అయ్యింది, కొంచెం సిగ్నల్ ఇస్తావా..
- మా అమ్మకి మంచి కోడలు కావాలంట, నువ్వు చాలా మంచి అమ్మాయివని విన్నాను నిజమేనా?
- ఇంటికెళ్లాక దిష్టి తీయించుకో, నిన్ను చూడకుండా ఉండటం నా వల్ల కావట్లేదు.
- కబ్జాలు చేస్తుంటావా ఏంటి, నా మనసును ఇంతలా ఆక్రమించేశావ్?
- బయట ఎక్కువ తిరగొద్దు, పికాసో పెయింటింగ్‌వని మ్యూజియంలో పెట్టేస్తారు!
- పగలే వెన్నెల పడుతుందేంటి.. ఓహ్, నువ్వు నవ్వుతున్నావా..
- కొంచెం దూరంగా కూర్చోవా.. నీ వెలుగుకి నా కళ్లలో ఫ్లాష్ పడుతోంది.



ఏది ప్రేమ.. ఏది క్రష్?

చూడగానే చెప్పలేని అలజడి. ఎప్పుడూ తనతోనే ఉండాలి అనిపించడం. ఏవేవో భావాల సరిగమలు. పెదవి దాటి బయటకు రాని గందరగోళం. ఇది ప్రేమేనేమో అనే ఆలోచన రాకుండా ఉండదు ఇలాంటి సమయాల్లో. అలా అనిపించినదంతా ప్రేమేనా.. శాశ్వతంగా నిలిచే బంధమేనా.. అంటే కాదంటారు నిపుణులు. మరి ప్రేమకూ క్రష్‌కు మధ్య తేడా తెలుసుకోవడం ఎలా?

టీనేజీ మనసు రంగురంగుల కాన్వాస్‌లాంటిది. అత్యంతగా భావోద్వేగాలు పీలయ్యే సమయం. ఈ దశలో క్రష్‌ను ప్రేమగా పొరపాటు పడటమనేది సహజం. కానీ ఇలా భావాల్లో స్పష్టత లేకపోవడం వల్ల తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తును ప్రభావితం చేయవచ్చు.

- సాగరికకు తన క్లాస్‌మేట్ వినయ్ అంటే చాలా ఇష్టం. అతని స్టైల్, కాన్ఫిడెన్స్, క్రికెట్ స్కిల్స్ ఆమెను ఆకట్టుకున్నాయి. ఇద్దరూ కొన్ని రోజులుగా మాట్లాడుకుంటున్నారు. అతడి నుంచి మెసేజ్ రాకపోతే తనకు ఏదోలా ఉంటుంది.
- ఇది క్రష్ లేదా ప్రేమ అంటే.. క్రష్. అతని రూపం, ప్రవర్తనతో కలిగిన ఆకర్షణ తప్ప ప్రేమ కాదు. ప్రేమగా మారడానికి చాలాసమయం పడుతుంది.

ప్రేమ అనేది ఒక్కసారిగా వచ్చేసేది కాదంటారు సైకాలజిస్ట్ **శ్రీనివాస్ అడ్డిగ.** అది అర్థం చేసుకోవడం, గౌరవం, సమయం అనే మూడు అంశాల మీద ఆధారపడి ఉంటుంది. ఇందులో ఆకర్షణకు తావులేదు. ప్రేమలో అవతలివారిని అర్థం చేసుకొని బాధ్యతగా ఉంటారు. వీరు ఇతరులను ఎలా ఇంప్రెస్ చేద్దాం అని కాకుండా ఎలా సపోర్ట్ చేద్దాం? అనే ఆలోచనతో ఉంటారు. వారి లోపాలను అంగీకరించడం, ఎదుగుదలకు సహాయపడటం ఉంటుందే తప్ప స్వార్థం ఉండదు.

టీనేజ్‌లోనే ఎందుకు ఎక్కువ?

ఈ వయసులో ఎక్కువగా హార్మోన్ల ప్రభావం ఉంటుంది. కొత్తకొత్త అనుభవాలు, పరిచయాలు, సినిమాలు, సోషల్ మీడియా వల్ల ఉత్తేజితం అవుతాం. స్నేహం, ఇష్టం, ఆకర్షణ మధ్య గందరగోళం ఏర్పడుతుంది.

1 కేరింగ్, శ్రద్ధ ఎక్కువగా చూపిస్తే అది లవ్ అనిపిస్తుందా? క్రష్‌లో కూడా ఇదే ఉంటుందా?

శ్రద్ధ చూపిస్తే అదేం ప్రేమ కాదు. టీనేజ్‌లో ఎవరో గౌరవంగా, సహాయకంగా, మిత్రభావంతో ప్రవర్తించినా మనసుకు ఇది ప్రేమ కావచ్చు అనిపిస్తుంది. అది ఎక్కువగా క్రష్ వల్ల వచ్చే భావోద్వేగం. మీకు ఉన్న సమస్యలను మిత్రులతో చెప్పుకొంటే వారు మీపై సానుభూతి చూపించడం, మీతో ఎక్కువసేపు మాట్లాడటం, మీకు విలువ ఇవ్వడం వల్ల వారిపై మీకు వచ్చేది భావోద్వేగంతో వచ్చే క్రష్ కానీ అది ప్రేమ కాదు. ఉదాహరణకు క్లాస్‌లో ఒక అమ్మాయి మీకు నోట్స్ ఇస్తుంది. మీకు సహాయం చేస్తుంది. మీరు వెంటనే ఆ అమ్మాయి నన్ను ఇష్టపడుతోంది అనుకుంటే అది ఊహ మాత్రమే. ప్రేమలో మాత్రం కేర్‌కుతోడు బాధ్యత, స్థిరత్వం, పరస్పరం అర్థం చేసుకోవడం, ఆలోచించడం, సపోర్ట్ చేయడం, ఓపిక ఉంటాయి. ఒక అమ్మాయి తన ఫ్రెండ్‌కి రోజూ బ్రేక్‌ఫాస్ట్ తెచ్చి ఇస్తుంటే, అది కేర్ మాత్రమే ప్రేమ కాదు.

2 క్రష్‌లో అయినా ప్రేమలో అయినా ఎంతవరకూ ఉండాలి?

క్రష్‌లో ఎలాంటి హద్దులు, స్పష్టత ఏమీ ఉండవు. ప్రేమలో మాత్రం ఓ హద్దు, పరస్పర గౌరవం ఉండాలి. ప్రేమ అనేది పరిపక్వతతో, బాధ్యతతో సాగుతుంది.

- క్రష్, ప్రేమ ఏదైనా సరే వ్యక్తి భవిష్యత్తు, ఆరోగ్యం, లక్ష్యాలు దెబ్బతినకుండా ఉండటం చాలా అవసరం. చిన్న వయసులో హద్దులు లేకపోతే క్రష్ వల్ల చదువులపై దృష్టి తగ్గిపోవడం, నిద్రలేమి, ఒత్తిడి, భయాలు మొదలవుతాయి.
- క్రష్ అనేది తాత్కాలికం. అందుకే రిప్లై రాకపోతే కోప్పడకండి. ఒక్క క్రష్ కోసం భవిష్యత్తును నాశనం చేసుకోవడం అనేది సరైంది కాదు. అతిగా మెసేజ్, కాల్ చేసి ఇంప్రెస్ చేయాలి అనుకుంటే హద్దులు దాటినట్టే. అతను లేదా ఆమెనే పర్ఫెక్ట్ అనుకోవడం.. ప్రతి మాటకు మీనింగ్ వెతకడం... ఇవి మన మనసును కన్‌ఫ్యూజ్ చేస్తాయి.

★ మనసును అర్థం చేసుకొని, మద్దతు, బాధ్యత, గౌరవంతో ఉండేదే బలమైన అనుబంధం. ఇదే అసలైన ప్రేమ.

★ క్రష్ అనేది బయటి అందం చూసి కలిగే ఫీలింగ్. ఇది తాత్కాలిక ఆకర్షణ మాత్రమే.

★ క్రష్ అంటే ఒక్కసారిగా వచ్చేసే ఇష్టం. ఇది రూపం, గొప్పదనం, స్టైల్, నవ్వు వంటి బయటి లక్షణాల వల్ల కలుగుతూ ఉంటుంది. నచ్చిన వాళ్లు కనిపిస్తే చాలు నెర్వస్ అవుతారు, టెన్షన్ కలుగుతుంది, వారిని ఎలా ఇంప్రెస్ చేయాలనే ఆలోచిస్తుంటారు. క్రష్ అనేది కొన్ని రోజులు, వారాలు లేదా నెలల్లో తగ్గిపోతుంది. ఇది ఒక భావోద్వేగ స్పందన, ప్రేమ కాదు.

పాటిద్దాం..

1. ఇష్టమైన వారితో మర్యాదగా, గౌరవంగా మాట్లాడాలి, మంచిగా ప్రవర్తించాలి.
2. రాత్రుళ్లు మెసేజ్, కాల్స్‌కు టైమ్ లిమిట్స్ ఉండాలి.
3. పబ్లిక్‌లో అనుచితమైన ప్రవర్తన వద్దు.
4. గిల్టీ, ఒత్తిడి, డ్రామా చేసి ఎమోషనల్‌గా ఇబ్బంది పెట్టకూడదు.
5. ఇప్పటి నిర్ణయం భవిష్యత్తును నష్టపెట్టకూడదు.

రిలేషన్‌షిప్ కోసం చదువు, కెరియర్, హెల్త్, కుటుంబం - ఫ్రెండ్స్‌ను పాడుచేసుకోకూడదు. ఇద్దరి గౌరవం, గోప్యత కాపాడాలి. భావాలను శాంతంగా, గౌరవంగా వ్యక్తపరచాలి. శారీరక హద్దులు చాలా స్పష్టంగా ఉండాలి.


సంబంధం కలిసి ఎదగడానికే కానీ ఒకరిపై ఒకరు ఆధారపడటానికి కాదు. దీన్నే మనం హెల్దీ రిలేషన్‌షిప్ అంటున్నాం. అది క్రష్ అయినా, ప్రేమైనా సరే!

అర్థం చేసుకో..

పంచుకుందాం

కరెంటు స్తంభంలా ఆరడుగులు ఉండటం కాదు
గుప్పెడు గుండెలో ఏముందో తెలుసుకో
అన్నింటికీ ఊరికే అరవడం కాదు
ఆగి అర్థం చేసుకోవడం నేర్చుకో
కోపం చాటున ప్రేమ దాచడం కాదు
మౌనం చాటున మనసును అర్థం చేసుకో.

– శరణ్య, బాపట్ల



మీ భాషేంటి

'ప్రేమిస్తున్నాను చాలదా?' అనుకుంటారు మనలో కొందరు. కానీ చాలదు, ప్రేమిస్తే అది అవతలివారికి తెలిసేలా చెప్పాలి. అంటే కేవలం ఐలవ్యూ అని కాదు సుమా! మరి ఏ భాషలో అంటే..

పదాలతో : మాటకు ఎంత శక్తి ఉందో కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. మన ప్రేమను ఆ మాటల్లో వ్యక్తపరచడం, కాంప్లిమెంట్లు ఇవ్వడం, అవతలి వారు మనకు ఎంత ఇంపార్టెంట్ అనేది వారికి తెలియజేయడం ద్వారా ప్రేమ ఎప్పటికప్పుడు కొత్తగా ఉంటుంది. మంచి మాటలు చెప్పాలి. పాజిటివ్ దృక్పథంలో ఉండాలి.

సమయం : ఎంత క్వాలిటీ టైమ్ గడిపితే.. అంతగా బంధం వికసిస్తుంది. సరదాగా గేమ్స్ ఆడటం, వాకింగ్‌కు వెళ్లడం, కలిసి సినిమా చూడటం, ఇద్దరూ కూర్చుని భోంచేయడం.. ఇవన్నీ సమయం గడపడమే. ఆ టైంలో మొబైల్‌కి విడాకులు ఇచ్చేయాలి.

బహుమతి: ఎంత చిన్నదైనా కానీ.. గిఫ్ట్ ఇచ్చే ఆనందం వేరు. అందుకే మన లవ్ లాంగ్వేజ్‌లో బహుమతులకు పెద్దపీట వేయాలి. సందర్భంతో పనిలేకుండా.. కేవలం మనం ప్రేమించిన వారిని సర్‌ప్రైజ్ చేయడమే లక్ష్యంగా ఇచ్చే గిఫ్ట్ అవతలి వారికి ఎంత సంతోషాన్ని ఇస్తుందో కదా!

చేతల్లో: మరి కేవలం మాటలు ఉంటే సరిపోదు కదా! ప్రేమ చేతల్లోనూ కనిపించాలి. పనుల్లో సాయం చేయడం, ఎల్లప్పుడూ తోడ్పాటుగా ఉండటం వంటివి ఈ కోవలోకి వస్తాయి. 'నీకు నేనున్నా' అని భరోసా ఇచ్చినప్పుడు, 'నువ్వేం టెన్షన్ పడకు, నేను చూసుకుంటాగా' అనే మాట అన్నప్పుడు.. అవతలి వారికెంత ఊరటగా ఉంటుంది చెప్పండి! పని చేయకుండా కేవలం మాటలు చెబితే అది నిజమైన ప్రేమ భాష అనిపించుకోదు.

స్పర్శ : చేతులు పట్టుకోవడం, ప్రేమపూర్వక కౌగిలింత, ఒడిలో వాలిపోవడం, ఇష్టంగా ఇచ్చే ముద్దు.. ఇవన్నీ బంధంలో చాలా అవసరం. అందుకే ఈ భాషలోనూ మీ ప్రేమను తెలియజేయండి.

మెయిల్ పంపండి



ఈతరం పేజీలో వస్తున్న కథనాలు, శీర్షికలపై మీ విలువైన సలహాలు, సూచనలు మాకు రాసి పంపండి. మా మెయిల్ అడ్రస్ youthpage@eenadu.in

టెక్ ట్రిక్..

కెరియర్ హైటెక్!



ఇన్‌ఫ్లుయెన్సర్లుగా కెరియర్ ప్రారంభించిన చాలామంది మనకు ఇప్పటికే తెలుసు. కానీ దాన్ని ఫుల్‌టైమ్‌లో చేస్తూ నెలకు లక్షల్లో ఆదాయం పొందుతున్న వారు కొద్దిమందే. అందులోనూ మారుమూల పల్లె నుంచి వచ్చి, టెక్ ప్రపంచంలో తనదైన ముద్ర వేశాడీ కుర్రాడు. అంతేకాదు వరుసగా ఫోర్బ్స్ ఇండియా జాబితాలో స్థానం కూడా సంపాదించుకుంటున్నాడు. ఇంకా తన గురించి తెలుసుకుందామా!

పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం కేశనపల్లి గ్రామానికి చెందిన **వినయ్** టెక్ ఇన్‌ఫ్లుయన్సర్‌గా రాణిస్తున్నాడు. యూట్యూబ్, ఇన్‌స్టా, ఇతర సామాజిక మాధ్యమాల్లో టెక్ వైనర్ పేరిట వీడియోలు చేస్తూ పేరు సంపాదించుకున్నాడు. వివిధ రకాలుగా జరిగే డిజిటల్ స్కామ్స్, ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలు, సామాన్యులు టెక్నాలజీ వాడటంలో ఉపయోగించదగిన ట్రిక్స్.. ఇలాంటి అంశాలపై ప్రధానంగా కంటెంట్ రూపొందిస్తూ అందరికీ చేరువయ్యాడు. సైబర్ మోసాల గురించి తెలియకపోవడం వల్ల చాలా నష్టపోతాం అన్న అవగాహనను అందరిలో పెంచుతున్నాడు. ప్రస్తుతం తనకు 10 లక్షల మందికి పైగా సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. 2023లో ఫోర్బ్స్ ఇండియా జాబితాలో 29వ స్థానం, 2024లో 42వ స్థానం దక్కించుకున్నాడు. 2025లోనూ చోటు దక్కే అవకాశాలున్నాయని చెబుతున్నాడు.

తన కంటెంట్‌తో అన్నివయసుల వారినీ ఆకర్షించడమే కాదు.. నెలకు రూ.రెండు నుంచి మూడు లక్షల ఆదాయం పొందుతున్నాడు. ఇటీవల దిల్లీలో నిర్వహించిన వివో ఎక్స్ సిరీస్ ఫోన్స్ ఓపెనింగ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వినయ్‌ను ఆహ్వానించారు. ఓ మారుమూల పల్లె నుంచి దేశ రాజధాని వరకూ ఎదిగిన అతడి ప్రయాణంపై తనతోపాటు గ్రామస్థులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కలలు కనే ధైర్యం, వాటిని నిజం చేసే క్రమశిక్షణ ఉంటే ఎక్కడ ఉన్నా రాణించవచ్చని వినయ్ చెబుతున్నాడు.

– సంతోష్, ముత్తారం, పెద్దపల్లి

తెలుసుకోవడం ఎలా?

మన లైఫ్‌లో కొందరు ఫ్రెండ్స్ ఉంటారు. చాలా బాగా మాట్లాడుతున్నట్టు, మనమంటే బోలెడంత కన్సర్న్ ఉన్నట్టు కనిపిస్తారు. కానీ వారి వల్ల ఎప్పటికప్పుడు మనం బాధపడుతూ ఉంటాం. కావాలనే నష్టం కలిగించి, తెలియక జరిగినట్టు మాట్లాడతారు. వారి ప్రవర్తన ఏంటో తెలుసుకోవడానికి చాలా ఇబ్బంది పడుతుంటాం, అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తుంటాం. కానీ అలాంటి వారిని గుర్తించడం చాలా సులభం అంటారు నిపుణులు. ఎలా అంటే..

★ వారే తప్పు చేసి మనల్ని నిందిస్తారు. పైగా తామే బాధితులం అన్నట్టు క్రియేట్ చేస్తారు. అది అర్థమవుతూ ఉన్నా, ఏం చేయలేని స్థితిలో ఉండిపోతాం. ★ ఇతర ఫ్రెండ్స్‌ను మనకు దూరం చేయడం ద్వారా ఒంటరిగా అనిపించేలా చేస్తారు. వారు తప్ప మరెవరూ లేకుండా అయిపోతుంది రోజు.



★ వారితో మాట్లాడిన ప్రతి సందర్భంలోనూ మనకు ఎమోషనల్‌గా చాలా అలసిపోయినట్టు అనిపిస్తుంది. మనలోని లోపాలను, పరిమితులను పదేపదే గుర్తుచేసి 'నేను అందరి కంటే చాలా తక్కువ' అనే భావన కల్పిస్తారు. ★ ఏం మాట్లాడితే ఏం వస్తుందో అన్న భయం కలుగుతుంది. వారి చుట్టూ చాలా జాగ్రత్తగా వ్యవహరించడం చేస్తుంటాం.

★ వారి లైఫ్‌లో ఎదురయ్యే ఇబ్బందులకు మనల్ని తప్పుపడతారు. సంబంధం లేని అంశాలను మనపై రుద్దుతారు.

★ మన ఫీలింగ్స్‌ను అస్సలు పట్టించుకోరు. ఎదుటివారి అభిప్రాయాలకు విలువ ఇవ్వడం అనేది వారి డిక్షనరీలోనే ఉండదు.

ఎవరి గురించైనా మనకు పదేపదే ఇలా అనిపిస్తూ ఉంటే వారు మెల్లగా మనల్ని మానసికంగా దెబ్బతీస్తున్నారని అర్థం. అలాంటి స్నేహితులకు దూరంగా ఉండటం ద్వారా మనల్ని మనం కాపాడుకోవచ్చు.

కొంటె కొటేషన్



1. తప్పించుకోలేక చలి.. కప్పుకున్నా కంబళి
   – కొడమంచిలి సుమన్‌కుమార్
2. కుదరకపోతే మంటల కుంపటి కప్పుకోవాలి వెచ్చటి దుప్పటి –యు.శ్రియ
3. చలి పులితో యుద్ధం దుప్పటితో సిద్ధం
   – శ్రీను జమ్ము, విజయనగరం
4. చలిలో వెచ్చగా దుప్పటి కప్పి దర్జా వెలగబెడుతోంది పప్పీ
   – పి.శ్రీచరణి, విజయనగరం




ఈ ఫొటోకి సరదా వ్యాఖ్య రాసి పంపండి. బాగున్నవి ప్రచురిస్తాం.

మెయిడెన్ ట్రిప్

టీన్ మూవీ

ఇదో డాక్యుమెంటరీ. లారా డెక్కర్ అనే అమ్మాయి 14 ఏళ్ల వయసులో ఒంటరిగా ప్రపంచం మొత్తాన్ని ఓడలో వెళ్తూ చూడాలి అని నిర్ణయించుకుంది. ఇందుకు అనుమతుల కోసం హాలాండ్ ప్రభుత్వంతో పోరాడి గెలిచింది. అది మొదలు ఐదువందల రోజులకు పైగా సముద్రంలో ప్రయాణించి గ్లోబ్‌ను చుట్టేసింది. ఈ డాక్యుమెంటరీలో తన ప్రయాణం తాలూకా అసలైన ఫుటేజ్‌తోపాటు.. ఇదంతా చేయడానికి తన ప్రేరణ, ధైర్యం ఏమిటనే విషయాలను ఆకట్టుకునేలా చూపించారు. యువత తలుచుకుంటే ఎంత సాహసమైనా చేయగలరు అనడానికి లారా కథే ఉదాహరణ. తనిలా చేయడానికి కారణం ఆమె కుటుంబ పరిస్థితులే అన్నది ఓ వాదన. ఎందుకంటే లారా తండ్రి ఓ సెయిలర్, తన భార్యతో విడాకులు తీసుకుని కూతురిని పెంచుకుంటున్నాడు. ఈ విచ్ఛిన్న కుటుంబ నేపథ్యం లారా భాషలో మనకు అర్థమవుతూ ఉంటుంది. అయినా తను కుంగిపోకుండా ఈ ఘనత సాధించింది. అందుకే మనం చూడాల్సిన సినిమాల జాబితాలో ఈ గంటాఇరవై నిమిషాల డాక్యుమెంటరీ చేరింది.



పట్నం చదువులు పల్లెల్లో సేవలు

డెంటిస్ట్ కావాలంటే మొదట 'బ్యాచిలర్ ఆఫ్ డెంటల్ సర్జన్' (బీడీఎస్) చదవాలి. చదివింది ప్రయోగాత్మకంగా నేర్చుకోవాలంటే దంత సమస్యలున్న వారికి చికిత్స చేయాలి. అయితే ఆ విద్యార్థులు మరో అడుగు ముందుకేశారు. 'పల్లె దంత సేవ' పేరుతో గ్రామీణ ప్రజలకు, సర్కారు బడి పిల్లలకు ఉచితంగా దంత వైద్యం అందిస్తూ, వారిలో అవగాహన కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు 'తెలంగాణ దంత వైద్య విద్యార్థుల సంఘం' (టీడీఎస్ఏ)లో ఉన్న యువ డెంటిస్ట్‌లు.



తెలంగాణలో ఒక ప్రభుత్వ, 13 ప్రైవేటు దంత వైద్య కళాశాలలు ఉన్నాయి. వీటిలో వేలాది మంది విద్యార్థులు బీడీఎస్, ఎండీఎస్ చదువుతున్నారు. వీరందరినీ ఒక తాటిపైకి తేవడం కోసం రెండేళ్ల క్రితం నిజామాబాద్‌లోని తిరుమల కళాశాలలో బీడీఎస్ చదివే బాలుసాని మణిదీప్ తన స్నేహితులైన అంజనాశ్రీ, సువర్ణ, వంశీకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీజ హన్సికలతో కలిసి టీడీఎస్ఏ ఏర్పాటుచేశారు. గ్రామీణ ప్రజలకు దంత ఆరోగ్యంపై అస్సలు అవగాహన ఉండటం లేదని, నోటి శుభ్రతపై నిర్లక్ష్యం వహించడం వల్ల ఓరల్ క్యాన్సర్ల లాంటి వ్యాధులు ప్రబలుతున్నాయని గ్రహించారు. అలా పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో 'పల్లె దంత సేవ' మొదటి శిబిరాన్ని ప్రారంభించారు. స్థానిక పాఠశాలలో శిబిరం పెట్టి దంత సంరక్షణపై అవగాహన కల్పించడమే కాక ఊళ్లో పంటి సమస్యలు ఉన్నవారికి ఉచిత చికిత్స అందించారు. ఈ కార్యక్రమానికి మంచి ఆదరణ లభించడంతో ఈ సంఘంలో సభ్యత్వం తీసుకునే విద్యార్థుల సంఖ్య వందల నుంచి వేలల్లోకి చేరింది. ఇప్పుడు 4,600 మంది సభ్యులయ్యారు!

వీరి కోసం ప్రత్యేక వాట్సాప్ గ్రూప్‌లు రూపొందించారు. ఇప్పటికి పదివేల మందికిపైగా పల్లె ప్రజలకు ఉచితంగా చికిత్సలు అందించారు. ఏవైనా పెద్ద సమస్యలు ఉంటే స్థానిక డెంటల్ క్లినిక్‌లతో మాట్లాడి బాధితులను అక్కడికి పంపిస్తున్నారు. ఇటీవల పలు ప్రభుత్వ పాఠశాలల్లో దంత సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న క్రమంలో అనేక మంది సర్కారు బడి పిల్లలు అసలు తాము టూత్ బ్రష్ వాడమని చెప్పడంతో విద్యార్థుల కోసం మరో కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించారు. బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఉచితంగా టూత్ బ్రష్, పేస్ట్ అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అలా ఇప్పటికే వేల సంఖ్యలో చిన్నారులకు అందజేశారు. తమ ఉచిత సేవ వేలాది గ్రామాలకు చేరాలనే సంకల్పంతో ఈ మధ్యే వాట్సాప్ ఛానెల్ క్రియేట్ చేశారు. ఎవరైనా దంత సమస్యలతో బాధపడుతూ తమ సమస్యను అందులో పోస్ట్ చేస్తే వెంటనే పరిష్కారం చెబుతున్నారు. చికిత్స అవసరమైతే బాధితులకు దగ్గర్లోని డెంటల్ కళాశాలకు పిలిచి తగిన చికిత్స అందిస్తున్నారు. వీరి కృషిని మనమూ అభినందించేద్దాం!

– జి.పాండురంగశర్మ, హైదరాబాద్

యుద్ధం లేని ఆధిపత్యం.. సైన్య సహకార విధానం!


వ్యాపార నిమిత్తం భారతదేశానికి వచ్చిన బ్రిటిషర్లకు స్వదేశీ రాజుల మధ్య కొరవడిన ఐక్యత, రాజకీయ అస్థిరత వరంగా మారాయి. సామ్రాజ్య స్థాపన కోసం బ్రిటిష్ వారు అనేక యుద్ధాలు చేశారు. భారత్‌లో ఫ్రెంచ్ కంపెనీతో సాగించిన కర్ణాటక యుద్ధాలు మొదలుకొని, ప్లాసీ, బక్సార్, ఆంగ్లో-మైసూర్ యుద్ధాలతో వీరి బలం అధికమైంది. ఈ కాలంలోనే వీరి చూపు మరాఠా సామ్రాజ్యంపై పడింది. ఛత్రపతుల మరణానంతరం, పీష్వాల పాలనలో ఏర్పడిన అనైక్యతను అవకాశంగా తీసుకుని బ్రిటిష్‌వారు మరాఠా ప్రాంతాన్ని తమ వశం చేసుకున్నారు. అంతేకాకుండా ఈ సమయంలోనే సైన్యసహకార పద్ధతిని ప్రవేశపెట్టారు.

ఈస్ట్ ఇండియా కంపెనీ అధికార స్థాపన

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

భారతదేశ చరిత్ర

సైన్య సహకార పద్ధతి



ఈ సామ్రాజ్యవాద విధానాన్ని లార్డ్ వెల్లస్లీ 1798లో ప్రవేశపెట్టాడు. యుద్ధాలు లేకుండా భారత రాజ్యాలపై ఆధిపత్యం చెలాయించడమే దీని ప్రధాన లక్ష్యం. సైన్య సహకార పద్ధతిని ఒప్పుకోవాల్సిందిగా ఆంగ్లేయులు భారత రాజులపై తీవ్ర ఒత్తిడి పెంచారు. అంగీకరించిన రాజులు ఆంగ్లేయులకు దాసోహమయ్యారు.

ముఖ్యమైన అంశాలు: సైన్య సహకార పద్ధతిని ఆమోదించిన రాజ్యాల రక్షణ బాధ్యతలను ఆంగ్లేయులు స్వీకరిస్తారు. వారి రక్షణ కోసం ప్రత్యేక సైన్యాన్ని నిర్వహిస్తారు. సైన్యానికయ్యే ఖర్చునంతా రాజులే భరించాల్సి ఉంటుంది. ఈ ఖర్చును నగదు రూపంలో చెల్లించవచ్చు లేదా కొంత ప్రాంతాన్ని ఆంగ్లేయులకు శాశ్వతంగా దత్తత ఇవ్వవచ్చు.

✦ ఆంగ్లేయుల అనుమతి లేకుండా ఈ రాజ్యాల్లోకి విదేశీయులను రానివ్వకూడదు.

✦ సైన్య సహకార పద్ధతికి ఒప్పుకున్న రాజ్యాలు తమ విదేశాంగ విధానాన్ని ఆంగ్లేయులకు అప్పజెప్పాలి.

✦ ఈ పద్ధతి ద్వారా ఆంగ్లేయులకు సంక్రమించిన భారతీయ రాజ్యాల రక్షణ, విదేశాంగ వ్యవహారాలు నిర్వహించడానికి రెసిడెంట్ అనే ఆంగ్లేయ అధికారిని నియమిస్తారు.

మరాఠా రాజ్య ఆక్రమణ

17వ శతాబ్దంలో శివాజీ స్థాపించిన మరాఠా రాజ్యం ప్రారంభంలో పెద్దగా విస్తరణకు నోచుకోలేదు. మరాఠా రాజ్యం చుట్టూ బలమైన మొగల్ సామ్రాజ్యం, బీజాపూర్, గోల్కొండ రాజ్యాలు ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. శివాజీ మరణానంతరం ఈ రాజ్యాలు అంతమవడంతో మరాఠా రాజ్య విస్తరణకు మార్గం సుగమమైంది. మొగల్ చక్రవర్తులు బీజాపూర్, గోల్కొండను జయించడం, ఆ తర్వాత 18వ శతాబ్దంలో మొగల్ సామ్రాజ్యం బలహీనపడటం మరాఠాలకు కలిసొచ్చింది.

▮ శివాజీ మనవడు సాహు పాలనా కాలంలో (1707-49) మరాఠా రాజ్యం ఒక మహాసామ్రాజ్యంగా ఎదిగింది. ఆసేతుహిమాచలం మరాఠాల అధీనంలోకి వచ్చింది. సాహు కాలంలో పనిచేసిన ముగ్గురు పీష్వాలు ఈ విజయాలకు కారకులుగా చెప్పవచ్చు. వీరు చిత్ పవన్ బ్రాహ్మణ కులానికి చెందినవారు.



బాలాజీ విశ్వనాథ్ (1713–20): ఇతడు పీష్వా పదవిని వంశపారంపర్యం చేశాడు. మొగల్ చక్రవర్తి ఫరూఖ్ షియార్‌తో ఢిల్లీ సంధిని చేసుకుని మొగల్ పాలకులతో ఉన్న వైరాన్ని అంతం చేశాడు. సయ్యద్ సోదరులతో సత్సంబంధాలు నెలకొల్పాడు.

బాజీరావు-I (1720–40): ఇతడు పీష్వాల్లో అందరికంటే గొప్పవాడు, గెరిల్లా యుద్ధంలో ఆరితేరినవాడు. 1739లో పోర్చుగీసు వారిని ఓడించి సాల్సెట్టి, బేసిన్‌లను ఆక్రమించుకున్నాడు. హైదరాబాద్ నిజాంతో పాటు అనేక మంది రాజులను ఓడించి మరాఠా ఆధిపత్యాన్ని నెలకొల్పాడు. పాల్కేడ్ యుద్ధం (1728)లో, భోపాల్ యుద్ధం (1738)లో నిజాంను ఓడించి అనేక ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నాడు.

బాలాజీ బాజీరావు/నానాసాహెబ్ (1740–61): 1749లో ఛత్రపతి సాహు వారసులు లేకుండా మరణించడంతో ఇతడు సింహాసనం అధిష్టించాడు. రాజధానిని సతారా నుంచి పూనాకు మార్చాడు.

☛ సదాశివరావు భావె (పీష్వా సోదరుడు) ఢిల్లీపై దండెత్తి ఎర్రకోటను దోచుకున్నాడు. ఎర్రకోటలోని దివాన్-ఎ-ఖాన్ వెండి పైకప్పును తీసుకెళ్లాడు. రఘుజీభోంస్లే బెంగాల్‌పై దండెత్తి నవాబ్ అలీవర్దీఖాన్‌ను ఓడించాడు. బెంగాల్ నవాబ్ చౌత్ చెల్లించడానికి ఒప్పుకున్నాడు.

☛ అవధ్ నవాబ్ షుజాఉద్దౌలాను ఓడించాడు. ఉద్గీర్ యుద్ధంలో పీష్వా కుమారుడు విశ్వాసరావు నిజాంను ఓడించి అహమ్మద్ నగర్, దౌలతాబాద్, బుర్హాన్‌పూర్‌లను స్వాధీనం చేసుకున్నాడు.

☛ మరాఠా సర్దారులు రఘునాథరావు, మల్హార్ రావ్ హోల్కార్‌లు వాయవ్య భారతదేశంపై దండెత్తి అట్టక్ నగరాన్ని దోచుకున్నారు. దీనికి గవర్నర్‌గా పనిచేస్తున్న తైమూర్ షాను (ఆఫ్ఘనిస్థాన్ పాలకుడు అహమ్మద్ అబ్దాలీ కుమారుడు) తరిమేశారు. దీంతో కటక్ నుంచి అటక్ వరకు మరాఠాల ఆధిపత్యం కొనసాగింది. దీనికి ప్రతీకారంగా అహమ్మద్ షా అబ్దాలీ మరాఠాలపై దండెత్తాడు.

☛ 1761 జనవరి 14న జరిగిన మూడో పానిపట్ యుద్ధంలో అహమ్మద్ అబ్దాలీ మరాఠాలను ఓడించాడు. ఈ యుద్ధంలో మరాఠా సైన్యానికి నాయకత్వం వహించిన సదాశివరావు భావె, విశ్వాసరావు మరణించారు. పీష్వా బాలాజీ బాజీరావు అదే సంవత్సరంలో పూనాలో మరణించాడు. దీంతో మరాఠాల వైభవం, భారతదేశంపై వారి ఆధిపత్యం అంతమయ్యాయి.

1 మొదటి ఆంగ్లో-మరాఠా యుద్ధం (1775-82)

పీష్వా మాధవరావు-II, గవర్నర్ జనరల్ వారన్ హేస్టింగ్స్ మధ్య ఈ యుద్ధం జరిగింది. ఏడేళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత ఇరువర్గాలు సాల్బే సంధితో యుద్ధం ముగించాయి. దీని ప్రకారం ఇరుపక్షాలు తాము జయించిన ప్రాంతాలు తిరిగి ఇచ్చేయాలి.

2 రెండో ఆంగ్లో-మరాఠా యుద్ధం (1803-05)

ఈ యుద్ధంలో మరాఠాలు ఘోర పరాజయం చవిచూశారు. లార్డ్ వెల్లస్లీ పీష్వా బాజీరావు-IIతో పాటు ప్రధాన మరాఠా సర్దారులందరినీ ఓడించాడు. నాగ్‌పూర్ పాలకులు భోంస్లే, గ్వాలియర్ పాలకులు సింధియా, బరోడా పాలకులు గైక్వాడ్‌లు ఓటమి పాలయ్యారు. ఇండోర్ పాలకుడు యశ్వంత్ రావు హోల్కార్ మాత్రమే ఆంగ్లేయులతో గౌరవప్రదమైన ఒప్పందం కుదుర్చుకుని యుద్ధం నుంచి వైదొలిగాడు.

3 మూడో ఆంగ్లో-మరాఠా యుద్ధం (1817-18)

బాజీరావు-II కాలంలోనే ఈ యుద్ధం జరిగింది. గవర్నర్ జనరల్ లార్డ్ హేస్టింగ్స్ ఈ యుద్ధంలో మరాఠాలతో పాటు పిండారీలను (దారి దోపిడీ దొంగలు) అణచివేసి మరాఠా రాజ్యాన్ని సంపూర్ణంగా ఆక్రమించుకున్నాడు. మరాఠాలకు మద్దతుగా పిండారీలు ఈ యుద్ధంలో పాల్గొనడంతో మూడో ఆంగ్లో-మరాఠా యుద్ధాన్ని 'పిండారీ యుద్ధం' అని కూడా అంటారు.

❖ ఈ యుద్ధంలో ఘన విజయం సాధించిన ఆంగ్లేయులు పీష్వా పదవిని రద్దు చేశారు. పీష్వా బాజీరావు-IIను కాన్పూర్ సమీపంలోని బిఠూర్‌కు పెన్షనర్‌గా పంపగా, శేషజీవితాన్ని అక్కడే గడిపాడు.

❖ మరాఠా సామ్రాజ్యాన్ని జయించిన ఆంగ్లేయులు సతారా రాజధానిగా ఒక చిన్న మరాఠా రాజ్యాన్ని ఏర్పాటు చేసి, శివాజీ బంధువర్గానికి చెందిన ప్రతాప్‌సింగ్‌ను రాజుగా చేశారు. మిగిలిన మరాఠా ప్రాంతాలతో లార్డ్ హేస్టింగ్స్ 1818లో బొంబాయి రాష్ట్రాన్ని ఏర్పాటు చేశాడు.

మాధవరావు-I (1761–72): ఇతడు 17 ఏళ్ల వయసులోనే పీష్వా అయ్యాడు. మూడో పానిపట్ యుద్ధంలో మరాఠాలు కోల్పోయిన వైభవాన్ని పునరుద్ధరించే ప్రయత్నం చేశారు. మైసూర్ పాలకుడు హైదర్ అలీని, హైదరాబాద్ పాలకుడు నిజాంను, భరత్‌పూర్ పాలకులు జాట్లను, రాజపుత్రులను ఓడించాడు. అతిగా మద్యం సేవించడం కారణంగా 27 ఏళ్లకే మరణించాడు.

నారాయణరావు (1772–73): మరాఠా రాజ్యంలో ఉన్నతాధికారిగా ఉన్న రఘునాథరావు (రఘోబా) అధికార వాంఛతో పీష్వా నారాయణరావును హత్య చేశాడు. అయితే మరాఠా సర్దారులంతా నానాఫడ్నవీస్ నాయకత్వంలో రఘోబాను అడ్డుకోవడంతో ఇతడు పీష్వా కాలేకపోయాడు.

మాధవరావు-II (1773–1796): ఇతడి కాలంలో రఘోబాకు రాజ్యబహిష్కరణ విధించారు. దీంతో రఘోబా ఆంగ్లేయులతో చేతులు కలిపి 1775లో సూరత్ సంధి చేసుకున్నాడు. ఈ సంధి మొదటి ఆంగ్లో-మరాఠా యుద్ధానికి దారి తీసింది. ఈ సంధి ప్రకారం, ఆంగ్లేయులు రఘోబాను పీష్వా చేయడానికి కావాల్సిన సైనిక సహకారాన్ని అందించాలి. దీనికి ప్రతిఫలంగా ఆంగ్లేయులకు సాల్సెట్టి, బేసిన్‌ను అప్పగించాలి.

బాజీరావు-II (1796–1818): ఇతడు చివరి పీష్వా. 1802 డిసెంబరు 31న బేసిన్ సంధి ద్వారా ఆంగ్లేయులతో సైన్య సహకార ఒప్పందం కుదుర్చుకున్నాడు. అయితే ఈ ఒప్పందం పూర్తిగా అమలుకాక ముందే ఆంగ్లేయులతో ఘర్షణ ప్రారంభమై, రెండో ఆంగ్లో-మరాఠా యుద్ధానికి దారితీసింది.



రచయిత
డాక్టర్ ఎం. రవి కుమార్
విషయ నిపుణులు

ఈనాడు ప్రతిభ
■ e-mail: support@epratibha.net
20
శనివారం డిసెంబరు 20, 2025

Word of the Day 866

Encumbrance

Telugu meaning: బరువు, భారం

English meaning: The word encumbrance (ఇన్కంబ్రన్స్) is a noun that refers to a burden, obstacle, or something that makes progress difficult.

Synonyms: Burden, Hindrance; ***Antonyms:*** Advantage, Asset

Usage: **1.** Heavy debt became a serious encumbrance on the company's plans for expansion.

2. Excessive rules often act as an encumbrance to efficient decision-making.

కరెంట్ అఫైర్స్

గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైనవారికి ఏడాదిలో 125 రోజుల పాటు పని కల్పించే 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్)' (వీబీ-జీ రామ్ జీ) బిల్లుకు 2025, డిసెంబరు 18న పార్లమెంట్ ఆమోదం లభించింది. మొదట ఆ బిల్లును లోక్‌సభ ఆమోదించగా, అర్ధరాత్రి సమయంలో మూజువాణి ఓటుతో రాజ్యసభ ఆమోదించింది. రెండు దశాబ్దాలుగా అమల్లో ఉన్న 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' (ఎంజీనరేగా) చట్టాన్ని రద్దుచేసి ఆ స్థానంలో దీన్ని తీసుకొచ్చారు.



పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)గా వంశీ రామ్మోహన్ బుర్రా పేరు ఖరారైంది. ఈ మేరకు ప్రభుత్వ రంగ సంస్థల ఎంపిక మండలి (పీఈఎస్‌బీ) కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ప్రస్తుతం ఆయన అదే సంస్థలో ఫంక్షనల్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్)గా పనిచేస్తున్నారు. వంశీకి విద్యుత్తు, టెలికాం రంగాల్లో మూడు దశాబ్దాల విస్తృత అనుభవం ఉంది. ఇదివరకు పవర్‌గ్రిడ్ టెలిసర్వీసెస్ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గానూ సేవలందించారు. కాంపిటీటివ్ బిడ్డింగ్‌లో పవర్‌గ్రిడ్ ప్రవేశించేలా చేయడంలో వంశీ రామ్మోహన్ కీలకపాత్ర పోషించారు.

స్వయంకృషితో ఎదిగిన 200 మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ ప్రైవేట్ - హురున్ ఇండియా 'టాప్ 200 సెల్ఫ్ మేడ్ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ద మిలేనియా 2025' జాబితాను రూపొందించింది. ఇందులో విమానయాన సంస్థ ఇండిగో ప్రమోటర్లు రాహుల్ భాటియా, రాకేశ్ గంగ్వాల్ తొలిసారిగా అడుగుపెట్టి, ఏకంగా టాప్-10లో నిలిచారు. ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ సంస్థ మార్కెట్ విలువ 2025లో రూ. 2.2 లక్షల కోట్లకు చేరడంతో, ఈ జాబితాలో వీరు మూడో స్థానం దక్కించుకున్నారు.



2026 ఫుట్‌బాల్ ప్రపంచకప్ విజేత జట్టుకు రికార్డు స్థాయిలో రూ.451 కోట్ల ప్రైజ్‌మనీ దక్కనుంది. 2022 ప్రపంచకప్ గెలిచిన అర్జెంటీనాకు రూ.379 కోట్లు లభించాయి. గత కప్‌తో పోలిస్తే ఈసారి మొత్తం నగదు బహుమతిని ఫిఫా 48.9 శాతం పెంచింది. 2022 కప్‌లో మొత్తం ప్రైజ్ మనీ 3971 కోట్లు కాగా.. ఈసారి రూ.5911 కోట్లకు పెరిగింది.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

అంతర్జాతీయ మానవ సంఘీభావ దినోత్సవం

సమాజంలో నివసించే వ్యక్తుల మధ్య ఒకే రకమైన అభివృద్ధి, సమానత్వం ఉండవు. వర్గాలు, కులాలు, జాతులవారీగా సామాజిక ప్రగతిలో వైరుధ్యం ఉంటుంది. పేదరికం, సాంఘిక అసమానతలు, వివక్ష లాంటి కారణాలతో ప్రపంచవ్యాప్తంగా అసంతృప్తులు, అస్థిర పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఈ సవాళ్లను అధిగమించి.. ప్రజల మధ్య ఐక్యత, సహకారం, భాగస్వామ్యాలను పెంపొందించే లక్ష్యంతో ఏటా డిసెంబరు 20న 'అంతర్జాతీయ మానవ సంఘీభావ దినోత్సవం'గా (International Human Solidarity Day) నిర్వహిస్తారు. ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించడంతోపాటు మెరుగైన ప్రపంచాన్ని సృష్టించడంలో సంఘీభావం పాత్రను చాటిచెప్పడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

డిసెంబరు 20 చరిత్రలో ఈనాడు

మానవ సంఘీభావం అంటే...

సంఘీభావం అంటే ఉమ్మడి బాధ్యతాభావం, అలాగే అవసరంలో ఉన్నవారికి మద్దతు ఇవ్వాలనే నిబద్ధత. ముఖ్యంగా మానవ సంఘీభావం అనేది ఒకరి పట్ల మరొకరికి ఉండే పరస్పర గౌరవం, మానవత్వం, ప్రశంసాభావంపై ఆధారపడి ఉంటుంది. భూమిపై నివసిస్తోన్న వారంతా ఒక్కటే అన్న భావంతో మెలిగి, అంతర్గత ఆత్మగౌరవం కలిగిన వ్యక్తులుగా మసలుకోవడమే మానవ సంఘీభావం.

☛ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సామాజిక బహిష్కరణ అనే భావన విస్తృతంగా ఉంది. ప్రజలు సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక కార్యకలాపాల్లో పాల్గొనలేని స్థితిని; అందుకు దారితీసే పరిస్థితిని సామాజిక బహిష్కరణ/మినహాయింపుగా పేర్కొంటారు.



☛ అన్ని విషయాల్లో ప్రజల హక్కులు, హోదాకు సమానమైన గౌరవం, రక్షణ ఉండాలి. అలా లేకపోతే వారి భాగస్వామ్యం పరిమితం అవుతుంది.


☛ దాదాపు అన్ని దేశాల్లో వయసు భేదాలు, వైకల్యం, జాతి, మతం, వలస, హోదా, ఆర్థిక స్థాయి, లింగ భేదాలు లాంటివి సామాజిక మినహాయింపులకు కారణమయ్యాయి.

నేచర్ సస్టెయినబిలిటీ అధ్యయనం వెల్లడించిన అంశాలు, అంతర్జాతీయ మానవ సంఘీభావ దినోత్సవం - 2025 నినాదం తదితర సమాచారం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - సైన్స్ అండ్ టెక్నాలజీ

జీవ సాంకేతికత

సంప్రదాయ జీవ సాంకేతిక శాస్త్రంలో సహజ జీవ వ్యవస్థలను ఉపయోగించి సాంకేతికతను అభివృద్ధి చేస్తారు. శిలీంధ్ర జాతికి చెందిన ఈస్ట్ దీనికి ఉదాహరణ. ఆధునిక జీవ సాంకేతిక శాస్త్రంలో మరింత అధునాతన జీవ వ్యవస్థలను లేదా జీవులను ఉపయోగించి ప్రస్తుత జీవనశైలి అవసరాలకు అనుగుణంగా టెక్నాలజీని ఉత్పత్తి చేస్తారు. పారిశ్రామిక జీవ సాంకేతికశాస్త్రంలో వివిధ రకాలైన జీవ వ్యవస్థలు - శైవలాలు, శిలీంధ్రాలు, మొక్కలు, జంతువులను వాటి అవసరాలకు అనుగుణంగా జన్యు పరివర్తనం చెందిస్తారు.



భారత్‌లో బయోటెక్నాలజీ అభివృద్ధి

జీవ సాంకేతికశాస్త్ర అభివృద్ధి కోసం 1982లో నేషనల్ బయోటెక్నాలజీ బోర్డును ఏర్పాటు చేశారు.

✦ 1986లో బయోటెక్నాలజీ బోర్డు పూర్తి బయో టెక్నాలజీ విభాగంగా (డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ) రూపాంతరం చెందింది.

జెనెటిక్ ఇంజినీరింగ్ అప్రైజల్ కమిటీ

ఈ సంస్థ మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్, క్లైమేట్ ఛేంజ్ ఆధ్వర్యంలో పనిచేస్తుంది. ఇది జన్యు పరివర్తనం చెందిన వివిధ రకాల జీవులు లేదా ఉత్పత్తులను పరిశీలించి, అవి ప్రస్తుత భారత పర్యావరణానికి అనుకూలంగా ఉన్నాయో లేవో నిర్ణయిస్తుంది. అంతేకాకుండా వివిధ రకాలైన క్షేత్ర పరీక్షలకు అనుమతిస్తుంది.

జీవ సాంకేతికశాస్త్రం - భారతదేశం, బయోటెక్నాలజీ - అనువర్తనాలు, జన్యుపరివర్తన జంతువులు, జీవ సాంకేతికత - స్టెమ్ సెల్ టెక్నాలజీ, జీవ సాంకేతికత - వ్యవసాయ రంగం, పర్యావరణ పరిరక్షణలో జీవ సాంకేతికత పాత్ర మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

జూనియర్ రెసిడెంట్ ఉద్యోగాలు

బిలాస్‌పూర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ రెసిడెంట్, జూనియర్ రెసిడెంట్ (డెంటిస్ట్రీ) ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 68. దరఖాస్తు ఫీజు రూ.1,180. అర్హులైన అభ్యర్థులు 2025, డిసెంబరు 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ఎగ్జిక్యూటివ్ పోస్టులు

ఎన్టీపీసీ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ (ఐటీడీ) ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 15. దరఖాస్తు ఫీజు రూ.500. అర్హులైన అభ్యర్థులు 2025 డిసెంబరు 24లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (డిసెంబరు 20) చివరి తేదీ

▮ ఆంధ్రప్రదేశ్ ఈఆర్ఎస్‌టీవైఎల్ తూర్పు గోదావరిలో 35 పోస్టులు. టెన్త్, డిప్లొమా, డిగ్రీ, ఎంబీఏ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

▮ ఐసీఎంఆర్‌లో 28 సైంటిస్ట్-బి పోస్టులు. ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.

▮ ఆర్‌సీఎఫ్ఎల్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులు. బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.

▮ కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో సెక్యూరిటీ ఆఫీసర్ పోస్టులు. డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Railway Exams

Mathematics

Time & Work

1. P and Q can complete a work together in 60 days. P is 5 times as efficient as Q. In how many days can Q alone complete the work?

A) 300 days B) 360 days
C) 400 days D) 420 days

2. Contractor planned to finish a project in 90 days and hired 45 workers initially. After 30 days, he recruited 15 more workers and completed the project on time. If no additional workers were hired, how many extra days would have been needed to finish the work? (round off to nearest integer)

A) 12 days B) 15 days
C) 18 days D) 20 days

3. M can finish a job in 12 days. N is 50% more efficient than M. In how many days will M and N together complete the work?

A) 4.8 days B) 5 days
C) 6 days D) 7.2 days

4. Ravi alone can finish a piece of work in 12 days working 2 hours per day. Seema alone can complete the same work in 3 days working 6 hours per day. If they work together, how many hours per day are required to finish the work in 6 days?

A) 1.7 hour B) 2.5 hours
C) 2.8 hours D) 4 hours

5. Karan takes 3 times as much time as Leena or 6 times as much time as Mohan to complete a job. Working together, they can finish the job in 3 days. How many days will Leena alone take to complete the work?

A) 8 days B) 9 days
C) 10 days D) 12 days

6. There are 1500 workers in a camp. They have food for 90 days. After 10 days, 600 workers leave the camp. For how many more days will the remaining food last?

A) 133.33 days B) 115 days
C) 105 days D) 110.66 days

7. A group of 900 men has enough food for 60 days. After 10 days, 300 men join the group. For how many more days will the food last?

A) 40 days B) 36 days
C) 30 days D) 37.5 days

8. There was enough food for 800 soldiers for 50 days. After 20 days, 200 soldiers left the camp. For how many more days will the food last?

A) 45 days B) 40 days
C) 50 days D) 42 days

9. R alone can complete a work in 18 days, while S alone can complete it in 10 days. They start working together, but after 4 days, R leaves the work. How much time will S take to finish the remaining work?

A) 3.78 days B) 6 days
C) 7 days D) 8 days

10. If machine X and Y can produce 900 units in 4 hours and 10 hours, respectively, then in how many hours can both machines working together at these constant rates produce 900 units?

A) 2.85 hours B) 3 hours
C) 3.5 hours D) 4 hours

11. The time taken by P, Q and R to complete a work is in the ratio 5 : 4 : 10. Find the ratio of their efficiencies.

A) 4 : 5 : 2 B) 2 : 5 : 4
C) 10 : 8 : 4 D) 2 : 5 : 1

12. D1, D2 and D3 can finish a piece of work alone in 8, 12 and 16 days, respectively. They start the work together, but D2 leaves 3 days before the work is completed. In how many days is the work completed?

A) 4.6 days B) 5 days
C) 6 days D) 7 days

13. Arjun and Varun undertook a job for Rs.6000. Arjun alone can finish the work in 12 days, while Varun alone can finish it in 18 days. If they work together, what will be the difference in the amount they receive?

A) Rs.1500 B) Rs.1200
C) Rs.1700 D) Rs.1800

14. R is 25% more efficient than S. How much time will they take working together to complete a task which R alone can finish in 32 days?

A) 16.8 days B) 17.7 days
C) 20.5 days D) 22 days

15. A group of workers planned to finish a task in 10 days, but 12 workers left the job at the end of each day. As a result, the work was completed in 12 days. How many workers were originally assigned to do the job?

A) 48 B) 448 C) 396 D) 180

16. 50 workers can complete a project in 20 days. After working for 10 days, 8 more workers join the group. How many additional days will be required to finish the remaining work?

A) 8.6 days B) 9.8days
C) 10 days D) 11 days

Scan the QR code for Key

These model questions were prepared by subject experts

పరిశోధన పత్రాల తీరును మార్చేస్తున్న ఏఐ

- పెరుగుతున్న భాషా సంక్లిష్టత, తగ్గుతున్న నాణ్యత
- విశ్లేషణలో వెల్లడి




దిల్లీ: పరిశోధన పత్రాల రచనలో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం.. శాస్త్రీయ ప్రచురణల తీరుతెన్నులను మార్చేస్తున్నట్లు శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. సంక్లిష్ట భాష వినియోగం, పరిశోధన నాణ్యత తగ్గిపోవడం వంటివి జరుగుతున్నట్లు వివరించారు. అమెరికాలోని కార్నెల్, కాలిఫోర్నియా విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తలు ఈ పరిశోధన చేశారు. 21 లక్షల ప్రీప్రింట్ అధ్యయనాలను విశ్లేషించి, ఈ మేరకు తేల్చారు. పరిశోధన పత్రాల రచనలో ఏఐని అనుమతిస్తూ, కొన్ని సంస్థలు మార్గదర్శకాలను జారీ చేసిన నేపథ్యంలో దీనికి ప్రాధాన్యం ఏర్పడింది. తాజాగా పరిశీలించిన పరిశోధన పత్రాల్లో లార్జ్ లాంగ్వేజ్ మోడల్ (ఎల్ఎల్ఎం) అనే ఏఐ వ్యవస్థ వాడకాన్ని గుర్తించేందుకు టెక్స్ట్ ఆధారిత డిటెక్టర్లను శాస్త్రవేత్తలు ఉపయోగించారు. ఏఐ వినియోగానికి ముందు, ఆ తర్వాత సంబంధిత పరిశోధన పత్రం నాణ్యతను పోల్చి చూశారు. ఎల్ఎల్ఎం వినియోగం వల్ల పరిశోధకుడి ఉత్పాదకత 23 శాతం నుంచి 89 శాతం మేర పెరిగినట్లు వెల్లడైంది. రచన, భాషాపరమైన ఇబ్బందులను ఎదుర్కొనేవారికి ఇది బాగా ప్రయోజనకరంగా మారిందని శాస్త్రవేత్తలు తెలిపారు. ఆసియాలోని సంస్థలకు సంబంధించిన పరిశోధకులు.. ఏఐ వినియోగం ద్వారా 43 శాతం నుంచి 89.3 శాతం మేర ప్రయోజనాన్ని పొందినట్లు వివరించారు. దీన్నిబట్టి ఎల్ఎల్ఎం సృష్టించిన భాష.. బలహీన శాస్త్రీయ పరిశోధనలను ఏమార్చుస్తుందని తెలిపారు. సంబంధిత పరిశోధకుల సైటేషన్ తీరును కూడా ఎల్ఎల్ఎంలు మార్చేస్తాయని వివరించారు. ఎక్కువగా పుస్తకాలు, పెద్దగా ఎవరూ ప్రస్తావించని వ్యాసాలను ఎల్ఎల్ఎం వాడే అవకాశం ఉందని పేర్కొన్నారు. 12 శాతం మంది పరిశోధకులు తమ పరిశోధక పత్రాల్లో పెద్ద సంఖ్యలో పుస్తకాలను ఉదహరించారని చెప్పారు. సుదీర్ఘ టెక్స్ట్ నుంచి ముఖ్యమైన అంశాలను ఒడిసిపట్టే సామర్థ్యానికి ఇది నిదర్శనమని తెలిపారు.

కీడు చేశానన్న భావన అపరాధ భావోద్వేగానికి హేతువు

- అధ్యయనంలో వెల్లడి

జ్ఞాన నేత్రం



దిల్లీ: ఒక వ్యక్తికి కీడు చేసినప్పుడు మనలో అపరాధ భావన, ఆ కీడుకు నేనే బాధ్యుడినన్న ఆలోచన అవమాన స్థితిని కలిగిస్తాయని "ఈ-లైఫ్" అనే జర్నల్ లో ప్రచురించిన అధ్యయన నివేదిక వెల్లడించింది. 'అపరాధ, అవమాన భావోద్వేగాలకు సంబంధించిన నాడీ స్పందనలు, మానసిక పరిణామాలపై అనేక అధ్యయనాలు జరిగాయి. అయితే ఈ భావాలకు ప్రేరణ ఏమిటన్నది ఇప్పటికీ అస్పష్టం' అని తాజా నివేదిక ప్రధాన రచయిత, చైనాలోని సన్ యాట్సెన్ విశ్వవిద్యాలయ మనోవైజ్ఞానిక విభాగంలో పనిచేస్తున్న రుయిడా జు అన్నారు. కీడు, దాని బాధ్యత ఏ విధంగా అపరాధ, అవమాన భావనలకు ప్రేరణ కలిగిస్తున్నాయో అంచనా వేయడానికి పరిశోధకులు ఒక చిన్నపాటి ఆటను కనుగొన్నారు. ఈ ఆటలో ఐదుగురు పాల్గొన్నారు. ఇందులో నలుగురు నిర్ణేతలు, ఒకరు రిసీవర్గా ఉన్నారు. నిర్ణేతలు కంప్యూటర్ తెరపై ఒక చుక్కల చిత్రాన్ని చూపి అందులో వున్న చుక్కల సంఖ్య 20 కంటే ఎక్కువా, తక్కువా అని అడిగారు. నిర్ణేతలు తప్పు అంచనా ఇచ్చిన ప్రతిసారీ రిసీవర్కు షాక్ తగిలిన భావన కలిగే ఏర్పాటుచేశారు. ఇలా షాక్ తీసుకున్న రిసీవర్లకు తాము ఎంత అధిక పరిహారం చెల్లించాలో నిర్ణయించే అధికారం నిర్ణేతలకు ఇచ్చారు. ఆర్థిక సాయాన్ని నిర్ణయించే సమయంలో వారి మెదళ్లను ఎఫ్ఎంఆర్ఐ ద్వారా స్కాన్ చేశారు. స్వీకర్తకు తాను కీడు చేశానని భావించిన వారి మెదడులో అపరాధ భావన కలిగే ప్రదేశం ప్రేరణకు గురికాగా, కీడు జరిగినందుకు బాధ్యుడిని తానే అని భావించిన వారి మెదడులో అవమాన భావనకు కారణమైన ప్రదేశంలో స్పందన నమోదైంది. అపరాధ భావనకు, అవమాన భావనకు భిన్నమైన నాడీ స్పందనలు ఉంటాయని ఆటలో పాల్గొన్న వారి స్కాన్లను విశ్లేషించి తెలిపారు.

శాంతి సామరస్యాల మార్గం.. ధ్యానం

- శ్రీశ్రీ రవిశంకర్



ఐక్యరాజ్యసమితి: తీవ్రమైన ఆర్థిక, రాజకీయ, సైనిక సంక్షోభాల్లో చిక్కుకున్న ప్రస్తుత ప్రపంచంలో సంక్లిష్టతల్ని అధిగమించడానికి ఉపయోగపడే మౌలిక నైపుణ్యంగా ధ్యానం గుర్తింపు పొందుతోందని, ప్రపంచ శాంతి సామరస్యాల సాధనకు ధ్యానం మార్గం చూపుతోందని ఆధ్యాత్మికవేత్తలు, ఐరాస రాయబారులు శుక్రవారం అభిప్రాయపడ్డారు. ఐక్యరాజ్య సమితిలోని భారత్, అండోరా, మెక్సికో, నేపాల్, శ్రీలంక దేశాల శాశ్వత మిషన్లు ఐరాస ప్రధాన కార్యాలయంలో రెండో ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా ఒక కార్యక్రమం నిర్వహించాయి. ప్రపంచ శాంతి సామరస్యాల కోసం ధ్యానం అనే శీర్షికతో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మిక గురువు శ్రీ శ్రీ రవిశంకర్ ప్రసంగించారు. ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేసే 700 శాస్త్రీయ పరిశోధక పత్రాలు ఉన్నాయని, ధ్యానం వల్ల 100కు పైగా ప్రయోజనాలు కలుగుతాయని శ్రీ శ్రీ రవిశంకర్ అన్నారు. మనిషిని అతని అంతరంగంలోని దాగి ఉన్న సమైక్యతా భావంతో ధ్యానం ఏకం చేస్తుందన్నారు. ధ్యానం కీలక దౌత్య సాధనంగా కూడా మారిందని, మరింత స్పష్టత దిశగా మనల్ని నడిపిస్తోందని, ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి, రాయబారి పర్వతనేని హరీశ్ అన్నారు. గత సంవత్సరం ఐరాస డిసెంబరు 21ని ప్రపంచ ధ్యాన దినోత్సవంగా ప్రకటిస్తూ తీర్మానం చేసిందని ఈ తీర్మానం వెనక భారత్ కీలక పాత్ర పోషించిందని అన్నారు. ఐరాసలో నేపాల్ శాశ్వత ప్రతినిధి లోక్ బహాదుర్ థాపా తదితరులు ఈ సందర్భంగా ప్రసంగించారు.

భారత్ను రెచ్చగొడుతున్న బంగ్లా!

- బంగాళాఖాతంలో కవ్వింపు చర్యలు



ఇంటర్నెట్ డెస్క్: విద్యార్థి నాయకుడు, ఇంకిలాబ్ మంచో నేత షరీఫ్ ఉస్మాన్ బిన్ హాదీ మృతితో బంగ్లాదేశ్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. భారత్ వ్యతిరేక ఆందోళనలు మిన్నంటుతున్నాయి. మరోవైపు గత కొన్ని నెలలుగా బంగాళాఖాతంలో ఆ దేశం వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే భారత్ను కావాలనే రెచ్చగొడుతోందని అర్థమవుతోంది. ఆ దేశానికి చెందిన చేపల బోట్లు తరచూ భారత ప్రాదేశిక జలాల్లోకి చొచ్చుకు రావడం, ఎన్నడూ లేని విధంగా బంగ్లా నౌకాదళం కూడా ఈ ప్రాంతంలో గస్తీ పెంచడం దీనికి బలం చేకూరుస్తోంది. డిసెంబర్ 15న తమ ప్రాదేశిక జలాల్లోకి వచ్చారని ఆరోపిస్తూ.. 16 మంది భారతీయ మత్స్యకారుల బోటును.. బంగ్లా నేవీ సిబ్బంది ఢీ కొట్టి వారందర్నీ సముద్రంలో తోసేశారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న ఇండియన్ కోస్ట్ గార్డ్ సిబ్బంది 11 మందిని రక్షించారు. మరో ఐదుగురి ఆచూకీ ఇప్పటికీ లభ్యం కాలేదు.

పాక్కు దగ్గరవుతూ..

బంగ్లాలో పోటువేసుకున్న హింసాత్మక అల్లర్ల తర్వాత అప్పటి ప్రధాని షేక్ హసీనా దేశం విడిచి వెళ్లిపోవడం, మహమ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడటం చకచకా జరిగిపోయాయి. అప్పటి నుంచి నుంచి భారత్తో బంగ్లా సంబంధాలు క్షీణిస్తూ వచ్చాయి. అదే సమయంలో క్రమంగా పాకిస్థాన్కు దగ్గరవుతోంది. అంతేకాకుండా బంగాళాఖాతంలో తన ప్రభావాన్ని విస్తరించేందుకు ప్రయత్నిస్తోంది. యూనస్ వ్యాఖ్యలు కూడా అందుకు మరింత బలం చేకూరుస్తున్నాయి. 'ఈ ప్రాంతం మొత్తానికి బంగ్లాదేశ్ సముద్ర రక్షకులం' అంటూ గతంలో యూనస్ వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలకు తగినట్లుగానే బంగ్లా నేవీ.. సముద్ర సరిహద్దు ప్రాంతాల్లో గస్తీ తీవ్రం చేసింది. భారత్ మత్స్యకారులను నిర్బంధించడం, వారి బోట్లను స్వాధీనం చేసుకోవడం, కోస్ట్గార్డ్ సిబ్బందితో కవ్వింపులకు దిగడం వంటి చర్యలకు పాల్పడుతోంది.

నోటిఫికేషన్ తర్వాత మరిన్ని కవ్వింపు చర్యలు

బంగ్లాదేశ్లో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో భారత్ వ్యతిరేక సెంటిమెంట్లను రెచ్చగొట్టి.. లబ్ధి పొందేందుకు యూనస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. మరోవైపు ఇటీవల కాలంలో బంగ్లాదేశ్కు చెందిన చేపల బోట్లు ఇండియాకు చెందిన ఎక్స్క్లూజివ్ ఎకనామిక్ జోన్ (ఈఈజెడ్)ను దాటి రావడం ఎక్కువైంది. డిసెంబర్ 16న బంగ్లాదేశ్కు చెందిన బోట్లు.. భారత్ జలాల్లోకి చొరబడ్డాయి. 35 మంది మత్స్యకారులను కోస్ట్గార్డ్ సిబ్బంది అదుపులోకి తీసుకొని.. 500 కేజీల చేపలను స్వాధీనం చేసుకున్నారు. అంతకుముందు ఎనిమిది బోట్లు, 170 మందిని సిబ్బందిని భారత్ దళాలు అరెస్టు చేశాయి. బంగ్లాలో ఎన్నికలకు సంబంధించి గత నెల అక్కడి ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. అప్పటి నుంచి ఈ తరహా ఘటనలు ఎక్కువయ్యాయి.

ఢాకాపై పాకిస్థాన్, చైనా దేశాల ప్రభావం పెరుగుతున్న తరుణంలో 1971 (భారత్-బంగ్లా యుద్ధం) తర్వాత భారత్ మరో సవాల్ను ఎదుర్కొంటోందని ఇటీవల పార్లమెంటరీ కమిటీ కూడా అభిప్రాయపడిందంటే.. పరిస్థితి ఎంత వరకు వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. తాజాగా షరీఫ్ ఉస్మాన్ బిన్ హాదీ మృతి నేపథ్యంలో భారత్ వ్యతిరేకంగా పెద్ద స్థాయిలో ఆందోళనలు చెలరేగాయి. చిట్టగాంగ్లోని అసిస్టెంట్ ఇండియన్ హైకమిషనర్ రాళ్ల దాడి జరిగింది. బంగ్లాదేశ్ అంతర్గత వ్యవహారాల్లో భారత్ జోక్యం చేసుకోనప్పటికీ.. ఆ దేశం మాత్రం భారత వ్యతిరేక వైఖరిని అవలంబిస్తోంది.



ఖ్వాజా మొయినుద్దీన్ చిష్తీ 814వ ఉర్సు నేపథ్యంలో అజ్మేర్లోని దర్గా షరీఫ్కు పంపుతున్న చాదర్తో శుక్రవారం దిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తదితరులు

వలసదారులపై ట్రంప్ కొత్త అస్త్రం

- విదేశీయుల అమెరికన్ పౌరసత్వాల రద్దుకు యోచన

వాషింగ్టన్: జన్మతః కాకుండా చట్టసమ్మత ప్రక్రియల ద్వారా అమెరికన్ పౌరులైన కొందరు విదేశీయుల పౌరసత్వాలను రద్దుచేయాలని డొనాల్డ్ ట్రంప్ సర్కారు యోచిస్తోంది. వలసలపై ఉక్కుపాదం మోపే క్రమంలో ఈ కొత్త చర్య తీసుకోవాలని చూస్తోంది. ఇతర దేశాలలో జన్మించినా వృత్తి రీత్యా కానీ, ఇతర చట్టబద్ధ మార్గాల్లో కానీ కొన్నేళ్లపాటు అమెరికాలో నివసించి గ్రీన్ కార్డు పొందినవారు, ఆంగ్ల భాషలో ప్రావీణ్యం సంపాదించి, నైతికంగా మంచి స్వభావం ఉన్నవారికి అమెరికా పౌరసత్వం ఇస్తారు. దీన్ని సహజీకరణ ప్రక్రియ అంటారు. ఇలాంటి సహజీకృత పౌరులు పౌరసత్వం కోసం పెట్టిన దరఖాస్తులలో పొరపాట్లు చేసినా, మోసానికి పాల్పడినా పౌరసత్వం రద్దవుతుంది. ప్రస్తుతం అమెరికాలో సహజీకృత పౌరులైన విదేశీ సంతతి వారి సంఖ్య 2.6 కోట్లని న్యూయార్క్ టైమ్స్ పత్రిక తెలిపింది. నిరుడు కొత్తగా 8 లక్షల మందికి సహజీకృత పౌరసత్వం లభించింది. సహజీకృత పౌరసత్వం కోసం దరఖాస్తు పెట్టిన వారిలో మోసాలకు పాల్పడిన వారిని ఏరివేయాలనీ, అలాంటి వారిని 2026లో నెలకు కనీసం 100 నుంచి 200 మందిని కనిపెట్టి, వారి పౌరసత్వాన్ని రద్దుచేయాలని మంగళవారం అమెరికా పౌరసత్వ, వలస వ్యవహారాల విభాగానికి అంతరంగిక ఉత్తర్వులు జారీ అయ్యాయని న్యూయార్క్ టైమ్స్ వెల్లడించింది. ఇలా సహజీకృత పౌరసత్వాల రద్దుకు కోటా నిర్ణయించడం సరికాదనీ, గతంలో నెలవారీగా జరిగిన రద్దులకు 10 రెట్లు ఎక్కువ సాధించాలని ఆదేశించడం ఆందోళనకరమని అభిజ్ఞులు అంటున్నారు. మోసగించాలని కాకుండా దరఖాస్తులలో తెలియక తప్పులు చేసిన వారినీ శిక్షించాలనడం అన్యాయమన్నారు. అయితే, మాదక ద్రవ్య ముఠాల సభ్యులను, హింసాత్మక నేరాలకు పాల్పడినవారినీ, ఆర్థిక నేరస్థులనూ అమెరికా నుంచి సాగనంపాలన్నదే ట్రంప్ సర్కారు ఉద్దేశమని అధికారులు వివరిస్తున్నారు.

శబరిమల బంగారం చోరీ కేసు ఈడీకి అప్పగింత

కొల్లాం: శబరిమల బంగారం చోరీ కేసు దర్యాప్తును చేపట్టడానికి ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కు అనుమతిస్తూ కొల్లాం విజిలెన్స్ కోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.



ఈ కేసుకు సంబంధించిన అన్ని పత్రాలను ఈడీకి అప్పగించాలని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను న్యాయస్థానం ఆదేశించింది. ఇప్పటివరకు నమోదైన రెండు ఎఫ్ఐఆర్ల ప్రతులు, నిందితుల రిమాండ్ రిపోర్టులు సహా ఇతర కీలక దస్త్రాలను ఈడీకి తక్షణమే ఇవ్వాలని స్పష్టం చేసింది. ఈ కేసులో ఈడీ త్వరలోనే మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయనుంది. శబరిమల ఆలయంలోని దేవుడి విగ్రహాల బంగారు తాపడం బరువులో వ్యత్యాసంపై దర్యాప్తు చేపట్టేందుకు కేరళ ప్రభుత్వం సిట్ను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా సిట్ ఏడుగురిని అరెస్టు చేసింది. అయితే మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టేందుకు అనుమతించాలని కోరుతూ ఈడీ తొలుత కేరళ హైకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు సూచన మేరకు కొల్లాం విజిలెన్స్ కోర్టులో ఈడీ పిటిషన్ వేసింది. మరోవైపు, బంగారం చోరీ కేసులో నిందితులుగా ఉన్న ట్రావెన్కోర్ దేవస్థానం బోర్డు(టీడీబీ) మాజీ అధ్యక్షుడు ఎన్ వాసు, మరో ఇద్దరు మాజీ అధికారులకు బెయిల్ ఇవ్వాలంటూ దాఖలైన పిటిషన్లను కేరళ హైకోర్టు తిరస్కరించింది.

భారత్తో మైత్రికి ప్రాధాన్యమిచ్చే వార్షిక రక్షణ బిల్లుకు ట్రంప్ ఆమోదం

- చైనా దూకుడుకు కళ్లెం వేసేలా క్వాడ్ దేశాలతో మరింత సమన్వయం



వాషింగ్టన్: ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనాతో కొనసాగుతున్న వ్యూహాత్మక పోటీలో ఆధిపత్యం సాధించడమే లక్ష్యంగా అమెరికా కీలక ముందడుగు వేసింది. భారత్తో సంబంధాలను మరింత దృఢంగా విస్తృతపరచుకునే ఉద్దేశంతో రూపొందించిన వార్షిక రక్షణ విధాన బిల్లుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం సంతకం చేశారు. 2026 ఆర్థిక సంవత్సరానికి గాను సిద్ధమైన 'జాతీయ రక్షణ అధికార చట్టం' భారత్-అమెరికా రక్షణ భాగస్వామ్యాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఈ చట్టం ద్వారా క్వాడ్ కూటమి (భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా)లో భారత్ నిర్వహించే పాత్రకు మరింత ప్రాధాన్యం లభించనుంది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో స్వేచ్ఛాయుత పరిస్థితులను సాధించుకోవడమే ప్రధాన ఉద్దేశమని బిల్లులో పేర్కొన్నారు. ముఖ్యంగా చైనా నుంచి ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు అమెరికా తన మిత్ర దేశాలతో కలిసి ముందుకు సాగనుంది. బిల్లుకు ఆమోదం తెలిపిన అనంతరం అధ్యక్షుడు ట్రంప్ మాట్లాడుతూ.. బాహ్య, అంతర్గత ముప్పుల నుంచి మాతృభూమిని రక్షించుకోవడమే ఈ చట్టం ప్రధాన లక్ష్యమన్నారు. రక్షణ రంగంలో పారిశ్రామిక పునాదులను బలోపేతం చేయడంతో పాటు, సైనిక సామర్థ్యాన్ని పెంచేందుకు ఇది దోహదపడుతుందని తెలిపారు. భారత్తో రక్షణ రంగంలో భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లినప్పుడే ఇండో-పసిఫిక్లో చైనాపై ఆధిపత్యం సాధ్యమవుతుందని ట్రంప్ వ్యాఖ్యానించారు. భారత్-అమెరికా వ్యూహాత్మక భద్రతా సంభాషణలో అణు బాధ్యత నియమాలపై సంయుక్త సంప్రదింపుల వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఈ చట్టం పేర్కొంది.

డెన్మార్క్పై రష్యా సైబర్ దాడులు

కోపెన్హెగెన్: రష్యా 2024, 2025 సంవత్సరాల్లో తమ దేశ మౌలిక సదుపాయాలు, వెబ్సైట్లపై సైబర్ దాడులు జరిపిందని డెన్మార్క్ అధికారులు శుక్రవారం వెల్లడించారు. గత సంవత్సరం తమ దేశంలో నీటి సరఫరా వ్యవస్థపై జరిగిన విధ్వంసకర సైబర్ దాడికి రష్యాదే బాధ్యత అని డెన్మార్క్ రక్షణ నిఘా సేవల విభాగం ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. పాశ్చాత్య జగతిలో అస్థిరత సృష్టించేందుకు రష్యా హైబ్రిడ్ యుద్ధాన్ని సాగిస్తోందని తెలిపింది. గడచిన ఒక్క వారంలోనే డెన్మార్క్లో 147 సైబర్ దాడి ఘటనలు సంభవించాయి. సోషల్ మీడియా సాయంతో పాశ్చాత్య దేశాల్లో ఉక్రెయిన్కు మద్దతు లేకుండా చేసేందుకు సైబర్ ప్రచారానికి, దాడులకు పాల్పడుతున్నారని వివరించింది. జర్మనీ కూడా ఇదే తరహా ఆరోపణలు చేస్తోంది. రష్యా తమ దేశంలో విద్రోహానికి, సైబర్ దాడులకు, ఎన్నికల్లో జోక్యానికి పాల్పడుతోందని జర్మనీ ఆరోపణ. ఈనెల 12న జర్మనీ అధినాయకత్వం రష్యా రాయబారిని పిలిపించి ఈ విషయంపై ఆందోళన వ్యక్తంచేసింది.





ఛత్తీస్గఢ్లో ట్రాన్స్జెండర్స్ జాతీయ క్రీడలు

ఛత్తీస్గఢ్ రాజధాని నగరమైన రాయ్పుర్లో ట్రాన్స్జెండర్ల నేషనల్ స్పోర్ట్స్మీట్- 2025 శుక్రవారం మొదలైంది. నగరంలోని కోటా స్టేడియంలో జరుగుతున్న ఈ క్రీడల్లో పాల్గొనేందుకు దేశంలోని 10 రాష్ట్రాల నుంచి దాదాపు 170 మంది ట్రాన్స్జెండర్ అథ్లెట్లు తరలివచ్చారు. పరుగు పందేలు, లాంగ్జంప్, షాట్పుట్, టగ్ ఆఫ్ వార్ వంటి పలు క్రీడాంశాల్లో వీరికి పోటీలు నిర్వహిస్తున్నారు. గతంలో 2012లోనూ రాయ్పుర్లో ఇటువంటి క్రీడలు జరిగాయి. బిచ్చగాళ్లుగా, సెక్స్ వర్కర్లుగా ఈ వర్గంపై సమాజంలో ఉన్న అభిప్రాయాన్ని మార్చేందుకు ఇదొక అవకాశంగా నిర్వాహకులు పేర్కొన్నారు. అవకాశమిస్తే ఒలింపిక్స్లోనూ భారత్కు ప్రాతినిధ్యం వహించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు ఝార్ఖండ్ నుంచి వచ్చిన కమ్లీ అగ్నిహోత్రి తెలిపారు. ట్రాన్స్జెండర్లలో ఎంతో ప్రతిభ ఉన్నా, సమాజం అవకాశాలు ఇవ్వడం లేదని.. ఈ క్రీడలు నిర్వహిస్తున్నందుకుగాను ఛత్తీస్గఢ్ ప్రభుత్వానికి ధన్యవాదాలు చెబుతున్నట్లు పశ్చిమబెంగాల్ నుంచి వచ్చిన ఝుమా అన్నారు. భారత ప్రజాస్వామ్యానికి, సమానత్వానికి ఈ కార్యక్రమం ప్రతిబింబమని కిన్నార్ అఖాడా మహామండలేశ్వర్ మీరా పరేడె అభిప్రాయపడ్డారు. ఛత్తీస్గఢ్ పోలీసు బలగంలోనూ 35 మంది ట్రాన్స్జెండర్లు చేరినట్లుగా పేర్కొన్నారు. శనివారంతో ఈ క్రీడలు ముగియనున్నాయి.

సిడ్నీ ఉగ్రదాడి ఘటన.. 'రియల్ హీరో' అహ్మద్కు భారీ నజరానా

ఇంటర్నెట్ డెస్క్: ఆస్ట్రేలియా సిడ్నీలోని బోండీ బీచ్లో కాల్పులకు తెగబడిన ఉగ్రవాదులకు ఎదురొడ్డిన అహ్మద్కు 'గో ఫండ్ మీ' సంస్థ 2.5 మిలియన్ ఆస్ట్రేలియన్ డాలర్ల(దాదాపు రూ.14 కోట్లు) చెక్కును అందించింది. ప్రపంచవ్యాప్తంగా 43 వేల మంది దాతల నుంచి దీన్ని సేకరించారు. ఇందుకు సంబంధించిన చెక్కును తీసుకున్న అనంతరం అహ్మద్ మీడియాతో మాట్లాడుతూ సంతోషం వ్యక్తం చేశారు. మనుషులంతా ఒకరికొకరు తోడుగా ఉండాలని, ఇతరుల ప్రాణాలు ప్రమాదంలో ఉన్న సమయంలో వారిని రక్షించడానికి శాయశక్తులా ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదులను ఎదుర్కొనే సమయంలో నిందితుడు పలు రౌండ్ల కాల్పులు జరపడంతో అహ్మద్ తీవ్రంగా గాయపడినట్లు ఆస్ట్రేలియన్స్ ఫర్ సిరియా అసోసియేషన్ ప్రతినిధి లుబాబా పేర్కొన్నారు. అతడి చికిత్సకయ్యే ఖర్చుల కోసం నిధులు సేకరిస్తున్నట్లు తెలిపారు.

కాలుష్యంపై చర్చ జరగకపోవడానికి కాంగ్రెసే కారణం: రిజిజు



దిల్లీ: దిల్లీలో వాయు కాలుష్యంపై చర్చ జరగకుండా పార్లమెంటును విపక్షాలే స్తంభింపజేశాయని కేంద్ర ప్రభుత్వం ఆరోపించింది. వీబీ- జీ రామ్ జీ బిల్లుపై చర్చ సందర్భంగా కొందరు విపక్ష ఎంపీలు ప్రవర్తించిన తీరు ఎంతమాత్రమూ ఆమోదయోగ్యంగా లేదంటూ ఆక్షేపించింది. పార్లమెంటు శీతాకాల సమావేశాలు శుక్రవారంతో ముగిసిన నేపథ్యంలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు.. ఆ శాఖ సహాయ మంత్రులు అర్జున్రామ్ మేఘ్వాల్, ఎల్.మురుగన్లతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. తాజా సమావేశాలు చాలా ఫలవంతంగా సాగాయని, రెండు సభల్లో చర్చ అనంతరం 8 బిల్లులు ఆమోదం పొందాయని రిజిజు పేర్కొన్నారు. సాధారణ ప్రజల జీవితాల్లో మెరుగైన మార్పులు తీసుకొచ్చేందుకు మోదీ సర్కారు ప్రారంభించిన సంస్కరణల ఎక్స్ప్రెస్ వేగాన్ని ఈ బిల్లులు మరింత పెంచుతాయన్నారు. "అయితే లోక్సభలో వీబీ- జీ రామ్ జీ బిల్లుపై చర్చ సందర్భంగా విపక్ష సభ్యులు అనుచిత రీతిలో వ్యవహరించారు. కొందరు డెస్కులపైకి ఎక్కి నిల్చున్నారు. కాగితపు విమానాలు విసిరేశారు. వాయు కాలుష్యంపై చర్చించాల్సిన అవసరం లేదని కొందరు కాంగ్రెస్ సభ్యులు అన్నారు. అందుకే.. ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ కాలుష్యంపై చర్చ జరగలేదు" అని రిజిజు తెలిపారు. చర్చలకు విపక్షాలు అడిగినదాని కంటే ఎక్కువ సమయాన్నే తాము కేటాయించామని చెప్పారు.

టాగూర్ను అవమానించడంతో మొదలై.. గాంధీజీకి అవమానంతో ముగిసింది: కాంగ్రెస్

శీతాకాల సమావేశాలు సాగిన తీరుపై కాంగ్రెస్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ సమావేశాలు రవీంద్రనాథ్ టాగూర్ను అవమానించడంతో ప్రారంభమై, మహాత్మాగాంధీని అవమానించడంతో ముగిశాయంటూ ధ్వజమెత్తింది. శీతాకాల సమావేశాలను 'కాలుష్య కాల భేటీ'గా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. వాయు కాలుష్యంపై పార్లమెంటులో చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నప్పటికీ.. ప్రభుత్వం పారిపోయిందని ఆరోపించారు. ఎప్పట్లాగే చివర్లో కీలక బిల్లును (వీబీ- జీ రామ్ జీ బిల్లును ఉద్దేశించి) ప్రవేశపెట్టి.. విపక్షాల నిరసనల మధ్యే దాన్ని ప్రభుత్వం ఆమోదింపజేసుకుందని విమర్శించారు.



వందేమాతరంపై చర్చలో దేశ తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూను సర్కారు అవమానించిందని, చరిత్రను వక్రీకరించిందని పేర్కొన్నారు. 'రవీంద్రనాథ్ ఠాగూర్నూ అవమానించారు. 1937లో ఆయన సిఫార్సు మేరకే.. తొలి రెండు చరణాలను జాతీయ గీతంగా ఆలపించాలని సీడబ్ల్యూసీ నిర్ణయించింది. మహాత్మాగాంధీని అవమానించడం ద్వారా ప్రస్తుత సమావేశాలు ముగిశాయి. ఆధునిక భారత్ను నిర్మించిన ముగ్గురు వ్యక్తులను అవమానించడమే ప్రధాని మోదీ వ్యూహమని స్పష్టమైంది" అని జైరాం రమేశ్ ఆరోపించారు.

ప్రధాని మోదీతో నితిన్ నబీన్ భేటీ

దిల్లీ: భాజపా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన నితిన్ నబీన్ శుక్రవారం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు చేపట్టబోయే చర్యల్లో నబీన్ సఫలీకృతమవ్వాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలియజేసినట్లు 'ఎక్స్'లో మోదీ పేర్కొన్నారు. సంస్థాగతంగా, పాలనాపరంగా ఆయనకున్న అనుభవం భాజపాకు గొప్ప ఆస్తిగా మారుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మరోవైపు- భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శులతో దిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో నితిన్ నబీన్ శుక్రవారం భేటీ అయ్యారు. కమలదళాన్ని మరింత బలోపేతం చేసే ప్రణాళికలపై వారితో చర్చించారు.

తైపీలో బీభత్సం సృష్టించిన దుండగుడు

- నిందితుడు సహా నలుగురి మృతి

తైపీ: తైవాన్ రాజధాని తైపీలో గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం సాయంత్రం పొగ బాంబులు విసురుతూ, కత్తిని ఝుళిపిస్తూ బీభత్సం సృష్టించాడు. నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్ సమీప సబ్వే వద్ద ప్రయాణికులను బెదిరిస్తూ దాడికి దిగాడు. తీవ్ర కలకలం రేపిన ఈ ఘటనలో 9 మంది గాయపడ్డారు. వీరిలో ముగ్గురు ఆసుపత్రిలో మృతి చెందారని అధికారులు తెలిపారు. పోలీసులకు చిక్కకుండా తప్పించుకునేందుకు ఎత్తైన భవనం నుంచి కిందికి దూకిన దుండగుడు కూడా తీవ్ర గాయాలతో చనిపోయాడు.

20 ఏళ్ల పథకాన్ని ఒక్కరోజులో కూల్చారు!

- మోదీ ప్రభుత్వంపై రాహుల్గాంధీ ధ్వజం



దిల్లీ: 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ ఆజీవికా మిషన్' (వీబీ-జీ రామ్ జీ) బిల్లు'ను పార్లమెంటులో ఆమోదింపజేసుకోవడంపై కాంగ్రెస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశంలో ఇరవై ఏళ్లుగా కొనసాగుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని(ఎంజీనరేగా) మోదీ ప్రభుత్వం ఒక్క రోజులో కూల్చివేసిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. వీజీ-జీ రామ్ జీని గ్రామ వ్యతిరేక బిల్లుగా అభివర్ణించారు. 'కొత్త పథకం హక్కుల ఆధారిత, డిమాండ్ చోదిత హామీని కూల్చివేసింద'ని పేర్కొన్నారు. 'ఎంజీనరేగా పథకం వల్ల వలసలు తగ్గాయి. కొవిడ్ సమయంలో జీవనోపాధి లేనప్పుడు కోట్ల మంది ఆకలి, అప్పుల ఊబిలో కూరుకుపోకుండా కాపాడింది' అని రాహుల్ గాంధీ తెలిపారు. జీ రామ్ జీ పథకం పేదలకు చాలా హానికరమని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీ 'పేర్ల మార్పు సంబంధిత వ్యాధి'తో బాధపడుతున్నారని ఈ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు.

రాత్రంతా మెట్లపై టీఎంసీ ఎంపీలు

వీబీ-జీ రామ్ జీ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందిన నేపథ్యంలో దీనికి వ్యతిరేకంగా టీఎంసీ ఎంపీలు నిరసనకు దిగారు. పార్లమెంటు ప్రాంగణంలోని సంవిధాన్ సదన్ వద్ద మెట్లపైనే ధర్నా చేపట్టారు. ఇతర పార్టీల ఎంపీలు కూడా పాల్గొన్నారు. గురువారం అర్ధరాత్రి మొదలైన ఈ ధర్నా.. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగింది. దిల్లీలోని జంతర్మంతర్ వద్ద సామాజిక కార్యకర్తలు, వివిధ పార్టీల ఎంపీలు నిరసనలు చేపట్టారు.

తీర రక్షణ దళంలోకి 'అమూల్య'!



దిల్లీ: మెరుపు వేగంతో సాగరజలాల్లో గస్తీ నిర్వహించే నౌక అమూల్య శుక్రవారం భారత తీర రక్షణ దళంలో చేరింది. దీంతో తూర్పు తీరంలో కోస్ట్గార్డ్ పోరాట సామర్థ్యానికి మరింత దన్ను లభించినట్లయింది. ఇది కొత్త తరం అదమ్య తరగతి ఫాస్ట్ పెట్రోల్ వెసెల్స్ శ్రేణిలో మూడోది. నిఘా, గాలింపు, సహాయ చర్యలు, స్మగ్లింగ్ నివారణ, కాలుష్య ప్రతిస్పందన వంటి కార్యకలాపాలను ఇది చేపట్టగలదు. ఈ నౌక పొడవు 51 మీటర్లు. ఇందులో 3వేల కిలోవాట్ల సామర్థ్యమున్న రెండు అధునాతన డీజిల్ ఇంజిన్లు ఉన్నాయి. ఈ నౌక గరిష్ఠంగా 50 కిలోమీటర్ల వేగాన్ని అందుకోగలదు. ఏకబిగిన 1500 నాటికల్ మైళ్ల దూరం ప్రయాణించగలదు. దీన్ని గోవా షిప్యార్డ్ నిర్మించింది. స్వదేశీ నౌకానిర్మాణ సామర్థ్యానికి ఇది నిదర్శనమని ఓ అధికారి తెలిపారు. అమూల్యలో 60 శాతం స్వదేశీ ఉపకరణాలను ఉపయోగించారు. అందులో నియంత్రిత పిచ్ ప్రొపెల్లర్లు, హై ప్రిసిషన్ గేర్బాక్స్లు ఉన్నాయి. వీటి సాయంతో ఈ నౌక.. సాగర జలాల్లో ఒడుపుగా కదలగలదు. ఇందులో 30 ఎంఎం సీఆర్ఎన్-91 గన్, రెండు 12.7 ఎంఎం స్టెబిలైజ్డ్ రిమోట్ కంట్రోల్డ్ గన్లు ఉంటాయి. ఒడిశాలోని పారదీప్ కేంద్రంగా ఈ నౌక సేవలు అందిస్తుంది.

మహువాకు హైకోర్టులో ఊరట

సీబీఐ ఛార్జిషీటు దాఖలుకు లోక్పాల్ ఇచ్చిన ఉత్తర్వు కొట్టివేత

దిల్లీ: ఒక వ్యాపారి నుంచి లంచం తీసుకుని లోక్సభలో ప్రశ్న అడిగారనే ఆరోపణపై తృణమూల్ కాంగ్రెస్ ఎం.పి. మహువా మొయిత్రాపై ఛార్జిషీటు దాఖలు చేయడానికి సీబీఐకి అనుమతిస్తూ లోక్పాల్ జారీ చేసిన ఉత్తర్వును దిల్లీ హైకోర్టు శుక్రవారం కొట్టివేసింది. ఛార్జిషీటుకు అనుమతించే ముందు ఆరోపణను ఎదుర్కొంటున్న ప్రజాప్రతినిధి వివరణ కోరాలని లోక్పాల్, లోకాయుక్త చట్టంలోని 20(7) నిబంధన నిర్దేశిస్తోందనీ, సీబీఐ ఆ పని చేయలేదని మహువా న్యాయవాది హైకోర్టుకు తెలియజేశారు. కాగా మహువాకు లోక్పాల్ విచారణలో ఎలాంటి పత్రాలనూ సమర్పించే హక్కు లేదనీ, మౌఖిక విచారణకూ అనుమతి లేదనీ, ఆమె కేవలం వ్యాఖ్యలు చేయడంతో సరిపెట్టుకోవాలని సీబీఐ వాదించింది. దర్శన్ హీరానందానీ అనే వ్యాపారి నుంచి బహుమతులు తీసుకుని మహువా లోక్సభలో ఒక ప్రశ్న అడిగారని ఆరోపించింది. కాగా, లోక్పాల్, లోకాయుక్త చట్టంలోని నిబంధనలను లోక్పాల్ సరిగా అర్థం చేసుకోలేదని దిల్లీ హైకోర్టు వ్యాఖ్యానించింది. లోక్పాల్ చట్టంలోని నిబంధనల ప్రకారం ప్రజాప్రతినిధి వివరణ తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. అందుకు నెల రోజుల గడువు విధించింది.

నేర పరిశోధన, ఛేదనలో ఏపీ పోలీసు అగ్రగామి

ఏబీసీడీ పురస్కారాల ప్రదానంలో డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా

ఈనాడు, అమరావతి: నేరానికి పాల్పడినవారు ఎట్టి పరిస్థితుల్లోనూ చట్టం నుంచి తప్పించుకోలేరని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా హెచ్చరించారు. నేర పరిశోధన, ఛేదనలో ఏపీ పోలీసు శాఖ అగ్రగామిగా ఉందని పేర్కొన్నారు. ఈ ఏడాది తొలి మూడు త్రైమాసికాల్లో జరిగిన నేరాలకు సంబంధించి పరిశోధన, ఛేదనలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బృందాలకు శుక్రవారం ఏబీసీడీ (అవార్డ్ ఫర్ బెస్ట్ ఇన్ క్రైమ్ డిటెక్షన్) అవార్డులు, నగదు పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీఐడీ విభాగాధిపతి రవిశంకర్ అయ్యన్నార్, శాంతిభద్రతల విభాగం ఏడీజీ మధుసూదన్‌రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు. త్రైమాసికాల వారీగా బహుమతులు పొందిన వారి వివరాలివి.



మొదటి త్రైమాసికంలో ప్రథమ బహుమతి పొందిన విజయవాడ కమిషనరేట్ రాజశేఖరబాబు బృందానికి పురస్కారం అందిస్తున్న డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా



రెండో త్రైమాసికంలో ప్రథమ బహుమతి పొందిన తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ బృందానికి పురస్కారం అందిస్తున్న డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా



మూడో త్రైమాసికంలో ప్రథమ బహుమతి పొందిన బాపట్ల ఎస్పీ ఉమామహేశ్వర్ బృందానికి పురస్కారం అందిస్తున్న డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా

మొదటి త్రైమాసికం (జనవరి-మార్చి)

- ■ **ప్రథమ బహుమతి:** ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు నేతృత్వంలోని బృందానికి
- ■ **ద్వితీయ బహుమతి:** పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి నేతృత్వంలోని బృందానికి
- ■ **తృతీయ బహుమతి:** సీఐడీ సైబర్ నేరాల విభాగం ఎస్పీ కె.కృష్ణప్రసన్న బృందానికి
- ■ **ప్రోత్సాహక బహుమతి:** కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ బృందానికి

రెండో త్రైమాసికం (ఏప్రిల్-జూన్)

- ● **ప్రథమ బహుమతి:** తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ బృందానికి
- ● **ద్వితీయ బహుమతి:** సీఐడీ సైబర్ నేరాల విభాగం ఎస్పీ కె.కృష్ణప్రసన్న బృందానికి
- ● **తృతీయ బహుమతి:** సత్యసాయి జిల్లా అప్పటి ఎస్పీ రత్న బృందానికి
- ● **ప్రోత్సాహక బహుమతి:** అప్పటి ప్రకాశం జిల్లా ఎస్పీ, ప్రస్తుత విజయనగరం ఎస్పీ ఏఆర్.దామోదర్ బృందానికి

మూడో త్రైమాసికం (జులై-సెప్టెంబరు)

- ◆ **ప్రథమ బహుమతి:** బాపట్ల ఎస్పీ ఉమామహేశ్వర్ నేతృత్వంలోని బృందానికి
- ◆ **ద్వితీయ బహుమతి:** అనంతపురం ఎస్పీ పి.జగదీష్ బృందానికి
- ◆ **తృతీయ బహుమతి:** విశాఖపట్నం సీపీ శంఖబ్రత బాగ్చి బృందానికి
- ◆ **ప్రోత్సాహక బహుమతి:** అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా, పల్నాడు ఎస్పీ బి.కృష్ణారావు నేతృత్వంలోని బృందాలకు

ఇండోసోల్‌కు ప్రోత్సాహకాలపై మార్గదర్శకాలు జారీ

ఈనాడు, అమరావతి: ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్‌కు టైలర్ మేడ్ విధానంలో ప్రోత్సాహకాలు చెల్లించేందుకు మార్గదర్శకాలను విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఆ సంస్థ 30 గిగావాట్ల సామర్థ్యం ఉన్న సిలికాన్/ పాలిసిలికాన్ పీవీ మాడ్యూల్స్, 20 గిగావాట్ల వేఫర్ సెల్ మాడ్యూల్స్ తయారీ యూనిట్‌ను శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. గిగావాట్ ఉత్పత్తి సామర్థ్యంతో తొలి యూనిట్‌ను ఏర్పాటుచేసి, దశల వారీగా 55 నెలల్లో ప్రాజెక్టు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది.

- ▼ ఈ సంస్థకు మూలధన సబ్సిడీ కింద గరిష్ఠంగా రూ.14,152 కోట్లు ప్రోత్సాహకంగా చెల్లించేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ మొత్తాన్ని ఏటా రూ.943.47 కోట్ల చొప్పున 15 ఏళ్ల పాటు చెల్లించనుంది.
- ▼ సంస్థ కోసం సేకరించే భూములకు ఎకరాకు రూ.10 వేల చొప్పున ఫెసిలిటేషన్ ఛార్జీల కింద వసూలు చేయాలని నిర్దేశించింది.
- ▼ వాటితో పాటు జీఎస్టీ, విద్యుత్ సుంకంలో రాయితీ వర్తింపునకు అనుమతులు ఇచ్చింది. ఈ ప్రోత్సాహకాల చెల్లింపు కోసం వివిధ శాఖలకు మార్గదర్శకాలు ఇచ్చింది.

జస్టిస్ శ్రీదేవి పింఛను మంజూరు ప్రక్రియను ప్రారంభించండి: హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: మాజీ న్యాయమూర్తి జస్టిస్ జి.శ్రీదేవికి పింఛను మంజూరు చేసే ప్రక్రియను ప్రారంభించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణలోగా ఆ వివరాలను తమ ముందుంచాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసి 2022 అక్టోబరులో జస్టిస్ జి.శ్రీదేవి పదవీ విరమణ చేశారు. మూడేళ్లైనా పింఛను మంజూరు ప్రక్రియను ప్రారంభించకపోవడాన్ని సవాల్ చేస్తూ ఆమె హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ శ్యాంకోశీ, జస్టిస్ చలపతిరావు ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది పైడా ప్రతీక్‌రెడ్డి వాదనలు విన్న అనంతరం ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఆదేశించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

పంట రుణం తీర్చేందుకు రూ.2 లక్షల నకిలీ నోట్లు

బ్యాంకు సిబ్బంది గుర్తించడంతో పరారైన పీఏసీఎస్ డైరెక్టర్

వర్ని, న్యూస్‌టుడే: బ్యాంకులో పంట రుణం చెల్లించడానికి ఓ రైతు రూ.2,08,500 విలువైన రూ.500 నోట్లు తీసుకురాగా... అవి నకిలీవిగా తేలిన ఘటన తెలంగాణలోని నిజామాబాద్ జిల్లా వర్నిలో శుక్రవారం వెలుగు చూసింది. వర్ని ఎస్సై రాజు కథనం ప్రకారం... వర్ని మండలం జలాల్‌పూర్ గ్రామానికి చెందిన రైతు, జాకోరా ప్రాథమిక వ్యవసాయ సహకార సంస్థ డైరెక్టర్ నరెడ్ల చిన్నసాయిలు అనే రైతు పంట రుణం చెల్లించడానికి గురువారం సాయంత్రం వర్నిలోని కెనరా బ్యాంకుకు రూ.2,08,500 విలువైన రూ.500 నోట్లు తీసుకొచ్చారు. క్యాష్ కౌంటర్‌లో సిబ్బందికి వాటిని ఇవ్వగా.. వారు కౌంటింగ్ మిషన్‌లో పెట్టగానే నకిలీవని సంకేతం ఇచ్చింది. దీంతో అప్రమత్తమై ఈ డబ్బు ఎక్కడి నుంచి తెచ్చారని సదరు రైతును ప్రశ్నించగా... ఆయన అక్కడి నుంచి పరారయ్యారు. ఈ మేరకు బ్యాంకు అధికారి పంకజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు చిన్నసాయిలు ఇంటికి వెళ్లి తనిఖీలు చేపట్టారు. రైతు పరారీలో ఉన్నట్లు ఎస్సై వివరించారు.

డిజిటల్ హెల్త్ రికార్డులతో ఆరోగ్య వ్యవస్థ బలోపేతం

- ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య ఖాతాల్లో ఏపీ ముందంజ
- ఐఐహెచ్ఎంఆర్-బెంగళూరు డైరెక్టర్ డాక్టర్ ఉషా మంజునాథ్

ఈనాడు, అమరావతి: ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య ఖాతాల(ఏబీహెచ్ఏ)ల ద్వారా ప్రజల ఆరోగ్య రికార్డులు డిజిటలైజ్ చేసి.. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎం)తో అనుసంధానం చేయడంతో ఆరోగ్య వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ (ఐఐహెచ్ఎంఆర్- బెంగళూరు) డైరెక్టర్ డాక్టర్ ఉషా మంజునాథ్ అన్నారు. రాష్ట్రంలో డిజిటల్ హెల్త్ అమలు- డిజిటల్ మౌలిక వసతుల విస్తరణపై ఐఐహెచ్ఎంఆర్ చేసిన అధ్యయనంపై అవగాహన కల్పించేందుకు గుంటూరు జిల్లా మంగళగిరిలోని హాయ్‌ల్యాండ్‌లో డీఎంహెచ్‌వోలు, డీసీహెచ్ఎస్‌లు, బోధనాసుపత్రుల సూపరింటెండెంట్లతో శుక్రవారం కార్యశాల నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, రాజస్థాన్ రాష్ట్రాల్లో డిజిటల్ హెల్త్ అమలుపై అధ్యయన వివరాలు వెల్లడించారు. ఏబీహెచ్ఏ హెల్త్ కార్డుల్లో ఆంధ్రప్రదేశ్ 96 శాతం ప్రగతితో దేశంలో మొదటి స్థానంలో ఉందన్నారు. ఐఐహెచ్ఎంఆర్ సలహాదారు డాక్టర్ సీఎస్ కేథార్ మాట్లాడుతూ డిజిటలైజేషన్ అప్లికేషన్ల అభివృద్ధికి నైపుణ్యం ఉన్న వారి సేవలు వినియోగించుకోవాలని సూచించారు. సెకండరీ హెల్త్ సంచాలకులు కేవీఎన్ చక్రధరబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో 4.84 కోట్ల మందికి ఆరోగ్య ఖాతాలు తెరిచామని, 26,083 ఆసుపత్రులు, 65,242 మంది వైద్యులు, సిబ్బంది వివరాలు హెల్త్ ప్రొఫెషనల్ రిజిస్ట్రీలో నమోదు చేసినట్లు వెల్లడించారు. డిజిటలైజేషన్‌లో ముందున్న మన రాష్ట్రానికి రూ.22 కోట్ల ప్రోత్సాహకం అందిందని వెల్లడించారు. ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ పద్మావతి మాట్లాడుతూ జనవరి 15 తర్వాత నుంచి కాగితాలు వాడకుండా, ప్రతి రోగి వివరాలూ డిజిటలైజేషన్‌లోనే నమోదుచేయాలని సూచించారు. సమావేశంలో ఏబీడీహెచ్ రాష్ట్ర నోడల్ అధికారి బీవీరావు మాట్లాడుతూ హెల్త్ ఖాతాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్దేశించారు. ఐహెచ్ఎంఆర్ ప్రతినిధులు ఆకాశ్ ప్రభు, గౌతం ఘోష్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



కార్యశాలకు హాజరైన వివిధ జిల్లాల వైద్యారోగ్య శాఖ అధికారులు, బోధనాసుపత్రుల సూపరింటెండెంట్లు



'డిజిటల్ హెల్త్' అమలు తీరును వివరిస్తున్న డాక్టర్ ఉషా మంజునాథ్

ఉర్దూ 'భగవద్గీత' రూపకర్త అప్పలాచార్యులు కన్నుమూత



అప్పలాచార్యులు

నారాయణగూడ, న్యూస్‌టుడే: భగవద్గీతను 'నగ్మే ఇలాహి' పేరిట ఉర్దూ భాషలోకి తర్జుమా చేయడంతో పాటు ఉర్దూ పాఠ్యపుస్తకాల రచనలో విశేష కృషి చేసిన సింగరాయకొండ తిరుమల వేంకట అప్పలాచార్యులు (96) ఇక లేరు. వయోభారంతో దిల్‌సుఖ్‌నగర్‌లోని నివాసంలో గురువారం కన్నుమూశారు. సింగరాయకొండ తిరుమల గోవిందాచార్యులు, ఆండాళ్లమ్మ దంపతులకు 1929 ఫిబ్రవరి 24న అప్పలాచార్యులు జన్మించారు. ఆయనకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. 1954 ఆగస్టులో హైదరాబాద్‌లో ప్రభుత్వ గణిత ఉపాధ్యాయుడిగా తన ప్రస్థానం ప్రారంభించారు. తర్వాత ప్రధానోపాధ్యాయుడిగా, తర్వాత గణాంకాధికారిగా సేవలు అందించారు. చిన్నప్పటి నుంచీ ఉర్దూ మాధ్యమంలో చదువుకోవడంతో ఆయనకు ఆ భాషపై మంచి పట్టు ఉండేది. ఉర్దూ భగవద్గీత దేశవ్యాప్తంగా ప్రశంసలు పొంది.. మూడుసార్లు ముద్రణకు వెళ్లింది. 20 ఏళ్ల కిందట క్యాన్సర్ బారినపడి కోలుకున్నారు. తర్వాత రెండేళ్లపాటు కృషి చేసి.. 'తెలుగు-ఉర్దూ నిఘంటువు'ను ప్రచురించారు. ఆయన అంత్యక్రియలు ఆదివారం ఉదయం జరుగుతాయని కుమారుడు శ్రీనివాసాచార్యులు తెలిపారు.

తెదేపా కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు

ఈనాడు, అమరావతి : మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని పాస్టర్ ప్రసాద్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనా గీతాలు ఆలపించారు. కేసు కోసి శుభాకాంక్షలు తెలిపారు. ఏసు బోధనలు అనుసరణీయమని ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో అన్ని మతాలవారికీ మేలు జరుగుతుందని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. కార్యక్రమంలో లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు, మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ ఉండవల్లి శ్రీదేవి, క్రిస్టియన్ సెల్ నేత మద్దిరాల ఇమ్మానియేల్ పాల్గొన్నారు.

ఆడుతూ... పాడుతూ చదివేస్తుంటే..

- అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆట ఆధారిత విద్య
- ఒకే తీరుగా బోధన ఉండేలా ఆర్ఎల్ఎం విధానం
- అమలు తీరుపై కేంద్రం ప్రశంస

ఈనాడు, అమరావతి: ఇరుకు గదుల్లో ఒత్తిడితో కూడిన విద్య కాకుండా అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులకు ఆట, పాటలతో చదువు నేర్పుతున్నాయి. ఆహ్లాదకర వాతావరణంలో ఏరోజుకారోజు వారు ఉత్సాహకంగా, ఉల్లాసంగా నేర్చుకునేలా ఆటవస్తువులతో బోధన సాగిస్తున్నారు. ఇంద్రియ జ్ఞానం, పరిసరాల పరిశుభ్రత తదితర సామర్థ్యాలన్నీ ఆటల ద్వారానే నేర్పిస్తున్నారు. ఈ ఆటల ఆధారిత విద్య ఒక్కో అంగన్‌వాడీ కేంద్రంలో ఒక్కో విధంగా లేకుండా అంతటా ఏకరూపత ఉండేలా 'రిమోట్ లెర్నింగ్ మెసేజ్' (ఆర్ఎల్ఎం) విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. దీని ద్వారా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒక రోజు ఒక అంశంపైనే.. ఒకే విధంగా బోధన ఉంటుంది. ఇలా చేయడంతో చిన్నారులంతా ఒకే విధమైన అభ్యాసన సామర్థ్యాలు సాధిస్తారు.





పిల్లలతో అక్షరాలను గుర్తించే యాక్టివిటీ చేయిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త ★ పిల్లలతో ఆటలు ఆడిస్తున్న కార్యకర్త

విద్యా బోధనకు ప్రత్యేక క్యాలెండర్..

రాష్ట్రవ్యాప్తంగా 55,746 అంగన్‌వాడీ కేంద్రాల్లో 3-6 ఏళ్ల లోపు చిన్నారులు 8 లక్షల మంది ఉన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు వీరికి బోధిస్తున్నారు. దేశవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధనకుగాను కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానం ప్రకారం 'ఆధార్ శిల' పేరుతో ప్రత్యేక సిలబస్‌ను రూపొందించింది. ఆంగ్లభాషలో ఉన్న దీన్ని రాష్ట్రంలో చిన్నారులకు బోధించడానికి వీలుగా తెలుగులోకి అనువదించారు. ఏ రోజు, ఏ వారం, ఏ నెల ఏం చెప్పాలనేది అంగన్‌వాడీ కార్యకర్తలకు స్పష్టంగా నిర్దేశిస్తూ ప్రత్యేక క్యాలెండర్ రూపొందించారు.

ఆర్ఎల్ఎం విధానం అంటే ?

- ✦ ప్రభుత్వం రూపొందించిన క్యాలెండర్‌కు అనుగుణంగా ఆర్ఎల్ఎం విధానాన్ని అమలు చేస్తున్నారు. పిల్లల్లో తీసుకురావాల్సిన సామర్థ్యం, నైపుణ్యాన్ని బట్టి ఈ పద్ధతిలో నిర్దేశిత పాఠ్యాంశాన్ని ఎలా బోధించాలన్న విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తూ రోజువారీ వీడియోలు రూపొందించారు.
- ✦ పిల్లలకు మరుసటి రోజు బోధించాల్సిన అంశానికి సంబంధించిన వీడియోను ఆ ముందు రోజే రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు పంపుతారు.
- ✦ కార్యకర్తలు దాన్ని చూసి బోధనకు అవసరమైన వస్తువుల్ని(టీచింగ్ ఎయిడ్స్) ముందుగానే సమీకరించి పిల్లలతో కేంద్రాల్లో ఆ యాక్టివిటీని చేయిస్తారు.
- ✦ ఇదే వీడియోను తల్లిదండ్రులకు పంపి వారిని కూడా ఇందులో భాగస్వాములను చేస్తారు.
- ✦ ఆర్ఎల్ఎం విధానం కారణంగా పిల్లల్లో ఐక్యూ స్థాయి పెరుగుతుంది.
- ✦ రాష్ట్రంలో ఈ విధానం అమలవుతున్న తీరును కేంద్ర ప్రభుత్వం కూడా ప్రశంసించింది.

అంగన్‌వాడీ పిల్లల్లో తీసుకొచ్చే సామర్థ్యాలు ఇవే...

- ✦ కేంద్రాల్లోని 3-6 ఏళ్ల చిన్నారుల్లో 6 రకాల అంశాలను అభివృద్ధి చేయనున్నారు.
- ✦ అవి..శారీరకాభివృద్ధి, నైతిక, మేధ, భాష, సాంస్కృతికాభివృద్ధి, సానుకూల అభ్యసన అలవాట్లు.
- ✦ 13 రకాల నైపుణ్యాలను పిల్లల్లో పెంపొందించాలనేది ప్రధాన లక్ష్యం. 100కిపైగా సామర్థ్యాలు వారిలో అభివృద్ధి కానున్నాయి.
- ✦ పిల్లలకు ఆసక్తికరంగా బోధించేందుకు 130 కార్యక్రమాలను సిద్ధం చేశారు.

కంప్యూటర్ ఇస్తే.. ఈ-ఆఫీస్‌లో పనిచేస్తాం

మంత్రికి వీఆర్వో, వీఆర్ఏ, సర్వేయర్ల సంఘాల వినతి



మంత్రి అనగానికి వినతిపత్రం అందజేస్తున్న వీఆర్వో, వీఆర్ఏ, సర్వేయర్ల సంఘాల నేతలు

ఈనాడు, అమరావతి: తమ సమస్యలు పరిష్కరించి, పదోన్నతులు కల్పించాలని వీఆర్వో, వీఆర్ఏ, సర్వేయర్ల సంఘాల నేతలు శుక్రవారం సచివాలయంలో రెవెన్యూ శాఖ మంత్రి సత్యప్రసాద్‌ను కోరారు. 'గ్రామ సచివాలయాలకు వెళ్లి హాజరు వేయించుకోవడం సమస్యగా ఉంది. ఎక్కడ పనిలో ఉంటే అక్కడే హాజరు వేసుకునే విధానం తీసుకురావాలి. రెవెన్యూ విధుల్లో ఉన్నప్పుడు ఇతర పనులు లేకుండా చూడాలి. సచివాలయానికి కంప్యూటర్ కేటాయిస్తే ఈ-ఆఫీస్‌లో పనిచేస్తాం' అని వీఆర్వో అసోసియేషన్ నాయకుడు రవీంద్ర కోరారు. తమ పోస్టుల్ని టెక్నికల్‌గా గుర్తించాలని సర్వే అసోసియేషన్ నేతలు విన్నవించారు. మంత్రి స్పందిస్తూ.. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అవినీతికి తావు లేకుండా పనిచేయాలని సూచించారు.

ఎర్రచందనం సంరక్షణ కోసం.. ఏపీ అటవీశాఖకు రూ.14.88 కోట్లు

ఈనాడు, దిల్లీ: ఎర్రచందనం సంరక్షణ, పునరుత్పాదన, పరిశోధన, అభివృద్ధి, అవగాహన కల్పన, సామర్థ్య పెంపు కార్యక్రమాల కోసం జాతీయ జీవ వైవిధ్య ప్రాధికార సంస్థ ఏపీ అటవీశాఖకు రూ.14.88 కోట్లు విడుదల చేసింది. దీంతో యాక్సెస్ బెనిఫిట్ షేరింగ్ కింద రాష్ట్రానికి విడుదల చేసిన మొత్తం రూ.104 కోట్లకు చేరింది. జాతీయ జీవ వైవిధ్య ప్రాధికార సంస్థ వివిధ రాష్ట్రాలకు కలిపి మొత్తం రూ.143 కోట్లు పంపిణీ చేయగా అందులో 72.72% ఆంధ్రప్రదేశ్‌కు దక్కింది. ఎర్రచందనం ప్రధానంగా తూర్పుకనుమల్లోని ఉమ్మడి అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు, ప్రకాశం జిల్లాల్లో మాత్రమే లభిస్తోంది. కేంద్ర ఆర్థికశాఖ పరిధిలోని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ ఇప్పటివరకు జప్తుచేసిన 1,115 టన్నుల ఎర్రచందనం వేలం ద్వారా వచ్చిన మొత్తంలో కొంత భాగాన్ని బెనిఫిట్ షేరింగ్ విధానంలో రాష్ట్రానికి పంపిణీ చేసింది.

టెట్ పేపర్-1ఏ ప్రాథమిక 'కీ' విడుదల

ఈనాడు, అమరావతి: ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష పేపర్-1ఏ పరీక్షల ప్రాథమిక 'కీ'ని విడుదల చేసినట్లు టెట్ కన్వీనర్ కృష్ణారెడ్డి తెలిపారు. ఈనెల 11 మధ్యాహ్నం నుంచి 15 ఉదయం సెషన్ వరకు మొత్తం 8విడతలుగా పరీక్షలు నిర్వహించారు. అభ్యర్థులు ఏపీ టెట్ అధికారిక వెబ్‌సైట్ నుంచి ప్రాథమిక కీని పొందొచ్చు. ఈనెల 26వరకు ప్రాథమిక కీపై అభ్యంతరాల స్వీకరణకు అవకాశం కల్పించారు.

మాజీ సైనికులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

- సాయుధ దళాల పతాక దినోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్

ఈనాడు, అమరావతి: భారత సాయుధ దళాలకు దేశ ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం ఉంటుందని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. రాష్ట్రంలోని మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. శుక్రవారం లోక్‌భవన్‌లో నిర్వహించిన సాయుధ దళాల పతాక దినోత్సవంలో గవర్నర్ మాట్లాడారు. ఈ కార్యక్రమం సైనికుల శౌర్యం, విధి పట్ల వారి అంకితభావానికి అభివందనం చేయడానికి ఒక ప్రత్యేక సందర్భమని తెలిపారు. మాజీ సైనికుల సంక్షేమానికి సైనిక సంక్షేమశాఖ అమలుచేస్తున్న కార్యక్రమాల వివరాలతో రూపొందించిన మార్గదర్శిని గవర్నర్ విడుదల చేశారు. అనంతరం మేజర్ టీఎస్‌టీ భరద్వాజ్ తండ్రి టి.ఉపేంద్ర కుమార్, నాయక్ వై.రాజు భార్య వై.గౌతమి, హవల్దార్ వి.సుబ్బయ్య భార్య జి.లీలావతి, ఎస్.డబ్ల్యూ. ఆర్‌పీ కార్తీక్ తల్లి పి.సెల్వి, హవల్దార్ జి.శివశంకరరావు భార్య జి.లక్ష్మి, శౌర్య పురస్కార గ్రహీతలు లెఫ్టినెంట్ కల్నల్ పి.మస్తాన్ రెడ్డి, గ్రూప్ కెప్టెన్ అబ్దుల్ రెహమాన్, విశిష్ట విజేతలు కల్నల్ కొలసాని శ్రీనివాస్(రిటైర్డ్) కెప్టెన్ సి.డి.ఎన్.వి.ప్రసాద్(రిటైర్డ్)లను గవర్నర్ సన్మానించి నగదు బహుమతులు అందజేశారు. సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి గరిష్ఠ విరాళాలు సేకరించినందుకు గుంటూరు, బాపట్ల, తూర్పుగోదావరి జిల్లాల కలెక్టర్లు ఎ.తమీమ్ అన్సరియా, డాక్టర్ వి.వినోద్ కుమార్, కీర్తి చేకూరి, జిల్లా సైనిక సంక్షేమ అధికారులు కెప్టెన్ పి.సత్య ప్రసాద్(రిటైర్డ్), గుణశీలను కూడా గవర్నర్ సన్మానించారు. సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు సుమారు రూ.3 కోట్లు విరాళం ఇచ్చినందుకు అభినందిస్తూ ఏపీఎన్జీఓ సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్‌కు జ్ఞాపిక అందజేశారు. హోం, సైనిక సంక్షేమ శాఖ మంత్రి వంగలపూడి అనిత కార్యక్రమంలో ప్రసంగించారు. సైనిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ వి.వెంకటరెడ్డి, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.అనంత రాము, హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్, గవర్నర్ సంయుక్త కార్యదర్శి పి.ఎస్.సూర్యప్రకాష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



సాయుధ దళాల పతాక దినోత్సవంలో సైనికుల సంక్షేమ చర్యల సంకలనం 'మార్గదర్శి'ని విడుదల చేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్. చిత్రంలో మంత్రి వంగలపూడి అనిత తదితరులు

చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపిన యనమల రామకృష్ణుడు

ఈనాడు, అమరావతి: సీఎం చంద్రబాబుకు ఎకనమిక్ టైమ్స్ 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' పురస్కారాన్ని ప్రకటించడంపై తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఓ ప్రకటనలో చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నో సంస్కరణలకు ఆయన ఆద్యుడని కొనియాడారు.

21లోగా కానిస్టేబుల్ అభ్యర్థులు రిపోర్టు చేయాలి

ఈనాడు, అమరావతి: పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులంతా ఈ నెల 21లోగా వారికి కేటాయించిన శిక్షణ కేంద్రాల్లో రిపోర్టు చేయాలని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, శిక్షణ విభాగం డీఐజీ బి.సత్యయేసుబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మొత్తం 21 పీటీసీ, డీటీసీ, బీటీసీల్లో శిక్షణ ఇస్తామని వివరించారు. ఏ అభ్యర్థికి ఏ శిక్షణ కేంద్రం కేటాయించారో తెలుసుకునేందుకు https://training.prismappolice.in/ వెబ్‌సైట్ ప్రారంభించామని, అందులో వారి వివరాలు పొందుపరిచి తెలుసుకోవచ్చని సూచించారు.

కన్వెన్షన్ సెంటర్ పూర్తికి రూ.90 కోట్లు

ఈనాడు, అమరావతి: విజయవాడ స్వరాజ్ మైదానంలోని అంబేడ్కర్ విగ్రహం ఉన్న ప్రాంతంలో కన్వెన్షన్ సెంటర్ పూర్తికి ప్రభుత్వం రూ.90.70 కోట్లు విడుదల చేసింది. ఈ సెంటర్‌లోని అలంకరణ పనుల పూర్తికి ఈ నిధులు వెచ్చించనున్నారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

కారవాన్ పర్యాటకం షురూ



పాడేరులో కారవాన్

పాడేరు, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లాలో కారవాన్ టూరిజం అందుబాటులోకి వచ్చింది. గత నెలలో ట్రయల్ రన్ విజయవంతం కావడంతో హైదరాబాద్ నుంచి కారవాన్‌లో 12 మంది సందర్శకులు విశాఖపట్నం మీదుగా.. అనంతగిరి, డుంబ్రిగుడ మండలాల్లోని పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. వీరంతా శుక్రవారం పాడేరు చేరుకున్నారు. పర్యాటక ప్రాంతాల్లో ప్రకృతి అందాలను ఆస్వాదించేందుకు కారవాన్ పర్యాటకం బాగుందని పర్యాటకులు చెప్పారు.

వృత్తి విద్యా కోర్సులకు జాతీయ గుర్తింపు

ఈనాడు, అమరావతి: ఇంటర్మీడియట్ వృత్తి విద్యా కోర్సులకు డ్యుయల్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ఇంటర్మీడియట్ విద్యా మండలికి జాతీయ వృత్తి విద్య, శిక్షణ మండలి (ఎన్‌సీవీఈటీ) నుంచి గుర్తింపు లభించింది. ఈ మేరకు ఎన్‌సీవీఈటీతో బోర్డు శుక్రవారం ఒప్పందం కుదుర్చుకుంది. వృత్తి విద్యా కోర్సులు పూర్తిచేస్తున్న అభ్యర్థులకు జాతీయ గుర్తింపు లభించేందుకు ఇంటర్మీడియట్ విద్యా మండలి ఈ ఒప్పందం చేసుకుంది. బోర్డు, ఎన్‌సీవీఈటీ కలిపి సర్టిఫికెట్లు జారీ చేస్తాయి. వృత్తి విద్యా కోర్సుల శిక్షణ, మూల్యాంకనం, సర్టిఫికెట్ల జారీని బోర్డు నిర్వహిస్తుంది. ప్రాథమికంగా సెరికల్చర్ టెక్నీషియన్ కోర్సుకు సంబంధించి ఎన్‌సీవీఈటీ ఆమోదం లభించింది. క్రమంగా మిగతా కోర్సులకూ దీన్ని విస్తరిస్తారు.